అనుదినం... జనస్వరం
www.navatelangana.com
# నవతెలంగాణ
మంగళవారం 11-02-2025
సమగ్ర తెలుగు దినపత్రిక

## అప్పుల కుప్ప



కేంద్రానికి రూ.200.16 లక్షల కోట్ల అప్పు

ఇది దేశ జీడీపీలో 56.1 శాతం :

లోక్‌సభలో కేంద్రమంత్రి పంకజ్ చౌదరి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మోడీ పాలనలో కేంద్ర ప్రభుత్వ అప్పులు.. కుప్పలుగా రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. 2025-26 బడ్జెట్ అంచనాల ప్రకారం రూ.200.16 ...6లో

సంపుటి : 11 | సంచిక : 42 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

క్రిమినల్ కేసులుంటే ఉద్యోగాలకే అనర్హులు!

మరి ప్రజాప్రతినిధులుగా

## ఎన్నిక ఎలా?

సుప్రీం కోర్టు వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ:** 'క్రిమినల్ కేసులుంటే ఉద్యోగంలో చేరడానికే అనర్హులు, అలాంటిది ప్రజాప్రతినిధులుగా ఎలా అర్హులవుతారు ?' అని సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. క్రిమినల్ కేసుల్లో దోషులుగా తేలిన నేతలు తిరిగి ఎన్నికల్లో పోటీ చేయకుండా జీవితకాల నిషేధం విధించాలని కోరుతూ అశ్వినీ ఉపాధ్యాయ్ 2016లో దాఖలు చేసిన పిల్‌పై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టిన సందర్భంగా పై వ్యాఖ్యలు చేసింది. ఒకసారి దోషులుగా తేలిన తర్వాత, మళ్లీ వారు పార్లమెంట్‌కు, శాసనసభలకు ఎలా తిరిగివస్తారు ? ఇందులో పరస్పర విరుద్ధ ప్రయోజనాలు వున్నట్లు కనిపిస్తోందని జస్టిస్ దీపంకర్ దత్తా వ్యాఖ్యానించారు. ప్రజా ప్రతినిధులపై నమోదైన కేసులను త్వరితగతిన పరిష్కరించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై కూడా కోర్టు విచారణ జరిపింది. ఈ సందర్భంగా అమికస్ క్యూరీ విజయ్ హన్సారియా సమర్పించిన నివేదికను ధర్మాసనం పరిశీలించింది.

42మంది లోక్‌సభ ఎంపీలపై క్రిమినల్ కేసులున్నాయని, కొన్నిచోట్ల ప్రజాప్రతినిధులపై 30 ఏండ్లుగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని అమికస్ క్యూరీ తన నివేదికలో పేర్కొన్నారు. దేశంలో చాలా చోట్ల కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులు లేవని తెలిపారు. నిందితులు ఏండ్ల తరబడి విచారణకు రాకపోవడం, పదేపదే వాయిదాలు కోరుతుండటం ఈ జాప్యానికి మరో కారణమని నివేదికలో పేర్కొన్నారు.

నేరస్తులను ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకునే విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం మరింత పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, అందుకు అనుగుణంగా ఉన్నత పరిష్కారం ఆలోచించాలని ...13లో

హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద ప్రజాసంఘాల పోరాట వేదికపై అభివాదం చేస్తున్న నేతలు



# బడ్జెట్ సవరించాల్సిందే

## కార్పొరేట్లపై నాలుగు శాతం సంపద పన్ను వేయాలి

పేదలపై భారాలు తగ్గించాలి..కొనుగోలు శక్తి పెంచాలి

ఇండ్ల స్థలాల పోరాటానికి అండగా ఉంటాం

ఆర్ఎస్ఎస్‌కా సాత్..అంబానీ, అదానీకా వికాస్

మోడీ సర్కారు బడ్జెట్ సారాంశం ఇదే :

ప్రజా సంఘాల పోరాట వేదిక మహాధర్నాలో వక్తలు

**నిర్మలమ్మ పద్దులో తెలంగాణకు తీరని అన్యాయం**

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కార్పొరేట్లకు మేలు చేసేలా, సామాన్యులపై మరింత భారాలు మోపేలా బడ్జెట్ ప్రకటించిన మోడీ సర్కార్‌పై యుద్ధం ప్రకటిస్తున్నాం..కాస్కో మోడీ అని ప్రజాసంఘాల పోరాట వేదిక హెచ్చరించింది. ప్రజా సంక్షేమం కోసం బడ్జెట్ సవరించాల్సిందేనని డిమాండ్ చేసింది. మోడీ సర్కారు సబ్‌కాసాత్..సబ్‌కా వికాస్ నినాదాన్ని...ఆర్ఎస్ఎస్‌కా సాత్..అంబానీ, అదానీకా వికాస్‌గా మార్చి పాలన చేస్తున్నదని విమర్శించింది. కార్పొరేట్లపై నాలుగు శాతం సంపద పన్ను వేస్తే దేశ బడ్జెట్‌ను లక్ష కోట్ల రూపాయలకు పెంచుకునే అవకాశముంటుందనీ, ఆ దిశగా మోడీ సర్కారు ఎందుకు అడుగులు వేయడం లేదని ప్రశ్నించింది. తెలంగాణలో ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం 20 ప్రాంతాల్లో పేదలు చేస్తున్న పోరాటాలకు అండగా ఉంటామనీ, ఇండ్లు, ఇండ్ల స్థలాలు దక్కే దాకా వెనుకడుగు వేయబోమని భరోసానిచ్చింది. సోమవారం హైదరా బాద్‌లోని ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ కార్పొరేట్లకు అనుకూలంగా, పేదలపై భారాలు మోపేలా ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ మహాధ ర్నా నిర్వహించారు. అధ్యక్షవర్గంగా ప్రజా సంఘాల పోరాట వేదిక కన్వీనర్ ఎస్.వీరయ్య, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య, రైతు సంఘం ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ఆర్.అరుణజ్యోతి, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు, వృత్తిసంఘాల కన్వీనర్ ఎమ్‌వీ.రమణ, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధర్మానాయక్ వ్యవహరించారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.వెంకటేశ్ నాయకులను వేదికపైకి ఆహ్వానించారు.



వివరాలు 14లో

**వేలాదిగా తరలి వచ్చిన ప్రజలు**

**ఆకట్టుకున్న ర్యాలీలు..**

**జానపద కళాకారుల ప్రదర్శనలు** 14లో.



జనాభా లెక్కలు

## నిర్వహించాలి

రాజ్యసభలో సోనియాగాంధీ డిమాండ్





నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

జనాభా లెక్కలు వీలైనంత త్వరగా నిర్వహించాలని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత సోనియా గాంధీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆమె రాజ్యసభలో మాట్లాడుతూ.. దేశంలో దాదాపు 14 కోట్ల మంది ప్రజలు ఆహార భద్రతా చట్టం కింద ప్రయోజనాలను కోల్పోతున్నారని అన్నారు. జనాభా గణనను త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జాతీయ ఆహార భద్రతా చట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ) కింద లబ్దిదారులను 2011 జనాభా లెక్కల ప్రకారం గుర్తిస్తున్నామనీ, తాజా జనాభా సంఖ్యల ప్రకారం కాదని అన్నారు. 2013 సెప్టెంబర్‌లో అప్పటి యూపీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్ఎఫ్ఎస్ఏను దేశంలోని 140 కోట్ల జనాభాకు ఆహారం, పోషక భద్రతను నిర్ధారించే లక్ష్యంతో ఒక మైలురాయి చొరవగా వివరించారు. 2011 జనాభా లెక్కల ఆధారంగానే లబ్దిదారుల కోటా ఇప్పటికీ నిర్ణయించబడుతున్నదని అన్నారు. ఈ సంవత్సరం జనాభా గణన నిర్వహించే అవకాశం లేదని బడ్జెట్ కేటాయింపులు స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. వెంటనే జనాభా లెక్కలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

**ప్రభుత్వానికి డెడికేషన్ కమిషన్ నివేదిక**

సీఎస్‌కు అందజేసిన భూసాని వెంకటేశ్వరరావు వివరాలు 13లో

## ఇందిరమ్మ ఇండ్లకు ఉచితంగా ఇసుక

అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఇందిరమ్మ ఇండ్లకు ఉచిత ఇసుకను అందించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సామాన్య వినియోగదారులకు తక్కువ ధరకు ఇసుక లభించేలా చర్యలు తీసుకోవాలనీ, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టి పేదలకు ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. రీచ్‌ల వద్ద వెంటనే తనిఖీలు చేపట్టాలన్నారు. అక్రమ రవాణాకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై సోమవారం సచివాలయం నుంచి కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఇసుక రవాణా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని చెప్పారు. జిల్లాలవారీగా కలెక్టర్లు, ఎస్పీలకు బాధ్యతలు అప్పగించాలని కోరారు. హైదరాబాద్ పరిసరాల్లో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే బాధ్యత హైడ్రాకు అప్పగించామన్నారు. ఇసుక అక్రమ రవాణాపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతీ ఇసుక రీచ్‌ల వద్ద 360 డిగ్రీల కెమెరాలు, సోలార్ లైట్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్టాక్ యార్డుల వద్ద కట్టు దిట్టమైన ఫెన్సింగ్‌తోపాటు ఎంట్రీ, ఎగ్జిట్‌లు ఏర్పాటు చేయాలన్నారు. రవాణాకు సంబంధించి రిజిస్టర్డ్ లారీలను ఎన్‌ప్యానెల్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇసుక బుక్ చేసిన 48 గంటల్లోగా వినియోగదారుడికి చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏరియాల వారీగా సమీప ఇసుక రీచ్‌ల నుంచి వినియోగదారుడికి ఇసుక చేరేలా సిస్టం ఉండాలని చెప్పారు. వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేయాలని సూచించారు. సమస్య వచ్చిన వెంటనే పరిష్కారం లభించేలా చూడాలన్నారు. నిర్ణీత ధరకు మాత్రమే ఇసుక అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇసుక రవాణా చేసే వాహనాలకు ట్రాకింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. ఆన్‌లైన్ బుకింగ్ ...13లో



**రామరాజ్యం పేరుతో దాడులు చేస్తే తీవ్ర చర్యలు**

చిలుకూరు అర్చకులు రంగరాజన్‌ను

ఫోన్ ద్వారా పరామర్శించిన ముఖ్యమంత్రి 13లో.

ఇది ముమ్మాటికి

## మతోన్మాద దాడే

అర్చకుడిపై దాడి చేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధానార్చకుడు రంగరాజన్ ఇంటిపై దాదాపు 30 మంది రామరాజ్య స్థాపన అనే సంస్థ ముసుగులో దౌర్జన్యం చేయడమే కాకుండా, పరుష పదజాలంతో దూషించి భౌతిక దాడి చేయడాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రంగరాజన్ గతంలో ఓ దళితుడిని ఆధ్యాత్మిక గురువుగా తీర్చిదిద్ది అదే దేవాలయంలో అర్చకుడిగా నియమించారని గుర్తు చేశారు. కుల అసమానతలు ఉండకూడదంటూ ఆయన ఆకాంక్షించడాన్ని ఓర్వలేని వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాదులు దాడికి తెగబడటం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. ఆ దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఘటనను ప్రజలు, ప్రజాస్వామిక వాదులు తీవ్రంగా ఖండించాలని విజ్ఞప్తి చేశారు.

## ఉద్రిక్తత

కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య తోపులాట

చెదరగొట్టిన పోలీసులు.. రవీందర్‌సింగ్ తీవ్ర ఆగ్రహం

చివరి రోజు ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల తీరు

కరీంనగర్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీకి 100..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 17 నామినేషన్లు

నల్లగొండలో 23 మంది అభ్యర్థులు- 50 సెట్లు


సోమవారం ఒక్కరోజే సగానికిపైగా దాఖలు

13లో.



## బీర్లపై 15 శాతం పెంపు

జస్టిస్ జైస్వాల్ కమిటీ సిఫారసుల మేరకు..



**హైదరాబాద్:** బీర్ల ధరలను ప్రభుత్వం సవరించింది. బీర్ల ధరలపై 15 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. పెరిగిన ధరలు నేటి నుంచి (మంగళవారం) నుంచి అమల్లోకి రానున్నాయి. జస్టిస్ జైస్వాల్ కమిటీ సిఫారసులకు అనుగుణంగా ధరలు పెంచినట్టు ఎక్సైజ్ శాఖ తెలిపింది.

## బడ్జెట్‌కు ప్రాధాన్యతేది..? దృష్టంతా స్థానికంపైనే

శాఖల వారీగా సమావేశాలు,

ప్రతిపాదనలు నామ్ కే వాస్తే

తూతూ మంత్రంగా ముగిస్తున్న వైనం

కొద్ది వారాల్లోనే రాష్ట్ర బడ్జెట్





నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు ఇస్తున్న ప్రాధాన్యత... రాబోయే బడ్జెట్‌కు ఇవ్వకపోవటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ కూర్పుపై శాఖల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించి, ప్రతిపాదనలు స్వీకరిస్తామంటూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించినప్పటికీ అది ఆచరణలో అమలు కాలేదు. డిసెంబరు, జనవరి నెలల్లో ఒకట్రెండు శాఖలతో భేటీలు నిర్వహించినప్పటికీ ఆ తర్వాత అవి కొనసాగలేదు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఢిల్లీ, బెంగళూరు పర్యటనలు, ఆ తర్వాత అసెంబ్లీని సమావేశపరచటం తదితర కార్యక్రమాల్లో బిజీ అయ్యారు. మరోవైపు కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో హైదరాబాద్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించినప్పటికీ, రాష్ట్ర బడ్జెట్‌పై పూర్తి స్థాయిలో కసరత్తులు చేయలేదని తెలిసింది. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు నిధులు కేటాయించకపోవటం, ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించకపోవటం తదితరాంశాలపై డిప్యూటీ సీఎం కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. కానీ ఆ తర్వాత నిర్మలమ్మ పద్దు ఆధారంగా తన బడ్జెట్‌లో ఎలాంటి మార్పులు, చేర్పులకు శ్రీకారం చుట్టాలి, అందుకనుగుణంగా వివిధ శాఖలను ఎలా సమాయత్తం చేయాలనే అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి కసరత్తులు చేయకపోవటం గమనార్హం. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆఘమేఘాల మీద అసెంబ్లీని సమావేశపరచటం, ఆ తర్వాత రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా తన కార్యకలాపాల్లో వేగం పెంచటం తదితర పరిణామాలు తెలిసిందే. ఈ క్రమంలో బడ్జెట్ కసరత్తులు పూర్తిగా వెనక్కు పోయాయని ఒక ఉన్నతాధికారి వ్యాఖ్యానించారు. ఈనెల ఒకటిన కేంద్రం తన బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో ఈనెలాఖరులో రాష్ట్ర ప్రభుత్వం తన బడ్జెట్‌ను ప్రతిపాదించాలని భావిస్తోంది. ఇందుకనుగుణంగా ఏర్పాట్లు చేయాలంటూ ఇప్పటికే సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించింది. ఈ క్రమంలో ఆర్థికశాఖ పద్దుకు తుది రూపమిచ్చేందుకు కసరత్తులు ప్రారంభిం చింది. అయితే శాఖల నుంచి సమాచారం, ప్రతిపాదనలు పూర్తి స్థాయిలో రాకపోవటంతో బడ్జెట్ కూర్పు సంక్లిష్టంగా మారిందని తెలిసింది. ఒకవైపు అనుకున్నంత స్థాయిలో ...13లో

వందశాతం రుణమాఫీ నిరూపిస్తే..

## రాజకీయ సన్యాసం

రాజీనామా చేసి పోటీ చేస్తే..చిత్తుగా ఓడిస్తాం




6లో..

రాజకీయ బిక్షపెట్టిన కొడంగల్‌కు అన్యాయం

గిరిజనులు, దళితుల భూముల జోలికొస్తే ఊరుకోం

తొండలు గుడ్లు పెట్టని భూముల్లో పచ్చని పంటలు ఎలా కనిపిస్తున్నాయి? : సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్

కోస్గి మండల కేంద్రంలో రైతు దీక్ష

హకీంపేట వద్ద కేటీఆర్‌కు గిరిజనం ఘన స్వాగతం

భూ బాధితులు ప్రవీణ్, జ్యోతి దంపతుల పాపకు 'భూమినాయక్'గా నామకరణం

# గాజా విధ్వంసం వెనుక కార్పొరేట్ల కుట్ర

- చమురు నిక్షేపాల కోసమే మారణహోమం
- ఆయుధాలు అమ్ముకునేందుకే అమెరికా వత్తాసు
- యుద్ధంలో ఇజ్రాయిల్ విలువలు పాటించ లేదు : ఎస్వీకే వెబినార్‌లో రాజకీయ విశ్లేషకులు హరగోపాల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"గాజా విధ్వంసం వెనుక పెట్టుబడిదారుల కుట్ర దాగుంది, ఇస్లామిక్ దేశాల్లో ఉన్న చమురు నిక్షేపాల కోసం వారి మధ్య తగాదాలు పెడుతున్నారు. ఇజ్రాయిల్‌ను పావుగా వాడుకుని తమ లక్ష్యాన్ని నెరవేర్చుకునేందుకు అమెరికా మారణహోమాన్ని సృష్టిస్తోంది. విధ్వంసమైన ఆ నగరాన్ని పునర్నిర్మిస్తామనే సాకుతో పూర్తిగా ఆక్రమించుకునేందుకు కుట్రలు పన్నుతోంది. ఇది ఒక్క గాజాతోనే ఆగదు. కెనడా, మెక్సికో నుంచి ఇతర దేశాలకు వ్యాపించే ప్రమాదముంది" అని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు హరగోపాల్ హెచ్చరించారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో "గాజాను అమెరికా ఆక్రమించుకుంటే జరిగేదేమిటి?" అనే అంశంపై జరిగిన వెబినార్‌లో ఆయన ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు. సోవియట్ యూనియన్ పతనం తర్వాత అమెరికా ఏక పక్షంగా ప్రపంచంపై పెత్తనం సాగిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. "మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలు మానవాళిని సంక్షోభంలోకి నెట్టాయి. సామ్రాజ్యవాదం కోసం ఆనాడు సాగిన యుద్ధంలోనూ ఆయా దేశాలు మానవీయ విలువలు పాటించాయి. కాని నేడు అమెరికా ప్రత్యక్షంగా, పరోక్షంగా సాగిస్తున్న మారణకాండలో కనీస విలువలు పాటించడం లేదు. దేశాలను భయపెట్టడం ద్వారా తాము అనుకున్నది సాధించాలని పెట్టుబడిదారి దేశాలు అమానుషాలకు తెగబడుతున్నాయి. చమురు నిక్షేపాల కోసం అమెరికా గాజాను ఆక్రమించుకునేందుకు యత్నిస్తుండగా, గిరిజనుల కాళ్ల కింద ఉన్న ఖనిజాల కోసం మోడీ సర్కార్ ఛత్తీస్‌గఢ్, బస్తర్ అడవుల్లో హింసకు పాల్పడుతోంది. రెండింటిలోనూ పెట్టుబడిదారుల లాభాలే ప్రధానంగా ఉన్నాయి" అని హరగోపాల్ అభిప్రాయపడ్డారు. తీవ్ర సంక్షోభంలో ఉన్న తన ఆర్థిక వ్యవస్థను కాపాడుకునేందుకు అమెరికా అధ్యక్షులు ట్రంప్ ప్రపంచ దేశాలపై ఆర్థిక యుద్ధాన్ని ప్రకటించారని విశ్లేషించారు. తమ ఆయుధాలను అమ్ముకునేందుకు అమెరికా మొదటి నుంచి ప్రపంచ దేశాల మధ్య వైరాన్ని పెంచి పోషిస్తోందనీ, దీనికి కొత్తగా వచ్చిన ట్రంప్ మరింత ఆజ్యం పోస్తున్నారని పేర్కొన్నారు. అమెరికా పాల్పడుతున్న అకృత్యాల గురించి భారత్‌తో పాటు ప్రపంచ దేశాలు మౌనంగా ఉండటం ఆందోళన కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. పాలస్తీనాను మొదటి నుంచి సమర్థించిన ఇండియా కూడా తన ప్రయోజనాల కోసం ఇప్పుడు ఇజ్రాయిల్‌ను సమర్థిస్తోందని అభిప్రాయపడ్డారు. మానవ హక్కుల విధ్వంసం దేశాల సార్వభౌమత్వాన్ని కాలరాయడం లాంటి అమెరికా చర్యలు భవిష్యత్‌లో ప్రపంచాన్ని సంక్షోభంలోకి నెట్టే ప్రమాదముందని ఆయన హెచ్చరించారు. ఎస్వీకే మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయకుమార్ ఈ వెబినార్‌కు సమన్వయకర్తగా వ్యవహరించారు.



## 'చిలుకూరు' అర్చకునిపై దాడి కేసులో మరో ఐదుగురు అరెస్టు

- రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్

నవతెలంగాణ-రాజేంద్రనగర్

చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై రామరాజ్యం పేరుతో దాడి కేసులో మరో ఐదుగురిని అరెస్టు చేసినట్టు రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కేసులో ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం కొప్పవరంకు చెందిన రామరాజ్యం వ్యవస్థాపకులు, ప్రధాన నిందితుడు వీరరాఘవారెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం ఉదయం ఇద్దరు మహిళలతోపాటు మొత్తం ఐదుగురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు వెల్లడించారు.



ప్రయాగ్‌రాజ్‌లో

# కిక్కిరిసిన రహదారులు

## భారీగా ట్రాఫిక్ జామ్

- గంటల తరబడి నిలిచిపోతున్న వాహనాలు

ప్రయాగ్‌రాజ్ : త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు లక్షలాదిగా తరలి వస్తున్న ప్రజానీకంతో కుంభ మేళాకు దారితీసే రహదారులు కిక్కిరిసి పోతున్నాయి. ఎక్కడికక్కడ గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రజల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. వందలాది కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభిస్తోంది. నిలిచిన వాహనాలు 300 కిలోమీటర్ల పొడవునా బారులు తీరాయని వార్తలు వస్తున్నాయి. వసంత పంచమి సందర్భంగా అమృత స్నానాలు ముగిసిన తర్వాత కుంభమేళాలో రద్దీ తగ్గుతుందని అధికారులు అంచనా వేశారు. కానీ జన సందోహం ఏ మాత్రం తగ్గడం లేదు. ప్రయాగ్‌రాజ్‌లో ఇసుకేస్తే రాలనంత జనం కన్పిస్తున్నారు.

పొరుగున ఉన్న మధ్యప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో ట్రాఫిక్‌ను నియంత్రించడంలో పోలీసులు అష్టకష్టాలు పడుతున్నారు. చివరికి చేసేదేమీ లేక ప్రయాగ్‌రాజ్ వెళ్లే వాహనాలను ఎక్కడికక్కడ నిలిపివేస్తున్నారు. 'ఈ ట్రాఫిక్ రద్దీలో ప్రయాగ్‌రాజ్ వెళ్లడం అసంభవం. 200-300 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది' అని పోలీసులు తెలిపారు. వారాంతపు రద్దీ కారణంగా ట్రాఫిక్ జామ్ అవుతోందని పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ (రేవా జోన్) సాకేత్ ప్రకాష్ పాండే చెప్పారు. రెండు మూడు రోజుల్లో పరిస్థితి చక్కబడుతుందని అన్నారు. 'వాహనాలు 48 గంటల పాటు నిలిచిపోయాయి. కేవలం యాభై కిలోమీటర్ల ప్రయాణం సాగడానికి 10-12 గంటలు పడుతోంది' అని ట్రాఫిక్‌లో చిక్కిన ఓ వ్యక్తి చెప్పారు. కాగా వారణాసి, లక్నో, కాన్పూర్ నుంచి ప్రయాగ్‌రాజ్‌కు చేరుకునే దారుల్లో 25 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. చివరికి కుంభమేళా జరుగుతున్న ప్రయాగ్‌రాజ్‌లో సైతం ఏడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.



ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రయాగ్‌రాజ్ సంగమ్ రైల్వే స్టేషన్‌ను ఇప్పటికే మూసేశారు. కుంభమేళా ప్రదేశానికి చేరుకునేందుకు వాహనాలు తరలి రావడంతో ట్రాఫిక్ రద్దీ ఏర్పడిందని ఓ పోలీస్ అధికారి చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం విఫలమైందని, నగరంలో నిత్యావసరాలకు కొరత ఏర్పడిందని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ విమర్శించారు. గత నెలలో మహా కుంభమేళా ప్రారంభమైన తర్వాత ఇప్పటి వరకూ 44 కోట్ల మంది స్నానాలు ఆచరించారని అధికారులు తెలిపారు.

# ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి అశోక్‌కుమార్ నామినేషన్




మాట్లాడుతున్న నర్సిరెడ్డి

కరీంనగర్‌లో భారీ ర్యాలీ
పాల్గొన్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి తదితరులు

నవతెలంగాణ - కరీంనగర్

టీఎస్ యూటీఎఫ్, ఉపాధ్యాయ అధ్యాపక సంఘాలు బలపరిచిన కరీంనగర్ నియోజకవర్గ టీపీటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి వై.అశోక్ కుమార్ సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. నగరంలో ఉదయం ఎన్టీఆర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆయన వెంట ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనిల్‌కుమార్, తిరుపతి, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చావ రవి, వెంకట్, అన్ని రకాల గురుకులాల రాష్ట్ర బాధ్యులు, టీఎస్ ఎమ్మెస్, టీఎఫ్ రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తులను చట్టసభలకు పంపాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. కరీంనగర్ నియోజకవర్గ టీచర్ ఎమ్మెల్సీ టీపీటీఎఫ్ అభ్యర్థి వై.అశోక్ కుమార్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని కోరారు. టీపీటీఎఫ్, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.అనిల్ కుమార్, చావ రవి మాట్లాడుతూ.. కరీంనగర్ నియోజకవర్గంలో వై.అశోక్ కుమార్ గెలుపు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, విద్యారంగానికి అనివార్యత అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్, టీఎస్ యూటీఎఫ్, టీజీజేఎల్ఏ-475, ఎస్సీఎస్టీయూఎస్-టీఎస్, బీటీఎఫ్, కేజీబీవీ, యూఆర్ఎస్‌డబ్ల్యూ, టీఎస్ఎంఎస్‌టీఎఫ్, టీఎస్ డబ్ల్యూఆర్‌ఈ ఐఎస్‌డబ్ల్యూ, టీటీడబ్ల్యూఆర్ ఈఐఎస్‌డబ్ల్యూ, ఎంజేపీటీబీసీ డబ్ల్యూఆర్‌ఈఐఎస్‌డబ్ల్యూ, టీజీఎంఆర్‌ఈఐఎస్‌డబ్ల్యూ, టీజీఆర్‌ఈఐఎస్‌డబ్ల్యూ, టీటీపీటీఎస్, ఎస్సీఎస్టీయూఎస్, ఎస్సీఎస్టీయూ, ఆల్ యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ యూనియన్ నాయకులు సిహెచ్.అనిల్ కుమార్, నన్నెబోయిన తిరుపతి, చావ రవి, ఏ.వెంకట్, సురేష్, కొమ్ము రమేష్, కొంగుల వెంకట్, కొండయ్య, జాడి రాజన్న, సురేష్ కుమార్, ప్రవీణ్ కుమార్, నరేందర్ రెడ్డి, ఎల్లయ్య, ప్రకాష్ రావు, నరసింహారెడ్డి, హనుమాన్లు, వేణుగోపాల్, రాములు, కొండల్ రెడ్డి, రాజేందర్ పాల్గొన్నారు.

# కేంద్ర బడ్జెట్‌ను సవరించేదాకా పోరాటం

## తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్



నవతెలంగాణబ్యూరో -హైదరాబాద్

కార్పొరేట్ అనుకూల విధానాలను అనుసరిస్తున్న కేంద్ర ప్రభుత్వం...బడ్జెట్‌ను వెంటనే సవరించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ డిమాండ్ చేశారు. లేదంటే ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆ సంఘం ఉపాధ్యక్షులు పి.జంగారెడ్డి అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన హామీల్లో ఏ ఒక్కటీ కేంద్రం అమలు చేయలేదని విమర్శించారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఖాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, హైస్పీడ్ రైల్వే లైన్, ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వలేదని చెప్పారు. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు, ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఉన్నా ఏం సాధించలేదని విమర్శించారు. సమావేశంలో ఉపాధ్యక్షులు అరిబండి ప్రసాదరావు, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, రాష్ట్ర నాయకులు బొంతు రాంబాబు, మాదినేని రమేష్, నున్నా నాగేశ్వరరావు, అన్నవరపు సత్యనారాయణ, దండా వెంకటొరెడ్డి, వీరేపల్లి వెంకటేశ్వర్లు, మాటూరి బాల్‌రాజ్‌గౌడ్, గఫూర్, శెట్టి వెంకన్న, రాపర్తి సోమయ్య, సత్తిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అంజిలయ్యగౌడ్, ఎం.శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

# దళితుడిని పూజారి చేశాడనే అక్కసుతోనే..

## రంగరాజన్‌పై మతోన్మాద మూకదాడి : కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



చిలుకూరు ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్ ఓ దళితుడిని పూజారిని చేసి తన భుజాలపై ఎత్తుకొని కుల వివక్ష ఉండకూడదని చాటి చెప్పినందుకే ఆయనపై మతోన్మాదులు మూకదాడికి పాల్పడ్డారని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) విమర్శించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వీర రాఘవరెడ్డి అనే మతోన్మాది కుల వ్యవస్థను రక్షించడానికే రామరాజ్య స్థాపన అనే మతోన్మాద సంస్థను స్థాపించారని తెలిపారు. రంగరాజన్ ఇంటిపై దౌర్జన్యం చేయడమేకాక, పరుష పదజాలంతో దూషిస్తూ భౌతిక దాడి చేయటం ఉన్మాదానికి ప్రతిరూపమని విమర్శించారు. ఈ ఘటనను ప్రజలు, ప్రజాస్వామిక వాదులు తీవ్రంగా ఖండించాలని కోరారు. రంగరాజన్ గతంలో ఓ దళితుడిని ఎత్తుకొని ఆధ్యాత్మిక గురువుగా తీర్చిదిద్ది, అదే ఆలయంలో అర్చకుడిగా నియమించాడని గుర్తుచేశారు. దళితుడిని ఆలయాలుకి రప్పించడమే కాకుండా ఎత్తుకుని తిరిగి అర్చకుడిగా మారుస్తావా? అంటూ గతంలోనే వీరరాఘవరెడ్డి, ఆయన అనుచరులు ఆగ్రహానికి గురయ్యారని గుర్తు చేశారు. అతడు వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ సంస్థల్లో గతంలో పనిచేశారని తెలిపారు. సుమారు 30 మంది యువకులను చేరదీసి ఒక ముఠాను పెంచి పోషిస్తున్నారన్నారు. రంగరాజన్‌పై దాడి సమయంలో ఆయన కుమారుడు అడ్డురాగా, అతనిపైనా దాడికి పాల్పడ్డారని తెలిపారు. దాడికి పాల్పడ్డ వారిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

# సంగమంలో రాష్ట్రపతి

## పవిత్రస్నానం ఆచరించిన ద్రౌపది ముర్ము



ప్రయాగ్‌రాజ్ : మహాకుంభమేళాకు హాజరైన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంగమంలో పవిత్ర స్నానం చేశారు. ప్రార్థనలు చేశారు. అంతకు ముందు ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళా గురించి..అక్కడి అధికారులు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు వివరించారు.

# యూఎస్, ఫ్రాన్స్ పర్యటనకు మోడీ

## నాలుగురోజుల టూర్‌లో ప్రధాని

న్యూఢిల్లీ : యూఎస్, ఫ్రాన్స్ పర్యటనకు సోమవారం ప్రధాని మోడీ బయలుదేరివెళ్లారు. నాలుగురోజుల టూర్‌లో భాగంగా.. ముందుగా ఫ్రాన్స్‌లోని పారిస్‌కు విమానంలో బయలుదేరుతూ.. వీడ్కోలు పలికిన సహచరులు, అధికారులకు మోడీ అభివాదం చేశారు.

# నవచిత్రం

## పైరసీ.. ఓ పెద్ద క్రైమ్



బన్నీవాసు, అల్లుఅరవింద్

'వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూప్ అడ్మిన్‌లకు ఇదే నా హెచ్చరిక. అడ్మిన్లు జాగ్రత్తగా ఉండండి. మీరు జైలుకి వెళ్లే అవకాశం ఉంది. మేము పట్టుదలతో ఉన్నాం. పైరసీ పెద్ద క్రైమ్. ఇప్పుడు సైబర్ సెల్స్ బాగా పనిచేస్తున్నాయి. ఇప్పుడు మిమ్మల్ని పట్టుకోవడం కూడా తేలిక. నిన్న ఆర్టీసీ బస్సులో సినిమా 'తండేల్' పైరసీ ప్రింట్ ప్రదర్శించడం డ్రైవర్ అమాయకత్వం' అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. నాగచైతన్య, సాయిపల్లవి జంటగా చందూ మొండేటి దర్శకత్వంలో రూపొందిన మూవీ తండేల్. ఇటీవలే రిలీజైన ఈ సినిమాను పైరసీ చేసి, ఆన్‌లైన్‌లో పెట్టారు. అలాగే ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లోనూ ప్రదర్శించారు.

నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ,'నిర్మాతలు, ఫిల్మ్ ఛాంబర్, ఓటీటీ చర్యల వల్ల కొన్ని ఏళ్ళుగా పైరసీ ఆగింది. అయితే రెండు నెలల నుంచి మళ్లీ పైరసీ రాక్షసి విజృంభిస్తోంది. దిల్ రాజు 'గేమ్‌ఛేంజర్'ని ఆన్‌లైన్‌లో విడుదల చేశారు. చాలా ప్రయత్నాలు చేసి, లింక్‌లు తొలగించాం. పైరసీపై పోరాటం చేసేందుకు ఫిల్మ్ ఛాంబర్‌లో సెల్ ఏర్పాటు చేశాం. వాళ్లు డే అండ్ నైట్ పైరసీ నియంత్రణకు పని చేస్తున్నారు. సినిమా సక్సెస్‌ను ఆస్వాదించే టైమ్‌లో ఇదొక ప్రతిబంధకం అయింది. ఈ పైరసీ లింకులన్నీ ఓవర్సీస్ నుంచి వస్తున్నాయని తెలుస్తోంది' అని అన్నారు. 'ఈ సినిమా ఇంకా అందరికీ చేరువ కావాలని సోమవారం నుంచి చాలా థియేటర్లలో టికెట్ రేట్లు తగ్గించాం. అయితే పైరసీ వల్ల నష్టపోతున్నాం' అని నిర్మాత బన్నీ వాసు చెప్పారు.



చిరంజీవి, విశ్వక్‌సేన్

## 'లైలా' బ్లాక్‌బస్టర్ ఖాయం : చిరు

విశ్వక్‌సేన్ నటించిన రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'లైలా'. రామ్ నారాయణ్ దర్శకుడు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మించారు. ఈనెల 14న బిగ్ స్క్రీన్స్‌లో విడుదల కానున్న నేపథ్యంలో మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరైన ఈ వేడుక చాలా గ్రాండ్‌గా జరిగింది.

ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ, 'విశ్వక్ సేన్ ఫంక్షన్‌కి వెళ్తున్నావా? అని అడిగారు. ఏం ఎందుకు వెళ్ళకూడదు? అతను మన మనిషి కాదు.. బాలకృష్ణ.. అప్పుడప్పుడు తారక్ అంటాడు. అంటే మనుషులంటే వేరే వాళ్ళ మీద అభిమానం ప్రేమ ఉండకూడదా? మా ఇంట్లోనే మా అబ్బాయికి సూర్య అంటే చాలా ఇష్టం. అంత మాత్రాన వాడి ఫంక్షన్‌కి నేను వెళ్ళకూడదా?, విశ్వక్‌కి ఈ ప్రశ్న అడగటం నేను చూశాను. దానికి విశ్వక్ చాలా చక్కని సమాధానం చెప్పాడు. మా ఇంటికి కాంపౌండ్ ఉంటుంది. కానీ సినిమా ఇండస్ట్రీకి కాంపౌండ్ లేదు అన్నాడు. నిజంగా తనని అభినందిస్తున్నాను. సినిమా ట్రైలర్ చూసిన తర్వాత ఎక్కడో అనగారిపోయిన కోరిక గబుక్కున పెళ్ళుబికింది. లైలా గెటప్‌లో విశ్వక్ కసక్‌లా అనిపిస్తున్నాడు (నవ్వుతూ). విశ్వక్ నిజంగా ఆడపిల్ల అయివుంటే గుండెజారి గల్లంతయ్యేది(నవ్వుతూ). అంతగ్లామర్‌గా ఉన్నాడు. నేను, నరేష్, రాజేంద్రప్రసాద్ లేడీ గెటప్స్ వేశాం. ఆ సినిమాలన్నీ హిట్ అయ్యాయి. 'లైలా' కూడా హిట్ గ్యారెంటీ. తప్పకుండ ఈ సినిమాకి ఆడియన్స్ వెళ్తారు. ఎంజాయ్ చేస్తారు. విశ్వక్ మాస్, క్లాస్ ఇటు అమ్మాయిగా అద్భుతంగా చేశాడు. దర్శకుడు రామ్ చాలా ఎంటర్‌టైన్మెంట్‌తో తీశాడు. విశ్వక్ చాలా ప్రతిభావంతుడు. తను ఇండస్ట్రీలో జెండా పాతాలి. ఇప్పటికే ప్రూవ్ చేసుకున్నాడు. ఈ సినిమాతో మగవాళ్ళ గుండెల్లో స్థానం సంపాదించుకుంటాడు. సాహు నిర్మాతగా, అనిల్ రావిపూడి దర్శకత్వంలో నేను ఒక సినిమా చేయబోతున్నాను. సినిమా సమ్మర్‌లో ప్రారంభం కాబోతోంది. ఇది ఆద్యంతం కామెడీగా ఉంటుంది' అని తెలిపారు.

## 'గార్డ్' రిలీజ్ ఎప్పుడంటే?

విరాజ్ రెడ్డి చీలం హీరోగా, జగ పెద్ది దర్శకత్వంలో అను ప్రొడక్షన్స్ బ్యానర్ మీద అనసూయ రెడ్డి నిర్మించిన చిత్రం 'గార్డ్'. 'రివేంజ్ ఫర్ లవ్' అనేది ఉప శీర్షిక.

సినిమా మొత్తాన్ని ఆస్ట్రేలియాలో షూట్ చేయడం విశేషం. హర్రర్, థ్రిల్లర్, లవ్ ఎలిమెంట్స్‌తో తెరకెక్కిన ఈ చిత్రంలో మిమీ లియానార్డ్, శిల్పా బాలకృష్ణ కథా నాయికలుగా నటించారు. ఈ చిత్రాన్ని ఈనెల 28న రిలీజ్ చేయబోతున్నారు.



విరాజ్ రెడ్డి

ఈ సందర్భంగా హీరో విరాజ్ రెడ్డి చీలం మాట్లాడుతూ, 'ఈ మూవీ కోసం చాలా కష్టపడ్డాం. మా టీజర్ నచ్చితే సపోర్ట్ చేయండి. మా డైరెక్టర్, టీం ఆస్ట్రేలియాలో ఉంది. రాజేష్ ఎడిటింగ్ చాలా బాగుంటుంది. అవుట్ పుట్ బాగా ఇచ్చాడు. సౌండ్ డిజైనింగ్, మిక్సింగ్ చేసిన టీనా లేడీ బాస్ టైపులో ఉంటారు. పార్థు పోస్టర్లను చక్కగా డిజైన్ చేశారు. సందీప ఈ ప్రాజెక్ట్ కోసం చాలా కష్టపడ్డారు. ప్రణయ్ మా సినిమాకు మంచి మ్యూజిక్ ఇచ్చారు. మంచి లవ్ సాంగ్స్ ఇచ్చారు. సిద్దార్థ్ బీజీఎం గురించి అందరూ మాట్లాడుకుంటారు. జగ పెద్ది మా సినిమాకు దర్శకుడు. ఆయన్నుంచి నేను చాలా నేర్చుకున్నాను. ఈ సినిమాలో ఏ ఒక్కరూ కొత్త యాక్టర్ అన్న ఫీలింగ్ రాదు. మిమి లియోనార్డ్, శిల్పా ఇలా అందరూ అద్భుతంగా నటించారు. అందరి సపోర్ట్ వల్లే ఈ సినిమాను ఇంత బాగా తీయగలిగాను. చిన్న చిత్రాలను అందరూ సపోర్ట్ చేయండి' అని చెప్పారు.

'ఈ చిత్రంలోని పాటలు అద్భుతంగా ఉంటాయి. కేవలం లవ్ స్టోరీ మాత్రమే కాకుండా థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉంటాయి. ఆర్ఆర్ అందరినీ మెప్పిస్తుంది. ఆడియో, సౌండ్ మిక్సింగ్ కూడా మా స్టూడియోలోనే జరిగింది. నన్ను నమ్మి అవకాశం ఇచ్చిన అనసూయకు థ్యాంక్స్. విరాజ్‌లో నటన పట్ల చాలా ప్యాషన్ ఉంది. సినిమా అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది. ఓ మంచి సినిమా చేశామనే నమ్మకంతో ఉన్నాం. కచ్చితంగా విజయం సాధిస్తుంది' అని మ్యూజిక్ డైరెక్టర్ ప్రణయ్ అన్నారు.

ఆటలు

# బుమ్రా అనుమానమే

- చాంపియన్స్ ట్రోఫీకి స్టార్ పేసర్ దూరం?
- జాతీయ క్రికెట్ అకాడమీలో వైద్య పరీక్షలు

**2025 ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ వేటలో టీమ్ ఇండియాకు కోలుకోలేని దెబ్బ!. భారత పేస్ దళపతి జస్‌ప్రీత్ బుమ్రా ప్రతిష్టాత్మక ఐసీసీ టోర్నమెంట్‌కు దూరం కానున్నాడు. వెన్నునొప్పితో బాధపడుతున్న జస్‌ప్రీత్ బుమ్రా ప్రస్తుతం జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో వైద్య పరీక్షలకు వెళ్లగా... చాంపియన్స్ ట్రోఫీ జట్టు ఖరారుకు తుది గడువు బుధవారంతో ముగియనుంది.**

నవతెలంగాణ-బెంగళూర్



భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాపై టీమ్ ఇండియా మేనేజ్‌మెంట్ ఓ నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమవుతోంది. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ అనంతరం మైదానంలో అడుగుపెట్టని జస్‌ప్రీత్ బుమ్రా.. బుధవారం అహ్మదాబాద్‌లో ఇంగ్లాండ్‌తో మూడో వన్డేలో ఆడతాడనే అంచనాలు ఉన్నాయి. కానీ, బుమ్రా నేరుగా బెంగళూర్‌లోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)కు బయల్దేరాడు. బుమ్రా ఫిట్‌నెస్‌పై బీసీసీఐ వైద్య నిపుణులు ఓ నివేదిక తయారు చేసి జట్టు మేనేజ్‌మెంట్‌కు అందించనున్నారు. ఫిబ్రవరి 12న ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి తుది జట్టును ఖరారు చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో నేడు లేదా రేపు బుమ్రా చాంపియన్స్ ట్రోఫీలో ఆడేది లేనిది తేల్చనున్నారు.

### ఎన్‌సీఏలో వైద్య పరీక్షలు

జస్‌ప్రీత్ బుమ్రా ఆస్ట్రేలియా పర్యటనలో గాయపడ్డాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ ఐదో టెస్టు (సిడ్నీ)లో గాయంతో మైదానం వీడిన బుమ్రా.. ఆ తర్వాత బ్యాటింగ్‌కు వచ్చినా బంతి మాత్రం పట్టుకోలేదు. బుమ్రా లేకుండానే భారత్ రెండో ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేసింది. సిడ్నీలో స్కానింగ్ నివేదికలు పరిశీలించిన వైద్యులు బుమ్రాకు ఐదు వారాలు విశ్రాంతి అవసరమని సూచించారు. బుమ్రా కోలుకుంటున్నాడనే ఆశాభావంతో సీనియర్ సెలక్షన్ కమిటీ అతడిని చాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక చేసింది. ఇంగ్లాండ్‌తో తొలి రెండు వన్డేలకు విశ్రాంతి లభించగా.. మూడో వన్డే జట్టులో బుమ్రా ఉన్నాడు. కానీ, బుమ్రాకు వెన్నునొప్పి సమస్య ఏమాత్రం తగ్గలేదు. దీంతో మూడో వన్డే వేదిక అహ్మదాబాద్‌కు కాకుండా.. నేరుగా బెంగళూర్‌కు బయల్దేరాడు. ఎన్‌సీఏ వైద్య బృందం బుమ్రాకు వైద్య పరీక్షలు చేశారు. స్కానింగ్ రిపోర్టులను వైద్య నిపుణులు పరిశీలించి బీసీసీఐకి మెడికల్ నివేదిక అందజేయనున్నారు.

### రానాకు అవకాశం?

జస్‌ప్రీత్ బుమ్రా భారత క్రికెట్ జట్టులో అత్యంత కీలక ఆటగాడు. బుమ్రా తుది జట్టులో నిలిస్తే విజయావకాశాలు సైతం 30-35 శాతం మెరుగవుతాయని చెప్పటం అతిశయోక్తి కాదు. అయితే, జస్‌ప్రీత్ బుమ్రా అంశంలో జట్టు మేనేజ్‌మెంట్ ఏ నిర్ణయం తీసుకుంటుందనే ఉత్కంఠ అభిమానుల్లో నెలకొంది. ఫిబ్రవరి 19 నుంచి చాంపియన్స్ ట్రోఫీ ఆరంభం కానుంది. గ్రూప్ దశను మినహాయిస్తే.. నాకౌట్ మ్యాచులకైనా బుమ్రా ఫిట్‌నెస్ సాధిస్తాడనే నమ్మకం కలిగితే అతడిని జట్టులో ఉంచనున్నారు. బుమ్రా వంటి పేసర్ సేవలను వదులుకునేందుకు కెప్టెన్, కోచ్ సిద్ధంగా లేరు. అయితే, బుమ్రా చాంపియన్స్ ట్రోఫీలో ఏ దశలోనూ ఆడే అవకాశాలు లేవని వైద్య బృందం స్పష్టం చేస్తే.. యువ పేసర్ హర్షిత్ రానాకు అవకాశం దక్కనుంది. ఇంగ్లాండ్‌తో తొలి రెండు వన్డేల్లో హర్షిత్ రానా రాణించాడు. అరంగేట్రంలో మూడు వికెట్ల ప్రదర్శనతో మెప్పించాడు. సీనియర్ పేసర్ మహ్మద్ షమి వికెట్ల వేటలో తడబడినా.. రానా మాత్రం ఆకట్టుకున్నాడు. హైదరాబాద్ సీమర్ మహ్మద్ సిరాజ్‌ను సెలక్షన్ కమిటీ పరిగణనలోకి తీసుకునే అవకాశాలు కనిపించటం లేదు.

చాంపియన్స్ ట్రోఫీలో భారత్ గ్రూప్-ఏ లో చోటుచేసుకుంది. ఆతిథ్య పాకిస్థాన్, బంగ్లాదేశ్ సహా న్యూజిలాండ్‌లు ఈ గ్రూప్‌లో ఉన్నాయి. భారత్ తన మ్యాచులను దుబాయ్ వేదికగా ఆడనుంది. ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌తో టీమ్ ఇండియా టైటిల్ వేట షురూ కానుంది. ఫిబ్రవరి 23న దాయాది పాకిస్థాన్‌తో, మార్చి 2న న్యూజిలాండ్‌తో ఢీకొట్టనుంది. స్వదేశంలో ఇంగ్లాండ్ వన్డే సిరీస్ ఫిబ్రవరి 12న ముగియనుంది. అహ్మదాబాద్ నుంచి ముంబయి చేరుకోనున్న టీమ్ ఇండియా అక్కడ్నుంచి నేరుగా దుబాయ్ బయల్దేరనుంది.

## వికలాంగ క్రికెటర్లను ప్రోత్సహిస్తాం

### హెచ్‌సీఏ అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు

హైదరాబాద్: దివ్యాంగుల ఇంటర్ జోనల్ టీ20 టోర్నమెంట్‌ను భారత క్రికెటర్ తిలక్ వర్మతో కలిసి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు సోమవారం ఉప్పల్ స్టేడియంలో ప్రారంభించారు. 'హెచ్‌సీఏ దివ్యాంగ క్రికెటర్లను ప్రోత్సహిస్తుంది. అందరిలాగే క్రికెట్ ఆడగలమని నిరూపించిన దివ్యాంగులకు అభినందనలు' అని జగన్ అన్నారు. డీఏసీహెచ్ అధ్యక్షుడు సురేందర్ అగర్వాల్, హెచ్‌సీఏ మాజీ కార్యదర్శి జాన్ మనోజ్, మాజీ ఉపాధ్యక్షుడు మొయిజ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



సంపాదకీయం

# ఎంతకాలం?



దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష ఒక అంతులేని కథగా మారింది. తమను తాము సమర్థవంతంగా పాలించుకుని అభివృద్ధి చెందుతున్నందుకు "ఈ శిక్షను" ఇంకా ఎంతకాలం అనుభవించాలి? అసలు ఎందుకు అనుభవించాలి? అన్న ప్రశ్నలు దక్షిణాదిన కొంత కాలం క్రితం వరకు మందకొడిగా ఉండి, ఇటీవల ఉచ్ఛ స్వరంలో వినవస్తున్నాయి. గతంలో తెలంగాణ, తమిళనాడు, కేరళ పలుమార్లు ఈ అంశం లేవనెత్తాయి. ఇందుకు కారణం నిధుల మళ్లింపు ఒకటి కాగా, కేంద్ర నిధుల్లో కోత రెండవది. ఈ అన్యాయాన్ని ఎదుర్కోవాలంటే దక్షిణాది రాష్ట్రాలు ఏకతాటిపైకి వచ్చి, ఉద్యమానికి సిద్ధం కావాల్సిన అవసరం ఉందని తాజాగా మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిల షించారు. కేరళ మాతృభూమి ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్ సదస్సులో పాల్గొన్న రేవంత్‌రెడ్డి "అవసరమైతే నేనే నాయకత్వం వహిస్తా. దక్షిణాది రాష్ట్రాల ఐక్యత, అభివృద్ధి కోసం పోరాడుతా" అని స్పష్టం చేయడం గమనార్హం.

> ఇప్పటికే కేరళ, తమిళనాడు ముఖ్యమంత్రులు తమ రాష్ట్రాల హక్కుల కోసం, రావాల్సిన వాటాల కోసం గట్టిగా ప్రశ్నిస్తున్నారు. వారికి మరో రాష్ట్రం తోడైతే మంచిదే. దేశ జనాభాను దృష్టిలో ఉంచుకుని కేంద్రం సూచనమేరకే దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణ పాటిస్తే... ఉత్తరాది రాష్ట్రాలు దాన్ని విస్మరించాయి. కానీ కేంద్రం జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించడం వల్ల అప్పట్లో కుటుంబ నియంత్రణ పాటించని ఉత్తరాది రాష్ట్రాలు ఇప్పుడు లబ్ధి పొందుతున్నాయి. అభివృద్ధి లక్ష్యాలను అందుకుంటున్న దక్షిణాది రాష్ట్రాలను జనాభా పేరుతో శిక్షిస్తారా?

'భిన్నత్వంలో ఏకత్వం' మన దేశం గొప్పదనం. భిన్న భాషలు, సంస్కృతి, సంప్రదాయాలు ఉన్నా.. మనదంతా ఒకే దేశం. కానీ దేశాన్ని ఏలుతున్న పాలకులు మాత్రం భిన్నత్వాన్ని అణచివేస్తూ, ఏకత్వానికి ముప్పు తలపెడుతున్నారు. ప్రాంతం, కులం, భాష, రాష్ట్రం ప్రాతి పదికన పోలరైజేషన్ చేస్తూ.. ఎన్నికల్లో లబ్ధి పొందుతున్నారు. సమాఖ్య స్ఫూర్తిని భంగపరుస్తున్నారు. వారికి నచ్చిన రాష్ట్రాలను అభివృద్ధి చేస్తూ.. నచ్చని వాటికి మొండిచెయ్యి చూపుతున్నారు. 'రాష్ట్రాల హక్కుల పరిరక్షణ కోసం దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పుదుచ్చేరి ప్రజలు ఏకమవ్వాలని, ప్రజలే కేంద్రాన్ని ప్రశ్నించేలా పోరాట స్ఫూర్తిని రగిలించాల్సిన అవసరం ఏర్పడు తుందని, దీనికోసం అవసరమైతే తానే చొరవ తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నాను' అని అత్యంత కీలకమైన సందర్భంలో అవసరమైన ప్రతి పాదనను తెరపైకి తీసుకొచ్చారు రేవంత్ రెడ్డి. చిత్తశుద్ధితో దాన్ని ఆయన ఆచరణలో పెట్టినప్పుడే ఆయన మాటల మీద నమ్మకం కలుగుతుంది.

దక్షిణాది రాష్ట్రాల ఆదాయం ఎక్కువ. కానీ కేంద్రం వాటికి కేటాయించే నిధులు తక్కువ. ఉత్తరాది రాష్ట్రాల ఆదాయం తక్కువ, కానీ కేంద్రం వాటికి కేటాయించే నిధులెక్కువ. పన్నుల రూపంలో తెలుగు రాష్ట్రాలు కేంద్రానికిచ్చే ప్రతీ రూపాయిలో కేవలం 67 పైసలే వెనక్కి వస్తుంటే.. యూపీకి రూపాయికి రెండు రూపాయలు, బీహార్‌కు రూపాయికి రూపాయి చొప్పున వెళ్తున్నాయి. దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న ఈ అన్యాయం ఏటేటా పెరుగుతూనే ఉంది. అదేమని అడిగితే... స్వయంగా ప్రధాన మంత్రే పార్లమెంట్‌లోనే "మా పన్నులు, మా నిధులు అంటున్నారు. అదేమి భాష? దేశమంతా ఒకే శరీరం. ఏ భాగం పని చేయకున్నా అంగవైకల్యం ఏర్పడుతుంది. హిమాలయాల నీటిని, మరొక రాష్ట్రం బొగ్గును ఇతర రాష్ట్రాలకు ఇవ్వబోమంటే ఏమవుతుంది?" అంటూ ఎదురుదాడికి దిగిన సందర్భాలనేకం.

2014లో కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చింది మొదలు బీజేపీ ప్రభుత్వం.. దక్షిణాది రాష్ట్రాలపై వివక్ష చూపుతూనే ఉంది. అది ప్రస్తుత బడ్జెట్ ద్వారా కూడా నిరూపితమైంది. ఇప్పటికే కేరళ, తమిళనాడు ముఖ్యమంత్రులు తమ రాష్ట్రాల హక్కుల కోసం, రావాల్సిన వాటాల కోసం గట్టిగా ప్రశ్నిస్తున్నారు. వారికి మరో రాష్ట్రం తోడైతే మంచిదే. దేశ జనాభాను దృష్టిలో ఉంచుకుని కేంద్రం సూచనమేరకే దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణ పాటిస్తే... ఉత్తరాది రాష్ట్రాలు దాన్ని విస్మరించాయి. కానీ కేంద్రం జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించడం వల్ల అప్పట్లో కుటుంబ నియంత్రణ పాటించని ఉత్తరాది రాష్ట్రాలు ఇప్పుడు లబ్ధి పొందుతున్నాయి. అభివృద్ధి లక్ష్యాలను అందుకుంటున్న దక్షిణాది రాష్ట్రాలను జనాభా పేరుతో శిక్షిస్తారా?

దక్షిణాదికి నిధుల కేటాయింపు తగ్గిపోవడం మాత్రమే కాదు. 2026లో దక్షిణ, ఈశాన్య రాష్ట్రాలకు పార్లమెంటు ఉభయ సభల్లో సీట్ల సంఖ్యకూ కోతపడే ప్రమాదం పొంచిఉంది. అటు నిధులు, ఇటు పార్లమెంటులో ప్రాతినిధ్యం తగ్గిపోతే దక్షిణాదిపై కేంద్రం పెత్తనం మరింత శృతిమించడం ఖాయం. కేంద్రం ఇకనైనా జనాభా ప్రాతిపదికన కాకుండా పన్నుల వాటాగా రాష్ట్రాలకు నిధులు కేటాయించాలి. 75 ఏండ్ల గణతంత్రదేశంలో చిన్న చిన్న అవసరాల కోసం కూడా రాష్ట్రాలు కేంద్రంపై ఆధారపడాల్సిన దుస్థితి కొనసాగడం విచారకరం. రాష్ట్రాల ఆదాయ వనరులన్నీ కేంద్రం గుప్పిట్లో ఉండటమే దీనికి ప్రధాన కారణం. మరో పక్క గవర్నర్ల వ్యవస్థ సైతం రాష్ట్రాలపై కేంద్రం గుత్తాధిపత్యం సాధించటానికి పెట్టిన వ్యవస్థలా పనిచేస్తోంది. దక్షిణాదిపై వివక్షత చూపడమంటే ఇక్కడి ప్రజల సామర్థ్యం, కష్టించేతత్వం, పొదుపు, విద్య, సంస్కృతిని శిక్షించడమే. దక్షిణాదిన పాగా వేయాలని తహతహలాడుతున్న మతోన్మాద పార్టీని ఎదుర్కోవాలంటే ఈ పరిధిలోని రాష్ట్రాలు ఏకతాటిగా పోరాడాలన్న ముఖ్యమంత్రి వ్యాఖ్యలు ఆహ్వానించదగినవి.

# ప్రజలను అవహేళన చేస్తున్న బడ్జెట్




ప్రభాత్ పట్నాయక్

2025 ఫిబ్రవరి ఒకటవ తేదీన ప్రవేశపెట్టిన బడ్జెట్ మాదిరిగా శ్రామిక ప్రజా బాహుళ్యపు జీవితాల గురించి ఇంత బాహాటంగా అవహేళన చేసిన బడ్జెట్ స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో ఇంకొకటి రాలేదు. పన్నులను తగ్గించి మధ్య తరగతి వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా ఆర్థిక వ్యవస్థకు చురుకుదనం తీసుకురావడమే ఈ బడ్జెట్ వెనుక వ్యూహం అని ఆర్థిక మంత్రితో సహా ఆర్థిక పండితులందరూ ఒప్పుకుంటారు. అటువంటి వ్యూహం ఫలించాలంటే పన్నుల తగ్గింపు ద్వారా పెరిగే మధ్య తరగతి వినిమయం కాస్తా వేరే ఖాతాల్లో ప్రభుత్వ వ్యయానికి కోత పెట్టడం వలన తగ్గే వినిమయంతో చెల్లు అయిపో కుండా ఉండాలి. అప్పుడు పెరిగిన మధ్య తరగతి వినిమయం మొత్తంగా స్థూల డిమాండ్ స్థాయిని పెంచుతుంది. తద్వారా ఆర్థిక వ్యవస్థకు చురుకుదనం కలుగుతుంది. అయితే ఇప్పుడు తగ్గించిన పన్నుల వలన ప్రభుత్వం కోల్పోతున్న ఆదాయాన్ని భర్తీ చేయడం కోసం ప్రభుత్వ వ్యయంలో కోత పెడుతున్నారు. 2024-2025తో (సవరించిన అంచనాల ప్రకారం) పోల్చితే 2025-26 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ వ్యయం నామమాత్రపు ధరల ప్రాతిపదికన కేవలం 7.4 శాతం మాత్రమే పెరగనుంది. పెరిగే ధరలను పరిగణనలోకి తీసుకుంటే వాస్తవ పెరుగుదల ఏమీలేనట్టే. అంతేకాదు, వాస్తవానికి దేశ జీడీపీతో పోల్చితే తగ్గుతుంది.

ప్రభుత్వ వ్యయం ఎక్కడెక్కడ తగ్గనుందో చూద్దాం. ఆహార సబ్సిడీని నామమాత్రపు ధరల ప్రకారం మూడు శాతం మాత్రమే పెంచారు. అంటే 2023-24 వాస్తవ ఖర్చుతో పోల్చితే తగ్గిపోయింది. గ్రామీణ ఉపాధిహామీ పథకానికి 2024-25లో సవరించిన అంచనాల ప్రకారం రూ.86వేల కోట్లు కేటాయించగా, ఇప్పుడూ అంతే. అంటే పెరుగుదల ఏమీ లేదన్నమాట. ఇక 2023-24లో వాస్తవంగా రూ.89,154 కోట్లు ఖర్చు చేశారు. ఆ ఏడాదితో పోల్చితే ఇప్పుడు కేటాయింపు పడిపోయింది. జనవరి 25 నాటికి ఉపాధి హామీ బకాయిలు రూ.6950 కోట్లు ఉన్నాయి. ఆ మొత్తాన్ని మినహాయించితే ఈ ఏడాది బడ్జెట్‌లో ఈ పద్దుకు కోత పెట్టారని స్పష్టమౌతోంది.

ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు 2024-25 బడ్జెట్‌లో కేటాయించిన మొత్తం కన్నా నామ మాత్రపు ధరల ప్రకారం 9.5 శాతం పెరుగుదల ఉన్నట్టు లెక్క. అయితే జీడీపీతో పోల్చిచూస్తే ఈ పద్దుకు కేటాయింపు తగ్గింది. గత ఏడాది బడ్జెట్‌లో పాఠశాల విద్యకు రూ.73,000 కోట్లు కేటాయిస్తే ఈ ఏడాది రూ.78, 600 కోట్లు కేటాయించారు. ఇక్కడ కూడా జీడీపీలో గత ఏడాది కన్నా తక్కువ శాతమే పాఠశాల విద్యకు కేటాయింపు జరిగింది. సాక్ష్యం అంగన్‌వాడీ. పోషణ్-2 (గతేడాది కన్నా నామమాత్రపు ధరల ప్రకారం 3.6 శాతమే పెరుగుదల) ప్రధాన మంత్రి పోషణ్ (నామమాత్రపు ధరలతో పోల్చినా గతేడాది ఎంత కేటాయించారో ఇప్పుడూ అంతే కేటాయించారు) ఆ విధంగా సామాజిక రంగాలను మొత్తంగా చూసినప్పుడు కేటాయింపులు తగ్గాయి.




సామాజిక రంగానికి కేటాయింపులను తగ్గించడం ద్వారా, ఆహార సబ్సిడీకి, ఉపాధి హామీకి తగ్గించడం ద్వారా మధ్యతరగతి జీతగాళ్లకు పన్నుల్లో తగ్గింపులు ఇవ్వడమంటే సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనాలు పొందే పేద, శ్రామిక ప్రజా బాహుళ్యపు కొనుగోలుశక్తికి కోత పెట్టి దానిని మధ్య తరగతిలోని ఒక భాగానికి బదలాయించ డమే. ఆ విధంగా చూస్తే 2025-26 బడ్జెట్ మొత్తం ఆర్థిక వ్యవస్థకు ఎటువంటి చురుకుదనాన్నీ తీసుకురాలేకపోగా శ్రామికవర్గపు పేద జనాన్ని బలిపెట్టి మధ్యతరగతి జీతగాళ్లకు రాయితీలు ఇచ్చింది. సంపన్న వర్గాలను ఏ మాత్రమూ అంటుకోకుండా పేద శ్రామికుల నుండి కొనుగోలు శక్తిని మధ్యతరగతికి పున:పంపిణీ చేస్తూ, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిని సంతృప్తి పరిచేలా ద్రవ్యలోటును ఏమీ మార్చకుండా కొనసాగించారు. దీనర్థం మధ్యతరగతి జీతగాళ్లకు ఏ విధమైన పన్ను రాయితీలూ ఇవ్వకూ డదని కాదు. పెరుగుతున్న ధరల నేపథ్యంలో వారికి రాయితీలు ఇవ్వాలి. అయితే అందుకోసం నిరుపేద శ్రామికవర్గాన్ని బలి చేయకూడదు కదా. కాని 2025-26 బడ్జెట్ అనుసరించినది ఇదే వ్యూహం. ఈ వ్యూహం వలన ఆర్థిక వ్యవస్థ మందకొడితనాన్ని అధిగమించలేక పోతున్నది కాని ఇందులో మూడు లక్షణాలు ఈ బడ్జెట్‌ను ఎన్డీయే కూటమికి ఆకర్షణీయంగా చేస్తున్నాయి.

> ప్రస్తుత బడ్జెట్ సమావేశాల ప్రారంభంలో దేశాధ్యక్షులు ద్రౌపది ముర్ము ప్రసంగంలో వర్తమాన అంశాలపై ప్రభుత్వ దృక్పథాన్ని వివరిస్తూ ఆక్రమంలో మధ్యతరగతిని ఆకాశానికెత్తేశారు. ఆర్థికమంత్రి పదే పదే మధ్య తరగతిని ప్రశంసిస్తూ ఆర్థిక వ్యవస్థను పునరుజ్జీవింపచేసే శక్తి ఆ తరగతికే ఉందని ప్రకటించారు. ఇవన్నీ పరిశీలించినప్పుడు ఈ బడ్జెట్ ఏదో హడావుడిగా పైపైన యాధృచ్ఛికంగా రూపొందించిన విధానాలను బట్టి తయారైంది కాదని, మధ్యతరగతికి, శ్రామికవర్గ ప్రజానీకానికి మధ్య ఒక చీలికను సృష్టించడం ద్వారా కార్పొరేట్- హిందూత్వ కూటమికి కొంత అదనపు మద్దతును సమీకరించే ఉద్దేశంతో తయారైనదని అర్థమౌతుంది. అదే సమయంలో అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిని కూడా ఇది సంతృప్తిపరుస్తుంది.

మొదటిది: శ్రామిక పేదల కొనుగోలు శక్తిని కుదించడం వలన వారు సాధారణంగా కొనుగోలు చేసే సరుకులకు డిమాండ్ తగ్గిపోతుంది. మామూలుగా ఇటువంటి సరుకులు ఎక్కువగా చిన్న చిన్న ఉత్పత్తిదారుల వద్ద తయారౌతాయి. మధ్య తరగతి కొనుగోలు శక్తి పెంచినందువలన వారు కొనుగోలు చేసే సరుకులకు డిమాండ్ పెరుగుతుంది. వీరు కొనుగోలు చేసే సరుకులు ఎక్కువగా సంఘటిత రంగంలో గుత్తాధిపత్య సంస్థలు ఉత్పత్తి చేస్తాయి. అంటే ఈ వ్యూహం వలన గుత్త పెట్టుబడి ప్రయోజనాలు బాగా నెరవేరుతాయి. ఇది మార్క్స్ చెప్పిన "పెట్టుబడి కేంద్రీకరణ" క్రమాన్ని వేగవంతం చేస్తుంది. ఈ క్రమంలో చిన్న పెట్టుబడులను దెబ్బ తీయడం ద్వారా పెద్ద పెట్టుబడి పెరుగుతుంది. నేటి భారతదేశ రాజకీయ రంగంలో కార్పొరేట్- హిందూత్వ కూటమి ఆధిపత్యా న్ని చెలాయిస్తోంది. ఆ కూటమిలోని ఒక స్తంభంగా ఉన్న కార్పొరేట్ల ప్రయోజనాలను ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఈ విధంగా నెరవేరుస్తోంది.

> ఈ "వ్యూహాత్మక నవ్యత్వం" మినహా 2025-26 బడ్జెట్ పాత నయా ఉదారవాద బడ్జెట్ల మాదిరిగానే అదే రోసిపోయిన విధానాన్ని అనుసరించింది. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పంటలకు తగిన ధరను కల్పించాలన్న రైతాంగపు డిమాండ్‌ను అది పట్టించుకోలేదు. ఇన్సూరెన్స్ రంగంలో విదేశీ కంపెనీలకు వంద శాతం యాజమాన్య వాటాలు కలిగివుండేందుకు అనుమతులిస్తూ వాటికి ఎర్రతివాచీ పరిచి స్వాగతిస్తోంది. తమ వేటాడే "జంతు ప్రవృత్తి"ని ప్రదర్శించమని, భారీగా పెట్టుబడులు పెట్టమని స్వదేశీ గుత్త పెట్టుబడి సంస్థలకు ఉద్బోధలు చేసింది

రెండవది: అధికారిక గణాంకాల్లో అసంఘటిత రంగంలో (చిన్న స్థాయి ఉత్పత్తి రంగం) పడిపోతున్న డిమాండ్‌ను, దాని ఫలితంగా తగ్గుతున్న ఉత్పత్తిని సక్రమంగా లెక్కించడం లేదు. ఇక స్వల్పకాలిక అంచనాల దగ్గరకొస్తే కార్పొరేట్ రంగంలో జరిగేదాన్నే మొత్తం ఆర్థిక వ్యవస్థకంతటికీ వర్తింపజేయడం ఒక అలవాటు అయిపోయింది. ఈ విధంగా చేయడం వలన ఆర్థిక వ్యవస్థ చాలా బాగా ఉన్నట్టు లెక్కలు చూపిస్తాయి. కార్పొరేట్లకు మంచి ఫలితాలు వస్తే మొత్తం దేశ ఆర్థిక వ్యవస్థకంతటికీ మంచి ఫలితాలు వచ్చినట్టే లెక్క. ఈ లెక్కలు చూపించి ఒక పక్కన కార్పొరేట్లను సంతోషపెడుతూనే, ప్రభుత్వం కూడా తాను ఆర్థిక వ్యవస్థను వేగంగా ముందుకు నడిపిస్తున్నట్టు గొప్పలు చెప్పుకోవచ్చు.

మూడవది: మధ్య తరగతికి పన్ను రాయితీలు ఇచ్చినది చాలా స్పష్టంగా కనిపిస్తుంది. కాని, అందుకోసం ఎవరు మూల్యం చెల్లించవలసి వస్తోంది అన్నది మాత్రం బడ్జెట్‌లో స్పష్టంగా కనిపించదు. అందుచేత ఏ పేదల కొను గోలు శక్తినైతే తాను దెబ్బ తీస్తోందో ఆ పేదల మద్దతును కోల్పోకుండానే మధ్యతరగతి నుండి అదనంగా మద్దతును పొందగలుగుతానని ప్రభుత్వం భావిస్తోంది. పేదల దారిద్ర్యానికి రకరకాల కారణాలను చూపించవచ్చు. తద్వారా బడ్జెట్‌లో అనుసరించిన వ్యూహం గురించి ఆ పేదలు పట్టించుకోకుండా చూసుకోవచ్చు. పైగా, శ్రామిక ప్రజల్లో తన మద్దత్తు గనుక తగ్గే పరిస్థితి ఉంటే హిందూత్వ వ్యూహాన్ని ఎటుదిరిగీ ముందుకు తేవచ్చు. తద్వారా వారిని తప్పుదోవ పట్టించనూవచ్చు.

బడ్జెట్‌లో అనుసరించిన 'వ్యూహం' గురించి మరీ మనం ఎక్కువగా ఊహించుకుంటున్నామా అని సందేహం రావచ్చు. కాని ఈ మధ్య ఎన్డీయే ప్రభుత్వం తరచూ మధ్యతరగతిని పొగడ్తలతో ముంచెత్తడం చూస్తే అటువంటి అనుమానాలు తొలగిపోతాయి. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల ప్రారంభంలో దేశాధ్యక్షులు ద్రౌపది ముర్ము ప్రసంగంలో వర్తమాన అంశాలపై ప్రభుత్వ దృక్పథాన్ని వివరిస్తూ ఆక్రమంలో మధ్యతరగతిని ఆకాశానికెత్తేశారు. ఆర్థికమంత్రి పదే పదే మధ్య తరగతిని ప్రశంసిస్తూ ఆర్థిక వ్యవస్థను పునరుజ్జీవింపచేసే శక్తి ఆ తరగతికే ఉందని ప్రకటించారు. ఇవన్నీ పరిశీలించినప్పుడు ఈ బడ్జెట్ ఏదో హడావుడిగా పైపైన యాధృచ్ఛికంగా రూపొందించిన విధానాలను బట్టి తయారైంది కాదని, మధ్యతరగతికి, శ్రామికవర్గ ప్రజానీకానికి మధ్య ఒక చీలికను సృష్టించడం ద్వారా కార్పొరేట్- హిందూత్వ కూటమికి కొంత అదనపు మద్దతును సమీకరించే ఉద్దేశంతో తయారైనదని అర్థమౌతుంది. అదే సమ యంలో అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిని కూడా ఇది సంతృప్తిపరుస్తుంది. నయా ఉదారవాద సాంప్రదాయానికి అనుగుణంగా ఈ బడ్జెట్‌లో సంపన్నులపై అదనపు పన్నులేమీ వేయలేదు. ద్రవ్యలోటును కూడా ఏమీ పెంచలేదు.

ఇక్కడే ప్రభుత్వపు దృష్టి బయట పడుతోంది. శ్రామిక ప్రజల ప్రయోజనాలను బలిపెట్టి మధ్య తరగతిలో తన మద్దతును పెంచుకోడానికి ప్రభుత్వం సిద్ధపడుతోంది. అంకెల్లో తన పాలన మెరుగైనదిగా చూపించుకోవడం కోసం అది శ్రామిక ప్రజానీకాన్ని నష్టపరుస్తోంది. పెట్టుబడిదారీ సమాజంలో ఇది తరచూ జరిగేదే. కాని భారత దేశంలో మాత్రం ఇది కొత్తగా జరుగుతోంది. మనదేశంలోని పాలక వర్గాలు ఎప్పుడూ తాము పేద శ్రమజీవుల కోసమే పాటు పడుతున్నట్టు చెప్పుకుంటారు. కాని ఇప్పుడు ప్రభుత్వం తన ప్రాధాన్యతలను బాహాటంగా వెల్లడిస్తోంది. మధ్య తరగతికి ప్రాధాన్యతనిచ్చి శ్రామిక పేదలను శిక్షిస్తోంది.

ఈ "వ్యూహాత్మక నవ్యత్వం" మినహా 2025-26 బడ్జెట్ పాత నయా ఉదారవాద బడ్జెట్ల మాదిరిగానే అదే రోసిపోయిన విధానాన్ని అనుసరించింది. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పంటలకు తగిన ధరను కల్పించాలన్న రైతాంగపు డిమాండ్‌ను అది పట్టించుకోలేదు. ఇన్సూరెన్స్ రంగంలో విదేశీ కంపెనీలకు వంద శాతం యాజమాన్య వాటాలు కలిగివుండేందుకు అనుమతులిస్తూ వాటికి ఎర్రతివాచీ పరిచి స్వాగతిస్తోంది. తమ వేటాడే "జంతు ప్రవృత్తి"ని ప్రదర్శించమని, భారీగా పెట్టుబడులు పెట్టమని స్వదేశీ గుత్త పెట్టుబడి సంస్థలకు ఉద్బోధలు చేసింది (ఆర్థిక సర్వే మాత్రం వినిమయ వస్తువుల డిమాండ్ చాలా నిరుత్సాహంగా ఉన్నందువల్ల పెట్టుబడులు రావడం లేదని, వేతనాలలో పెరుగుదల లేకుండా, లాభాల వాటా మాత్రం చాలా ఎక్కువగా పెరిగిపోయినందువలన ఆర్థిక అసమానతలు పెరిగిపోయాయని, అందువల్లే డిమాండ్ మందకొడిగా ఉందని స్పష్టంగానే చెప్పింది).

విదేశీ మదుపుదారులను పొగడ్తలతో ముంచెత్తితే దానివల్ల ఏ ప్రయోజనమూ ఉండదు. కాని అటువంటి పొగడ్తలతో విదేశీ పెట్టుబడులు వస్తాయని, రూపాయి విలువ పతనం ఆగుతుందని ప్రభుత్వం ఆశించివుండొచ్చు. అయితే ఆ ఆశ అడియాసేనని బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన రెండు రోజులకే తేలిపోయింది. రూపాయి పతనం ఆగలేదు సరికదా ఫిబ్రవరి 3న అది కోలుకోలేనంతగా దిగజారింది. ఒక డాలరుకి రూ.87 చొప్పున మారకపు రేటు ఆ రోజున పడిపోయింది. ప్రజలలో ఒక సమూహాన్ని అవహేళనా పూర్వకంగా మోసగిస్తూ మరొక సమూహాన్ని ఆకర్షించడానికి, తనను తాను గొప్పగా చిత్రీకరించుకోడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తే అది ఆర్థిక సంక్షోభాన్ని ఏమాత్రమూ పరిష్కరించలేదు.

(స్వేచ్ఛానుసరణ)

# అణు వాణిజ్యం-విదేశీ విక్రేతలకే పరిహార బాధ్యత

అణు ఇంధనం, అణు విపత్తులకు పౌర బాధ్యతల చట్టం 2010 (సి.ఎల్.ఎన్.డి.ఎ-క్లండా)ను సవరించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. అణు ఇంధన ఉత్పత్తి రంగంలో ప్రయివేటు రంగ ప్రవేశానికి మార్గం సుగమం చేయడమే అణుశక్తి చట్టానికి సవరణ ఉద్దేశం. నిజానికి అసలే అనుచితమైన ఆలోచన అది. ఏమైనా క్లండా చట్టానికి తలపెట్టిన సవరణ మరింత ప్రమాదకరమైనది. ప్రభుత్వ రంగంలోనైనా ప్రయివేటు రంగంలోనైనా అణు ప్రమాదమే సంభవిస్తే బలైన ప్రజలకు చెల్లించాల్సిన నష్టపరిహారం మొత్తాన్ని కోత కోసేందుకు ఉద్దేశించింది ఈ సవరణ.

క్లండాను పార్లమెంటు 2010లో ఆమోదించింది. ఇండియాలోకి విదేశీ అణు రియాక్టర్లను దిగుమతి చేసుకోవాలన్న ట్టయితే ఆ వాణిజ్యం సరఫరాలు జరగడానికి పౌర అణు పరిహార చట్టం తప్పనిసరి. పౌర అణు ఒప్పందంలో భాగంగా పదివేల మెగావాట్ల అణు రియాక్టర్లను కొనుగోలు చేయడానికి యుపిఎ ప్రభుత్వం వాగ్దానం చేసింది. అయితే ఆ బిల్లును పార్లమెంటులో చర్చకు స్వీకరించినప్పుడు ఈ చట్టంలో తగిన న్యాయమైన



PEOPLE'S DEMOCRACY

నష్టపరిహారానికి తగిన ఏర్పాటు వుండాలనే గట్టి డిమాండు వచ్చింది. ఏదైనా అణు ప్రమాదమే జరిగితే దానికి బలైన బాధితులు త్వరితంగా తగినంతగా పరిహారం పొందడానికి అప్పుడే వీలుండాలంటే అది తప్పనిసరని కూడా డిమాండు ముందుకొచ్చింది. ఇందుకోసం 17(బి) అనే ఒక కొత్త నిబంధన అదనంగా చేర్చబడింది. ఆ రియాక్టర్ ఆపరేటర్లే గాక దాన్ని సరఫరాదార్లు కూడా పరిహారం చెల్లింపునకు బాధ్యత వహించాలని ఆ నిబంధనలో పొందుపర్చబడింది. 17(బి)ని మార్చడం ద్వారా ఈ చట్టాన్ని నీరుగార్చాలని ప్రభుత్వం ప్రయత్నించింది గానీ ప్రధానంగా వామపక్ష ఎంపీల గట్టి ప్రతిఘటన వల్ల ఆ పని చేయడంలో విఫలమైంది.

## భోపాల్ విషాదం పాఠం

ఆ సమయంలో ప్రభుత్వంపై ప్రజల ఒత్తిడి పెరగడానికి దారితీసిన ముఖ్యమైన అంశం ఒకటి వుంది. భోపాల్ విష వాయు లీక్ దురంతానికి బలైన వేలాది మంది బాధితులకు యూనియన్ కార్బయిడ్ కంపెనీ నుంచి మరింత పరిహారం ఇప్పించాలంటూ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించడమే ఆ విధంగా ఒత్తిడి పెరగడానికి కారణమైంది. చట్టం ప్రకారం అలాంటి డిమాండుకు ఆస్కారమే లేదని కోర్టు అభిప్రాయపడింది. క్లండా చట్టం ఆమోదించిన తర్వాత కొద్ది నెలల్లోనే జపాన్‌లో ఫుకుషిమా అణు ప్రమాదం సంభ వించింది. దాంతో కఠినమైన అణు పరిహార చట్టం అవసరం మరింతగా ముందుకొచ్చింది. 17(బి) వంటి నిర్దిష్టమైన నిబంధనలే లేకపోతే ఏదైనా ప్రమాదం లేదా నష్టం జరిగినప్పుడు విదేశాల్లోని అణు పరికరాల సరఫరాదార్లు భారం వహించేలా చేయడం సాధ్యం కాదని భావించబడింది.

## నిరాకరణ, ఒత్తిడి

క్లండా చట్టం ఆమోదించిన తర్వాత విదేశాలలోని ముఖ్యంగా అమెరికాలోని అణు రియాక్టర్ల ఉత్పత్తిదార్లు వాటిని అమ్మడానికి గానీ ఈ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి గానీ తిరస్కరించారు. సరఫరాదారులే పరిహార బాధ్యత స్వీకరించాలన్న నిబంధన అంతర్జాతీయ సూత్రాలకూ కాంట్రాక్టరు బాధ్యతలకు వ్యతిరేకమని వారు వాదించారు. విదేశీ కంపెనీలు తీసుకున్న ఈ వైఖరే భారత దేశంలో విదేశీ అణు రియాక్టర్ల స్థాపన నిర్వహణకు ప్రధాన ఆటంకమైంది.ఈ విధంగా సరఫరాదారు బాధ్యత వహించాలనే అంశాన్ని తోసిరాజనడానికి తర్వాతి సంవత్సరాలలో రకరకాల ప్రయత్నాలు జరిగాయి. 2015లో అమెరికా అధ్యక్షుడు ఒబామా భారత దేశం వచ్చినపుడు మోడీ ప్రభుత్వం క్లండా చట్టాన్ని సవరించాల్సిన అవసరం లేదనే వైఖరికే కట్టుబడింది. కావాలంటే మొత్తంగా ప్రమాద నిర్వహణ బాధ్యతలు చూడటానికి భారత అణు బీమా సమ్మిళిత నిధి ఏర్పాటు చేయవచ్చని సూచించింది. అయితే దీనికి కూడా విదేశీ అణు రియాక్టర్ల సరఫరాదారుల నుంచి సానుకూల స్పందన రాలేదు.

## ఈ లొంగుబాటు పర్యవసానం?

క్లండా చట్టాన్ని సవరించవలసిందిగా అమెరికా ప్రభుత్వం నిరంతరాయంగా చేస్తున్న ఒత్తిడికి చివరకు మోడీ సర్కారు లొంగిపోయింది. అణు రియాక్టర్ల నిర్మాణం, నిర్వహణ చేసేందుకు ప్రయివేటు రంగాన్ని అనుమతించడమంటే అణు ప్రమాదాలకు అవకాశం మరింత పెంచుకోవడమే. ఇప్పటివరకూ అణు రియాక్టర్లు ప్రభుత్వ రంగంలోనే భారత అణుశక్తి కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. వాటికి భద్రతా ప్రమాణాలు బాగా పాటించిన చరిత్ర వుంది. ఒకసారి గనక అణు ఇంధన ప్లాంట్లు ప్రయివేటురంగం చేతుల్లోకి వచ్చేస్తే క్లండా చట్టం సవరణ వల్ల ఖరీదైన విదేశీ అణు రియాక్టర్ల సరఫరాకు అవకాశం కలిగిస్తుంది. అప్పుడు ప్రమాదం జరిగితే ఆ బాధ్యత మొత్తం వాటి యజమానులే చూసుకోవలసి వుంటుంది. అంతిమంగా దాని భారం, బాధ్యత భారత ప్రభుత్వంపైనే పడుతుంది. విదేశీ సరఫరాదార్లు ఎలాంటి బాధ్యత లేకుండా తప్పించుకోగలు గుతారు. క్లండా బిల్లును పార్లమెంటు చర్చించినప్పుడు ప్రమాదం బాధ్యత సరఫరాదారులపై వుండాలన్న నిబంధనను బీజేపీ బలపర్చింది. కానీ ఇప్పుడు ఆ పార్టీ ప్రభుత్వం ఆ వాగ్దానం నుంచి తప్పుకుంటున్నది. ఆ విధంగా చేయడం వల్ల భారతీయుల ప్రాణాలు పోయినా పట్టించుకోవలసిన అవసరం లేదనే సంకేతం పంపిస్తున్నది.

(ఫిబ్రవరి 5 'పీపుల్స్ డెమొక్రసీ' సంపాదకీయం)

# రాష్ట్ర బడ్జెట్- విద్యారంగం ప్రాధాన్యత



పాకాల శంకర్ గౌడ్
9848377734

ఎన్నికల వేళ రాజకీయ పార్టీల నాయకులు ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందిస్తామని ఏండ్లుగా హామీలిస్తూనే ఉన్నారు. గెలిచాక మాత్రం దాని ఊసే మరుస్తున్నారు. సాధారణ పౌరులు వారి సంపాదనలో దాదాపుగా ఎనభై శాతం విద్య, వైద్యానికే ఖర్చు చేస్తున్నారనీ సర్వేల అంచనా. భారతదేశంలో అత్యధికంగా విద్య, వైద్య రంగాల్లో దోపిడీ జరుగుతు న్నది కూడా మన తెలుగు రాష్ట్రాల్లోనేనన్న విమర్శ వాస్తవం. ప్రయివేటు రంగంలో ఫీజులను నియంత్రించకపోవడం, ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ పట్ల పాలకులకు చిత్తశుద్ధి లోపించడం, విద్యావంతులు, మేధావుల సూచనల్ని పరిగణనలోకి తీసుకోకపోవడం, కార్పొరేట్ విద్యను బలోపేతం చేసే విధానాల్ని అవలంభించడం ఈ దుస్థితికి కారణం.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించాక సామాజిక బాధ్యతగా, విద్యావంతులు, మేధావులు, ఉపాధ్యాయ సంఘాలు రాష్ట్రంలో విద్యా వ్యవస్థ ఎలా ఉండాలో సూచిస్తూ ప్రతిపాదనలను నాటి ప్రభుత్వానికి అందజేసింది. కానీ, వాటిని ఆ సర్కార్ పెడచెవిన పెట్టింది. కేవలం గురుకుల విద్యావ్యవస్థను మాత్రమే ప్రోత్సహిస్తూ వచ్చింది. మంచిదే, కానీ అది అప్పటికే కొనసాగుతున్న పాఠశాల విద్య నిర్లక్ష్యానికి దారితీసింది. గురుకుల విద్య, పాఠశాల విద్యను సమాన స్థాయిలో ముందుకు తీసుకెళ్లే కార్యచరణ లోపించింది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత రాష్ట్రంలో కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్యనందిస్తామని, కార్పొరేట్ విద్యకు ధీటుగా ప్రభుత్వ బడుల్లో అందరికీ నాణ్యమైన విద్యను అందిస్తామని గత సర్కార్ హామీలిచ్చింది. కానీ, పాఠశాల విద్యకు కేటాయించిన బడ్జెట్ రాష్ట్ర బడ్జెట్‌లో సగటుగా చూస్తే 6.6శాతం మాత్రమే. దీనివల్ల విద్యారంగంపై బడ్జెట్ ప్రభావం చాలా ఉన్నది. రాష్ట్రంలోని పాఠశాలల్లో 5895 పాఠశాలలో ఏకోపాధ్యాయ పాఠశాలలుగా నడుస్తుండగా ఇందులో 2097 పాఠశాలల్లో అసలు పిల్లలే లేరు(జీరో స్కూల్స్). విద్యా హక్కు చట్టం అమల్లోకి వచ్చి పదిహేనేండ్లు కావస్తున్నా రాష్ట్ర బడుల్లో మూత్రశాలలు బాలురకు 74.1శాతం, బాలికలకి 85.14శాతం మాత్రమే ఉపయోగించే స్థితిలో ఉన్నాయి.

రాష్ట్రంలో ప్రతియేటా జీరో బడులు(పిల్లలు లేని బడులు) పెరుగుతున్నాయి. అంటే ప్రభుత్వ బడులకు ఆదరణ తగ్గుతుందనే విషయం మనకు అర్థమవుతున్నది. కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలన్నట్టుగా రాష్ట్రంలో పాఠశాల విద్యా రంగం గాడి తప్పడానికి అనేక కారణాలున్నాయి. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత, భర్తీ చేయని ఖాళీలు, పర్యవేక్షణా లోపం, సత్ఫలితాలనివ్వని పథకాల అమలు, ప్రభుత్వ బడులపై తల్లిదండ్రులకు ఏర్పడిన అభిప్రాయం,విద్యారంగానికి సరిపోయే బడ్జెట్ కేటాయించకపోవడం, ఇలా చెప్పుకుంటూ పోతే అనేక అంశాల్లో విద్యారంగం పట్ల మన పాలకులకు సరైన దృష్టి లేదనే చెబుతున్నది. తెలంగాణ బడ్జెట్‌లో గతేడాది విద్యారంగానికి కేటాయించిన నిధులు రూ.21,292 కోట్లు. దేశంలోని టాప్ ఇరవై రాష్ట్రాల్లో విద్యారంగానికి అత్యల్పంగా 7.75శాతం నిధులను కేటాయించింది మన రాష్ట్రమే. ఢిల్లీ 21.1, కర్నాటక 11, ఆంధ్రప్రదేశ్ 12.6, కేరళ 14, తమిళనాడు 14.1 రాష్ట్రాలు విద్యారంగ అభివృద్ధికి, ప్రభుత్వ విద్యారంగా పరిరక్షణకి మనకన్నా అత్యధిక నిధులు కేటాయించాయి. ఆ రాష్ట్రాలతో పోల్చుకుంటే తెలంగాణ చాలా వెనకబడి ఉన్నది. ఒకరకంగా విద్యారంగాన్ని సర్కార్ నిర్లక్ష్యం చేయడమే అవుతుంది. ఇది రానురానూ విద్యా సంక్షేమం బాధ్యత నుంచి సర్కార్ తప్పుకుంటుందా? అనే సందేహం కూడా కలుగుతున్నది.ఇది సరైంది కాదు, బడ్జెట్ కేటాయింపులను బట్టి విద్యావంతులు, మేధావులు స్పందించి చర్చల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలి. విద్యార్థుల భవిష్యత్తు కోసం పాలకులపై ఒత్తిడి పెంచి అవసరమైన నిధులు రాబట్టాలి.



ప్రగతిశీల చైతన్యపూరిత భావజాలానికి బదులుగా కార్పొరేటీకరణ,వ్యాపారీకరణ, ప్రయివేటీకరణ, స్వచింతన విద్యారంగంతో పాటు ఉపాధ్యాయుల్లోనూ నెలకొన్నాయి. ప్రజలకు ఉపాధ్యాయులకు మధ్య అవినాభావ సంబంధం తగ్గింది. గతంతో పోలిస్తే నేటితరం ఉపాధ్యాయులపై ప్రజల్లో ప్రేమ అభిమానాలు, గౌరవం కూడా తగ్గాయి. వాటిని పునరుద్ధరించుకోవాల్సిన బాధ్యత నేటి తరం ఉపాధ్యాయులపై ఉన్నా ఆ దిశగా దృష్టి సారించకపోవడం విచారకరం. ఉపాధ్యాయులకు బోధనా నైపుణ్యాల పెంపు కోసం ప్రతి ఏడాది వృత్యంతర శిక్షణలను ఇస్తూ, పర్యవేక్షణ అధికారులతో నిరంతరం పర్యవేక్షిస్తే సత్ఫలితాలు సాధించవచ్చు.పర్యవేక్షణ అధికారులుగా బోధనా అనుభవంలేని వారిని నియమిస్తే అసలుకే మోసం వచ్చే ప్రమాదం ఉంటుంది. జిల్లా, మండల స్థాయి పర్యవేక్షణ అధికారులుగా బోధనా అనుభవం గల వారిని మాత్రమే నియమించాలి. క్షేత్రస్థాయి పరిస్థితుల్ని విద్యార్థుల ఉపాధ్యాయుల సమస్యలను అర్థం చేసుకోవాలంటే బోధనా అనుభవం ఉన్న అధికారులతో మాత్రమే సాధ్యమవుతుంది.

విద్యకు 15శాతం నిధులు బడ్జెట్‌లో కేటాయించి,ప్రభుత్వ బడులను పటిష్టం చేసి రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన ఉచితవిద్యను అందిస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు కేవలం 7.75శాతం మాత్రమే గత బడ్జెట్‌లో కేటాయింపులు చేసింది.దేశంలోని అన్ని రాష్ట్రాల్లో విద్యకు కేటాయించిన సగటు బడ్జెట్ 14.7శాతంలో ఈ కేటాయింపులు సగం మాత్రమేనన్నది మనం గమనించాలి. విద్యా రంగాన్ని సంక్షోభం నుండి బయట పడేయాలంటే

> తెలంగాణ బడ్జెట్‌లో గతేడాది విద్యారంగానికి కేటాయించిన నిధులు రూ.21,292 కోట్లు. దేశంలోని టాప్ ఇరవై రాష్ట్రాల్లో విద్యారంగానికి అత్యల్పంగా 7.75శాతం నిధులను కేటాయించింది మన రాష్ట్రమే. ఢిల్లీ 21.1, కర్నాటక 11, ఆంధ్రప్రదేశ్ 12.6, కేరళ 14, తమిళనాడు 14.1 రాష్ట్రాలు విద్యారంగ అభివృద్ధికి, ప్రభుత్వ విద్యారంగా పరిరక్షణకి మనకన్నా అత్యధిక నిధులు కేటాయించాయి. ఆ రాష్ట్రాలతో పోల్చుకుంటే తెలంగాణ చాలా వెనకబడి ఉన్నది. ఒకరకంగా విద్యారంగాన్ని సర్కార్ నిర్లక్ష్యం చేయడమే అవుతుంది. ఇది రానురానూ విద్యా సంక్షేమం బాధ్యత నుంచి సర్కార్ తప్పుకుంటుందా? అనే సందేహం కూడా కలుగుతున్నది.

రాష్ట్రంలో వివిధ మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో నడుస్తున్న 30306 పాఠశాలలో చదువుతున్న 28,95,456 మంది విద్యార్థులు, 2020 సంక్షేమ హాస్టల్లో ఉండి చదువుకుంటున్న 3లక్షల30వేల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు, 35వేల అంగన్వాడీ సెంటర్లో ఉన్న మూడు లక్షల పూర్వ ప్రాథమిక విద్యార్థుల అవసరాలను పరిగణలోకి తీసుకోవాలి. రాబోయే రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయింపులు పెంచాల్సిన అవసరం ఉన్నది.ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ విద్యారంగం పరిరక్షించాలంటే, రాష్ట్రంలోని బాలలకు నాణ్యమైన విద్య ఉచితంగా అందాలంటే ప్రభుత్వం నియమించిన విద్యామిషన్ సిఫారసులను తప్పకుండా అమలు చేయాలి. అలా చేస్తేనే రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ సాధ్యమవుతుంది, బడుగు బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన ఉచిత విద్య అందుతుంది.ఆ దిశగా ప్రభుత్వం కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.



## 3 రోజుల్లో డీఎస్సీ-2008 నియామకాలు

### హైకోర్టుకు ప్రభుత్వ హామీ

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

డీఎస్సీ-2008లో అర్హత సాధించిన 1,382 మంది బీఎడ్ అభ్యర్థులను కాంట్రాక్ట్ పద్ధతిన మూడు రోజుల్లో నియామకాలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు హామీ ఇచ్చింది. ఏపీ తరహాలో రిటైర్ అయ్యే వరకు కాంట్రాక్టు పద్ధతిలో నియమించాలని గతంలో ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయలేదంటూ పలువురు అభ్యర్థులు వేసిన పిటిషన్లను సోమవారం హైకోర్టు విచారించింది. గత ఉత్తర్వుల మేరకు అమలు చేయకపోవడంతో హైకోర్టు ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డిని కోర్టుకు పిలిపించి విచారణ జరిపింది. తాము ఆదేశించినా ఎందుకు అమలు చేయలేదని ఆయనను నిలదీసింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఈసీ అనుమతి వచ్చిందనీ, మూడు రోజుల్లో అమలు చేస్తామని నరసింహా రెడ్డి కోర్టుకు వివరించారు. ఈ హామీని హైకోర్టు రికార్డుల్లో నమోదు చేసింది. డీఎస్సీ-2008కి సంబంధించి 1,382 పోస్టుల భర్తీ వ్యవహారంపై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ ఈ తిరుమలాదేవిలతో కూడిన బెంచ్ సోమవారం విచారించింది. ప్రభుత్వ హామీని అమలు చేసి నివేదిక అందజేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 17కు వాయిదా వేసింది.

**పోలీసులకు హైకోర్టు నోటీసులు**

ఫోన్ ట్యాపింగ్ జరిగిందంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్‌గౌడ్ చేసిన ఫిర్యాదు ఆధారంగా పంజాగుట్ట పోలీసులు పెట్టిన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ రెండో నిందితుడు రాధాకిషన్‌రావు హైకోర్టును ఆశ్రయించారు. పోలీసులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను ఈనెల 24వ తేదీకి వాయిదా వేస్తూ జస్టిస్ లక్ష్మణ్ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఇదే కేసులో మాజీ మంత్రి హరీశ్‌రావు వేసిన పిటిషన్‌ను కూడా కలిపి విచారిస్తామన్నారు.

**సీబీఐకి నోటీసులు**

ఏపీకి చెందిన మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసు నిందితుడు దస్తగిరిని సాక్షిగా సీబీఐ పేర్కొనడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను హైకోర్టు విచారించింది. సీబీఐతోపాటు దస్తగిరికి సోమవారం నోటీసులు జారీ చేసింది. తొలుత నిందితుడిగా ఉన్న దస్తగిరి అప్రూవర్‌గా మారినందున సాక్షిగా పరిగణించాలన్న దస్తగిరి అభ్యర్థనను సీబీఐ కోర్టు ఆమోదించింది. ఈ నిర్ణయాన్ని రద్దు చేయాలంటూ డి శివశంకర్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డి వేసిన పిటిషన్లను జస్టిస్ లక్ష్మణ్ విచారించారు. తదుపరి విచారణను ఈనెల 27కు వాయిదా వేశారు.

**తెలంగాణ కుల ధ్రువీకరణ పత్రం ఉంటేనే రిజర్వేషన్లు**

పీజీ మెడికల్ అడ్మిషన్లలో ఏపీ ప్రభుత్వం జారీ చేసిన ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాల మేరకు సీట్లను పొందలేరని హైకోర్టు స్పష్టం చేసింది. తెలంగాణలో ఎస్సీలుగా ఉన్న వాళ్లు ఏపీలో ఉండాలనేది లేదనీ, ఏపీలో ఉన్న వాళ్లు తెలంగాణలో ఉండాలని కూడా లేదని చెప్పింది. ఏపీలో పొందిన కుల ధ్రువీకరణ పత్రాల ద్వారా ఇక్కడ రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది. తెలంగాణలో తహసీల్దార్, ఆర్డీవో అధికారులు ఎస్సీ/ఎస్టీ/బీసీ కుల ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తారనీ, అలాంటి వాటినే అనుమతించాలని ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ మేరకు కాళోజీ వైద్య విశ్వవిద్యాలయం అమలు చేసింది. తెలంగాణలో జారీ చేసిన పీజీ మెడికల్ అడ్మిషన్లలో రిజర్వేషన్లు కల్పిస్తామన్న నిబంధనను కొట్టేయాలంటూ వేసిన పిటిషన్లను యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజయ్ పాల్, జస్టిస్ రేణుక డివిజన్ బెంచ్ కొట్టివేస్తూ కీలక తీర్పును సోమవారం వెలువరించింది.

## అంతర్రాష్ట్ర సర్వీసులపై ఆర్టీఏ కొరడా

- నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాల సీజ్
- ఇప్పటి వరకు 61 ప్రయివేటు బస్సులపై కేసులు
- రూ.20 లక్షలు జరిమానా వసూలు
- తెలంగాణ రోడ్ ట్యాక్స్ కట్టాల్సిందే




**నవతెలంగాణ-సిటీబ్యూరో**

అంతర్రాష్ట్ర సర్వీసులపై రవాణాశాఖ కొరడా ఝుళిపిస్తుంది. నేషనల్ పర్మిట్, ఇంటర్ స్టేట్ పర్మిట్ల పేరుతో రాష్ట్రంలో తిరుగుతున్న ప్రయివేటు బస్సుల తనిఖీని రవాణాశాఖ అధికారులు ముమ్మరం చేశారు. కేవలం 5 రోజుల్లో 61 బస్సులపై కేసులు నమోదు చేసి, దాదాపు రూ.20 లక్షలకు పైగా జరిమానాలు వసూలు చేశారు. శివారు ప్రాంతాలు, రాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్‌పోస్టుల్ని బలోపేతం చేసి, నిరంతర తనిఖీలు చేస్తున్నారు. కేవలం పర్మిట్లనే కాకుండా, బస్సుల్లో అదనంగా సీట్లు ఉన్నా, ఇతర ఉల్లంఘనలు కనిపించినా భారీ ఎత్తున జరిమానాలు విధిస్తున్నారు. వాస్తవానికి సంక్రాంతి సమయంలోనే ఆర్టీఏ అధికారులు ప్రయివేటు బస్సుల తనిఖీలు ప్రారంభించారు. ఆ సమయంలో అనేక బస్సుల్లో నిబంధనల ఉల్లంఘనలు గుర్తించడంతో, తాజాగా కేవలం అంతర్రాష్ట్ర సర్వీసులే లక్ష్యంగా దాడులు చేస్తున్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, వాహన సామర్థ్య పరీక్షల(ఫిట్‌నెస్) గడువు ముగిసిపోవడం, బస్సుల్లో ఫస్ట్‌ఎయిడ్ బాక్స్‌లు లేకపోవడం, అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన నియంత్రణా పరికరాలు లేకపోవడం, పరిమితికి మించి సరుకు రవాణా చేయడం సహా ఇతర ఉల్లంఘనలన్నింటినీ క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. దూర ప్రాంత బస్సుల్లో ఇద్దరు డ్రైవర్లు లేకపోయినా కేసులు నమోదు చేస్తున్నారు. నేషనల్ పర్మిట్ పేరుతో రాష్ట్రంలోకి ప్రవేశించి రోడ్డు టాక్స్ చెల్లించకుండా తిరుగుతున్న వాహనాలను నిలుపుదల చేస్తున్నారు. తమిళనాడు, కేరళలో కూడా నేషనల్ పర్మిట్లు ఉన్నప్పటికీ రాష్ట్ర రహదారులపై వాహనాలు తిరుగుతున్నందున రోడ్ ట్యాక్స్ విధిస్తున్నారు. దీన్నే తెలంగాణలో కూడా అమలు చేస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగింపు సమీపిస్తుండటంతో రవాణాశాఖ ఆదాయాన్ని పెంచుకోవడం కోసం ఈ తరహా తనిఖీలను అధికారులు ముమ్మరం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నా, క్షేత్రస్థాయిలో మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్లు (ఎమ్‌వీఐ), సహాయ ఎమ్‌వీఐలు నిబంధనల ఉల్లంఘనల్ని గుర్తించడంలో ఎలాంటి టార్గెట్లు లేవని చెప్తున్నారు. తాము రెగ్యులర్‌గా ఇలాంటి తనిఖీలు చేస్తూనే ఉంటామని, తప్పులు సరిదిద్దుకోలేని ఉల్లంఘనలు ఉంటే వాహనాలను సీజ్ చేసి, రవాణాశాఖ కార్యాలయాలకు తరలిస్తున్నామని చెప్తున్నారు. కండీషన్‌లేని వాహనాలు రోడ్లపై తిరిగితే, అమాయకులు రోడ్డు ప్రమాదాలకు గురవుతారని హెచ్చరిస్తున్నారు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, ఓవర్‌లోడ్ వంటి కారణాలతో రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతున్నదని అధికారులు భావిస్తున్నారు. దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల వల్ల ఏటా దాదాపు 4.50 లక్షల మంది మరణిస్తున్నారు. రహదారుల విస్తరణ వేగవంతగా జరుగుతున్నా, వాహనాల ఫిట్‌నెస్ సక్రమంగా లేకపోవడం, అతివేగంతో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నట్టు నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. దానిలో భాగంగానే రవాణాశాఖ ఈ తరహా తనిఖీలను ముమ్మరం చేస్తున్నది. కేవలం బస్సులపైనే కాకుండా లారీలు, ఇతర సరుకు రవాణావాహనాలను కూడా క్రమం తప్పకుండా తనిఖీలు చేస్తామని రవాణాశాఖ అధికారులు చెప్తున్నారు. దీనివల్ల మార్చి నెలాఖరు నాటికి దాదాపు రూ.10 కోట్లకు పైగా అదనపు ఆదాయం వస్తుందని లెక్కిస్తున్నారు. రాష్ట్ర పరిధిలోని బెంగళూరు, గుజరాత్, ముంబై, నాగ్‌పూర్, విజయవాడ జాతీయ రహదారులపై ఈ తరహా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. పెండింగ్ ట్యాక్స్‌లు చెల్లించనట్టు గుర్తిస్తే, అవి చెల్లించే వరకు వామనాలను సీజ్ చేస్తున్నామని రవాణాశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

# అభ్యంతరాలుంటే, ఏండ్ల తరబడి మౌనమెందుకు ?

**తమిళనాడు గవర్నర్‌ను ప్రశ్నించిన సుప్రీం కోర్టు**

**కేసుపై తీర్పు రిజర్వ్**




**న్యూఢిల్లీ :** రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లులపై అభ్యంతరాలు వున్నపుడు ఇంత సుదీర్ఘకాలం ఎందుకు మౌనంగా వున్నారని తమిళనాడు గవర్నర్‌ను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. బిల్లులను ఆమోదించకుండా మీరు నిలుపు చేయడానికి గల కారణాలను ప్రభుత్వానికి తెలియచేసి వుంటే మీతో ప్రభుత్వం అంగీకరించి వుండేదేమో కదా అని జస్టిస్ పార్దివాలా వ్యాఖ్యానించారు. రోజులు, నెలలు కాదు, ఏకంగా ఏళ్ళ తరబడే ఇలా మౌనం పాటించడాన్ని ఆయన ప్రశ్నించారు. తొలుత మౌనం పాటించి, చివరకు పరిశీలన నిమిత్తం రాష్ట్రపతికి పది బిల్లులను నివేదించడంతో ఈ అంశం పరాకాష్టకు చేరుకుంది. ఈ బిల్లులను ఇలా తొక్కిపట్టి వుంచినపుడు గవర్నర్ మనసుసలో 'కచ్చితంగా ఏదో వుంది' అని జస్టిస్ పార్దివాలా, గవర్నర్ తరపు వాదనలు వినిపిస్తున్న అటార్నీ జనరల్ వెంకటరమణిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అయినా, ఈ బిల్లుల విషయంలో తనకు అసంతృప్తిని కలిగించిన అంశం గురించి గవర్నర్ ప్రభుత్వానికి తెలియచేయలేదన్నారు. దాదాపు ఒకటి, రెండేళ్ళు మాట్లాడకుండా కూర్చుని, అకస్మాత్తుగా రాష్ట్రపతికి నివేదించానని చెప్పారని పార్దివాలా అన్నారు.

రాష్ట్ర యూనివర్సిటీల్లో వైస్ ఛాన్సలర్ల నియామకాలకు సెర్చ్ కమ్ సెలక్షన్ కమిటీ ఏర్పాటుకు సంబంధించి తన అభ్యంతరాలను గవర్నర్ ఇంతకుముందే రాష్ట్ర ప్రభుత్వానికి తెలియచేశారని వెంకటరమణి చెప్పారు. ఈ కమిటీలో యుజిసి ఛైర్‌పర్సన్ నామినీని కూడా చేర్చాలని గవర్నర్ కోరారు. ఆ వెంటనే వైస్ ఛాన్సలర్ల నియామక ప్రక్రియ నుండి గవర్నర్‌ను తొలగించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం బిల్లులను ఆమోదించింది. అటువంటపుడు 2023 నవంబరు 18న ఆ పది బిల్లులను అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశమై మళ్ళీ ఆమోదించడమనేది కేవలం లాంఛనప్రాయం కాదని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ఆయన అభ్యంతరాలు ఏమిటో అసెంబ్లీకి తెలియాల్సి వుందని న్యాయమూర్తి పేర్కొన్నారు.

అలా అయితే ఆమోదం తెలియచేయకుండా, రాష్ట్రపతి పరిశీలనకు పంపడం ద్వారా గవర్నర్ తన పరిధి దాటి వ్యవహరించారా అని అటార్నీ జనరల్ వెంకటరమణి ప్రశ్నించారు. ఈ దశలో తమిళనాడు ప్రభుత్వం తరపున వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది ఎ.ఎం.సింఘ్వి మాట్లాడుతూ, బిల్లులను తొక్కిపెట్టడానికి గల కారణాలను గవర్నర్ ప్రభుత్వానికి తెలియచేయడమనేది సుపరి పాలన లక్షణమన్నారు.

ఈ దశలో బెంచ్‌లోని మరో న్యాయమూర్తి జస్టిస్ మహదేవన్ మాట్లాడుతూ, గవర్నర్ నవంబరు 13న బిల్లులను వెనక్కి పంపిస్తే 18నే అసెంబ్లీ తిరిగి ఆమోదించిందని, అంటే ప్రభుత్వం ఎందుకు కేవలం ఐదురోజులే సమయం తీసుకుందని ప్రశ్నించారు. దానిపై సింఘ్వి స్పందిస్తూ, 200వ అధికరణ కింద రాజ్యాంగపరమైన భావనలో అసెంబ్లీకి సర్వాధికారాలు వున్నాయని, గవర్నర్‌కు లేవని చెప్పారు. గవర్నర్ కారణాలు చెప్పినా, చెప్పక పోయినా 200వ అధికరణ కింద నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం అనుసరించాల్సిందేనని, అది తప్ప మరే ఇతర భాష్యం చెప్పినా అది రాజ్యాంగ ప్రాథమిక స్ఫూర్తికి విరుద్ధమవుతుందని సింఘ్వి పేర్కొన్నారు. "నేను చెప్పేవరకు పరిశీలించవద్దని గవర్నర్, అసెంబ్లీకి చెప్పలేరని సింఘ్వి స్పష్టం చేశారు. ఈ కేసులో తీర్పును కోర్టు రిజర్వ్ చేసుకుంది.

## ప్రజల మనిషి కాసాని ఐలయ్య

### సంస్మరణ సభలో ఉడుత రవీందర్



**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

ప్రజల మనిషి కాసాని ఐలయ్య అనీ, ఆయన ప్రజల గుండెల్లో నిలిపోతారని గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం (జీఎంపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ చెప్పారు. సోమవారం హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జీఎంపీఎస్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కాసాని ఐలయ్య సంస్మరణ సభను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కిల్లె గోపాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ ఐలయ్య.. ప్రజల సమస్యల పరిష్కారం నిరంతరం శ్రమించారని గుర్తు చేశారు. వరంగల్ జిల్లాలో జన్మించి కొత్తగూడెం జిల్లా సుజాత నగర్‌కు వలసెళ్లి ఆ ప్రాంతంతో పాటు, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని గుర్తుచేశారు. ఇండ్లు లేని పేదలను సమీకరించి 20వేల మందికి గూడు కల్పించారని తెలిపారు. భూ పంపిణీ కోసం ఉద్యమాలు నిర్వహించారన్నారు. వేలాదిమంది గిరిజనులకు పోడు భూములకు పట్టాలు ఇప్పించారని గుర్తు చేశారు. అలాంటి గొప్ప నాయకుడు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు రావుల జంగయ్య, రాష్ట్ర నాయకులు పగడాల యాదయ్య, కె.చంద్రశేఖర్, కె.లింగయ్య, ఏ.శంకరయ్య, బొల్లం అశోక్, ఎం.రాజు, ఆలేటి యాదగిరి, అమీర్ పేట్ మల్లేష్, ఎ.కొమురయ్య, సిహెచ్.కోటేశ్వర్ రావు, డి.నాగేశ్వర్ రావు, కాసాని రజిత తదితరులు పాల్గొన్నారు.

## రెండు ఎకరాల వరకు రైతు భరోసా ప్రారంభం

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

రైతు భరోసా పథకం కింద రెండెకరాలున్నా రైతుల ఖాతాల్లో నగదును జమ చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది.

ఇందులో భాగంగా ఎనిమిది లక్షల మంది రైతులకుగానూ రూ. 707 కోట్లను వారి ఖాతాలకు ప్రభుత్వం విడుదల చేసింది. జనవరి 27న పైలెట్ ప్రాజెక్టు కింద 577 గ్రామాలకు రైతు భరోసా నిధులను విడుదల చేసింది. ఫిబ్రవరి 5న ఎకరా లోపు రైతుల ఖాతాల్లో రూ. 557 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసింది.

## అప్పుల కుప్ప

(మొదటిపేజీ తరువాయి)

లక్షల కోట్లకు అప్పు పెరగనుంది. ఇది దేశ జీడీపీలో 56.1 శాతంగా నమోదైంది. లోక్‌సభలో సీపీఐ ఎంపీ కె.సుబ్బరాయన్ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ అప్పులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. 2018-19లో రూ.93.26 లక్షల కోట్ల ఉన్న కేంద్ర ప్రభుత్వ అప్పు, 2025-26 నాటికి రూ.200.16 లక్షల కోట్లకు పెరగనున్నది.

| ఏడాది | అప్పు (లక్షల కోట్లు) |
|---|---|
| 2018-19 | రూ. 93.26 |
| 2019-20 | రూ. 105.07 |
| 2020-21 | రూ. 121.86 |
| 2021-22 | రూ. 138.66 |
| 2022-23 | రూ. 156.02 |
| 2023-24 | రూ. 171.70 |
| 2024-25 | రూ. 185.11 |
| 2025-26 | రూ. 200.16 |

### కుటుంబ అప్పులు పైకి... పొదుపులు కిందకి

దేశంలో కుటుంబాల అప్పు పెరుగుతోంది. పొదుపు తగ్గుతోంది. లోక్‌సభలో ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. తలసరి ఒక కుటుంబ అప్పు 2019లో రూ.46,898 ఉండగా, 2024 నాటికి రూ. 86,713 పెరిగింది. ప్రతి ఏడాదీ కుటుంబాల అప్పులు పెరుగుతూనే ఉన్నాయి. మరోవైపు, కుటుంబాల పొదుపు 2020-21లో జీడీపీలో 22.7 శాతం కాగా, 2022-23 నాటికి 18.4 శాతానికి పడిపోయింది.

| ఏడాది | తలసరి కుటుంబ అప్పు | జీడీపీలో వాటా (శాతం) |
|---|---|---|
| 2019 | రూ. 46,898 | 32.9 |
| 2020 | రూ. 52,090 | 34.7 |
| 2021 | రూ. 57,306 | 39.1 |
| 2022 | రూ. 63,000 | 36.5 |
| 2023 | రూ. 73,887 | 37.9 |
| 2024 | రూ. 86,713 | 41.0 |

| ఏడాది | కుటుంబాల పొదుపు (జీడీపీలో శాతం) |
|---|---|
| 2020-21 | 22.7 |
| 2021-22 | 20.1 |
| 2022-23 | 18.4 |

### బ్యాంకులలో క్లర్క్, సబ్ స్టాఫ్ పోస్టుల కుదింపు

ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో క్లర్క్, సబ్‌స్టాఫ్ పోస్టులు కుదించారు. లోక్‌సభలో కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఒక ప్రశ్నకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో వివరాలు వెల్లడించారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీ)ల్లో 2017లో క్లర్క్ పోస్టులు 2,69,271 ఉండగా, 2025 జనవరి 1 నాటికి 2,48,173కు తగ్గాయి. అంటే, 21,098 పోస్టులను కుదించారు. అలాగే సబ్‌స్టాఫ్ పోస్టులు 2017లో 1,19,288 ఉండగా, 2025 జనవరి 1 నాటికి 88,851 పోస్టులకు తగ్గాయి. అంటే, 30,437 పోస్టులు కుదించారు.

### పెరిగిన అన్ని రాష్ట్రాల అప్పులు

అన్ని రాష్ట్రాల అప్పులు పెరుగుతున్నాయి. లోక్‌సభలో కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతా(యూటీ)ల అప్పులు 2016లో జీడీపీలో 23.7 శాతం కాగా, 2025 నాటికి 28.8 శాతానికి పెరిగింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ అప్పులు పైకి ఎగబాకాయి. తెలంగాణ అప్పు 2016లో జీఎస్‌డీపీలో 15.7 శాతం కాగా, 2025 నాటికి జీఎస్‌డీపీలో 26.2 శాతానికి పెరిగింది. ఏపీలో అప్పు 2016లో జీఎస్‌డీపీలో 24.5 శాతం కాగా, 2025 నాటికి జీఎస్‌డీపీలో 34.7 శాతానికి ఎగబాకింది.

| ఏడాది | జీఎస్‌డీపీలో తెలంగాణ అప్పు శాతం | ఏడాది | జీఎస్‌డీపీలో ఏపీ అప్పు శాతం |
|---|---|---|---|
| 2016 | 15.7 | 2016 | 24.5 |
| 2017 | 12.4 | 2017 | 37.2 |
| 2018 | 21.4 | 2018 | 29.2 |
| 2019 | 22.2 | 2019 | 30.3 |
| 2020 | 23.7 | 2020 | 33.2 |
| 2021 | 28.8 | 2021 | 36.1 |
| 2022 | 28.0 | 2022 | 33.1 |
| 2023 | 26.7 | 2023 | 33.1 |
| 2024 | 26.2 | 2024 | 34.3 |
| 2025 | 26.2 | 2025 | 34.7 |

## అల్వాల్ శాఖలో ఐఓబీ వ్యవస్థాపక దినోత్సవం



నవతెలంగాణ - హైదరాబాద్

ప్రభుత్వ రంగంలోని ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ (ఐఓబీ) 89వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆ బ్యాంక్ అల్వాల్ శాఖలో నిర్వహించారు. ఐఓబీ ఫౌండర్, చైర్మెన్ ఎం సిటి ఎం చిదంబరమ్ చెట్టియర్ దీన్ని 1937 ఫిబ్రవరి 10న స్థాపించారు. 1977లో అల్వాల్ శాఖను ప్రారంభించారు. ఈ ప్రత్యేక దినం సందర్భంగా అల్వాల్ బ్రాంచ్ మేనేజర్ మెగవత్ తారాచంద్ మాట్లాడుతూ.. తమ శాఖ రూ.275 కోట్ల వ్యాపారానికి చేరిందన్నారు. ఆర్థిక సంవత్సరం 2024-25లో రూ.300 కోట్లు దాటుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఓబీ అధికారులు నవీన్ కుమార్, కొడిగుడ్ల సుధీర్, పి రాఘవేందర్ రెడ్డి, అనిరుద్ జెన, శ్రీరామ్, రిటైర్డ్ చీఫ్ మేనేజర్ రవీన విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవరన్నల బతుకు భారం



### ఆర్టీసీలోకి ఎలక్ట్రిక్ బస్సులు

- హయత్‌నగర్ డిపో-2కు 100 బస్సుల కేటాయింపు
- వేరే ఎనిమిది డిపోలకు ఆర్టీసీ బస్సుల తరలింపు
- 100 మంది డ్రైవర్లు సైతం బదిలీ
- హైదరాబాద్‌లో వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులు నడిపేందుకు ప్రభుత్వం ప్రణాళికలు


నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

హైదరాబాద్ రీజియన్ పరిధిలో ఎలక్ట్రికల్ బస్సులను నడిపేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. సుమారు 25 డిపోలకు ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించనుంది. ఇందులో భాగంగా మొదటగా హయత్‌నగర్ డిపో-2కు 100 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. 14 ఏండ్ల పాటు కొనసాగిన హయత్‌నగర్ డిపో-2లో ఆర్టీసీ డ్రైవర్ల పరిస్థితి 'గూడు చెదిరిన పక్షుల్లా' మారింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో 100 మంది డ్రైవర్లు చెల్లాచెదురయ్యారు. ఇన్నేండ్లు ఒకేచోట పనిచేసిన తమను ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో తరలిస్తే.. తమ భవిష్యత్ ఏంటనీ ఆర్టీసీ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రానురాను బస్సులు, డ్రైవర్ల తరలింపుతో హయత్‌నగర్ డిపో-2 తన ఉనికిని కోల్పోతోంది. రాష్ట్రంలో మరిన్ని ఆర్టీసీ డిపోల పరిస్థితి కూడా ఇలాగే మారనుంది.

రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల స్థానాల్లో ఎలక్ట్రిక్ బస్సులు నడిపించేందుకు ప్రభుత్వం ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్ రీజియన్‌లోని కొన్ని డిపోలు, కరీంనగర్ డిపో-2, వరంగల్ డిపో-2, నిజామబాద్ డిపో-2, నల్లగొండ డిపోలకు త్వరలో ఎలక్ట్రిక్ బస్సులకు కేటాయించనున్నారు. ఒక్కో డిపో నుంచి 100 ఎలక్ట్రిక్ బస్సులు నడిపించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఏడాది చివరికి సుమారు 2,800 ఎలక్ట్రిక్ బస్సులు నడిపించనుంది. హైదరాబాద్ రీజియన్ల పరిధిలో 25 డిపోలను ఎలక్ట్రిక్ బస్సుల కోసం కేటాయించనున్నారు. ఆయా డిపోల్లో పనిచేసే ఆర్టీసీ డ్రైవర్లు 7 వేల మంది ఉన్నారు. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ డిపో-2 2010లో ఏర్పడింది. ఈ డిపో 98 ఆర్టీసీ బస్సులతో నడుస్తోంది. ఇక్కడ 188 మంది డ్రైవర్లు పనిచేస్తున్నారు. ఇప్పుడు దీన్ని ఎలక్ట్రిక్ బస్సుల డిపోగా మార్చుతున్నారు. ఈ డిపోలోని ఆర్టీసీ బస్సులను జిల్లాలోని ఇతర ఎనిమిది డిపోలకు తరలించారు. ఇక్కడ ఉన్న 188 మంది డ్రైవర్లలో ప్రస్తుతం 100 మందిని వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారు. వీరంతా 14 ఏండ్లపాటు ఒకే డిపోలో పనిచేశారు. ఒక్కసారిగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో చెల్లాచెదురయ్యారు. మిగతా 80 మందితోపాటు 25 మంది మెకానిక్‌లను సైతం వివిధ డిపోలకు ట్రాన్స్‌ఫర్ చేయనున్నట్టు డిపో అధికారులు తెలిపారు. దాంతో 14ఏండ్ల పాటు కొనసాగిన డిపో నేడు ప్రమాదంలోకి నెట్టబడుతోంది. డిపోకు ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించినప్పటికీ డిపో మాత్రం ఆర్టీసీ ఆధ్వర్యంలోనే కొనసాగుతుందని అధికారులు తెలిపారు. కానీ ఆర్టీసీ బస్సులు ఉన్నప్పుడు ఉన్న వైభవం, ఆ సిబ్బంది పనితీరు.. ఎలక్ట్రిక్ బస్సులతో రాదని.. తాము 14 ఏండ్లు ఒకచోట పనిచేసి, ఇప్పుడు దిక్కులేని వారిలా చెట్టుకొకరు.. పుట్టకొకరు అన్న చందంగా పడేశారని డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో మరిన్ని డిపోల పరిస్థితి ఇదే విధంగా మారనుంది.

### ఎలక్ట్రిక్ బస్సుపై అదనంగా కిలో మీటర్‌కు రూ.40 భారం

ప్రస్తుతం డీజిల్ బస్సుకు కిలో మీటర్‌కు ఖర్చు రూ.50 నుంచి 55 అవుతుంది. ప్రస్తుతం వచ్చే ఆదాయానికి ఖర్చుకు సరిపోతుంది. కానీ ఎలక్ట్రిక్ బస్సులు నడిపేందుకు ఒక కిలో మీటర్‌కు ప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సు యాజమానికి రూ.67 చెల్లించాలి. కండక్టర్‌కు రూ.18 ఇవ్వాలి. డిపోలో సూపర్‌వైజర్లు, ఇతర మెయింటనెన్స్ ఖర్చు రూ.5, మొత్తంగా ఒక కిలో మీటరుకు ఎలక్ట్రిక్ బస్సు మీద రూ. 90 ఖర్చు చేయాల్సి వస్తోంది. దీన్ని బట్టి చూస్తే ప్రభుత్వంపై అదనంగా కిలో మీటర్‌కు రూ.40 భారం పడనుంది. ప్రజా రవాణా కోసం ఖర్చు చేయడంలో తప్పు లేదు. కానీ ఆ ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుపై ఇచ్చే సబ్సిడీలను ఆర్టీసీకి ఇచ్చి ఆర్టీసీ వ్యవస్థను కాపాడాల్సిన అవసరం ఉందని ఆర్టీసీ ఉద్యోగులు అంటున్నారు.



### ఎలక్ట్రిక్ బస్సులు నడిపేందుకు ఆర్టీసీ డ్రైవర్లు అవసరం లేదు

ఎలక్ట్రిక్ బస్సులు నడిపేందుకు ఆర్టీసీ డ్రైవర్లతో పనిలేదని.. కార్పొరేట్ సంస్థలు తెగేసి చెబుతున్నాయి. తమకు కండక్టర్‌ను ఇచ్చి.. ప్రతి 100 బస్సులకు ఒక డిపో.. అందులో 40 చార్జింగ్ పాయింట్స్, 33 కేవీ సబ్ స్టేషన్ ఉండాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరాయి. ఈ మేరకు ప్రభుత్వం ఆర్టీసీ డిపోలను ఎలక్ట్రిక్ బస్సు డిపోలుగా మార్చనుంది. ప్రస్తుతం ఒక్కో ఎలక్ట్రికల్ డిపోలో చార్జింగ్ పాయింట్స్ నిర్వహణకు రూ.10 లక్షలు ఖర్చవుతుంది.

### కేంద్రం ఎలక్ట్రికల్ బస్సులపై సబ్సిడీని ఆర్టీసీకి ఇవ్వాలి

ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు కార్పొరేట్ వ్యవస్థలకు ఇచ్చే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలి. కాలుష్య నియంత్రణలో భాగంగా ఎలక్ట్రిక్ బస్సులు నడపడానికి అభ్యంతరం లేదు. కానీ ఎలక్ట్రిక్ బస్సు కొనుగోలుకు ఇస్తున్న సబ్సిడీ నిధులు ఆర్టీసీకి ఇవ్వాలి. ఎలక్ట్రిల్ బస్సులను ఆర్టీసీ వ్యవస్థ నుంచి నడిపించి ఆర్టీసీ కార్మికులను, ఆర్టీసీ వ్యవస్థను కాపాడాలి.



వి. శ్రీనివాసరావు, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

# పెన్షన్ వాటాను పెంచాలి

- పెన్షన్‌ను చట్టబద్ధమైన హక్కుగా మార్చేందుకు పోరాటం : ఢిల్లీలో ఎన్‌పీఆర్‌డీ మహాధర్నాలో నేతలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో




మాట్లాడుతున్న జాతీయ ఉపాధ్యక్షులు ఎం. అడివయ్య

దేశ రాజధాని హస్తినలో వికలాంగులు కదంతొక్కారు. తమ సమస్యలను పరిష్కరించాలని గొంతెత్తారు. "వికలాంగులు గౌరవంగా జీవించడానికి, వారి ప్రాథమిక అవసరాలను తీర్చడానికి కేంద్ర పెన్షన్ వాటాను రూ.5,000 కు పెంచాలి. 2021 రాజస్థాన్ చట్టం ప్రకారం పార్లమెంటులో వికలాంగ పెన్షన్‌ను చట్టపరమైన హక్కుగా హామీ ఇచ్చే చట్టాన్ని అమలు చేయాలి. 40 శాతం, అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న వారందరికీ పెన్షన్ ఇవ్వాలి. ఇతర మినహాయింపు ప్రమాణాలను తొలగించాలి. ప్రతి వికలాంగునికీ అంత్యోదయ రేషన్ కార్డు, ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు ఇచ్చి 200 రోజులు పని దినాలు కల్పించాలి. 2025-26 కేంద్ర బడ్జెట్‌లో 5 శాతం నిధులు కేటాయించాలి. వికలాంగులకు పెన్షన్ చట్టబద్ధమైన హక్కుగా మార్చాలి" తదితర డిమాండ్ల సాధన కోసం అంటూ సోమవారం ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో పార్లమెంట్ మార్చ్ నిర్వహించారు.

ఈ మార్చ్‌లో సీపీఐ(ఎం) ఎంపీలు జాన్ బ్రిట్టాస్, శివదాసన్, ఎఎ రహీమ్, బికాష్ రంజన్ భట్టాచార్య, డీఎంకే ఎంపీ తిరుచ్చి శివ, సీపీఐ ఎంపీ పి. సంతోష్ కుమార్, టీఎంసీ ఎంపీ మౌషన్ నూర్, ఎస్పీ ఎంపీ జావిద్ అలీ ఖాన్, ఎన్‌సీపీ ఎంపీ ఫౌజియా ఖాన్, కేరళ కాంగ్రెస్ ఎంపీ జోస్ కె.మణి, జేఎంఎం ఎంపీ మహువా మాంఝీ, ఐయూఎంఎల్ ఎంపీ హరీష్ బిరెన్, స్వతంత్ర ఎంపీ అజిత్ కుమార్ భూయాన్ పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌పీఆర్‌డీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గిరీష్ కీర్తి, మురళీధరన్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్ చట్టబద్ధమైన హక్కుగా మార్చాలని డిమాండ్ చేశారు. దేశంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 2.68 కోట్ల మంది వికలాంగులున్నారని కేంద్ర ప్రభుత్వం చెప్తున్నదనీ, డబ్ల్యూహెచ్ఓ లెక్కల ప్రకారం 16 శాతం మంది వికలాంగులు ఉన్నారని వివరించారు. వికలాంగుల జనాభాను గుర్తించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆగ్రహించారు. 2012 నుంచి పెన్షన్లలో కేంద్రం తన వాటాగా రూ.300 మాత్రమే చెల్లిస్తుందనీ, దీనితో వికలాంగులు ఎట్లా బతుకుతురని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) ఎంపీజాన్‌బ్రిట్టాస్

నిత్యవసర సరకుల ధరలు 300 రేట్లు పెంచిన మోడీకి వికలాంగుల పెన్షన్స్ పెంచాలానే ఆలోచన ఎందుకు రావడం లేదన్నారు. ధరల పెరుగుదల సూచీకి పెన్షన్స్ అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం ఇస్తున్న ఇందిరా గాంధీ జాతీయ వికలాంగుల పెన్షన్ పథకాన్ని వికలాంగులందరికీ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు.

రాజస్థాన్ రాష్ట్రం మాదిరిగా పెన్షన్ పొందడం వికలాంగుల హక్కుగా ప్రత్యేక చట్టం చేయాలన్నారు. 2015 డిసెంబర్ 3న ఆర్భాటంగా ప్రధాని మోడీ ప్రారంభించిన సుగమ్య భరత్ అభియాన్ పథకం అమలుకు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునేందుకు బడ్జెట్‌లో నిధులు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. కేంద్రం అసమర్థతతో 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం, 2017 మెంటల్ హెల్త్ కేర్ యాక్ట్, 2007 ఐక్య రాజ్య సమితి హక్కుల ఒప్పంద పత్రం, నేషనల్ పాలసీ, నేషనల్ ట్రస్ట్ వంటి కీలక చట్టాలు అమలు కావటం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు పరం చేసి వికలాంగులకు అమలవుతున్న రిజర్వేషన్లను రద్దు చేస్తారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను గుర్తించాలనీ, వాటిని భర్తీ చేసేందుకు ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హక్కుల సాధన కోసం వికలాంగులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ వర్కింగ్ ప్రెసిడెంట్ నంబు రాజన్, ఉపాధ్యక్షులు ఎం. అడివయ్య, మాజీ జాతీయ అధ్యక్షులు క్రాంతి గంగూలీ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ ఉపాధ్యక్షులు జాన్సీ రని, శ్యామ్య గంగూలీ, కోశాధికారి చక్రవర్తి, సహాయ కార్యదర్శి రిషికేష్, కేంద్ర కమిటీ సభ్యులు కె. వెంకట్, ఆర్. వెంకటేష్, జె. రాజులతో పాటు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి, స్వామి, అరిఫా, ఉపేందర్, కాషాప్ప, సహాయ కార్యదర్శులు దశరథ్, బాలేశ్వర్, గంగాధర్ పాల్గొన్నారు. కేంద్రం వికలాంగుల సమస్యలు పరిష్కారం చేయకుంటే, పార్లమెంట్‌లో ప్రభు త్వంను నిలదీస్తామని ఎంపీలు హామీ ఇచ్చారు.

## ఐదు మృతదేహాల గుర్తింపు

- 2026 వరకు మావోయిస్టులను పూర్తిగా నిర్మూలిస్తాం : బస్తర్ ఐజీ పి.సుందర్ రాజ్
- జవాన్లకు శ్రద్ధాంజలి ఘటించిన ఐజీ, ఇతర పోలీస్ అధికారులు

నవతెలంగాణ-చర్ల

సరిహద్దు ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లా పర్సఘడ్ పోలీస్ స్టేషన్ పరిధి లోద్దెడు గుట్టలపై ఆదివారం జరిగిన బీకర పోరులో 11 మంది మహిళా మావోయిస్టులతో సహా 31 మంది మావోయిస్టులు చనిపోగా, ఇద్దరు జవాన్లు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బస్తర్ ఐజీ పి.సుందర్ రాజ్ వివరాలు వెల్లడించారు. ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టుల్లో ఐదుగురిని గుర్తించామని, మిగిలిన 26 మందిని త్వరలోనే గుర్తిస్తామని తెలిపారు. గుర్తించిన మావోయిస్టుల్లో.. రూ.8 లక్షల బహుమతి గల హంగా కర్మ, డీవీసీఎం వెస్ట్ బస్తర్ డివిజన్ మంగు హేమ్లా, రూ.5 లక్షల బహుమతి గల పీపీసీఎం సవ్నార్, గంగలూరు పోలీస్ స్టేషన్ నివాసి, ప్లాటూన్ నంబర్ 11 కమాండర్, రూ.5 లక్షల అవార్డు గల నేషనల్ పార్క్ కమిటీ మెంబర్ సుభాష్ ఓఎం, గంగలూరి ఏరియా కమిటీ మెంబర్, రూ.5 లక్షల రివార్డు గల సన్ను, రూ.2 లక్షల రివార్డు గల నేషనల్ పార్క్ ఏరియా సభ్యుడు రమేష్ ఉన్నారు. ఎన్‌కౌంటర్ ప్రదేశం నుంచి ఒక ఏకే 47 రైఫిల్, మూడు మ్యాగజైన్‌లు, 56 కాట్రిడ్జ్‌లు, ఒక ఎస్‌ఎల్‌ఆర్ రైఫిల్, ఒక ఇన్సాస్ రైఫిల్, ఒక 303 రైఫిల్, 01 మ్యాగజైన్, 02 కాట్రిడ్జ్‌లు, 315 బోర్ రైఫిల్, 30 కాట్రిడ్జ్‌లు, 12 బోర్‌గన్‌లు, ఒక బీజీఎల్ రాకెట్ లాంచర్, బిగ్ స్టాండ్, బీజీఎల్ సెల్, ఆరు బీజీఎల్ లాంచర్లు, నాలుగు మజిల్ లోడింగ్ రైఫిల్ 9 ఐఈడీలు, లేజర్ ప్రింటర్, పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాలు, మావోయిస్టుల యూనిఫామ్స్, సాహిత్యం, మందులు, రోజువారీ ఉపయోగించే వస్తువులు స్వాధీనం చేసుకున్నట్టు ఐజీ తెలిపారు. ఇంద్రావతి నేషనల్ పార్క్ ఏరియా కమిటీ, తెలంగాణ కేంద్ర కమిటీ సమావేశం జరిగినట్టు విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం కూంబింగ్‌కి బయలుదేరినట్టు చెప్పారు. సుమారు 50 కిలోమీటర్ల దూరం కాలినడకన నడిచి వెళ్లి భద్రతా బలగాలు మూడు గ్రూపులుగా విడిపోయి లోదోడు కొండలను చుట్టుముట్టి ఆపరేషన్ నిర్వహించారని చెప్పారు. కాగా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ఉన్న మహారాష్ట్ర, తెలంగాణ, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను సమన్వయం చేసుకుంటూ 2026 మార్చి వరకు మావోయిస్టు పార్టీని పూర్తిగా నిర్మూలిస్తామని తెలిపారు. దండకారణ్యంలో జరిగిన ఎదురు కాల్పుల్లో మృతి చెందిన మావో యిస్టుల మృతదేహాలను హెలికాప్టర్ ద్వారా బీజాపూర్ జిల్లా కేంద్రంలోని పోలీస్ లైన్‌కు తరలించామన్నారు. గుర్తించే ప్రక్రియ కొనసాగుతుందని ఐజీ వివరిం చారు. ఈ ఆపరేషన్‌లో ఎస్టీఎఫ్ బస్తరు ఫైటర్స్, సీఆర్పీఎఫ్, డీఆర్జీ బలగాలకు చెందిన సుమారు 600 మంది విశేషంగా కృషి చేశారని అభినందించారు.

## ఉద్యోగం నుంచి జి.శ్రీనివాస్ తొలగింపు


- బీసీ కమిషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పొరుగు సేవల ప్రాతిపదికన రీసెర్చ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న జి.శ్రీనివాస్‌ను రాష్ట్ర బీసీ కమిషన్ ఉద్యోగం నుంచి తొలగించింది. ఈ మేరకు సోమవారం బీసీ కమిషన్ సభ్య కార్యదర్శి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 7న ఏసీబీ శ్రీనివాస్‌పై ఏసీబీ దాడి చేసింది. దీంతో అతనిపై అవసరమైన చర్యలు తీసుకోవాలని బీసీ కమిషన్ అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీని సూచించింది.

## ఆర్టీసీ చర్చలు వాయిదా

- ఎలక్షన్ కోడ్ ఉందన్న యాజమాన్యం
- మరో తేదీ ప్రకటిస్తాం-కార్మికశాఖ



ఆర్టీసీ యాజమాన్యంతో సంప్రదింపుల కోసం కార్మికశాఖ కార్యాలయంలో ఎదురుచూస్తున్న జేఏసీ నేతలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కార్మికసంఘాలతో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) యాజమాన్యం చర్చలు వాయిదా పడ్డాయి. ఈనెల 3 నుంచి మార్చి 8వ తేదీ వరకు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున చర్చలకు హాజరుకాలేమని ఆర్టీసీ యాజమాన్యం కార్మికశాఖ సంయుక్త కమిషనర్ సునీత గోపాల్‌దాస్‌కు లేఖను పంపింది. ఆర్టీసీలో కార్మిక సంఘాలు సమ్మె నోటీసు ఇచ్చిన నేపథ్యంలో సోమవారం సంప్రదింపులకు రావాలని కార్మికశాఖ ఆర్టీసీ యాజమాన్యానికి నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కార్మిక సంఘాల జేఏసీ నేతలు ఈ వెంకన్న (ఎంప్లాయీస్ యూనియన్), ఎమ్ థామస్‌రెడ్డి (టీఎమ్‌యూ), ఎమ్‌డీ మౌలానా (ఎన్‌ఎమ్‌యూ), కే యాదగిరి (బీకేయూ), ఎస్ సురేష్ (బీడబ్ల్యూయూ), బీ యాదగిరి (కార్మిక పరిషత్) సోమవారం సాయంత్రం నాలుగుగంటలకు కార్మికశాఖ కార్యాలయానికి వెళ్లారు. సంప్రదింపులకు ఆర్టీసీ యాజమాన్యం రాలేదు. దీనితో సంయుక్త కమిషనర్ సునీత గోపాల్‌దాస్ ఆర్టీసీ యాజమాన్యం చెప్పిన కారణాన్ని కార్మిక సంఘాల నేతలకు వివరించారు. అదే విషయాన్ని రాతపూర్వకంగా ఇవ్వాలని నాయకులు కోరడంతో ఆమె అలాగే వివరణ రాసిస్తూ, చర్చలకు అనుకూలమైన తేదీని మళ్ళీ నిర్ణయించి పిలుస్తామని చెప్పారు.



## వందశాతం రుణమాఫీ నిరూపిస్తే.. రాజకీయ సన్యాసం

- రాజీనామా చేసి పోటీ చేస్తే.. చిత్తుగా ఓడిస్తాం
- తొండలు గుడ్లు పెట్టని భూముల్లో పచ్చని పంటలు ఎలా కనిపిస్తున్నాయి?
- సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్
- కోస్గి మండల కేంద్రంలో రైతు దీక్ష
- హకీంపేట వద్ద కేటీఆర్‌కు గిరిజన మహిళల ఘన స్వాగతం

నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

'అయ్యా ముఖ్యమంత్రిగారూ.. మీ సొంత ఊరు కొండారెడ్డిపల్లికి వస్తాను. అక్కడ 100 శాతం మంది రైతులకు రుణమాఫీ అయ్యిందని నిరూపిస్తే.. అక్కడే నా శాసన సభ సభ్యత్వానికి రాజీనామా చేస్తాను. నిరూపించకుంటే నీవు రాజీనామా చేయడానికి సిద్ధమేనా' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. నారాయణపేట జిల్లా కోస్గి మండల కేంద్రంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అధ్యక్షతన రైతు దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ బిక్షపెట్టిన కొడంగల్‌కు అన్యాయం చేసేలా గిరిజన, దళితుల భూములను లక్ష్యంగా చేసుకొని ఫార్మా పేరుతో సాగు భూములను గుంజుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తొండలు గుడ్లు పెట్టే భూముల్లో.. పచ్చని పంట పొలాలు ఎలా ఉన్నాయని, అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన కందులు ఎలా పండుతున్నాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో దుర్మార్గపు పాలన నుంచి ఈ ప్రాంతాన్ని విముక్తి చేయాలన్నారు. 14 నెలల రేవంత్‌రెడ్డి పాలనలో రైతులు, యువత, మహిళలకు, పెద్దలకు ఒరిగిందేమీ లేదన్నారు. ఒనగూరిందల్లా ఎనుముల కుటుంబంతో పాటు అదానీ, అంబానీలకు దోచిపెట్టడమే అని ఆరోపించారు.

జనవరి 26న అర్ధరాత్రి తర్వాత రైతుల ఖాతాల్లో డబ్బులు టకీ టకీమని వేస్తామన్న మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో రైతుబంధు డబ్బులు రూ.5వేలు వేశారని, కాంగ్రెస్ హామీ ప్రకారం రైతుల ఖాతాలో ఎకరాకు రూ.7500 వేయాల్సి ఉండగా ఇప్పటి వరకు మూడు పర్యాయాలు కలిపి మొత్తం రూ.17500 రైతులకు చెల్లించాల్సి ఉందన్నారు. ఫార్మా కంపెనీ పేరుతో దళిత, గిరిజనుల భూములను కాజేయాలని చూస్తే.. ఇక్కడి గిరిజనులు తిరగబడిన పాపానికి కలెక్టర్‌పై దాడి నేపం మోపి 40 మందిపై కేసులు పెట్టి జైలుకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. "సీఎం నియోజకవర్గంలో మీరు చేసింది న్యాయమే అయితే.. ఈ ప్రాంత ప్రజలు నిన్ను దీవిస్తున్నారనుకుంటే.. వెంటనే రాజీనామా చేసి మా పట్నం నరేందర్‌రెడ్డిపై పోటీ చెయ్యి.. నరేందర్‌కు 50 వేల మెజార్టీకి ఒక్క ఓటు తగ్గినా రాజకీయాలకు దూరం అవుతా" అని సవాల్ విసిరారు. త్వరలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు రానున్నాయి.. కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామాలకు వచ్చి ఓట్లడిగితే నిలదీసి అడగండి.. మీరు ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రులు నీరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### లగచర్ల బాధితులకు అండగా ఉంటాం

కొడంగల్ :లగచర్ల బాధితులకు బీఆర్‌ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హామీ ఇచ్చారు. సోమవారం వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో రైతు దీక్షకు వెళ్తున్న కేటీఆర్‌కు దుద్యాల మండలంలోని హకీంపేట్ స్టేజీ దగ్గర భారీ సంఖ్యలో బీఆర్‌ఎస్ నాయకులు, గిరిజన మహిళలు ఘన స్వాగతం పలికారు. అనంతరం భూ నిర్వాసితులు ఏర్పాటుచేసిన స్టేజ్ దగ్గరకు కేటీఆర్ వెళ్లారు. పులిచర్ల కుంటతండాకు చెందిన భూ నిర్వాసితులు పాత్లావత్ ప్రవీణ్, జ్యోతి దంపతులకు జనవరి 17న ఆడబిడ్డ పుట్టింది. ఈ సందర్భంగా ఆ బిడ్డకు పేరు పెట్టాలని జ్యోతి కోరగా, దీనికి స్పందించిన కేటీఆర్ భూ పోరాటంలో పుట్టింది కాబట్టి.. పాపకు భూమి, ధాత్రి, అవని అనే మూడు పేర్లు సూచించారు. దీనికిగాను అందరి నుంచి భూమి అని పేరు చెప్పడంతో, పాపకు 'పాత్లావత్ భూమిబాయినాయక్' అని నామకరణం చేశారు. గిరిజన మహిళలు కేటీఆర్‌కు గోరిమాటి వీరణ(వస్త్రాన్ని)ను బహూకరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. గిరిజన రైతుల పక్షాన బీఆర్‌ఎస్ పోరాడుతుందన్నారు. బాధిత రైతులకు అన్నివిధాలా అండగా ఉంటామన్నారు. అనంతరం అక్కడి నుంచి కోస్గిలో నిర్వహించిన రైతు దీక్షకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు చాంద్ పాషా, విష్ణువర్ధన్‌రెడ్డి, యాదయ్య, సురేష్ రాజ్, రాజునాయక్, బసప్ప, కే.నర్సిములు, బుగ్గప్ప, సుదర్శన్‌గౌడ్, విశాల్, శేఖర్, వెంకటేష్, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

7

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఎల్బీనగర్ - మహేశ్వరం

మంగళవారం | ఫిబ్రవరి 11, 2025 | www.navatelangana.com

## బార్‌లోకి ప్రవేశించిన పాత నేరస్తుడు

- అరెస్టు చేసిన పోలీసులు



నవతెలంగాణ- నాగోల్

ఓ బారులోకి అర్ధరాత్రి పాతనేరస్థుడు ప్రవేశించి సెక్యూరిటీ గార్డు నుంచి తప్పించుకోగా అతన్ని పోలీసులు గాలించి అరెస్టు చేశారు. ఈ ఘటన నాగోల్‌లో చోటుచేసుకుంది. నాగోల్ ఎస్‌ఐ వి.రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా మట్టంపల్లి గ్రామానికి చెందిన రామావత్ సైదులు ఆదివారం రాత్రి ఒంటిగంట ప్రాంతంలో నాగోల్‌లోని అమరావతి బార్‌లోకి ప్రవేశిం చాడు. అయితే సెక్యూరిటీ గార్డ్ గమనించి అతన్ని పట్టుకోవడం ప్రయత్నించగా తప్పించుకున్నాడు. సోమవారం ఉదయం బార్ యజమానుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారించగా నిందితుడిని గుర్తించి గురించి ఆరా తీయగా అతనికి నేర చరిత్ర ఉందని తెలియడంతో పట్టుకొని అరెస్టు చేసి కోర్టులో హాజరపరిచినట్లు ఎస్సై తెలిపారు. నిందితుడిపై ఇప్పటికే 27 దొంగతనం కేసులలో ప్రమేయం ఉందని ఎస్‌ఐ పేర్కొన్నారు.

## గాయపడిన కానిస్టేబుల్‌కు తోటి ఉద్యోగుల సాయం



నవతెలంగాణ-హాయత్ నగర్

ఎల్‌బీనగర్ ట్రాఫిక్ కానిస్టేబుల్ శ్రీకాంత్ గత నెలలో విధుల్లో ఉండగా రోడ్డు ప్రమాదంలో రెండు చేతులు విరిగాయి. దీంతో అతనితో పాటుగా విధులు నిర్వహిస్తున్న 2012బ్యాచ్‌కు చెందిన తోటి ఉద్యోగులు రూ. 52000వేల ఆర్థిక సాయం అందజేశారు. తామున్నామంటూ ముందుకు వచ్చినందుకు తోటి ఉద్యోగులు అభినందించారు.

# మీర్‌పేట్ హత్యకేసులో సంచలన విషయాలు..!

- తల్లి, చెల్లి, తమ్ముడు సహకారంతో భార్యను హత్య చేసిన గురుమూర్తి ..!
- పోలీస్ కస్టడిలో పలువురు పేర్లను చెప్పిన నిందితుడు..!
- హత్యకు సహకరించిన వారికోసం పోలీసుల గాలింపు..



నవతెలంగాణ - మీర్ పేట్

భార్యను అతికిరాతకంగా ముక్కలు ముక్కలుగా చేసి హత్య చేసిన గురుమూర్తి సంఘటనలో సంచలన విష యాలు బయటకు వస్తున్నాయి. గురుమూర్తి ఒక్కడే కాదు భార్యను హత్య చేసిన దాంట్లో అతనికి ముగ్గురు సహకారం చేసినట్టు పోలీస్ కస్టడిలో విచారణలో గురు మూర్తి వెల్లడించినట్టు తెలిసింది.

నిందితుడు గురుమూర్తిని విచారణ నిమిత్తం మీర్ పేట్ పోలీసులు కస్టడికి తీసుకున్నారు. ఊర్లో పంచాయతీ పెట్టి పరువు తీసిందని భార్యపై కోపం పెంచుకుని భార్యను చంపడానికి పథకం వేశాడు గురుమూర్తి. పక్కా ప్లాన్‌తో పిల్లలను, భార్యను గురుమూర్తి 15వ తారీఖున తన చెల్లెలి ఇంటి వద్ద వదిలాడు. అయితే మీ చెల్లెలు ఇంట్లో ఉండటం ఇష్టం లేదని భార్య అనడంతో గురుమూర్తి తన పిల్లలని అక్కడి వదిలి భార్యని ఇంటికి తీసుకోచ్చాడు. అనంతరం తనని పుట్టింటికి ఎందుకు పంపడం లేదంటూ భార్య మాధవి ప్రశ్నించింది. దాంతో దంపతుల మధ్య వాగ్వాదం పెరిగింది. ఈ క్రమంలో గురుమూర్తి.. మాధవి గొంతు నులిమి హత్య చేశాడు. ఆదే రోజు మృతదేహన్ని ముక్కలు ముక్కలుగా చేసి ముక్కలను నీటిలో హీటర్‌తో ఉడికించాడు. ఎముకలను పోడి చేసి మిగిలిన మాంసం ముక్కలను బకెట్ లో వేసి పెద్ద చెరువులో పడవేశాడు. 18న ఆమె కనిపించడం లేదంటూ భార్య తల్లిదండ్రులకు కాల్ చేసి చెప్పి మీర్ పేట్ పోలీసులకు మాధవి తల్లితో ఫిర్యాదు చేయించాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన మీర్ పేట పోలీసులు మాధవి ఆచూకీ కోసం తీవ్రంగా గాలించారు. అయితే ఇంటి సమీపంలో సీసీ కెమెరాలలో గురుమూర్తి, మాధవి కదలికలను గమనించిన పోలీసులు.. తమ దైనా శైలిలో విచారణ చేయడంతో గురు మూర్తి నిజం ఒప్పుకున్నట్టు తెలిసింది. అయితే ఆ సమయంలో ఒక్కడినే చేసినట్టు చెప్పుకోచ్చాడు గురుమూర్తి. చేసిన హత్య పట్ల పోలీసులు లోతైనా విచారణ చేసినా ఏమాత్రం ఒక్క క్లూ పోలీసులకు దొరక కుండా నిందితుడు జాగ్రత్త పడ్డాడు. మీర్ పేట్ పోలీసులు మరింత సాక్షాదారాలు సేకరించెందుకు గురుమూర్తిని 4రోజుల పోలీస్ కస్టడికి తీసుకున్నారు. దింతో గురుమూర్తి ఒక్కడే కాదు భార్యను హత్య చేసిన దాంట్లో మరో ముగ్గురు సహకారం చేసినట్టు గురు మూర్తి వెల్లడించినట్టు సమాచారం. దాంతో గురుమూర్తి తల్లి, చెల్లీ, తమ్ముడిపై గృహహింస చట్టం కింద కేసు నమోదు చేసినట్టు తెలుస్తున్నది. ఆ ముగ్గురు కోసం పలు ప్రత్యేక బృందాలతో పోలీసులు గాలిస్తున్నారని తెలిసింది.

## బీజేపీ ప్రభుత్వం చేస్తున్న విధ్వంసానికి వ్యతిరేకంగా పోరాడాలి

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్
- బీడీఎల్ బీడీఈయూ జనరల్ బాడీ సమావేశం




నవతెలంగాణ-చంపాపేట్

బీజేపీ ప్రభుత్వం చేస్తున్న విధ్వంసానికి వ్యతిరేకంగా పోరాడాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. బీడీఎల్ బీడీఈయూ జనరల్ బాడీ సమా వేశం డీఆర్‌డీఓలోని కమ్యూనిటీ హాల్‌లో సోమవారం నిర్వహిం చారు ముఖ్య అతిథిగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాల డుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి జే వెంకటేష్ , రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్. వీరయ్య హాజరయ్యారు. ఈ సమావేశానికి పి మురళి అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లా డుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను బడా కార్పొరేట్ పెట్టుబడి దారి వర్గానికి ధారాధత్తం చేయడానికి పూనుకుంటోందని తెలిపారు. ముఖ్యంగా బీడీఎల్, మిధాని, డీఆర్డిఓ, రైల్వే, బ్యాంకు ఎల్ఐసీ లాంటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు పరం చేయడానికి దూకుడుగా కదులుతోందని చెప్పారు. దీనివల్ల కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు అనేక విధాలుగా నష్టాలు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. అదేవిధంగా కార్మికులు ఎన్నో సంవత్సరాలు తరబడి పోరాటం చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను మారుస్తూ 4 కోడ్లుగా చేస్తోందని, దాంతో కార్మికుల హక్కులన్నిటిని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కావున బీజేపీ ప్రభుత్వం చేస్తున్న విధ్వంసానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు.

ఎస్ వీరయ్య మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అదానీ, అంబానీ లాంటి పెట్టుబడిదారీ వర్గానికి సేవలందిస్తున్నారు కానీ నిరంతరం దేశ రక్షణ, దేశ అభివృద్ధి గురించి నిరంతరం కష్టపడి పనిచేస్తున్న కష్టజీవులు కార్మికుల గురించి పట్టించుకోవడంలేదని విమర్శిం చారు. అదే విధంగా దేశంలో మను వాద సిద్ధాంతాన్ని అమలు చేసే విధంగా పూనుకుంటోందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులకు తూట్లు పొడిచి బడా కార్పొరేట్ పెట్టుబడిదారీ వర్గానికి ఉపయోగపడే విధంగా కార్మిక చట్టాలను మారుస్తూ కార్మిక వర్గ శ్రమని పెట్టుబడిదారులకు దోచి పెట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నదన్నారు. దీన్ని కార్మిక వర్గం పెద్ద ఎత్తున ముక్తకం ఠంతో వ్యతిరేకించాలన్నారు. బీజేపీవిధానాలకు వ్యతిరేకంగా జరిగే ప్రతి పోరాటంలోకి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ల్లో పనిచేసే ప్రతి కార్మికుడు రావాలని పిలుపునిచ్చారు

### బీడీఈయూ నూతన కమిటీ ఎన్నిక

అనంతరం బీడీఎల్ బీడీఈయూ నూతన కమిటీని ఎన్నుకు న్నారు. బీడీఈయూ ప్రెసిడెంట్‌గా ఈ మురళిని, ప్రధాన కార్యదర్శిగా టీ. సత్తయ్యను, ట్రెజరర్ గా రవీందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా సి లక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్ర మంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జే. వెంకటేష్ , కృష్ణ , సీఐటీయూ హైదరాబాద్ సౌత్ అధ్యక్ష కార్యదర్శులు ఎం. మీనా, ఎం. శ్రావణ్ కుమార్, సహకార కార్యదర్శి ఎస్. కిషన్, ఎల్ కోట య్య, అభిమానులు కార్యకర్తలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## పార్క్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి



నవతెలంగాణ-హయత్‌నగర్

పార్క్ స్థలం ఖాళీగా ఉన్నందున అది కబ్జా పాలవుతుందని, అట్టి స్థలంలో వెంటనే ప్రహరీ నిర్మించి పార్క్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయా లని కోరుతూ సోమవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని ఆయన కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు కలిసి వినతి పత్రం అందజేశారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని సహారా మొదటి గేట్ వద్ద ఉన్న కమలా నగర్ కాలనీలో గతంలో కబ్జాకు గురైన పార్క్ స్థలాన్ని కబ్జాదారుల చెర నుంచి కాపాడామని, అందరూ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేయగా వెంటనే స్పందించిన కమిషనర్ ఎల్‌బీ నగర్ జోనల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీచేసినట్టు వెల్లడించారు. ఆయన వెంట కాలనీ సలహా దారుడు, శాంతి కుమార్ ఉన్నారు.

## చంపాపేట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి



నవతెలంగాణ-చంపాపేట్

అన్ని వర్గాల ప్రజల అభివృద్ధిని రాష్ట్రంలో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని, మంచినీటికి అధిక ప్రాధాన్యత, వేగవంతంగా పనులు పూర్తిచేసేలా చర్యలు చేపడతానని బీజేపీ చంపాపేట్ కార్పొరేటర్ వంగా మధుసూదన్ రెడ్డి అన్నారు సోమవార డివిజన్ పరిధిలో మారుతి నగర్ కాలనీ నందు రూ.11 లక్షల 50 వెలతో తాగునీటి సరఫరా అభివద్ధి పనులకు జలమండలి అధికారులతో కలిసి ముఖ్య అతిథులుగా హాజరై కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో మంచినీటికి ఇబ్బంది లేకుండా ఎక్కడికక్కడ నూతన పైప్‌లైన్ నిర్మాణం చేపట్టామని, ఇప్పటికే చాలా వరకు పనులు పూర్తయ్యాయని తెలిపారు. అలాగే డ్రయినేజీ వ్యవస్థ మెరుగుపరిచేందుకు కూడా ఎన్నో చర్యలు తీసుకుంటున్నామని,ప్రజలకు కావలసిన రోడ్లు, డ్రయినేజీ, మంచినీటి పైప్‌లైన్ కోసం నిత్యం పనులు జరుగుతున్నాయని చెప్పారు. దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యాయని మిగిలినవి కూడా అతి త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మారుతి నగర్ కాలనీ అధ్యక్షులు ఎం.రమేష్ కుమార్,కాలనీ సభ్యులు జి శ్రీనివాస్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, నవీన్, శివకుమార్, మురళీధర్ రెడ్డి, ఖాదీర్, శంకర్ నాయక్, బలరాం రెడ్డి, రాజు, ఈశ్వరయ్య గౌడ్, బీజేపీ సీనియర్ నాయకులు సుమిత్ సింగ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ పనులకు నిధులు విడుదల చేయాలి

- డిప్యూటీ ఫ్లోర్ లీడర్,కార్పొరేటర్ కొప్పుల




నవతెలంగాణ-హాయత్ నగర్

టెండర్ అయి బడ్జెట్ సాంక్షన్ కోసం పెండింగ్ లో ఉన్న పనులకు నిధులు విడుదల చేయాలని ఎల్బీ నగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డికలిసి కోరారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించి రూ.2 కోట్ల నిధులను సి.సి రోడ్లు, ఇతర పనులకు మంజూరు చేసిన జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ హదయపూర్వక కతజ్ఞతలు తెలియజేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎల్బీనగర్ నియోజకవర్గం ప్రజలు కడుతున్న టాక్స్‌లకు అనుగుణంగా ఎల్బీనగర్ నియోజకవర్గానికి రూ:25.00 కోట్ల నిధులను కేటాయిస్తున్నారని, ప్రతి డివిజన్‌కు రూ. 2.00 కోట్ల నిధులను మంజూరు చేస్తున్నారని అన్నారు.శివరాత్రి పండగ పర్వదిన సందర్భంగా డివిజన్‌లోని హయత్ నగర్ ప్రాంతంలో ఉన్న పురాతనమైన శివాలయం వీరన్న గుట్ట పైన రోడ్డు ఫార్మేషన్, కొత్త విద్యుత్ దీపాలు, శానిటేషన్ ఇతర సమస్యలను కూడా వివరించడంతో సానుకూలంగా స్పందించారని అన్నారు.

## ఏడాదిలోనే కాంగ్రెస్ పాలనపై ప్రజావ్యతిరేకత



- వచ్చేది మన ప్రభుత్వమే, అప్పటిదాకా ఓపిక పట్టండి
- పంచాయతీ ఎన్నికల్లో 14 సర్పంచ్ స్థానాలు గెలుచుకుందాం
- మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

కళ్ళబొల్లి అబద్దపు మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఏడాది కాలంలోనే ప్రజల్లో గడ్డుకాలం మొదలైందని బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండల కేంద్రంలోని వైఎస్ఆర్ గార్డెన్స్‌లో బీఆర్ఎస్ మండల, గ్రామ స్థాయి కార్యకర్తల విస్తత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మంచిరెడ్డి కిషన్ రెడ్డితో పాటు పార్టీ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్ హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా పాలనలో అధికారులకు స్వేచ్ఛ లేదన్నారు. తాను ఎమ్మెల్యే గా పని చేసిన 15 సంవత్సరాలలో తన నియోజకవర్గంలో ఏ అధికారిని ఇబ్బంది పెట్టిన దాఖలా లు లేవని, కానీ నేడు అందుకు విరుద్ధంగా ఉందని విమర్శిం చారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి తప్ప కాంగ్రెస్ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. కొంతకాలం కార్యకర్తలు ఓపిక పడితే వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని తెలిపారు. కార్యకర్తలు ఎవరూ, ఎక్కడా అధైర్యపడవద్దని హితవు పలికారు.జరగబోయే పంచాయతీ ఎన్నికల్లో మండలంలోని 14 గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానాలకు గాను 14 బీఆర్ఎస్ అనుబంధ అభ్యర్థులను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యకర్తలను పార్టీ భుజాన ఎత్తుకొని మోస్తోందని, ఎక్కడా నిరుత్సాహపడకుండా శక్తి వంచన లేకుండా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, మండల, గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా, పార్టీ విస్తరణ, ప్రజా సమస్యల పరిష్కారం, కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకతను, ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలాన్నారు. కార్యకర్తలు సమష్టిగా కృషి చేస్తే భవిష్యత్తులో మరింత పారదర్శకమైన పాలను బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. అందుకు కార్యకర్తలు కంకణబద్దులై పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికులకు డైరీ ఎంతో ఉపయోగపడుతుంది



- భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రామ్మోహన్

నవతెలంగాణ- నాగోల్

బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ 2025 డైరీ భవన నిర్మాణ కార్మికులకు ఎంతో ఉపయోగప డుతుందని, దాని వినియోగించుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎస్ రామ్మోహన్ భవన నిర్మాణ కార్మికులకు సూచించారు. సోమవారం భవన నిర్మాణ కార్మికుల సంఘం (సీఐటీయూ) న్యూ నాగోల్ డివిజన్ ఆధ్వర్యంలో ఎండీ లతీఫ్ అధ్యక్షతన డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ డైరీ, క్యాలెండర్ భవన నిర్మాణ కార్మికులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని, అందులో వాళ్లకు వర్తింపజేసే జీవోలు, హక్కులు ఉన్నాయని తెలిపారు. వెల్ఫేర్ బోర్డులో కార్మికులు అన్ని రకాల స్కీములు ఏ విధంగా నమోదు చేసుకోవాలో ఈ డైరీలో పొందపరిచినట్లు చెప్పారు. ఏఎల్ఓడీసీఎల్ అధికారులు, జిల్లా నాయకులు పేర్లు ఫోన్ నెంబర్ తో సహా ఈ డైరీలో పొందుపర్చినట్టు తెలిపారు. రంగారెడ్డి జిల్లా కోశాధికారి గోకమల్ల చైతన్య, సరూర్‌నగర్ సర్కిల్ (సీఐటీయూ) కన్వీనర్ ఎం వీరయ్య, ఎల్ శంకర్, కే చంద్ర య్య, ఎండీ రహీం, జే రామస్వామి, జగన్, కే జంగయ్య, జె వెంకటేష్, సీహెచ్ బాలు, బి బాలగౌడ్, మాధవ రావు, సీహెచ్ వెంకటయ్య, కే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## జీవిత కాలం ప్రజా సేవలోనే ఉంటా

- మాజీ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

తన జీవిత కాలమంతా ప్రజా సేవలో ఉంటానని మాజీ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 31వ డివిజన్ శ్రీ సాయి బాలాజీ హెూమ్స్ ఫేస్ 2 కాలనీలో కాలనీ వెల్ఫేర్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో మాజీ మేయర్ దంపతులు పాల్గొన్నారు. వారికి కాలనీ వాసులు పూల మాలలు వేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ మాట్లా డుతూ కాలనీలో సమస్యలను పరిష్కరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తాను కార్పొరేటర్ గా పోటీ చేసిన సమయంలో ఈ కాలనీలలో రోడ్లు, డ్రయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడం చూసి ప్రచార సమయంలో చాలా ఇబ్బందులు పడ్డామన్నారు. మీ అందరి సహకారంతో కార్పొరేటర్‌గా గెలవడం, మేయర్ కావడంతో రోడ్లు, డ్రయినేజీలు పూర్తి చేయగలిగామని తెలిపారు. కాలనీ కమిటీ సభ్యులు,కాలనీ వాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయ నిర్వాహణపై ప్రత్యేక కార్యశాల



నవతెలంగాణ-హాయత్ నగర్

హాయత్ నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయ నిర్వాహణ పై ప్రత్యేక కార్యశాల ఏర్పాటు చేసినట్టు ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గీత నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలలో సమర్థవంతమైన విధానాలు కొత్త సాంకేతిక పద్ధతుల ద్వారా ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణలో జరిగిన మార్పులను, వాటి అవసరాలను వివరించారు. కళాశాల సూపరింటెండెంట్ ఏ.లావణ్య మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయ నిర్వహణలో నిబంధనల పరిధి, జీతభత్యాల నిర్వహణ, ఆఫీసు ఫైల్ ల నిర్వహణ, మారుతున్న పరిస్థి తుల్లో ఈ- ఆఫీసు నిర్వహణ లాంటి వివిధ రకాల అంశాల పై అవగాహన కల్పించారు.కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గీత నాయక్, డాక్టర్ గంగాధర్ , డాక్టర్ వెంకటే శ్వర్లు,యాదగిరి రెడ్డి, డాక్టర్ నాగేంద్ర, డాక్టర్ రమాదేవి, మహమ్మద్, దుర్గా ప్రసాద్,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా మల్‌రెడ్డి రాంరెడ్డి జన్మదిన వేడుకలు







నవతెలంగాణ -ఎల్‌బీనగర్

రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ మల్‌రెడ్డి రాంరెడ్డి జన్మదిన వేడుకలు చైతన్యపురి కాంగ్రెస్ కార్యాల యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుక కు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరై ఆయనకు శు భాకాంక్షలు తెలియజేశారు. ముందు గా మల్‌రెడ్డి రాంరెడ్డికి అభిమానులు గజమాలతో సంప్రదా యబద్ధంగా స్వాగతం పలికారు. హారతులు ఇచ్చి, పుష్పాబి. షేకం చేసి, ఆయన పట్ల తమ గౌరవాన్ని చాటుకున్నారు. అభిమానుల నినాదాలతో చైతన్యపురి మార్మోగిపోయింది. ఎల్‌బీ నగర్‌లోని అన్ని డివిజన్‌లలో హెూర్డింగ్స్ ఏర్పాటు చేశారు.జన్మదినం సందర్భంగా ఆశీర్వచనాలు అందజేసి, శు భాకాంక్షలు తెలిపారు.

### స్వచ్ఛంద రక్తదాన శిబిరం

జన్మదిన వేడుకల సందర్భంగా స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు . రాంరెడ్డి వ్యక్తిగతంగా శిబిరాన్ని సందర్శించి, రక్తదాతలను ప్రోత్సహించారు. పలువురు యువకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున ముందుకు వచ్చి రక్తదానం చేసి, తమ సమాజ సేవా నిబద్ధతను చాటుకున్నారు. కళాకారులు, డప్పుల వాయిద్యాలతో వేడుకకు మరింత హుషారును తీసుకువచ్చారు. బంజారా సంప్రదాయ నత్యాలు, కూచిపూడి ప్రదర్శనలు వీక్షకులను మంత్ర ముగ్ధులను చేశాయి. కార్యకర్తలు, అభిమానులు సంబరాల్లో మునిగిపోయారు.

### కాంగ్రెస్ నేతల భారీగా హాజరు ..

### ఘన సన్మానాలు

ఎల్బీనగర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. రాంరెడ్డిని శాలువాలతో సత్కరించి, పూల బోకేలు అందజేశారు.వేడుకల అనంతరం రాంరెడ్డి కార్యకర్తలకు, అభిమానులకు హదయపూర్వక కతజ్ఞతలు తెలియజేశారు. సమాజ సేవే తన ప్రధాన లక్ష్యం అని పునరుద్ఘాటించారు. అభివద్ధి, సేవా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, రాగుల వెంకటేశ్వర్ రెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ చైర్మెన్ చిలుక మధుసూధన్ రెడ్డి, సేవాదళ్ అధ్యక్షులు మిద్దెల జితేందర్ రెడ్డి, మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి, మల్ రెడ్డి సాయి తేజ్ రెడ్డి, డైరెక్టర్లు పన్నాల జైపాల్ రెడ్డి, గణేష్ నాయక్, మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వజీర్ ప్రకాష్ గౌడ్, బద్దుల వెంకటేష్ యాదవ్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు బండ సురేందర్ రెడ్డి, బద్దుల వేణుగోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




## మహిళలకు అండగా ఉంటా

- చిలుక మధుర ఉపేందర్ రెడ్డి

నవతెలంగాణ-దిల్ సుఖ్ నగర్

మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని తెలంగాణ యువజన కాంగ్రెస్ నేత, ప్రజా సేవకురాలు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆర్‌కే పురం మహిళా సంఘం ప్రథమ వార్షికోత్సవం సోమవారం ఆర్ కె పురం కమ్యునిటీ హాల్‌లో ఘనంగా జరిగింది. వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన చిలుక మధుర ఉపేందర్ రెడ్డి మాటా డుతూ ఆర్థికంగా ఎదగడానికి మహిళలు స్వశక్తితో ముందుకు రావాలని పిలుపుని చ్చారు. ప్రణాళిక బద్ధంగా ముందుకు పోతున్న శ్రీ రామకష్ణా పురం మహిళా సంఘం సభ్యులకు ఆమె అభినందనలు తెలిపారు. మహిళా సంఘం నిర్దేశించు కున్న లక్ష్యాలకు తనవంతుగా ఆర్థిక, హార్దిక సహాయాన్ని అందజేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వస్తానని హామీ ఇచ్చారు. రాజకీయాలకతీతంగా మహిళలు రాణించడానికి ఒక ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని ఆమె సూచిం చారు. ఇప్పటికే డివిజన్‌లో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నామని ఒక మహిళగా మహిళా సంఘం చేపట్టే కార్యక్రమాలకు చేదోడువాదోడుగా ఉంటానన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆర్థికంగా ఆదుకోవడం లేదా ప్రభుత్వ పరంగా కూడా సహాయ సహకారాన్ని అందిస్తున్న విషయాన్ని ఆమె గుర్తు చేశారు. శ్రీ రామకృష్ణా పురం మహిళా సంఘానికి మొదటి నుంచి స్థానికంగా పాజిటివ్ అభిప్రాయం ఉందని కాలనీ అభివద్ధిలో కూడ మహిళా సంఘం కీలక పాత్ర ఉండటమే దీనికి ప్రధాన కారణం అన్నారు. డాక్టర్ సత్య శ్రీ, సంఘం అధ్యక్షురాలు అన్నపూర్ణ, కార్యదర్శి రాధ, కోశాధికారి విజయలక్ష్మి, ఉపాధ్యక్షురాలు నీలిమ, సోసైటీ కార్యదర్శి రాజశ్రీ రామారావు, అర్చన, స్వప్న, సురేఖ, మాధవి, శకుంతల, పుష్ప, రేఖ, సరిత, రాణి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నో పేద కుటుంబాలను ఆదుకుంటున్నాం




- ఉప్పల శ్రీనివాస గుప్తా

నవతెలంగాణ -నాగోల్

ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంతో మంది నిరుపేద కుటుంబాలకు చెందిన ఆడబిడ్డల వివాహాలకు మంగళసూత్రం, మెట్టెలు ,చీర, గాజులను అందించి ఆదుకుంటున్నామని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షుడు, ఉప్పల ఫౌండేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస గుప్త అన్నారు. వరంగల్‌కు చెందిన వికలాంగులైన తేజావత్ బాలు ఇస్లాం గీతలు బోడుప్పల్ లోని గుడ్ వే ఫౌండేషన్‌లో వివాహం జరుపుకునేందుకు తమకు సహాయ, సహకారాలు అందించాలని కోరుతూ సోమవారం నాగోలు డివిజన్‌లోని ఉప్పల శ్రీనివాస గుప్త క్యాంపు కార్యాలయంలో శ్రీనివాస గుప్తను కలిశారు. స్పందించిన ఉప్పల శ్రీనివాస గుప్తా వారి ఆర్థిక పరిస్థితులను అడిగి తెలుసుకుని ఐఫ్ ప్రథమ మహిళ, ఆయన సతీమణి ఉప్పల స్వప్నతో కలిసి వారికి మంగళ సూత్రం, మెట్టెలు, చీర, గాజులను అందించారు. రమణయ్య, గుడ్ వే ఫౌండేషన్ (వికలాంగుల సేవా సంస్థ) అధ్యక్షురాలు ఎరుపల్లి మంగమ్మ , ప్రధాన కార్యదర్శి షన్ముక రావు , కోటగిరి ఐవీఎఫ్ నాయకులు దేవదానం తదితరులు పాల్గొన్నారు.

## పల్లె దవాఖాన డాక్టర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



**నవతెలంగాణ-సిటీబ్యూరో**

పల్లె దవాఖాన డాక్టర్స్ అసోసియేషన్ అయూష్మాన్ ఆరోగ్య మందిర్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా క్యాలెండర్ ను డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ శోభారాణి ఆవిష్కరించారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షులుగా డాక్టర్ డి.వెంకన్న, జనరల్ సెక్రెటరీగా డాక్టర్ శంకర్‌నాయక్, అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా భవాణి, ఉపాధ్యక్షులుగా డాక్టర్ కుమార్, డాక్టర్ సాయిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ, ప్రోగ్రాం ఆఫీసర్లు, ఏఎంహెచ్‌ఓ స్టాఫ్ పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి



**నవతెలంగాణ- మేడ్చల్**

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. మేడ్చల్ డివిజన్ ఏసీపీ బీ శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ పట్టణంలోని కింది బస్తీలో నూనావత్ రమేష్ (35), భార్య నలుగురు పిల్లలతో కలిసి ఉంటున్నాడు. కాగా ఆదివారం మధ్యాహ్నం అతిగా మద్యం సేవించి వచ్చి ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవపడి బయటకి వెళ్లిపోయాడు. సోమవారం ఉదయం తను నివాసముంటున్న ఇంటికి కొద్ది దూరంలో ఖాళీగా ఉన్న స్థలంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. స్థానికుల నుండి సమాచారం అందుకున్న సీఐ సత్యనారాయణ, పోలీసులు క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి హత్యనా అతిగా మద్యం సేవించి మరణించాడా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## శ్రీరామ లింగేశ్వర స్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం



**నవతెలంగాణ-ఉప్పల్**

రామంతాపూర్ శ్రీనివాసపురంలోని శ్రీరామ లింగేశ్వర స్వామి దేవాలయ నూతన కమిటీ సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గం ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందన్నారు. అంతకుముందు ఆలయ ఈవో కమిటీ, ఆలయ ట్రస్ట్ ఛైర్మన్‌గా కంది ఆగిరెడ్డి, సభ్యులుగా నాగారం శ్రీనివాస్ చారి, సంపత్, వేం యాకుబ్ రెడ్డి, చేవేళ్ల మల్లయ్య కురుమ, నాగరాజ్, శ్రీవాణిలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఆంజనేయులు, కంది శ్రవణ్ రెడ్డి, ఆకారపు అరుణ్ పటేల్, విజయ్ కుమార్, పేట మురళి ముదిరాజ్, మార్తం ఉపేందర్‌రెడ్డి, వల్లపు శ్రీకాంత్ యాదవ్, బాబు, సాగ శ్రీధర్, తదితరులున్నారు.

## ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



- కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్

**నవతెలంగాణ-నేరేడ్‌మెట్**

ఆధ్యాత్మిక చింతన తో మానసిక ప్రశాంతత లభిస్తుందని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ అన్నారు. గౌతమ్ నగర్ డివిజన్ మల్లికార్జున నగర్‌లోని మల్లన్న దేవాలయంలో సోమవారం విగ్రహ ప్రాణప్రతిష్ట దేవతలు కలహ భైరవ, దక్షిణా మూర్తి, విష్ణుమూర్తి, బ్రహ్మ, శ్రీచక్రం, సింహ వాహనం ప్రతిష్ట కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రావుల అంజయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం



**నవతెలంగాణ - జవహర్ నగర్**

11 కేవీ సాయి బాబా ఫీడర్ పీఎస్‌సీ, సీఎస్‌సీ, స్తంభాల టోరెంట్ కారణంగా మంగళవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బాలాజీ నగర్ మెయిన్ రోడ్డు, మహంకాళి మెయిన్ రోడ్డు, మోహన్ రావు కాలనీ, ఆనంద్ నగర్ కాలనీ, మార్కెట్ రోడ్డు, శాంతి నగర్, ముత్తు స్వామి కాలనీ, వెంకటేశ్వర కాలనీ, చంద్రగిరి కాలనీ, ఫైరింగ్ రేంజ్ కాలనీలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని బాలాజీ నగర్ ఏఈ సాంబశివ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## అనారోగ్యంతో బండారి పద్మ మృతి



**నవతెలంగాణ-కాప్రా**

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వదిన బండారి పద్మ అనారోగ్యంతో మరణించడంతో సైనిక్‌పురిలోని వారి నివాసంలో ఆమె పార్థివదేహానికి పలువురు రాజకీయ నాయకులు నివాళులర్పించారు. సోమవారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ మహమ్మద్ అలీ, మాజీ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి, రావుల శ్రీధర్ రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, తదితరులు పద్మ పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## బుద్ధి శ్రీనివాస్‌కు శుభాకాంక్షల వెల్లువ



**నవతెలంగాణ-కీసర**

బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులుగా బుద్ధి శ్రీనివాస్‌కు నియమితులైన సందర్భంగా సోమవారం ఆయన పుట్టినరోజు పురస్కరించుకొని బీజేపీ నాగారం మున్సిపాలిటీ రాంపల్లి నేతలు మాజీ ఎంపీటీసీ బలరాం, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ కే.ఎల్లారెడ్డి జీ. రాము చారి, జే.అశోక్ గుప్తా, జగదీశ్వరరావు, కే.రాజశేఖర్‌రెడ్డిలు బుద్ధి శ్రీనివాస్‌ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## బుద్ధి శ్రీనివాస్‌కు ఘనంగా సన్మానం



**నవతెలంగాణ-కీసర**

బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా నూతన అధ్యక్షులుగా ఎన్నికైన బుద్ధి శ్రీనివాస్‌ను బీజేపీ నాగారం మున్సిపాలిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంచాల మహేందర్, నాగారం మున్సిపల్ ఎస్సీ మోర్చా అధ్యక్షులు పొడవల్ల రవి, నీరుడు మధుబాబు, నాగారం మున్సిపల్ జాయింట్ సెక్రెటరీ పొడవల్ల కరుణాకర్, తదితరులు వారిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

# జీరో కార్బన్ ఫుట్ ప్రింట్ సాధించే దిశగా భారత్ పయనం

- **ఓయూ ఇంజనీరింగ్ విభాగం చైర్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్**
- **ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో రెండు రోజుల జాతీయ సదస్సు**




**నవతెలంగాణ-సిటీబ్యూరో**

వచ్చే 2070 నాటికీ విద్యుత్ తరంగాలు, పరిశ్రమలు, రవాణా తదితర అనేక కాలుష్యాలు నుంచి జీరో కార్బన్ ఫుట్ ప్రింట్ సాధించే దిశగా భారతదేశం పయనిస్తున్నదని, భూమి ఉపరితలం పైనున్న మినరల్స్ స్థానంలో సముద్రలోతుల్లో దాగిన క్రిటికల్ మినరల్స్‌ను వెలికితీసే పనిలో నేషనల్ ఇనిస్టిట్యూట్ అఫ్ ఓషియన్ టెక్నాలజీ తదితర ప్రభుత్వ సంస్థలు పనిచేస్తున్నాయని ఓయూ ఇంజనీరింగ్ విభాగం చైర్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. నేషనల్ ఎనర్జీ సెక్యూరిటీ- ఎక్స్ ప్లోరేషన్ అండ్ మైనింగ్ ఆఫ్ క్రిటికల్ మినరల్స్ అండ్ ఎలిమెంట్స్ పై గచ్చిబౌలి లోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా మైనింగ్ విభాగం ఏర్పాటు చేసిన రెండు రోజుల జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా ఆయన హాజరై ప్రసంగిస్తూ దేశ అభివద్ధిలో ఖనిజ సంపద ప్రధానమైనదని, భూమి ఉపరితలంపైని ఖనిజ సంపద కన్నా ఎన్నోరెట్లు విలువైన ఎక్కువ ఖనిజ సంపద సముద్ర గర్భంలో దాగి ఉందన్నారు. టెక్నాలజీ ద్వారా మాత్రమే ఈ సంపదను పైకి తీయడం సాధ్యమవుతుందని, అతి సూక్ష్మంగా న్యానో పార్టికల్స్ మాదిరిగా కూడా ఉండే కోబాల్ట్, కాపర్, లిథియం, నికెల్ తదితర సుమారు 24 రకాల క్రిటికల్ మినరల్స్ దేశ అభివృద్ధిలో కీలకమైన ఖనిజ సంపద అన్నారు. అరుదైన ఖనిజ సంపదగా పేర్కొన్న లిథియం, నికెల్ లాంటివి విండ్ టర్బైన్లు, ఎలక్ట్రిక్ కార్లు, స్పేస్, న్యూక్లియర్ పవర్, డిఫెన్స్ , టెలికమ్యూనికేషన్ హై-టెక్ ఎలక్ట్రానిక్స్ వంటి రంగాల్లో బాగా ఉపయోగి స్తున్నామని, అరుదైన ఖనిజాల అన్వేషణ మరియు గనుల తవ్వకంపై ఇలాంటి జాతీయ సదస్సులు నిర్వహించడం వలన నూతన ఆవిష్కరణలకు మార్గం ఏర్పడుతుందన్నారు.

ఈ సమావేశంలో మరొక అతిథిగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విజిటింగ్ ఫ్యాకల్టీ డాక్టర్ యమునా సింగ్ మాట్లాడుతూ భారత కీర్తి ప్రతిష్టలను చాటే ఇస్రో లాంటి శాస్త్రవేత్తలతో పాటుగా పెరుగుతున్న భూతాపాన్ని తగ్గించాడనికి, జీరో కార్బన్ ఎమిషన్ సాధించే దిశలో ఇంజనీరింగ్ యువత ముందుకు రావాలన్నారు. భారతదేశం క్లీన్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీ, రేనోవెబుల్ ఎనర్జీ తదితర లక్ష్యాలతో పాటుగా క్రిటికల్ మినరల్స్ అన్వేషణపై ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రాధాన్యతను వివరించడం జరిగిందన్నారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పూర్వ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హరి సర్వోత్తమ్ మాట్లాడుతూ భారత్ సెమి కండక్టర్ హబ్‌గా మారే రోజులు త్వరలోనే వస్తాయన్నారు. సముద్రలోతుల్లో విలువైన ఖనిజ సంపద దాగి ఉందని, మినరల్ ఇంజనీరింగ్ ద్వారా మాత్రమే ఈ సంపదను వెలికి తీయడం సాధ్యమవుతుందన్నారు. ఇందుకోసం నైపుణ్యత కలిగిన ఇంజనీరింగ్ విధానాలు అవసరమన్నారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు మాట్లాడుతూ, ఇండియా విజన్‌లో ప్రధానమైన నేషనల్ మినరల్ పాలసీ ద్వారా క్లీన్ ఎనర్జీ, జీరో ఎమిషన్ వంటి కీలక అంశాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లి చర్చలు, సమావేశాలు ద్వారా నెట్ జీరో కార్బన్ సాధించడమే లక్ష్యంగా పనిచేస్తున్నదన్నారు. ఇలాంటి జాతీయ సమావేశాల ద్వారా ఒక రోడ్ మ్యాప్ తయారవుతుదన్నారు. సెమినార్ నిర్వాహకులు, ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా మైనింగ్ డివిజన్ హెడ్ కె.జె. అమర్ నాథ్ మాట్లాడుతూ ఖనిజాలు అనేవి అనేక పరిశ్రమలకు మూలాధారమని, ఖనిజ సంపదకు మరొక ప్రత్యామ్నాయం లేదన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కారణమైన ఖనిజ సంపద పరిశోధన, అన్వేషణ కోసం భారత ప్రభుత్వం రూపొందించిన క్రిటికల్ మినరల్స్ మిషన్ బలోపేతానికి జాతీయ సమావేశాలు అవసరముందన్నారు. ఈ సమావేశంలో పలు ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థులు, ప్రొఫెసర్స్, అధికారులు పాల్గొన్నారు. కోల్ ఇండియా లిమిటెడ్, జాతీయ మినరల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ రెండు రోజులు ఈ జాతీయ సెమినార్‌ను స్పాన్సర్ చేసింది.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి




- **ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**
- **సర్కిల్ పరిధిలోని పలు సమస్యలను పరిష్కరించాలని జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేత**

**నవతెలంగాణ-నేరేడ్‌మెట్**

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని పార్కులు, సీసీ రోడ్ల ఏర్పాటు, శ్మశానవాటికల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులను కేటాయించాలని కోరుతూ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణిలో జెడ్సీ రవికుమార్‌కు వినతి పత్రంను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి మాట్లాడుతూ.. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని చాణిక్యపురి కాలనీలో ఎల్ఈడీ థీమ్ పార్క్ ఏర్పాటు, ఓల్డ్ నేరేడ్‌మెట్‌లోని కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు నిర్మాణం, విమాలాదేవి నగర్‌తో పాటు పలు కాలనీల్లో సీసీ రోడ్డు నిర్మాణం, వర్ధారెడ్డి కాలనీలో ఉన్న ప్రభుత్వ పార్క్ స్థలంలో పవర్ బోర్ ఏర్పాటు చేయాలన్నారు. విష్ణుపురి ఎక్సటెన్షన్‌లో బాక్స్ డ్రైన్, పలు సమస్యలపై ప్రతి పాదనలు చేస్తూ వినతి పత్రం అందజేశామన్నారు. మల్కాజిగిరి సర్కిల్‌లోని ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, బీఆర్ఎస్ నాయకులు రావుల అంజయ్య జగదీష్ గౌడ్, రాము యాదవ్, జికె హనుమంతు రావు, చిన్నయాదవ్, వంశీముదిరాజ్, అమీనుద్దీన్, బాలకృష్ణ, తుపాకుల జనార్ధన్, స్థానిక కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులపై తక్షణ చర్యలు

**- జోనల్ కమిషనర్ టీ. వెంకన్న**




**నవతెలంగాణ - ధూల్‌పేట్**

ప్రజావాణిలో అందిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్న తెలిపారు. ఆయన పర్యవేక్షణలో చాంద్రాయణ గుట్ట నర్కి పూల్‌బాగ్ లోని జోనల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ సర్కిల్ పరిధిలోని ఫోకస్ హై స్కూల్ విద్యార్థులు కుక్కల బెడద పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు స్థానికంగా నెలకొన్న సమస్యలపై ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందించి సంబంధిత విభాగాలచే వాటి పరిష్కకరానికి చర్యలు తీసుకుంటామన్నారు . ఇప్పటి వరకు అందిన ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ శైలజ, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి,,ఏ యం సీ రాజారావు, మలేరియా సీనియర్ ఎంటమలాజిస్ట్ నామాల శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఈఈ రామారావు , బిల్ కలెక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

# మర్రి లక్ష్మణ్‌రెడ్డి నేటి యువతకు ఆదర్శం

- **ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**
- **కృష్ణా నదిలో 1.5 కిలోమీటర్ల దూరాన్ని 40నిమిషాల 7 సెకండ్ల లో స్విమ్మింగ్ పూర్తి చేసిన లక్ష్మణ్ రెడ్డి**





**నవతెలంగాణ-నేరేడ్‌మెట్**

80ఏండ్ల వయస్సులో చలిని తట్టుకొని స్విమ్మింగ్ చేసిన మర్రి లక్ష్మణ్‌రెడ్డి నేటి యువత ఆదర్శమని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. విజయవాడలో అక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్విమ్మింగ్‌లో ఎంఎల్ఆర్ఐటీ ఛైర్మెన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి విజయవాడ వద్ద కృష్ణా నదిలో 1.5 కిలోమీటర్ల దూరాన్ని 40 నిమిషాల 07 సెకండ్లలో సెమ్మింగ్‌ను పూర్తి చేసి మరో ఘనతను సాధించాడని తెలిపారు. ఇది రెండోసారి కావడం గర్వకారణంగా ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్‌రావులు మాట్లాడుతూ మర్రి లక్ష్మణ్‌ను ఆదర్శంగా తీసుకుని తమ కళాశాలలో ప్రతీ ఏటా రూ.1.5 కోట్ల స్కాలర్ షిప్స్‌ను క్రీడా కోటాలో అందిస్తూ సుమారు 36 మందికి ఉచిత విద్యను అందిస్తున్నామని తెలిపారు.

## అమ్మాయిలపైకి దూసుకెళ్లిన రెడీమిక్స్ వాహనం

**నవతెలంగాణ -శామీర్‌పేట**

ఓరెడీమిక్స్ వాహనం కారును తప్పించబోయి బస్టాపులో ఉన్న ఇద్దరు అమ్మాయిల మీదకు దూసుకెళ్లిన ఘటన శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం తూంకుంట మున్సిపాలిటీ అంతాయపల్లి గ్రామానికి చెందిన కొరివి గాయత్రి (24), కొరివి భవాని (19) ఇద్దరు కలిసి తిరుమలగిరిలో పనిచేయడానికి వెళ్లదామని బిట్స్ జంక్షన్ దగ్గర వెదురువనం వద్ద బస్సు కోసం వేచి ఉండగా సోమవారం ఉదయం 7గంటల 45నిమిషాల సమయంలో కీసర రోడ్డు నుండి వేగంగా వస్తున్న కారును తప్పించబోయి కొరివి భవానీ, కొరివి గాయత్రిలపైకి రెడీమిక్స్ వాహనం దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర రక్త గాయాలయ్యాయి. స్థానికులు వారిని వెంటనే చికిత్స నిమిత్తం కొంపల్లిలోని శ్రీకరా హాస్పిటల్‌కు తరలించారు. ఈ మేరకు శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# కోర్టు ఆదేశాలతో మల్లారెడ్డి యూనివర్సిటీలో భూ సర్వే




- **అడ్వకేట్ కమిషనర్ రాజేందర్, సర్వేయర్ వినోద్ ఆధ్వర్యంలో సర్వే పూర్తి**
- **8 ఎకరాల ఖాళీ స్థలం గుర్తింపు**

**నవతెలంగాణ- మేడ్చల్**

గుడ్లపోచంపల్లి మున్సిపల్ పరిధి మైసమ్మగూడ మల్లారెడ్డి యూనివర్సిటీలో సోమవారం అడ్వకేట్ కమిషనర్ రాజేందర్ ఆధ్వర్యంలో సర్వేయర్ వినోద్ భూమి సర్వే నిర్వహించారు. బహదూర్‌పల్లికి చెందిన పీట్ల వీరయ్యకు మైసమ్మగుడలో 14 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. కాగా మొదటి భార్య కొడుకులైన పీట్ల చంద్రయ్య, పీట్ల నర్సింహలకు చెందిన 2 ఎకరాల భూమిని చామకూర మల్లారెడ్డి కొనుగోలు చేశారు. కాగా మిగిలిన సర్వే నంబర్లు 641, 642, 643, 644లోని 12ఎకరాల తమ భూమిని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కబ్జా చేశాడని పీట్ల వీరయ్య రెండో భార్య కొడుకు పీట్ల యాదగిరి తెలిపారు. కోర్టు ఆదేశాలు, పోలీస్ ప్రొటెక్షన్‌తో అడ్వకేట్ కమిషనర్ రాజేందర్ ఆధ్వర్యంలో మండల సర్వేయర్ వినోద్ సర్వే చేసి 8 ఎకరాలను ఖాళీ స్థలాన్ని గుర్తించినట్లుగా తెలిపారు. అంతకుముందు మల్లారెడ్డి కుమారుడు చామకూర మహేందర్ రెడ్డి నోటీసులో తమ పేర్లు లేవని సర్వేకు అడ్డుపడడంతో ఎస్సై మహేశ్వర్‌రెడ్డి సర్ది చెప్పడంతో సర్వేకు ఒప్పుకున్నారు. ఇద్దరి తరఫున న్యాయవాదులు, పోలీసులు, ఇద్దరి తరఫున ఒక్కొక్కరిని సర్వే పర్యవేక్షించడానికి చామకూర మహేందర్ రెడ్డి అంగీకారం తెలిపారు. సర్వేయర్ వినోద్ మాట్లాడుతూ సర్వే రిపోర్టును అడ్వకేట్ కమిషనర్‌కు అందజేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ తను ఎలాంటి భూ కబ్జాకు పాల్పడలేదని వివరణ ఇచ్చారు. 30 ఏండ్ల క్రితం తాను పీట్ల చంద్రయ్య పీట్ల నర్సింహ వద్ద భూమి కొనుగోలు చేసినట్లు తెలిపారు.

## సచిన్ పైలట్‌ను కలిసిన చిలుక మధుసూదన్ రెడ్డి



**నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్**

అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, కవాడిపల్లి గ్రామ పరిధిలో రాజస్థాన్ వీర గుజ్జర్ సమాజ్ వారు ఇటీవల నూతనంగా నిర్మించిన భగవాన్ శ్రీ స్వామి దేవ్ నారాయణ్ మందిర్ ప్రాణ ప్రతిష్ట ప్రారంభోత్సవంలో రాజస్థాన్ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి ఎమ్మెల్యే సచిన్ పైలట్‌ను ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ చిలుక మధుసూదన్‌రెడ్డిలు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.

# అనురాగ్ విశ్వవిద్యాలయం హ్యాకాట్రానిక్స్ హ్యాకథాన్ ప్రారంభం

**నవతెలంగాణ - పోచారం**

పోచారం మున్సిపల్ పరిధిలోని అనురాగ్ విశ్వవిద్యాలయంలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 10, 11న జరుగుచున్న 36 గంటల హ్యాక్ట్రానిక్స్ హ్యాకథాన్‌ను డీన్ ఎస్‌వోఈ డాక్టర్ వి.విజయ్ కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ హ్యాకథాన్‌ను వీ.ఎల్.ఎస్.ఐ, ఎంబెడెడ్ అండ్ ఐఓటీ, ట్రాక్‌సాట్ విభాగాల్లో నిర్వహిస్తుండగా వివిధ కళాశాలలకు చెందిన 350కి పైగా విద్యార్థులు పాల్గొనున్నారు. డీన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ.. ఈ మూడు విభాగాలలో హ్యాక్‌థాన్ నిర్వహించడం తెలంగాణలో మొదటిదిగా అభివర్ణిస్తూఈసీఈ విభాగాన్ని అభినందించారు. ఇటువంటి హ్యాకథాన్‌లో పాల్గొనడం వలన విద్యార్థుల సృజనాత్మకత ప్రదర్శనకు, సాంకేతిక నైపుణ్యం పెంపుదలకు దోహదపడుతుందన్నారు. ఈ హ్యాకథాన్‌కు పరిశ్రమల నుండి డా.శ్రీకాంత్ డైరెక్టర్ ఐ.ఎన్.ఎ.ఎస్ టెక్నాలజీస్, ప్రదీప్ కటికిల సీనియర్ ఇంజనీర్ క్రాఫ్ట్ ట్రానిక్స్, సాయి సంతోషి ప్రోగ్రాం మేనేజర్ ఏబీటెక్ విల్లే, సాయి, శివరామకృష్ణ సీఈఓ రెప్రో నర్స్ టెక్నాలజీ సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఈ కార్యక్రమం లో ఈసీఈ హెచ్ఓడీ ప్రొఫెసర్. మంగళ గౌరీ, హ్యాక్ తాన్ కన్వీనర్ ప్రొఫెసర్ నారాయణ , కో కన్వీనర్ ప్రొఫెసర్ హరి కృష్ణ కోఆర్డినేటర్లు డా.పవిత్ర ,ఎస్. అమృత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# భవనం పైనుంచి పడి కార్మికుడు మృతి

**నవతెలంగాణ-బాలానగర్**



కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని కేంద్ర ప్రభుత్వ సంస్థ నైపర్ క్యాంపస్ లో ఉన్న భవనం వెనుక వైపు కొత్తగా నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి పడి ఓ భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. బాలానగర్ సీఐ నరసింహ రాజు తెలిపిన వివరాల ప్రకారం మధ్యప్రదేశ్ ప్రాంతానికి చెందిన నుపేంద్ర నిపానే (45) పరిశ్రమలో సెంటింగ్ పని చేస్తున్నాడు. భవనం 3 వ అంతస్తు లో స్లాబ్ వర్క్‌లో పనిచేస్తుండగా, ప్రమాదవశాత్తు 1వ అంతస్తు స్లాబ్‌పైకి అతను పడిపోవడంతో తలపై గాయాలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# అందుబాటులో యూరియా

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రకళ

**నవతెలంగాణ-సిటీబ్యూరో**



జిల్లాలోని రైతులకు సరిపోను యూరియా అందుబాటులో ఉందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రకళ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దుండిగల్ గండిమైసమ్మ మండలంలో 17.46 మెట్రిక్ టన్నులు, ఉప్పల్ మండలంలో 26.1, ఘట్‌కేసర్ మండలంలో 16.02, కాప్రా మండలంలో 4.095, కీసర మండలంలో 34.56, మేడ్చల్ మండలం లో 60.75, మూడు చింతలపల్లి మండలంలో 114.84, శామీర్‌పేట మండలంలో 163.44తో కలిపి మొత్తం జిల్లాలో 437.265 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్టు చంద్రకళ తెలిపారు.

# రంగరాజన్‌పై దాడి బాధాకరం



- జనసేన రాష్ట్ర ఇన్‌చార్జి నేమూరి శంకర్‌గౌడ్

**నవతెలంగాణ-కేపీహెచ్‌బీ**

శ్రీ చిలుకూరు బాలాజీ టెంపుల్ దేవాలయ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడి బాధాకరమని జనసేన రాష్ట్ర ఇన్‌చార్జి నేమూరి శంకర్ గౌడ్ అన్నారు. జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు.. శ్రీ చిలుకూ రు బాలాజీ టెంపుల్ రంగరాజన్‌పై జరిగిన దాడిని ఖండించారు. సోమవారం జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబర్ బొంగు నూరి మహేందర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి నేమూరి శంకర్ గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రాధారాం రాజలింగం, వీర మహిళా విభాగం అధ్యక్షు రాలు కావ్య, రంగరాజన్ నివాసమునకు వెళ్లి పరిస్థితులను తెలుసుకొని పరా మర్శించారు. ఈ సందర్భంగా జనసేన రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ రంగ రాజన్‌పై దాడి చేసిన దోషులను రాష్ట్ర ప్రభుత్వము వెంటనే పట్టుకొని కఠిన శిక్ష విధించాలన్నారు. రంగారాజన్ కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. జన శ్రేణులు వారికి అండగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర జనసేన పార్టీ నాయకులు, గ్రేటర్ హైదరాబాద్ నాయకులు, జన సైనికులు పాల్గొన్నారు.

# పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**నవతెలంగాణ-కూకట్‌పల్లి**

స్మశాన వాటికల్లోని పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచించారు. సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇంజనీరింగ్, హార్టికల్చర్, ఎలక్ట్రికల్ అధికారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో ఉన్న స్మశాన వాటికల్లో ఉన్న సమస్యలు పరిశీలించామని, 60శాతం పనులు పూర్తయ్యాయి అని తెలిపారు. అన్ని స్మశాన వాటికల్లో పెండింగ్ పనులు పూర్తి చేయాలని, వాటికి కావలసిన నిధులు అంచనా వేసి అందజేయాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ముద్దం నరసింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, జూపల్లి సత్యనారాయణ, యం. సబిహా గౌసుద్దీన్, మాజీ కార్పొరేటర్లు పగడాల బాబురావు, తూము శ్రావణ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 57 ఫిర్యాదులు

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

**నవతెలంగాణ-సిటీబ్యూరో**



జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి స్వీకరించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 57 ఫిర్యాదులు అందినట్టు తెలిపారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ శాఖల్లో ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణికి ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలనీ, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

# విద్యార్థులు అన్ని రంగాల్లో ఎదగాలి

- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

**నవతెలంగాణ-జగద్గిరిగుట్ట**



విద్యార్థులు చిన్ననాటి నుంచే అన్ని రంగాల్లో ఎదగాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ సూచించారు. సోమవారం గాజులరామారం డివిజన్, హెచ్ఎ ఎల్ కాలనీలో గల రిచ్ మైండ్స్ ఎలిమెంటరీ స్కూల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టెస్టీ ఫుడ్ ఫెయిర్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మనోభావాలకు అనుగుణంగా తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. అనంతరం విద్యార్థులు వండిన రుచికరమైన వంటలు తిని ఆయన వారిని అభినందించారు. విద్యతో పాటు సమసమాజానికి ఉపయోగపడే మంచి వ్యక్తిత్వం కూడ అలవర్చుకోవాలన్నారు. నైతిక విలువలు, నైపుణ్య అభివృద్ధి పెంపొందించే అంశాలపై దృష్టి సాధించాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు అన్ని రంగాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మెన్ మహమ్మద్ మెహబూబ్ అలీ, అకాడమిక్ డైరెక్టర్ మహమ్మద్ బిలాల్, ప్రిన్సిపల్ మంజుల సురేఖ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మీర్జా రషీద్ బేగ్, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# మైసమ్మ నగర్‌లో నూతన కమిటీ నియామకం



**నవతెలంగాణ-జగద్గిరిగుట్ట**

జగద్గిరిగుట్ట డివిజన్ మైసమ్మ నగర్(బి) బ్లాక్ సృజన వెల్ఫేర్ అసోసియేషన్ బస్తీ నూతన కమిటీ ఎన్నికలు ఉత్కంఠ భరితంగా జరిగాయి. ఈ ఎన్నికల్లో స్కూటర్ గుర్తుపై పోటీ చేసిన ప్యానెల్ సభ్యులు గెలుపొందారు. బస్తీలో మొత్తం 464 ఓట్లు ఉండగా.. అందులో 399 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధ్యక్షులుగా పోటీ చేసిన బసవప్పకు 184 ఓట్లు రాగ ప్రత్యర్థి పిల్లి ఆంజనేయులుకు 114, జమేదార్ సంతోష్‌కు 79 ఓట్లు వచ్చాయి. బసవప్ప 70 ఓట్లతో గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా పోటీ చేసిన బండారి రవిందర్‌రెడ్డికి 251 ఓట్లు రాగా.. బీఎస్ఆర్ నానికి 107 ఓట్లు వచ్చాయి. రవిందర్‌రెడ్డి 144 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. అదే విధంగా కోశాధికారిగా పోటీ చేసిన భానుచందర్‌కు 144 ఓట్లు రాగా.. శ్రీకాంత్ యాదవ్‌కు 209 ఓట్లు వచ్చాయి. శ్రీకాంత్ యాదవ్ 65 ఓట్లతో గెలుపొందారు. అనంతరం బస్తీ పెద్దలు, ప్రజలు నూతనంగా గెలిచిన కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నూతనంగా గెలుపొందిన కమిటీ బాధ్యులు బసవప్ప, రవిందర్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్‌లు మాట్లాడుతూ బస్తీ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు. తమ విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

# కన్యకా పరమేశ్వరి విగ్రహ ప్రతిష్టాపన



**నవతెలంగాణ-కేపీహెచ్‌బీ**

బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని డివిజన్‌లో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ కార్పొరేటర్ బాబురావులు పాల్గొని అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బాలాజీ నగర్ ప్రెసిడెంట్ డాక్టర్ వెంకట్రావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# జెడ్‌పీహెచ్‌ఎస్ ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్



**నవతెలంగాణ-కూకట్‌పల్లి**

ఈ రోజుల్లో ఆధునిక కాలంలో సైన్స్‌కు ఎక్కువ ప్రాముఖ్యత ఉన్నందున, విద్యార్థులు సైన్స్‌పై దృష్టి సారించాలని అకాడమీని మానిటరింగ్ ఆఫీసర్ రవీందర్ రాజు తెలిపారు. కొత్త కొత్త విషయాలను కనుగొని మానవ జీవితం సులభతరం చేసుకోవాలన్నారు. సోమవారం కూకట్‌పల్లి హై స్కూల్‌లో, తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ ఎస్సీ ఈఆర్టీ సౌజన్యముతో, ఫోరం ఫర్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఆధ్వర్యంలో.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్థాయిలో పదవ తరగతి విద్యార్థులకు, ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ కూకట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆన్లైన్ మోడ్‌లో నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో మొదటి స్థా నం కే.విజయ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాచుపల్లి, రెండవ స్థానం శరణ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీడిమెట్ల, మూడో స్థానం సాయి సంతోష్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బౌరంపేట్, కన్సోలేషన్ బహుమతి అక్షయ్ కుమార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బోడు ప్పల్ విద్యార్థి కైవసం చేసుకు న్నారు. వీరిలో మొదటి మూడు స్థానాల్లో ఉన్నవారు తిరిగి 12వ తేదీ రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన వలసి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫోరం అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ మధుసూదన్, రాష్ట్ర ఫోరం అధ్యక్షులు అజయ్ సింగ్, రాష్ట్ర కోశాధికారి శ్రీనివాసచారి, మేడ్చల్ జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రవీందర్ రాజు, బీసీఈబి సెక్రటరీ సురేష్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



- మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు

**నవతెలంగాణ-కూకట్‌పల్లి**

ప్రభుత్వం ఇకనైనా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు అన్నారు. సోమవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి మండల చౌరస్తాలో, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి నేతృత్వంలో, జరిగిన రైతు మహా ధర్నాకి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు వెళ్లారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తన నియోజకవర్గంలో జరిగిన రైతు మహాధర్నాలో, కొడంగల్ నియోజకవర్గ ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకున్నరన్నారు. ముఖ్యమంత్రి పీఠం ఎక్కి, తన నియోజకవర్గం ప్రజలకే ఇచ్చిన వాగ్దానాలు రైతు బంధు, రైతు రుణమాఫీ, రైతు బీమా, ఇలాంటి పథకాలు ఏమి ఇవ్వలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు ఇంకా ఏమిస్తాడని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రబెల్లి సతీష్ రావు, వెముల ఆంజనేయులు, పర్వత సతీష్ కుమార్, పల్లపు బాబు, గౌని శ్రీనివాస్ సాగర్, సిల్వర్ మనీష్, జగదీష్, రాము తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రతిష్టాత్మక నిర్ణయాలతో పని చేస్తుంది..

**నవతెలంగాణ-ధూల్ పేట్**



కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతిష్టా త్మక నిర్ణయాలు తీసుకుంటుందని హైదరాబాద్ కాంగ్రెస్ అధ్యక్షుడు సమీర్ వలి ఉల్లాహ్ అన్నారు. అసెంబ్లీలో బీసీలకు, ఎస్సీ వర్గీకరణకు తీర్మాణం చేసిన సందర్భంగా సోమవారం ఖిల్వత్ ఉర్దూ మాస్కా న్ హాల్‌లో ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనం తరం ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో బీసీలకు నలుబై శాతం రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణకు ప్రతిష్టా త్మక నిర్ణయం తీసుకున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం భవిష్యత్ తరాలకు అను గుణంగా పనిచేస్తుందన్నారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. హైదరా బాద్ పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల కాంగ్రెస్ నాయకులకు అదిష్టా నం ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. పాత బస్తీ కాంగ్రెస్ నాయకులకు పార్టీ పదవులు నామిటెడ్ పదవులలో అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్ర మంలో హైదరాబాద్ ఇన్‌చార్జి మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ ఉబెదుల్ల కొత్వాల్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఆఫ్జలుద్దీన్, ముజీబుల్లాహ్ షరీఫ్, ఉస్మాన్ అల్ హజరి, నరేష్, అక్బర్, రవి రాజ్, తదితరులు పాల్గొన్నారు.

# కళలు సంస్కారం నేర్పుతాయి



**నవతెలంగాణ-కల్చరల్**

కళలు సంస్కారం నేర్పుతాయని కేంద్ర పూర్వ మంత్రి సముద్రాల వేణు గోపాలా చారి అన్నారు. ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్, శ్రీ లాస్య నత్యాలయ సంయుక్త ఆధ్వర్యంలో నల్ల కుంటలోని శంకర మఠం ప్రాంగణంలో భరత నాట్య ప్రదర్శన జరిగింది. నాట్య గురువు విశాఖ ప్రకాష్ శిష్య బృందం పలు నాట్య అంశాలు కన్నుల పండుగగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డాక్టర్ వేణు గోపాలా చారి పాల్గొని కళాకారులను సత్కరించి మాట్లాడారు. మారుతున్న కాలంతో పాటు నేడు మహిళలకి ఆత్మ స్థైర్యం విశ్వాసం కలిగి వుండాలి అన్నారు. ఈ లక్షణాలు కళలు నేర్చుకోవటం వల్ల కలుగుతాయి అని చెప్పారు. యువ కళా వాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీ నారాయణ అధ్యక్షత వహించిన కార్యక్రమానికి బుర్ర మోహన్ కృష్ణ వ్యాఖ్యానం చేయగా సంధ్య రాణి కార్యక్రమ నిర్వహణ చేశారు.

## ఐరిస్ ఫ్లోరెట్స్ వరల్డ్ స్కూల్‌లో
# హస్తలేఖన శిక్షణా శిబిరం

**నవతెలంగాణ-కుత్బుల్లాపూర్**



ఐరిస్ ఫ్లోరెట్స్ వరల్డ్ స్కూల్‌లో సోమవారం ప్రముఖ హస్తలేఖన నిపుణుడు డా.వై.మల్లికార్జునరావు నిర్వహించిన ప్రత్యేక శిక్షణా శిబిరం ముగిసింది. హస్తలేఖన శాస్త్రంలో డాక్టరేట్ పొందిన ఆయన, విద్యార్థులకు శాస్త్రీయంగా రచన ప్రక్రియను మెరుగుపరిచే పద్ధతులను వివరించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. హస్తలేఖనంలో శాస్త్రీయ ధోరణులు, అందమైన అక్షరలేఖనం అభివృద్ధి చేసుకోవడానికి ఉపయోగపడే ప్రాక్టికల్ టెక్నిక్స్, వ్యాయామాల గురించి ఆయన ప్రాక్టికల్ డెమోతో వివరించారు. స్కూల్ ప్రిన్సిపాల్ డా. తులసి కుమారి నంద ఈ సందర్భంగా మాట్లాడుతూ "మన విద్యార్థుల హస్తలేఖన నైపుణ్యాలను మెరుగుపరచడానికి ఇటువంటి శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి" అని తెలిపారు. ఈ సందర్భంగా డా.మల్లికార్జునరావు మాట్లాడుతూ "హస్తలేఖనం మన మస్తిష్క అభివృద్ధికి తోడ్పడే శాస్త్రం అన్నారు. సరైన ప్రాక్టీస్ ఉంటే అద్భుతమైన అక్షరలేఖనాన్ని అభివృద్ధి చేసుకోవచ్చు" అని తెలిపారు. ఈ శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన ఐరిస్ ఫ్లోరెట్స్ వరల్డ్ స్కూల్ యాజమాన్యానికి, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. చైర్మెన్ శిరీష్ తుర్లపాటి, డైరెక్టర్ రాధిక తుర్లపాటి,హెడ్ ఆఫ్ ఆపరేషన్ శ్రీనివాస్ ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల హస్త కళ నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకున్నారని ప్రసంగించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



- ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్

**నవతెలంగాణ-కుత్బుల్లాపూర్**

పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులను కుత్బుల్లాపూర్ స్థానిక ఎమ్మెల్యే కేపీ. వివేకనంద్ స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలను వివరించగా, ఎమ్మెల్యే వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ప్రజల సమస్యల పరిష్కారం తన మొదటి ప్రాధాన్యత అని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి విజ్ఞప్తిని సమగ్రంగా పరిశీలించారు. తగిన వెంటనే చర్యలు తీసుకునేలా అధికారులకు సూచనలు ఇస్తున్నాం" అని తెలిపారు. పలు సమస్యలు, ముఖ్యంగా నీటి సరఫరా, రోడ్ల మరమ్మతులు, రేషన్ కార్డులు, పెన్షన్‌లు, విద్యుత్ సమస్యలు, డ్రయినేజీ సమస్యలపై ప్రజలు వినతులు సమర్పించారు. అయా శాఖల అధికారులను వెంటనే సంప్రదించి, ప్రజలకు తగిన సహాయం అందించేందుకు ప్రయత్నిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంక్షేమ సంఘం నాయకులు,సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులు సైన్స్, టెక్నాలజీపై ఆసక్తి పెంచుకోవాలి

ఎమ్మెల్యే కె.పి.వివేకానంద సుభాష్ నగర్‌లోని " లిటిల్ స్టార్ హై స్కూల్ " లో సోమవారం ఏర్పాటు చేసిన "రోబోటిక్ గాల అండ్ టెక్ టోపియా" సైన్స్ ఫెయిర్ ను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్, టెక్నాలజీపై ఆసక్తి పెంచుకోవడం చాలా అవసరం అన్నారు. ఈ విధమైన ప్రదర్శనలు విద్యార్థుల సృజనాత్మకత, పరిశోధనా ధోరణిని ప్రోత్సహిస్తాయి అని పేర్కొన్నారు. విద్యార్థుల సృజనాత్మకతకు ఇది ఒక అద్భుతమైన వేదిక అని తెలిపారు. ఈ ఫెయిర్‌లో ప్రదర్శించిన ప్రాజెక్టులు వారి పరిశోధనా నైపుణ్యాలను మెరుగుపరిచేలా చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్, యువ నాయకులు నదీం రాయి, బౌరంపేట్ కౌన్సిలర్ బాల్ రెడ్డి, సిద్ధిఖీ, యాదగిరి హరిబాబు ప్రభాకర్ హరీష్, స్కూల్ యాజమాన్యం కరస్పాండెంట్ అల్తాఫ్ హుస్సేన్, ప్రధానోపాధ్యాయురాలు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# శ్రీవారి బ్రహ్మోత్సవాల ఆదాయం లెక్కింపు



- రూ.10.02829 ప్రకటించిన దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు

**నవతెలంగాణ-జగద్గిరిగుట్ట**

జగద్గిరిగుట్ట కొండపై ఉన్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి (శ్రీవారి )54 బ్రహ్మోత్సవాలు ఈనెల మూడు, నాలుగు, ఐదు తేదీల్లో అంగరంగ వైభవం గా జరిగాయి. సోమవారం ఆలయ ఆవరణలో దేవాదాయ ధర్మాదాయ శాఖ పర్యవేక్షణాధికారి సిహెచ్.చంద్రమోహన్, కార్యనిర్వహణధికారి జె.కృష్ణమా చార్యులు, చైర్మెన్ కే.నరేందర్ రెడ్డి, ప్రధాన అర్చకులు మాడభూషిని విజయ కుమార్ చార్యులు, శేషాచార్యులు, ధర్మకర్తల మండలిసభ్యులు ఆధ్వర్యంలో ఆదాయాన్ని లెక్కించారు. తైబజార్ 3,48,400, స్వామివారి కట్నాలు 1,57,401, హుండి ఆదాయం2,39,528, ఇతరత్రా ఆదాయం 2,57,500, రూ.10.02828 వివిధ పద్దులపై రూ.6,61,671 వచ్చిందని అధికారులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు కే.బుచ్చిరెడ్డి, ఆర్.వేణుగౌడ్, కే.రవీందర్, సునీత, వి.రాజు, మాజీ ఆలయ చైర్మెన్ జి. సుధాకర్ రావు, శేశిరెడ్డి,డి.శ్రీనివాస్ రెడ్డి, సంజీవరెడ్డి, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఓయూ వీసీకి వినతిపత్రం



ఓయూ విద్యార్థి సంఘాలు

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ల రిటైర్మెంట్ ఏజ్‌ను 65 ఏండ్లకి పెంచిన నేపథ్యంలో ఓయూ పీహెచ్డీ ఎంట్రెన్స్ నోటిఫికేషన్‌లో మార్పులు చేయాలని, సీట్ల సంఖ్య పెంచాలని సోమవారం ఓయూ విద్యార్థి సంఘాల ప్రతినిధుల వీసీ ప్రొ. కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రీసెర్చ్ సెంటర్స్, పీజీ సెంటర్స్, రిటైర్డ్ ప్రొఫెసర్లుకు కూడా గైడ్ షిప్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, జార్జిరెడ్డి పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, బీఆర్ఎస్వీ, ఎస్టీఎస్ఏ, మాదిగ స్టూడెంట్ యూనియన్, అంబేద్కర్ స్టూడెంట్ అసోషియేషన్, మాల జన సమితి, అంబేద్కర్ పూలే స్టూడెంట్ యూనియన్ విద్యార్థులు పాల్గొన్నారు.

## దర్గాను దర్శించుకున్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ సోమవారం సాయంత్రం తాడ్‌బండ్ షావలి దర్గాను దర్శించుకున్నారు. అనంతరం ముస్లిం గ్రేవ్‌యార్డ్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన వీధి దీపాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం గ్రేవియార్డ్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. వీధి దీపాల ఏర్పాటుకు ఎమ్మెల్యే తన వంతు ఆర్థిక సహాయం చేసారని, వీధి దీపాలు ఏర్పాటు చేయటం వల్ల దర్గాకు, గ్రేవ్‌యార్డ్‌కు వచ్చే వారికి చాలా సౌకర్యంగా ఉంటుందని గ్రేవ్‌యార్డ్ కమిటి సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

# ఫిర్యాదుల సత్వర పరిష్కారంపై దృష్టి

- జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి
- జీహెచ్ఎంసీ ప్రజావాణికి 155 అర్జీలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజావాణిలో అందిన ఫిర్యాదుల సత్వర పరిష్కారం పై దృష్టి సారించామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి తెలిపారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజలను కమిషనర్.. వారి సమస్యలను అడుగుతూ అర్జీలను స్వీకరించారు. పలు సమస్యలకు అప్పటికప్పుడు పరిష్కారం దిశగా సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో ఆయా విభాగాలకు సంబంధించి అందిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులన్నింటినీ విభాగాల వారీగా పరిశీలన చేసి ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని, అదేవిధంగా సర్కిల్ వారీగా ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో అత్యధికంగా టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించిన ఫిర్యాదులు అందుతున్నాయని, 2025 జనవరి నుంచి ఇప్పటి వరకు టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి 330 ఫిర్యాదులు అందగా, అందులో 190 ఫిర్యాదులను పరిష్కరించినట్టు తెలిపారు. ఆయా ఫిర్యాదుల పరిష్కారం పై ప్రతి వారం సమీక్షిస్తున్నట్టు కమీషనర్ తెలిపారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 59 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 34, ఇంజినీరింగ్ మెయింటెనెన్స్ 6, ట్యాక్స్, వెటర్నరీ విభాగాలకు 3 చొప్పున, ఫైనాన్స్, హెల్త్, ఎలక్ట్రికల్ విభాగాలకు రెండు చొప్పున, శానిటేషన్, లేక్స్, యూసీడీ విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులు అందగా, ఫోన్ ఇన్ ద్వారా 4 ఫిర్యాదులు అందాయని తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 96 అర్జీలు అందాయని, అందులో కూకట్ పల్లి జోన్‌లో 41, ఎల్బీనగర్, శేరిలింగంపల్లి జోన్‌లలో 13 చొప్పున, సికింద్రాబాద్ జోన్‌లో 11, చార్మినార్ జోన్‌లో 7, ఖైరతాబాద్ జోన్‌లో ఒక్క ఫిర్యాదు అందిందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, గీతా రాధిక, పంకజ, అశోక్ సామ్రాట్, రఘు ప్రసాద్, వేణుగోపాల్ రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, యాదగిరి రావు, యూబీడీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, అడిషనల్ సీసీపీలు ప్రదీప్, గంగాధర్, (ఎల్.ఏ) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాము నాయక్, ఎస్టేట్ అధికారి ఉమా ప్రకాష్, జె.సి రెవెన్యూ మహేష్ కులకర్ణి, డిప్యూటీ సీఈ పనసారెడ్డి, వాటర్ వర్క్స్ సాయి రమణ తదితరులు పాల్గొన్నారు.

## బాలికల అనాథాశ్రమాన్ని సందర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-బేగంపేట్

సికింద్రాబాద్ రెజిమెంటర్ బజార్‌లోని 'హోమ్ అవే ఫ్రమ్ హోమ్' బాలికల అనాథాశ్రమాన్ని సోమవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ సందర్శించారు. దాదాపు 100 మంది ఉండగలిగే సామర్థ్యం ఉన్న అనాథ ఆశ్రమాన్ని చక్కగా నిర్వహిస్తూ అక్కడ ఆశ్రయం పొందుతున్న వారిని సొంత పిల్లలా ఆదరిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా ఆశ్రమం నిర్వహణలో ఉన్న ఇబ్బందులను నిర్వాహకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎలక్ట్రిసిటికి సంబంధించి సమస్యను ఆశ్రమంలో సోలార్ సిస్టమ్ ఏర్పాటుకు వెంటనే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. అలాగే అదనపు గదులు ఇతర సమస్యలకు సంబంధించి ప్రభుత్వ తరపున, వ్యక్తిగతంగా కూడా పూర్తి సహకారం అందిస్తామని హామి ఇచ్చారు. అలాగే కంటోన్మెంట్ ప్రాంతంలో బాలికల హోమ్‌తో పాటు బాయ్స్ హోమ్‌ను కూడా అభివృద్ధి చేయడంతో పాటు ఎలాంటి ఆధారం లేని వృద్ధులకు ఓల్డ్ ఏజ్ హోమ్‌లు ఏర్పాటు చేసి వారికి కూడా అండగా నిలబడాల్సిన బాధ్యత సమాజం పట్ల ఉందని, తాను స్వయంగా ఆ దిశగా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు స్థానికి కాంగ్రెస్ నాయకులు. ఆశ్రమం హోమ్ సస్టయినబుల్ ఆఫీసర్ గ్రేస్, ఆశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు.

## 'అడ్వకేట్ ఆన్ రికార్డ్ సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా' ఎఓఆర్ గా ఓయూ విద్యార్థి



నవతెలంగాణ-ఓయూ

ప్రతిష్టాత్మక 'అడ్వకేట్ ఆన్ రికార్డ్ సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా' (ఏఓఆర్) అర్హత పరీక్షలో ఉస్మానియా విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థిని గాయత్రీ ఎంపిక ఐయ్యారు. గాయత్రీ (2017-2019 విద్యా సంవత్సరంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం న్యాయ కళాశాలలో ఎల్ఎల్ఎం (కార్పోరేట్ అండ్ సెక్యూరిటీ లా)ను అభ్యషించారు. దేశవ్యాప్తంగా ఈ పరీక్షలో 10 ఎంపిక సాధించగా వారిలో ఒకరు గాయత్రీ కావడం విశేషం. తెలంగాణ హై కోర్టులో ప్రస్తుతం ఆమె ప్రాక్టీసు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఓయూ లా కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొ. రాం ప్రసాద్, మాజీ హెడ్ ప్రొ. వెంకటేశ్వర్లు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రొపెసర్స్, విద్యార్థులు, ఉద్యోగులు ఆమె ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇది ఓయూకు గర్వించ దగ్గ విషయం అన్నారు.

## విద్యార్థులు సంస్కృతి సంప్రదాయలకు పెద్దపీట వేయాలి





- ప్రొ.బీ.విమల్ సుకుమార్

నవతెలంగాణ-ఓయూ

విద్యార్థులు విద్యలో క్రీడలు సంస్కృతిక కార్యక్రమాల్లో రాణిస్తూ జీవితంలో ఆల్రౌండర్స్‌గా ఎదగాలని వెస్లీ పీజీ కళాశాల డైరెక్టర్ ప్రొ. విమల్ సుకుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ఎం అన్నారు. సోమవారం కళాశాల ఆధ్వర్యంలో ఆడిటోరియంలో నిర్వహించిన ఎంసీఏ విద్యార్థుల ట్రెడిషనల్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. విద్యార్థులు మన సంస్కృతి సాంప్రదాయాలు పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సంస్కృతి సంప్రదాయాలతోనే దేశం అన్ని రంగాల్లో ప్రత్యేకమైన శైలితో ముందుకు సాగుతుందని తెలిపారు. విద్యాసంస్థల యొక్క విద్యా విధానాన్ని, సౌకర్యాల్ని, మౌలిక వస్తువుల్ని వినియోగించుకుని విద్యార్థులు రాణించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంసీఏ విద్యార్థిని విద్యార్థులు వివిధ రకాల సంప్రదాయ బద్ధమైన వస్త్రాలతో ప్రత్యేకమైన ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్లకు ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలి



- ఓరుగంటి వెంకటేశం గౌడ్

నవతెలంగాణ-బంజారాహిల్స్

కులగణనపై ప్రభుత్వం నిర్ణయం పునః పరిశీలించి మరో మారూ సర్వే చేసి 42 శాతం రిజర్వేషన్లకు ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని జాతీయ ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఓరుగంటి వెంకటేశం గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వెంకటేశం గౌడ్ మాట్లాడుతూ.. లక్ష కోట్ల రూపాయల నిధులు కేటాయించాలనీ, ప్లానింగ్ కమిటీ సభ్యులనూ పక్కన పెట్టేసిన ప్రభుత్వం ఓసీ నాయకులు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జానా రెడ్డిలనూ ఎందుకు ఈ కమిటీల్లో తీసుకున్నారో తెలపాలని ప్రశ్నించారు. 20 లక్షల పైచిలుకు బీసీ ఓట్లను ప్రభుత్వం సర్వే పేరుతో చంపేసిందని, శ్రీకృష్ణ కమిటీ ఏ ప్రభుత్వ హయాంలో ప్రకటించిందో ప్రస్తుత ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రెడ్ల జనాభా 4 శాతం కంటే ఎక్కువగా ఉండదని అనేక వర్గాల వారు ప్రభుత్వాన్ని రెడ్ల పాలన సాగిస్తున్నారని విమర్శలు గుప్పిస్తున్నా పోటీకి అభ్యర్థి లేనట్టు రెడ్డి అభ్యర్థినీ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో పెట్టడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వంలో ఉన్న మంత్రులు భజన చేయడం ఆపి ఇప్పుడైనా కూల సంఘాల ఆధ్వర్యంలో రీసర్వే చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వనికి బీసీ కులాల సర్వే ఎందుకు రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలు అడగాలని ఆ బాధ్యత ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న వారిపై లేదా ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి మంత్రి వర్గం ఎందుకు ప్రశ్నించలేదనీ మౌనంగా ఉంటే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో కొల్ల జనార్ధన్, జెల్ల నరేందర్ నేత, రఘురామ్ నేత, దుస్సా యాదగిరి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలగిరిలో పర్యటించిన ఎమ్మెల్యే



- నవతెలంగాణ-కంటోన్మెంట్

నియోజకవర్గ బస్తీ పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ సోమవారం తిరుమలగిరిలో పర్యటించారు. ఏడోవ వార్డులోని తిరుమలగిరి విలేజ్, వనిత సొసైటీ, సెయింట్ ఆంథోనీ చాపెల్, వీరభద్ర స్వామి దేవాలయం, సగమాత చర్చ్ ఏరియాల్లో బస్తీ పర్యటన చేశారు. స్థానికులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. భూగర్భ డ్రయినేజీ వ్యవస్థ సరిగాలేకపోవడం, బోర్ వాటర్, తాగునీరు సరఫరా, అంతర్గత రహదారులు ఏర్పాటు ఆవశ్యకతలను గుర్తించిన ఎమ్మెల్యే పరిష్కారం కోసం, కంటోన్మెంట్ బోర్డు అధికారుల తీసుకుని వెళ్లి పరిష్కరిస్తామని అన్నారు. అభివృద్ధి కోసం నిధులను మంజూరు చేయిస్తానని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేత అదనపు నిధులను నియోజకవర్గానికి తీసుకొస్తానని తెలిపారు. ప్రజల మద్దతుతో అభివృద్ధి చేస్తానని బస్తీ వాసులకు హామీ ఇచ్చారు. బస్తీ పర్యటనలో ఎమ్మెల్యే వెంట వార్డు నాయకులు రేమండ్ హార్ ఉడ్, నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు భవాని సుందర్ రాజన్, మురళీ ముదిరాజ్, సరిత, రాకేష్, నరేష్, రాజేష్, అశోక్, స్థానిక బస్తీ పెద్దలు ఉన్నారు.

## విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

క్రీడలతో మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటారని, వివిధ ప్రాంతాలకు చెందిన వారంతా ఒక్కచోట కలుసుకొనే అవకాశం ఉంటుందని, మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. అమీర్‌పేట్‌లోని మున్సిపల్ గ్రౌండ్‌లో ఈ నెల 6 నుండి నిర్వహిస్తున్న క్రీడాపోటీలు ఆదివారం రాత్రి ముగిసాయి. ఈ కార్యక్రమానికి సంబంధించి బహుమతులు సోమవారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రతి ఏడాది క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. క్రీడా పోటీల సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాలలో నివసిస్తున్న సిక్కులు హాజరయ్యారు. క్రికెట్ పురుషుల విభాగంలో అమీర్‌పేట్‌కు చెందిన రాయల్ ఛాలెంజర్స్ టీమ్‌కు మొదటి ప్రైజ్, కిషన్ బాఘ్ టీమ్‌కు ద్వితీయ బహుమతి, మహిళల విభాగంలో అమీర్ పేట్‌కు చెందిన ప్రిన్స్1, ప్రిన్స్2 కి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అమీర్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి నామన సంతోష్ మణి కుమార్, నాయకులు ప్రవీణ్ రెడ్డి, అమీర్‌పేట్ గురుద్వార్ అధ్యక్షుడు దర్శన్ సింగ్, కార్యదర్శి సురేందర్ సింగ్, నరేందర్ సింగ్, సుమిత్ సింగ్, మాంటి, మోను, పప్పు, సోను, కక్కు తదితరులు పాల్గొన్నారు..

# డిప్యూటీ మేయర్‌కు స్వచ్ఛ కార్మికులు వినతి



నవతెలంగాణ-ఓయూ

జీహెచ్ఎంసీ స్వచ్ఛ ఆటో, రిక్షా కార్మికుల జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు సోమవారం గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డికి, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డికి జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గత 30 ఏండ్లుగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇంటింటికి తిరిగి చెత్త సేకరిస్తున్న స్వచ్ఛ ఆటో రిక్షా కార్మికుల పరిస్థితి దయనీయంగా మారిందని, గత ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీ ద్వారా స్వచ్ఛ ఆటోలను పొందిన కార్మికులు ఇప్పుడు ఆ ఆటోల రవాణా పన్ను చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఆటోలపై రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధిస్తున్నారని, ఇది కార్మికులు భరించలేని భారంగా మారిందని, గతంలో ఇలాంటి సమస్యలు తలెత్తినప్పుడు కమిషనర్, ఆర్టీఓ అధికారులతో మాట్లాడి సమస్యను తాత్కాలికంగా పరిష్కరించారు. కానీ జీవో జారీ చేయకపోవడంతో సమస్య తిరిగి తలెత్తిందన్నారు. స్వచ్ఛ ఆటోల సీజ్ వల్ల కార్మికుల జీవనాధారం దెబ్బతినడంతో పాటు కాలనీల్లో చెత్త సేకరణ వ్యవస్థలో అంతరాయం కలుగుతుంది. ఇది కాలనీల్లో దుర్వాసన, చెత్త రోడ్ల మీద పడటం వంటి సమస్యలకు దారితీస్తోందని వాపోయారు. రోజువారీ వేతనాలతో ఆటోల నిర్వహణ, పిల్లల చదువు, వైద్యం, కుటుంబ ఖర్చులు నిర్వహించుకోవడం కష్టంగా మారింది. జరిమానాలు చెల్లించడమే కాకుండా స్వచ్ఛ ఆటోలను కొనసాగించడం కూడా కార్మికులకు సాధ్యమయ్యేలా లేదని, తక్షణమే సీజ్ చేసిన స్వచ్ఛ ఆటోలను విడుదల చేయాలని, ఆర్టీఓ అధికారులు ఆటోలను సీజ్ చేయకుండా శాశ్వతంగా ఈ సమస్యకు పరిష్కారం చూపించాలని, కార్మికుల జీవనోపాధిని కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలి కోరారు. జాయింట్ యాక్షన్ కమిటీ, తెలంగాణ రాష్ట్ర జీహెచ్ఎంసీ సెర్చ్ ఆటో, రిక్షా కార్మికులు పాల్గొన్నారు.

## వాచ్‌మెన్ కూతురిపై కారు డ్రైవర్ లైంగిక దాడి

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

వాచ్‌మెన్ కూతురుపై కారు డ్రైవర్ లైంగిక దాడి చేసిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45లో గల రియల్ ఎస్టేట్ ఆఫీసులో డైరెక్టర్‌గా పని చేస్తున్న వ్యక్తి కారుకి మోతి నగర్‌లో నివసిస్తున్న శివ అనే వ్యక్తి కొంతకాలం నుంచి డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అదే బిల్డింగ్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న భార్యాభర్తలను పరిచయం చేసుకొని తరచూ వారి ఇంటికి వెళ్తూ వాచ్‌మెన్‌తో కలిసి మద్యం సేవించేవాడు. అయితే అతడు శనివారం రాత్రి 8 గంటలకు వాచ్‌మెన్ ఇంటికి వెళ్లాడు. ఇంటిలో ఎవరులేరా అని వాచ్‌మెన్ కూతురిని అడగగా తన తండ్రి తీర్థయాత్రలకు వెళ్లాడని, తల్లి మొదటి అంతస్తులో పని కోసం వెళ్లిందని, తన అన్న కూడా అదే బిల్డింగ్‌లో సెక్యూరిటీ గార్డ్ గా పని చేస్తున్నందున అతను కూడా డ్యూటీకి వెళ్లాడని" తెలిపింది. ఒంటరిగా ఉన్న యువతితో రాత్రి 11:30 గంటల వరకు మాట్లాడుతూ.. కూర్చున్నాడు. యువతి తనకి నిద్ర వస్తుందని, డ్రైవర్‌ను వెళ్లిపోవాలని కోరింది. అనంతరం ఆమె నిద్రిపోవడానికి వెళ్ళింది. అర్ధ గంట తర్వాత అతడు తిరిగి వచ్చి యువతిపై బలవంతంగా అరవకుండా దిండుతో నోరు కుక్కి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఎవరితో చెప్పవద్దని నీకు అన్ని విధాలా సహాయం చేస్తానని చెప్పి బెదిరించి బయటకు వెళ్ళిపోయాడు. అతను వెళ్ళిన వెంటనే యువతి రోదిస్తూ తన తల్లి వద్దకు వెళ్లి జరిగిన విషయం చెప్పింది. వెంటనే తల్లి ఈ విషయాన్ని భర్తకి తెలియజేసింది. వారు సోమవారం జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్‌కి వెళ్లి జరిగిన విషయం చెప్పి ఫిర్యాదు చేశారు. శివపై బీఎన్ఎస్ సెక్షన్ 64 కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. త్వరలో నిందితుడిని అరెస్ట్ చేస్తామని జూబ్లీహిల్స్ పోలీసులు తెలిపారు.

## గాలేరియా 2025లో పాల్గొన్న కోటా నీలిమ



నవతెలంగాణ-బేగంపేట్

డా. కోటా నీలిమ హైదరాబాద్ స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో జరిగిన 'గాలేరియా 2025' కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ ఫోటోగ్రఫీ సొసైటీ (టీపీఎస్) ఫిబ్రవరి 7 నిర్వహించిన ఐదు రోజుల వార్షిక ప్రదర్శన నేటితో ముగుస్తుంది. డా. కోటా నీలిమకు వీపీఎస్ శర్మ, కార్యదర్శి ప్రశాంత్ మంచికంటి, సత్యప్రసాద్, హరీష్, కృష్ణన్ కల్పత్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డా. నీలిమ మాట్లాడుతూ.. ఫోటోగ్రఫీ ద్వారా సంస్కృతి పరిరక్షణ, చరిత్ర డాక్యుమెంటేషన్, సామాజిక మార్పుకు నాంది పలుకే విధంగా ఉంటుందని, తెలిపారు. ఫోటోగ్రఫీ కళను ప్రోత్సహిస్తూ టీపీఎస్ అందిస్తున్న వేదికను ఆమె ప్రశంసించారు. ఒక్కో ఫోటో వెనుక ఓ కథ ఉంటుంది. దృశ్యాలు మనసును కదిలించే శక్తి కలిగి ఉంటాయి. ఫోటోగ్రఫీ కేవలం కళ మాత్రమే కాదు, అది సమాజాన్ని మార్చే ఓ గొప్ప శక్తిగా మారుతుంది. ఈ ప్రదర్శనలో భాగస్వామ్యమైన ప్రతి ఫోటోగ్రాఫర్‌కు నా అభినందనలని ఆమె అన్నారు. ఈ ప్రదర్శనలో ఆచార సంప్రదాయాలు, ప్రకృతి, సమకాలీన సామాజిక సమస్యలు వంటి విభిన్న అంశాలను ప్రదర్శించే అద్భుత చిత్రాలు ప్రదర్శించారు. హైదరాబాద్ కళా ప్రేమికులు, విద్యార్థులు, ఫోటోగ్రఫీ అభిమానం కలిగిన ప్రతి ఒక్కరూ ఈ ప్రదర్శనను సందర్శించి ఆస్వాదించాలి. ఈ ప్రదర్శన నేటి సాయంత్రం 5 గంటల వరకు బహిరంగంగా అందుబాటులో ఉంటుంది.

## బిర్యానీ, పానీపూరీ అంటే చాలా ఇష్టం

- ప్రముఖ సినీ నటి ఐశ్వర్యా రాజేష్



నవతెలంగాణ-బంజారాహిల్స్

తనకు బిర్యానీ అన్నా.. పానీ పూరి అన్నా చాలా ఇష్టమని సినీ హీరోయిన్ ఐశ్వర్యా రాజేష్ అన్నారు. సోమవారం బంజారా హిల్స్ రోడ్ నెం. 2లో నూతన ంగా ఏర్పాటు చేసిన కలర్స్ 2.0 యూనిట్‌ను ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాను ఫుడ్ లవర్‌నని తనకు నచ్చిన ఫుడ్‌ను ఇష్టంగా తింటానని దానికి తగ్గట్లే వర్కవుట్స్ చేసి అందంగా, ఆరోగ్యంగా ఉంటానని అన్నారు. తనకు చీరలంటేనే ఇష్టమని ఆడవారి అందాన్ని, గౌరవాన్ని చీర మరింత పెంచుతుందని తెలిపారు. కలర్స్ హెల్త్ కేర్' సీవోవో శివాజీ కూన మాట్లాడుతూ.. 2004లో ప్రారంభించిన 'కలర్స్ హెల్త్ కేర్' సేవలకు మరింత అడ్వన్స్ టెక్నాలజీని జోడిస్తూ 'కలర్స్ హెల్త్ కేర్ 2.0 ప్రారంభించినట్టు తెలిపారు. ఇప్పటికీ 50 బ్రాంచీలు ఉన్న తమ 'కలర్స్ హెల్త్ కేర్'ను వచ్చే ఏడాది చివరి కల్లా దేశవ్యాప్తంగా 250 బ్రాంచీలకు విస్తరించనున్నట్టు ప్రకటించారు. 'కలర్స్ హెల్త్ కేర్' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాయుడు మాట్లాడుతూ.. యూఎస్ ఎఫ్డీఏ అప్రూవుడ్ టెక్నాలజీతో 'కలర్స్ హెల్త్ కేర్ 2.0 ప్రారంభించినట్టు తెలిపారు. ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మినర్వా హోటల్స్ అధినేత, మాజీ ఎంపీ ప్రభాకర్ రెడ్డి, సీబీఐటీ డైరెక్టర్ దివ్యారెడ్డి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

## నిరాటంకంగా కొనసాగుతున్న అభివృద్ధి పనులు



- ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

నవతెలంగాణ-ఓయూ

గత పదేండ్ల కాలంలో సికింద్రాబాద్‌లో తాము చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను నిరాటంకంగా కొనసాగిస్తాయని, అందుకు ఎన్ని కష్టాలైన ఎదుర్కొనందుకు సిద్ధమని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ అన్నారు. సీతాఫల్‌మండీ డివిజన్ పరిధిలోని భవానీ నగర్‌లో రూ.20 లక్షల ఖర్చుతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణం పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సితాఫట్‌మండీ పరిధిలో అన్ని అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సామల హేమతో, జీహెచ్ఎంసీ, జలమండలి, రెవిన్యూ అధికారులు విద్యా సాగర్, స్వర్ణ లత, కౌశిక్, కుశాల్ కుమార్, పాల్గొన్నారు.

## కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్‌లో సెల్ఫ్ డిఫెన్స్ వర్క్‌షాప్

- ప్రతి మహిళ మానసికంగా శారీరకంగా దృఢంగా ఉండాలి
- డా.ఏవీ గురవారెడ్డి



నవతెలంగాణ-బేగంపేట్

ప్రతి మహిళకు మానసిక స్థైర్యంతోపాటు శారీరక దృఢత్వం అవసరమని అందులో భాగంగానే బేగంపేటలో కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్‌లో పనిచేసే మహిళా ఉద్యోగులు, నర్సింగ్ సిబ్బంది, డాక్టర్‌లకు సెల్ఫ్ డిఫెన్స్ వర్క్ షాప్‌ను సోమవారం కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, ఆర్థోపెడిక్ సర్జన్ డా.ఏవీ గురువారెడ్డి ప్రారంభించారు. సమాజంలో ఇటీవల కాలంలో మహిళలపై జరుగుతున్న దాడులు ఇతరత్రా సంఘటనలను దృష్టిలో పెట్టుకొని ప్రతి మహిళ తనను తాను ఆపద సమయంలో కాపాడుకునేందుకు, ప్రతి ఒక్కరిలో మానసిక, శారీరక దారుఢ్యాన్ని పెంపొందించాలనే లక్ష్యంతోనే ఈ సంస్థలో పనిచేసే మహిళా ఉద్యోగులందరికీ సెల్ఫ్ డిఫెన్స్ వర్క్ షాప్‌లో భాగంగా శిక్షణ ప్రారంభించామని ఆయన తెలిపారు. మహిళలపై ఎవరు అసభ్యంగా ప్రవర్తించినా వారే స్వయంగా ఎదుర్కొనే విధంగా యోధ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ మార్షల్ ఆర్ట్స్‌లో ప్రావీణ్యం పొందిన మాస్టర్ అజయ్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ శిక్షణ తరగతులను సంస్థలో పనిచేసే ప్రతి మహిళ ఉపయోగించుకోవాలని సూచించారు. సెల్ఫ్ డిఫెన్స్ వర్క్ షాప్‌లో తమపై దాడి చేసినప్పుడు ఎలా తప్పించుకోవాలి, ఎలా ప్రతిగడించాలి, ఎలా ఎదుర్కోవాలనే అంశంపై వారం రోజులపాటు బ్యాచుల వారిగా శిక్షణ తరగతులు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేయనున్నారు. ఈ వర్క్ షాప్‌లో కార్డియాలజిస్ట్ డా.కావ్య, న్యూరాలజిస్ట్ డా.నివేదితతో నర్సింగ్ స్టాఫ్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## నియామక ప్రక్రియలో విప్లవాత్మక మార్పులు



నవతెలంగాణ-బంజారాహిల్స్

నియామక ప్రక్రియలో ఉన్న సమస్యలను అధిగమించడమే లక్ష్యంగా రిక్తం గ్రూప్ తన అధునాతన 'జెడ్ ఇంటర్వ్యూ ఏఐ'ను ఆవిష్కరించింది. ఈ నూతన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ప్లాట్‌ఫారమ్ ఆటోమేటెడ్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తూ నియామక ప్రక్రియను సరికొత్తగా మార్చనుంది. ఇది హెచ్ఆర్ రంగంలో విప్లవాత్మక మార్పులకు ఆజ్యం పోయనుందనీ సోమవారం బంజారాహిల్స్ తాజ్ దక్కన్లో ఏర్పాటు చేసిన సమావేశంలో జెడ్ ఇంటర్వ్యూ ఏఐ వ్యవస్థాపకుడు, సీఈవో (రిక్తం టెక్నాలజీ కన్సల్టింగ్‌లో డైరెక్టర్) సిద్ధరామ్ శింగశెట్టి ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కృత్రిమ మేధస్సును ఉపయోగించి టాలెంట్ హైరింగ్‌ను సులభతరం చేస్తున్నామని చెప్పారు. దీని ద్వారా సంస్థలు సమయాన్ని, వనరులను ఆదా చేసుకోవచ్చని తెలిపారు. పదిహేనేండ్లుగా రిక్తం టెక్నాలజీ కన్సల్టింగ్ ప్రపంచవ్యాప్తంగా టయోటా, నైకి, గూగుల్, ప్రొక్టర్ అండ్ గాంబుల్ వంటి ప్రముఖ కంపెనీలకు కన్సల్టింగ్ సేవలు అందిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం నియామక ప్రక్రియలో వేగం, కచ్చితత్వం, సమానత్వం చాలా అవసరం అన్నారు. సరైన అభ్యర్థులను ఎంపిక చేయడం ఇప్పటికీ సమస్యగా ఉందన్నారు. ఈ సందర్భంగా జెడ్ ఇంటర్వ్యూ ఏఐ సహ వ్యవస్థాపకుడు విజేందర్ జైన్ మాట్లాడుతూ.. సాఫ్ట్ లాంచ్ సమయానికి దాదాపు 20 పైగా సంస్థాగత వినియోగదారులను సంపాదించుకుందన్నారు. వివిధ పరిశ్రమలలో వేలాది ఇంటర్వ్యూలు నిర్వహించిందన్నారు. నియామకదారుల సమయాన్ని, శ్రమను గణనీయంగా ఆదా చేస్తూ కచ్చితమైన నియామక నిర్ణయాలను తీసుకోవడంలో సహాయపడడం ద్వారా ఇది హెచ్ఆర్ టెక్ రంగంలో మార్గదర్శకంగా నిలుస్తుందని తెలిపారు. మరింత సమాచారం కోసం www.zinterview.ai ఈ-మెయిల్లకు hello@zinterview.ai సంప్రదించాలని కోరారు.

## 'కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు చెల్లించాలి'

**నవతెలంగాణ - బంజారా హిల్స్**

జీహెచ్ఎంసీ పరిధిలోని కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి సాయి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో వారు మాట్లాడుతూ.. 2023 లో ఆసెంబ్లీ 2024లో లోక్ సభ ఎన్నికల నిర్వహణ, బూత్‌ల ఏర్పాట్లకు సంబంధించి బిల్లులు చెల్లించాలని డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క, ప్రభుత్వాధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండాపోయిందన్నారు. టెండర్ల ద్వారా చేపట్టిన సివిల్ పనుల బిల్లులకు ఆడిటింగ్ పూర్తయినా ఇప్పటి వరకు విడుదల చేయలేదని వాపోయారు. కాంగ్రెస్ అధికారం లోకొచ్చాక ఎన్నో పెట్టుకొన్నామని, కానీ, ప్రస్తుత ప్రభుత్వం కూడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడంలో నిర్లక్ష్యం చూపతున్నదని పేర్కొన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి కాంట్రాక్టర్లకు న్యాయం చేయాలని కోరారు. అసోసియేషన్ ప్రతినిధులు సివిల్ కాంట్రాక్టర్లు శేఖర్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## "భూపతి చంద్ర" స్మారక కథానికల పోటీ

**నవతెలంగాణ - అంబర్‌పేట**

తెలుగు కథానిక రచయిత/రచయిత్రులలో గల నైపుణ్యతను వెలికితీసి, వారిలో పోటీతత్వాన్ని పెంపొందించి, సమాజాభ్యుదయము పట్ల వారికి గల నిబద్ధతను చాటి చెప్పుటకు "భూపతి చంద్ర" స్మారక సంస్థ కథానికల పోటీని నిర్వహించేందుకు నిర్ణయించారు.

రచయిత / రచయిత్రులకు సూచనలు

1. కథానిక డి.టి.పి.లో ఎ4 సైజ్ నాలుగు పేజీలకు మించరాదు.
2. కథానికలు సమకాలీన సామాజిక సమస్యలను ప్రతిబింబించేవిగా ఉండాలి. హాస్యాన్ని మేళవించగలిగితే మంచిది.
3. పోటీకి పంపుతున్న కథానిక గతంలో ఏ పత్రికలోను ప్రచురితమై ఉండకూడదు.
4. కథానిక తమ స్వీయ రచనేనని అనువాదం, అనుసరణ, అనుకరణ కాదని, గతంలో ఎక్కడా ప్రచురితం కాలేదని, పరిశీలనలో కూడా లేదని హామీ పత్రం జత చేయాలి.
5. రచయితలు / రచయిత్రులు తమ పూర్తి చిరునామాను, ఫోన్ నంబర్‌ను కథానికతో పాటు జత పరచాలి. తమ కలం పేరుతో పాటు స్వంత పేరు కూడా తప్పనిసరిగా వ్రాయాలి.
6. ఒక్కరు ఒక్క కథానికను మాత్రమే పంపాలి. రెండు కాపీలను పంపవలెను.
7. బహుమతుల విషయంలో న్యాయ నిర్ణేతలదే తుది నిర్ణయము. ఎలాంటి సంప్రదింపులకు అవకాశము లేదు. కథానికలు త్రిప్పి పంపబడవు.
8. పోటీకి పంపిన కథానికలను ప్రచురించే హక్కు నిర్వాహకులకు ఉంటుంది.
9. కథానికలు చేరవలసిన చివరి తేది : 10.03.2025.
10. బహుమతుల ప్రకటన తేది : 12.05.2025 దినపత్రికలలో ప్రకటించబడును.

బహుమతుల వివరములు

1. ప్రథమ బహుమతి రూ. 5,000/-
2. ద్వితీయ బహుమతి రూ. 3,000/-
3. తృతీయ బహుమతి రూ. 2,000/-
4. ప్రోత్సాహక బహుమతులు 5. ఒకొక్కరికి రూ. 1,000/-

**రచయిత / రచయిత్రులకు సూచనలు**

కథానికలు పంపవలసిన చిరునామ : సమన్వయకర్త, "భూపతి చంద్ర" స్మారక కథానికల పోటి ఆనంద నిలయం, ఇం.నం. 1-5-1020/4, బి.ఆర్.రావు నగర్, ఓల్డ్ అల్వాల్, సికింద్రాబాద్ - 500010. ఫోన్ : 99636 16999

ఎమ్.ఎల్. కాంతారావు
అధ్యక్షులు
"భూపతి చంద్ర" స్మారక కథానికల పోటి
ప్రజ్ఞాపూర్, గజ్వేల్,
సిద్దిపేట, తెలంగాణ.

# ప్రజావాణికి 1561 దరఖాస్తులు

- అర్జీలను సత్వరమే పరిష్కరించాలి
- అదనపు కలెక్టర్ కదిరవన్ పలాని

**నవతెలంగాణ- సిటీ బ్యూరో**



ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్లు కదిరవన్ పలాని, డాక్టర్ ముకుంద రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కదిరవన్ పలాని, ముకుంద రెడ్డి పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణిలో ప్రజల నుంచి 1561 దరఖాస్తులు అందాయని తెలిపారు. అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ప్రజావాణిలో డిస్ట్రిక్ట్ సివిల్ సప్లై 743, గృహ నిర్మాణ శాఖకు 735, పెన్షన్ 55 , డిఈఓ 04 ఇతర శాఖలకు సంబంధించినవి 24 దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. ఆర్డీఓ సాయిరాం, జిల్లా అధి కారులు ఆర్. రోహిణి, ఆర్ రోహిణి, పవన్ కుమార్, కోటా జీ, డి ఎం హెచ్ ఓ వెంకటి, సుబ్రహ్మణ్యం, ఇలియాజ్ అహ్మద్, రాజేందర్ ,శ్రీరామ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## హెూలియదాసరి కులస్తుల డిమాండ్‌ను నెరవేర్చాలి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ

**నవతెలంగాణ - బంజారాహిల్స్**



రాష్ట్ర ప్రభుత్వం తీసుకురాబోతున్న ఎస్సీ వర్గీకరణలో గ్రూపు - 3 లో ఉన్న తమ కులాన్ని గ్రూప్ -1 లో చేర్చాలన్న హెూలియదాసరి కులస్తుల డిమాండ్‌కు న్యాయ బద్ధత కల్పించి వారికి న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన హెూలియదాసరి కుల సంఘం నేత జహంగీర్, మాజీ పార్లమెంటు సభ్యులు బోర్లకుంట వెంకటేష్ నేతతో కలిసి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ ప్రక్రియలో తలెత్తిన లోపాల వలన అన్యాయానికి గురైన కులాలు తీవ్రంగా ఆవేదన చెందుతున్నాయని అన్నారు. ఎస్సీ వర్గీకరణ చట్ట రూపంగా వచ్చే లోపు లోపాలను సవరించి అందరికీ న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. డా. పృథిరాజ్ యాదవ్,సయ్యద్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.



## ఒరిజిన్‌ఫినరీ ఫుడ్స్ నుంచి విరాట్ చిల్లీ పౌడర్

**నవతెలంగాణ- సిటీబ్యూరో**

ఒరిజిన్‌ఫినరీ ఫుడ్స్ (ORIGINFINERY FOODS) నుంచి విరాట్ చిల్లీ పౌడర్ ను సోమవారం శ్రీచరణ కమ్యూనికేషన్ ఎం.డి. బుస్సా శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో ప్రారంభించారు. సంస్థ ప్రతినిధి ప్రసాద్ మాట్లాడుతూ నేడు మార్కెట్లో దొరికే కారంలో అనేక రకాల రంగులు కెమికల్స్ వాడడం వల్ల, అనేక రకాల వ్యాధులు కారణమవుతున్నాయని తెలిపారు. నాణ్యతలేని మిరపకాయలు వాడడం ఈ సమస్యలకు కారణమన్నారు. ఈ సమస్యలకు చెక్ పెట్టడానికి అత్యంత న్యాయమైన మిరపకాయలను అనుభవం కలిగిన వారితో విరాట్ చిల్లి పౌడర్ తయారు చేస్తూ ఎటువంటి కెమికల్స్ కానీ రంగులు కానీ వాడక పోవడం వల్ల కారం చాలా స్పైసీగా, రుచిగా ఉంటుందని తెలిపారు. డిస్ట్రిబ్యూటర్ కోసం 7807 234565 నెంబర్ కు కాల్ చేయాలన్నారు.




## అవినీతి అక్రమాలపై విచారణ జరిపించాలి

- చెరుకుపల్లి వెంకట్ రెడ్డి

**నవతెలంగాణ-బడంగ్‌పేట్**

బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరిగిన అవినీతి అక్రమాలపై ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి న్యాయ విచారణ జరిపించాలని బీజేపీ బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి అన్నారు. సోమవారం నాదర్ గుల్ గ్రామంలోని బీజేపీ కార్యాలయంలో వారు మాట్లాడారు. గత ఐదేండ్లుగా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 31,19,18,23 డివిజన్లతో పాటు ఇతర డివిజన్ల పరిధిలో ఉన్న ప్రభుత్వ పార్కులను, ఓపెన్ స్థలాలు రాజకీయ పార్టీల నాయకుల కనుసన్నలలో కొందరు ఆక్రమణకు గురి చేశారని తెలిపారు. కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ పార్కులను, ఓపెన్ స్థలాలను కాపాడాలని కోరుతూ గతంలో ఎన్నోసార్లు మాజీ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి,కమిషనర్ సరస్వతి, అడిష్నల్ కలెక్టర్, సీడీఎంఏ అధికారికి వినతి పత్రాలను అందజేసినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎస్ఎన్‌డీపీ నిధులతో నిర్మించిన డ్రయినేజీలు, వరుద కాల్వలు కొని పూర్తి కాగా మరికొన్ని అసంపూర్తిగా నిలిచి పోయాయని, వాటిని పూర్తి చేసేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరినట్టు తెలిపారు. కంచన్ బాగ్ నుంచి ఆదిభట్ల వరకు రేడియల్ రోడ్డు 100 ఫీట్ల, 150 ఫీట్లా తేల్చి ఎమ్మెల్యే చెప్పాలన్నారు.గత బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం తమకు ఇష్టం వచ్చినట్టు ఎజెండాలో తీర్మాలు చేసి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. అవినీతి అక్రమాలపై విజిలెన్స్ అధికారులతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు 1,2 రాళ్ళగూడం రామకృష్ణా రెడ్డి,రామిడి వీరకర్ణా రెడ్డి,సీనియర్ నాయకులు తర్రే మల్లేష్ లు తదితరులు పాల్గొన్నారు.



## నాదర్ గుల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**నవతెలంగాణ-బడంగ్‌పేట్**

బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్ గుల్ గ్రామంలో సోమవారం ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1996-97 బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థులు బొమ్మరిల్లు నాదర్ గుల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నుంచి బొంగ్లూర్ వెళ్లే దారిలో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు.ఆనాటి ఉపాధ్యాయులకు పూల మాలలు వేసి శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థులు తమ చిన్ననాటి మధుర జ్ఞాపకాలను వల్లెవేసుకున్నారు. పూర్వపు ఉపధ్యాయులు కర్ణాకర్ రెడ్డి, నైముల్లా, బలవంత్ రెడ్డి, నర్సింహాచారీ, అరుణ టీచర్, ప్రభాకర్ రెడ్డి, సిద్దప్పలు పాల్గొని మాట్లాడారు. ఆనాటి విలువలు నేటీ సమాజంలో కరువైనాయని, నేటి విద్యార్థులు సంస్కారం వంతులై బాధ్యత గల పౌరులుగా సమాజ బాగు కోసం కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మంత్రి మహేష్ ముదిరాజ్‌తో పాటు పూర్వ విద్యార్థులు సంరెడ్డి మహిపాల్రెడ్డి, కందికంటి రాజు గౌడ్, హర్షవర్ధన్ రెడ్డి,కోరే జంగయ్య, తర్రే మల్లేష్ యాదవ్, రమేష్, సతీష్, కర్ర రాజు, అనిత మంజుల,శ్యామల, సరిత, సునీత,తదితరులు పాల్గొన్నారు.

**BEFORE THE HON'BLE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION, MEDAK DISTRICT AT SANGAREDDY**
**C.C.NO. 117 OF 2024**

Between:
Sr. Neerumalla Vamshi Krishna .... Complainant
AND
M/s. SahitiInfratec Ventures India Private Limited and Others .....Opposite Party

**NOTICE**

To
1. M/s. SahitiInfratec Ventures India Private Limited and others
As company registered under the Companies Act 2013, CIN: U45203 TG2015PTC099984, having its registered office at Plot No 1222,H. No 20239, /82/a/1222/F4, 4thFloor, Co-operative House Building Society Ltd, Road No 36, Jubilee Hills, Hyderabad, Telangana - 500 033
Rep by Its authorized Signatory,
2. Mr. Boodati Lakshmi Narayana S/o B. Anjaneyulu,
3. Mrs. Boodati Parvathi W/o Boodati Lakshmi Narayana .....Opposite Party

Whereas the Complainant filed a consumer case against the Opposite Party No. 1 to 3 and the above case is coming for your appearance. The above case is posted on 18th Feb 2025at 10-30 am for your appearance is required. On the said date and time you should appear in the said courteither in person or through Advocate if you fail to appear before above said court in any reasons the suit shall be decreed Ex-parte.

**//BY ORDER OF THE COURT//**
**M. Govardhan**
Advocate
Sangareddy District

**IN THE COURT OF THE HON'BLE ADDI SENIOR CIVIL JUDGE, VADARDRI BHUVANGAGIRI DIST AT : BHONGIR**
**IA.NO. 4 OF 2021 IN O.S.NO.82 OF 2021**

Between
Smt. Pabathi Sulochana and anr Petitioner/Plaintiff
And
Smt. Vijaya and Ors ...Respondents/Defendants

To ,
Yadagirigutta Temple Development Authority (YTDA) 3 & 5th, floor 640, Opp. P.T.I. Building, A.C. Guards, Hyderabad-500 004
Rep by its Chief Planning Officer.
Respondent No.5/Defendant No.5

Please take notice that the Hon'ble Court vide orders dated 23-01-2025 was pleased to direct me to take out notice to you in LA.No. 4 of 2021 in O.S.No.82 of 2021 on the file of Addl. Senior Civil Judge Court, Yadadri Bhuvanagiri District at Bhongir through paper publication while posting the matter to 21-02-2025 for your appearance.
You are required to be present before court on **21-02-2025** at 10.30 A.M. when the matter is called, failing which the matter will be decided as per law in your absence.

**M.S. CHANDRESH**
**ADVOCATE**
Room No.310, 3rd floor Raghava Ratna Towers, Hyderabad-500 001
Mob.No. 98488 13388

**IN THE COURT OF THE HON'BLE ADDL. SENIOR CIVIL JUDGE, YADARDRI BHUVANGAGIRI DIST AT BHONGIR**
**O.S.No.82 of 2021**

Between
Smt. Pahathi Sulochana and anr ...Plaintiff
And
Smt. Vijaya and Om ...Defendants

To,
Yadagirigutta Temple Development Authority (YTDA) 3 & 5, floor 640, Opp. P.T.1. Building. A.C. Guards, Hyderabad-500 004
Rep by its Chief Planning Officer. ...Defendant No.5

Please take notice that the Hon'ble Court vide orders dated 23-01-2025 was pleased to direct me to take out notice to you in 0.8.No.82 of 2021 on the file of Addl. Senior Civil Judge Court, Yadadri Bhuvanagiri District at Bhongir through paper publication while posting the matter to 21-02-2025 for your appearance
You are required to be present before court on **21-02-2025** at 10.30 A.M. when the matter is called, failing which the matter will be decided as per law in your absence.

**M.S. CHANDRESH**
**ADVOCATE**
Room No.310, 3rd floor Raghava Ratna Towers, Hyderabad-500 001
Mob. No.98488 13388

**IN THE COURT OF THE VII JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT :: HYDERABAD**
**O S No . 618 of 2024**

Between: -
Kota Jaya Prakash & Another .... Petitioner/Plaintiff .
AND
Smt G Rama Devi ....Respondent/Defendants

To,
Smt G Rama Devi W/o Sri G Uttam Kumar,Aged About : 58 Years, Occu : Housewife,R/o H.No. 9-1-364/A/4, Bapu Nagar, Langer House, Hyderabad 500008 .

Please take notice that the above named plaintiffs filed suit vide O S No 618 of 2024 on the file of Honble VII Junior Civil Judge, City Civil Court, Hyderabad, and same is posted on 12-02-2025 at 10.30 A.M for appearance and counter , Therefore it is requested that if any person or person having any objection in the above suit are hereby requested to make appearance either in person or through advocate duly instructed on **12-02-2025** at 10.30 A.M. before the above said hon'ble court, failing which the matter will be heard in their absence .

**By order of the court**
**Sri. L.K. SHARMA**
**ADVOCATE**

**IN THE COURT OF THE VII JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT:: HYDERABAD**
**OS No. 618 of 2024**

Between: -
Kota Jaya Prakash & Another ....Petitioner/Plaintiff.
AND
Smt G Rama Devi ..Respondent/Defendants

To.
Smt G Rama Devi W/o Sri G Uttam Kumar, Aged About: 58 Years, Occu: Housewife, Rio H.No. 9-1-364/A/4, Bapu Nagar, Langer House, Hyderabad 500008.

Please take notice that the above named plaintiffs filed suit vide OS No 618 of 2024 on the file of Honble VII Junior Civil Judge, City Civil Court, Hyderabad, and same is posted on 12-02-2025 at 10.30 AM for appearance and counter, Therefore it is requested that if any person or person having any objection in the above suit are hereby requested to make appearance either in person or through advocate duly instructed on **12-02-2025** at 10.30 A.M. before the above said hon'ble court, failing which the matter will be heard in their absence.

**L.K. SHARMA & ASSOCIATES**
**ADVOCATES**
OFFICE: #18-4-463, Opp Sai Baba Temple, Near State Bank of India, Shamsheergunj, Aliyabad, Hyderabad - 500 053,
Cell: 6281951735,9391320030

**IN THE COURT OF THE HON'BLE CHAIRMAN MACT-CUM- II ADDL.DISTRICT JUDGE, RANGAREDDY DISTRICT AT: L.B. NAGAR.**
**I.A. No.136 OF 2024 IN O.P. No.115 OF 2018**

BETWEEN:
K.Srinivas@Srinivas Reddy ...Petitioner/Petitioner
AND
C.Praveen Reddy and others ...Respondents/Respondents

To,
R-1: Chintala Praveen Reddy S/o. Laxma Reddy, aged Major, Occ: Business & Owner que nar of Car bearing No.TS 10 EH 0123, R/o. H.No. 16-120/10, Sai Nagar Colony, Temple Alwal, Secunderabad-500010.

The Petitioner herein had filed the above petition for compensation under section 166 of the M.V.Act, 1989 and Rule 475/1B of A.P.M.V.Rules, 1989 against the Respondents which includes you. The Hon'ble Court was pleased to order for publication of this Notice for your appearance in the I.A.No.137 of 2024 in O.P.No.115 of 2018, and the matter is posted to **28-02-2025** at 10.30 A.M. and therefore you may appear before this Hon'ble Court either personally or through your authorized Counsel or otherwise the matter will be adjudicated in due process of Law.
Hence, this Notice.

**(BY ORDER OF THE COURT)**
Sd/-
**K.NARSING RAOJI**
**ADVOCATE**
Off: H.No.5-179/1/16/A/1, Plot No.84.Vigneshwara Nilayam, Street No.1Shivaji Nagar Colony, Meerpet, Balapur Mandal, Ranga Reddy District, -97.
Mobile:6848217676

**IN THE COURT OF THE HON'BLE XIII ADDL.DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT, AT: L.B.NAGAR**
**E.P.No. 1506 OF 2022 IN ARB.Proc.No. 1 OF 2013**

Between:
M/s.Kotak Mahindra Investments Ltd., ...Petitioner/Decree Holder
AND
Gorintla Hunuma Sastry ...Respondent/Judgment Debtor.2

To.
Gorintla Hunuma Sastry
11-20/D.P.No.106, Shailaja Premier Apartment, Saibaba Temple Road, T.NT Colony, Dilsukh Nagar, Hyderabad-500060. ...Judgment Debtor

Please take notice that, the Decree Holder above named has filed E.P.No. 1506 of 2022 in Arb.Proc.No 1 of 2013 for attachment of movable properties of the Judgment Debtor before above mentioned Court, and same is coming for your appearance on 19.02.2025 before above said Court. Therefore, you are hereby directed to appear before the Hon'ble XIII Addl. District Judge Rangareddy District at, L.B.Nagar either in person or through Advocate on **19.02.2025** at 10.30 a.m. failing which the matter will be decided in your absence on merits.

**// BY ORDER OF THE COURT **
**Ramu & Associates**
**Advocates**
Flat No.203, Domalguda, Hyderabad

**IN THE COURT PF THE HON'BLE PRL SENIOR CIVIL JUDGE R.R.DISTRICT AT: L.B.Nagar/Hyd**
**O.S.NO. 1266 OF 2019**

Between:
Smt K.Archana ....Plaintiff
AND
K.Vijayalaxmi and Another ....Defendant

To
Anil Babu S/o Jangaiah AGED ABOUT :53 YEARS , OCC: service, R/o Plot.No.4, Shakthinagar Colony ,Hastinapuram, Hyderabad

**NOTICE**

Please take notice that the above petition is posted to for your appearance and filing counter before the Hon'ble Prl Senior civil Judge :R.R.District at L.B.Nagar, Hyderabad at 10-30 A.M. dt. **19-02-2025** either in person or through an advocate , in case if you fail to appear before the above Hon'ble Court on the said date and time ,the matter will be heard exparty .

**//BY ORDER OF THE COURT//**
**By**
**D.Jagadeesh Goud**
**B.Prashanth**
**Advocates**
Badangpet (v),Balapur Mandal) R.R.District,Hyderabad -058.
7416500026

**IN THE COURT OF THE HON'BLE II ADDL. JUNIOR CIVIL JUDGE, XIII ADDL METROPOLITAN MAGISTRATE RR DISTRICT AT: RAJENDRA NAGAR**
**OS. No. 662 of 2024**

Between:
Smt. Golla Shoba & Others ...Plaintiffs
And
The Tahsildar Rajendra Nagar & All Concerned ....Defendants

To,
All concerned

Please take notice that the Plaintiffs named above have filed the above suit to declare them as legal heirs of Late. Golla Narayana and the said matter is posted for appearance on 18-02-2025 at 10.30 AM. If any person/individual has got any sorts of objection or claim, they may appear before the Hon'ble court either in person or through pleader and submit their objections or claims, before the Hon'ble court, if any, on the above mentioned date and time. Otherwise, the matter will be heard and decided in your absence.

**"By order of the court"**
DATED: 09-02-2025
**M/s Tekula Maheshwar Rao G. Saritha Rani Advocates**
Flat No 102, Alekhya Residency #10-4-35/3, Humayun Nagar, Hyderabad
COUNSEL FOR PLAINTIFFS

**BEFORE THE HON'BLE ARBITRAL TRIBUNAL SHRI JUSTICE DR. SHAMEEM AKTHER (RETD) SOLE ARBITRATOR AT : HYDERABAD**
**ARBITRATION CASE NO.7 OF 2024 IN ARBITRATION APPLICATION No.68 OF 2020**

BETWEEN:
Sri. CHITANURI VIJAY KUMAR ...Claimant
AND
M/s. SAMA CONSTRUCTIONS & 18 Others ...Respondents

To,
Sri. D. PAPA RAO, S/o. Late D. Anand Rao, Aged About 58 Yrs., Occ: Business, H. No. 16-2-751/?/44/A, New Saidabad Colony, Hyderabad-59, Telangana. [The Respondent No.15 in the above Arbitration Case]

**NOTICE**

That Sri Chitanuri Vijay Kumar initiated the above Arbitration Proceedings seeking RENDITION OF ACCOUNTS of M/s. SAMA CONSTRUCTIONS from 25/05/2004 to 18/07/2015 and also to pass an Award in favour of the Partners of the M/s. SAMA CONSTRUCTIONS FIRM in lieu with their respective legitimate share in accordance with the Partnership Agreement Deed Dt. 25/05/2004.
The Hon'ble Arbitral Tribunal was pleased to order Paper Publication on 01/02/2025 vide I.A.No.3 of 2025 filed by the Claimant to bring to the notice of Sri. D. PAPA RAO, S/o. Late D. Anand Rao, Aged About 58 Yrs., Occ: Business, H. No. 16-2-751/A/44/A, New Saidabad Colony, Hyderabad 59, Telangana. [The Respondent No.15 in the above Arbitration Case.
The matter is coming up for your appearance on **01/03/2025** at 11:00 AM at MAYFAIR Apartment, H. No. 8-2-269/3/MF/F-6, Flat No. 6F, Block-B, Road No.2, Banjara Hills, Sri Nagar Colony, Hyderabad, Telangana-500034. Therefore, through this Paper Publication it is informed that, you may appear before the Hon'ble Arbitral Tribunal either personally or through your counsel on the date and place mentioned above or else, the matter will be adjudicated in accordance with the Law.

**D.KIREET,**
**Advocate**
H.No.2-19-79/A1, Balaji Enclave Colony, Beside Kalyanpuri Colony, Uppal, Hyd-39
Cell:6309963240

**IN THE COURT OF HON'BLE PRL JUNIOR CIVIL JUDGE-cum-VII ADDL.METROPOLITAN MAGISTRATE: MEDCHAL-MALKAJGIRI DISTRICT: AT MEDCHAL**
**O.S No. 361 of 2022**

Between:
Sri. Desireddy Brahma Reddy. ...Plaintiff.
AND
Sri. K. Ram Kista Reddy. ..Defendant.

**NOTICE**

To
Sri. K. Ram Kista Reddy, S/o Sri. K. Bal Reddy, R/o H.No.1-26, Nizampet village, Bachupaly Mandal, Medchal-Malkajgiri district, Rep by his General Power of Attorney holder Sri. P.Premdass, S/o Ramdas, aged about: 75 years, Occ: Retd. R/o House No. 56/1, LIG, Phase-III,KPHB Colony, Kukatpally, Hyderabad, T.S -72.

Take notice that above named plaintiff has filed the above suit against you for specific performance of agreement of sale dated 26-02-2008 in respect of suit schedule property and other reliefs. The above suit is posted on **24-02-2025** at 10.30 A.M. for your appearance before the Hon'ble Court. Therefore you are hereby by directed to appear before the Hon'ble Court either in person or through your pleader on the said date and time, failing which matter will be heard and decided in your absence.

**(PUBLISHED AS PER THE ORDERS OF THE HON'BLE COURT)**
**Shaik Mohin Pasha,**
**V. Rama Rao,**
**A.Divya Dathri,**
**K. Upender,**
**Advocates.**
cell No 99482 21120,
# 8-4-393/15/4,1 st Floor, Hotel RS,Erragadda, Hyderabad-114.

**IN THE COURT OF THE HON'BLE CHAIRMAN MACT-CUM-II ADDL.DISTRICT JUDGE, RANGAREDDY DISTRICT AT: L.B. NAGAR.**
**I.A. No.137 OF 2024 IN O.P. No.115 OF 2018**

BETWEEN:
K.Srinivas@Srinivas Reddy ...Petitioner/Petitioner
AND
C.Praveen Reddy and others ...Respondents/Respondents

To,
R-1: Chintala Praveen Reddy S/o. Laxma Reddy, aged Major, Occ: Business & Owner campdrisser of Car bearing No.TS 10 EH 0123, R/o. H.No. 16-120/10, Sai Nagar Colony, Temple Alwal, Secunderabad-500010.

The Petitioner herein had filed the above petition for compensation under section 166 of the M.V.Act, 1989 and Rule 475/1B of A.P.M.V.Rules, 1989 against the Respondents which includes you. The Hon'ble Court was pleased to order for publication of this Notice for your appearance in the I.A.No.137 of 2024 in O.P.No.115 of 2018, and the matter is posted to **28-02-2025** at 10.30 A.M. and therefore you may appear before this Hon'ble Court either personally or through your authorized Counsel or otherwise the matter will be adjudicated in due process of Law.
Hence, this Notice.

**(BY ORDER OF THE COURT)**
Sd/-
**K.NARSING RAOJI**
**ADVOCATE**
Off: H.No.5-179/1/16/A/1, Plot No.84.Vigneshwara Nilayam, Street No.1Shivaji Nagar Colony, Meerpet, Balapur Mandal, Ranga Reddy District, -97.
Mobile:6848217676

**IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT AT: HAYATHNAGAR,**
**O.S. NO.14 OF 2022**

BETWEEN
SRI GURRAM CHANDRASEKHAR REDDY & 5 OTHERS ... PLAINTIFFS
AND
SRI KONTHAM MAHESHWAR REDDY & 9 OTHERS ... DEFENDANTS

TO,
1. SMT PATNAM SINDHURI @KONDUR SINDHURI. W/O K. VENKATESWARLU. AGED ABOUT 33 YEARS, OCC: HOUSEWIFE, R/OH.NO.7-206, PRAKASH RAOD, ANANTHPUR TOWN & DISTRICT PRESENTLY R/O H.NO.1-4-2/2, S.R.L. COLONY, ROAD NO.2, SAROORNAGAR, RANGA REDDY DISTRICT
2. DR. T. SURESH KUMAR, S/O T. RAMACHANDRAIAH, AGED ABOUT 61 YEARS, OCC: EMPLOYEE. R/O H.NO.7-1CHAITANYAPURI, HYDERABAD-500 060
3. SMT K. VIJAYA LAXMI, D/O K. YELLA REDDY. AGED ABOUT 27 YEARS, OCC: STUDENT, R/O H.NO. 469, R.O. SURARAM MANDAL, KADILAPUR. RANGA REDDY DIST
4. SMT ARROJU SANDHYA, W/O A. SADANANDA CHARY, AGED ABOUT 56 YEARS, OCC: HOUSEWIFE, R/O H.NO.6-2-48,KAKAJI COLONY. HANAMKONDA-506 011.
5. SMT MUNEERA RAJANI, D/O ALIMOHAMMAD RAJANI,AGED ABOUT 57 YEARS, OCC: HOUSEWIFE, R/O H.NO.8-7-4/2, OPP: CKM HOSPITAL GOVINDARAJULA GUTTA AREA, GIRMAJIPET, WARANGAL-506 002.
6. SMT DARMA SAGARA SABITHA, W/O D. KALIDAS, AGED ABOUT 60 YEARS, OCC:HOUSEWIFE,. R/O H.NO.6-2-48, KAKAJI COLONY, HANAMKONDA-506 011.
7. SMT SUNCHIKALA PADMA, W/O S. RAGHUPATHI RAO, AGED ABOUT 49 YEARS, OCC: HOUSEWIFE, R/O H.NO.2-12-230, VIDYARANYAPURI, HANAMKONDA, WARANGAL 506 009.
SIRS.

WHEREAS THE ABOVE NAMED PLAINTIFFS FILED THE ABOVE SUIT SEEKING PERPETUAL INJUNCTION IN RESPECT OF SUIT SCHEDULE PROPERTY. THE HON'BLE COURT POSTED THE MATTER ON 17.02.2025 AT 10.30 A.M. FOR YOUR APPEARANCE. THEREFORE YOU ARE HEREBY REQUESTED TO APPEAR BEFORE THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT AT HAYATHNAGAR ON **17.02.2025** AT 10.30 A.M. EITHER IN PERSON OR THROUGH A COUNSEL DULY INSTRUCTED. OTHERWISE THE MATTER WILL BE DECIDED EX PARTE IN YOUR ABSENCE.

**(BY ORDER OF THE COURT)**
**V.RANGA REDDY**
**ADVOCATE**
H.NO.11-8-148, PLOT NO. 33 & 34 ROAD.NO. 3, VIKASNAGAR RANGAREDDY DIST PH.9848070418
(COUNSEL FOR THE PLAINTIFFS)

**Notice**
**IN THE COURT OF THE PRL.DIST.JUDGE:: GUNTUR**
**T.O.P.No.281/2023. And. I.A.No.768/2023**

Between:
Maddula Sarada ...Petitioner
And
Bogolu Narasa Reddy and Others ......Respondents

To,
R-1:Bogolu Narasa Reddy@China Narasa Reddy,S/o.Narasa Reddy, R/o. Door No.379/B,Plot No.29,New Manikya Nagar,Near Bank Colony,Kuthbullapur, Hyderabad, Telangana State.
R-2:Bogolu Lakshmi,W/o.Bogolu Narasa Reddy@China Narasa Reddy, R/o.Door No.379/B,Plot No.29,New Manikya Nagar,Near Bank Colony, Kuthbullapur,Hyd,Telangana State

పైనెంబరు ట్రాన్స్ పర్ ఓ.పి.లో ఆర్-1&2 రెస్పాండెంట్స్ కు, ఐ.ఎ.నెం.768/2023 Stay పిటీషనులో ఆర్-1& 2 రెస్పాండెంట్స్ కు నోటీసు నిమిత్తం వ్యిదా ది.05-03-2025తేదికీవేసియున్నారు.సదరు వ్యిదా రోజు ఉ.గం.10-30ని.లకుప ట్కోర్ను ౹ి యుటదుట్ మీరు హాజరెట్కు మీకు గల ఆక్షేపణలను త ఀియపరచుకొనవలెను.లేని ఁయుటదల మీ పరోక్షమున కేసు తీర్నిటంచబదునని ఇటంది మూలెంగ్ త ఀియపం చదము ట్కనది.

జి.సీతారామిరెడ్డి,
పిటీషనర్ తరపు అడ్వకేట్,
గుంటూరు.

**IN THE COURT OF THE HON'BLE IX ADDITIONAL DISTRICT & SESSIONS JUDGE, R. R.DIST., AT: L.B NAGAR**
**E.P. NO. 120 OF 2024 IN O.S. NO. 1319 OF 2022**

BETWEEN:
Sri. Pavan Kumar Jain. ... Petitioner/Decree Holder/Plaintiff
AND
Sri. Maskat Yogesh Shetty. ...Respondent/Judgment/Debtor/Defendant

To.
SRI. MASKAT YOGESH SHETTY, S/o. MANJUNATH SHETTY,age about 46 years, Occ: Business,R/o. H. No. 10-1-704, West Marredpally, Secunderabad, Hyderabad-500026, Telangana State, India.

Sir,
Please take notice that the Petitioner/Decree Holder/Plaintiff has filed the above EP in Suit for Specific Performance, against you. That you have been arrayed as party to the above EP case as sole Respondent/ Judgment/Debtor/Defendant respectively. The notice in the ordinary course could be served on you. Now the case is posted to **25-02-2025.**, at 10-30am before the above said Court failing which the matter will be decided in your absence.

**(By Order of the Court)**
**M/s. S. SRISHAILAM,**
**M. MEGHANATH REDDY**
**ADVOCATES.**
#7-8/1, Bhrundhavan, Sheriguda, Shankarpally, R.R. District, T.S.- 501203,
email: srishailam@lawyer.com,
Ph. No. 9908767008/ 9052744117

**IN THE COURT OF THE HON'BLE HIGH COURT OF HYDERABAD FOR STATE OF TELANGANA**
**MACMA.No. 1016 OF 2017**

BETWEEN:
KONDA PANDU RANGA RAMA RAJU ... Petitioner
AND
B.SAIDULU AND ANR ...Respondents

To
1. B.Saidulu, S/o. Lingaiah, age. Major, Occ.R/o. H.No. 8-2-94/A/1, Shaitnagar, L.B. Nagar, Sarromagar Mandal, Ranga Reddy District.
2. Shriram General Insurance Companay Limited, Rep by it's Manager, Kunda Estate, III Floor, 4-1-370/1, Besaide Hotel Jaya International, Reddy Hostel Road, Abids, Hyderabad.

It is hereby informed/called that my client Sri. Konda Pandu Ranga Raju, S/o. Late Raghava Raju, Filed MACMA.No. 1016 OF 2017 against you for MACMA aggrieved by the award passed in MVOP No 364/2012 dated 21-12-2016 on the file of Motor Accidents Claims Tribunal cum XIV Addl. District Judge Ranga Reddy District. The said MACMA posted for your appearance on 7-3-2025 the above said MACMA.
The above said MACMA the Hon'ble Court ordered for publication on 5-2-2025 and it was posted for your appearance on **7-03-2025** you have to appear through counsel or personal on or before 7-03-2025 on that day at 10-30 AM before the above mentioned Hon'ble Court otherwise the matter will be settled an ex-party as available record.

**//order by the Hon'ble Court //**
**(G.L.NARASIMHA RAO)**
**Advocate**

## రంగరాజన్ పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

● అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులి గారి గోవర్ధన్ రెడ్డి



**నవతెలంగాణ-ముషీరాబాద్**

చిలుకూరు బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై రామరాజ్య స్థాపకుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులి గారి గోవర్ధన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామ రాజ్య స్థాపన సంస్థ పేరుతో 20 మంది ప్రధాన అర్చకుల పై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. భగవంతుని సేవలో నిమగ్నమైన రంగరాజన్ కుటుంబ సభ్యుల కే ఇలాంటి పరిస్థితి ఎదురైతే, ఇక రాష్ట్రంలో సామాన్యుల పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకో వచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే దాడికి పాల్పడిన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్ర రావు, సముద్రాల శ్రీనివాస్, వేణుగోపాల్, కిషన్ ,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రేడియంట్ హై స్కూల్ 61వ వార్షికోత్సవ వేడుకలు



**నవతెలంగాణ-ముషీరాబాద్**

ముషీరాబాద్ డివిజన్ రేడియంట్ హైస్కూల్ 61వ వార్షికోత్సవ వేడుకలు, సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులు రకరకాల అంశాలపై తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శిం చారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముషీరాబాద్ మండలం డిప్యూటీ ఈవో శ్రవణ్‌కుమార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు సైన్స్ ఫెయిర్‌ను సందర్శించారు.ఈ కార్యక్రమంలో రేడియంట్ హై స్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ అహ్మదుల్లా భక్తియారి, ఉపాధ్యాయులు ఇర్ఫాన అమ్ముల్, మతీన, అశ్రఫాతిమా, మంజుశ్రీ, హనీఫ, ఖలీల్, అన్వర్తో పాటు బీఆర్ఎస్ నాయ కులు కొండా శ్రీధర్‌రెడ్డి, మహ్మద్ ఖదీర్, ఎండి.జావెద్ ఖాన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## వేతనాలు చెల్లించకపోతే 19న కమిషనరేట్‌ను ముట్టడిస్తాం

**కమిషనర్‌కు నోటీసు అందజేసిన ఏఐటీయూసీ**



**నవతెలంగాణ-సుల్తాన్‌బజార్**

తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు రావాల్సిన 7 నెలల వేతనాలు వెంటనే చెల్లించకపోతే ఈనెల 19న కమిషనర్ కార్యాలయం ముట్టడించి ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండి యూసుఫ్, ఎం నరసింహ తెలియజేశారు. సోమవారం కోఠిలోని వైద్య విధాన పరిషత్ కార్యాలయంలో కార్మికులతో కలిసి టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి 21న కమిషనర్‌కు ఒక మారు లెటర్ ఇచ్చి కార్మికుల వేతనాలు చెల్లించకపోతే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రతిరోజు రాష్ట్రంలో అన్ని తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో కార్మికులు ఒక గంట నిరసన ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రభుత్వం పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని కార్మికుల వేతనాలు చెల్లించడంలో అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం, కాంట్రాక్టర్లు ఎవరికి వారే అన్న తీరుగా వ్యవహరిస్తూ కార్మికుల కష్టాన్ని చూడటం లేదని వారు దుయ్యబట్టారు. ప్రభుత్వం వెంటనే బిల్లులు రిలీజ్ చేసి కార్మికులకు వేతనాలు చెల్లించకపోతే తప్పనిసరి పరిస్థితుల్లో 19న కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించి భారీ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వారు ఈ సందర్భంగా తెలియజేశారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ లో ప్రతి ఆరు నెలలకు ఒకసారి కార్మికులు వేతనాలకు పోరాటం చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ప్రభుత్వం వెంటనే సవరించి కార్మికులకు ప్రతినెల జీతం, పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా అందించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమం లో నాయకులు వెంకటరాజ్యం తులసి తదితరులు పాల్గొన్నారు.

## 'స్పోర్ట్స్ డేటా గేమ్‌థాన్'ను ప్రారంభించిన ఎఫ్ఐఎఫ్ఎస్

● భారతదేశ ప్రీమియర్ ఇన్‌స్టిట్యూట్‌ల కోసం 'స్పోర్ట్స్ ఏఐ ఛాలెంజ్'




**నవతెలంగాణ-హిమాయత్‌నగర్**

స్పోర్ట్స్ టెక్‌లో భారతదేశాన్ని గ్లోబల్ హబ్‌గా మార్చా లనే లక్ష్యంతో ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫాంటసీ స్పోర్ట్స్ (ఎఫ్ఐఎఫ్ఎస్) ఆధ్వర్యంలో డ్రీమ్11 సమర్పణలో స్పోర్ట్స్ ఏఐ ఛాలెంజ్ 'స్పోర్ట్స్ డేటా గేమ్‌థాన్'ను ప్రారంభించినట్లు ఎఫ్ఐఎఫ్ఎస్ డైరెక్టర్ జనరల్ జాయ్ భట్టాచార్య సోమ వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఆధునాతన సాంకే తిక పోటీ డేటాను సమగ్ర పరచడంతో పాటు ఆర్టిఫిషి యల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్) వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను క్రీడలకు ఉపయోగించుకోవడానికి నూతన మార్గాలను అన్వేషించే దిశగా అడుగులేస్తుందన్నారు. ఈ గేమ్‌థాన్‌లో ప్రీమియర్ ఇన్‌స్టి ట్యూట్‌ల నుండి విద్యార్థి జట్లు పా ల్గొంటాయన్నారు. 'స్పోర్ట్స్ డేటా గేమ్‌థాన్' అనేది ఆవిష్కరణకు ప్రోత్సాహక వేదికగా మారడంతో పాటు భారత దేశాన్ని స్పోర్ట్స్ టెక్నాలజీలో ప్రపంచ నేతగా ఎదగడమే లక్ష్యంగా ముందుకు తీసుకెళ్లానుందని పేర్కొన్నారు. ఈ తరంలో వేగంగా అభివృ ద్ధి చెందుతున్న స్పోర్ట్స్ అనలిటిక్స్ రంగంలో యువ ప్రతిభను పెంపొందించడంతో గేమ్‌థాన్ అభిమానుల భాగస్వామ్యాన్ని పునర్నిర్వచించడానికి అత్యాధునిక సాంకేతికత, డిజిటల్ కంటెంట్ అనుసంధానం చేసే విశిష్టమైన వ్యవస్థను పెంపొందిస్తుందన్నారు.ఇతర పూర్తి వివరాలకు వెబ్‌సైట్ https://fifsgameathon.inలో సందర్శిం చాలని ఆయన కోరారు.

## ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి

**సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ తెలంగాణ వ్యవస్థాపకులు జాతీయ కార్యదర్శి బి.పురుషోత్తం**



**నవతెలంగాణ-ముషీరాబాద్**

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ తెలంగాణ వ్యవస్థాపకులు జాతీయ కార్యదర్శి బి.పురుషోత్తం అన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదాయ పనులు రాయితీ పేరుతో మధ్యతరగతి ప్రజలను మోసగించిందన్నారు. సోమవారం చిక్కడపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో ఏఐడబ్ల్యూటీయు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఝూన్సీ అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆదాయ పన్ను రాయితీల పేరుతో మధ్యతరగతి ప్రజలను మోసగించిందన్నారు. ఈ అంశాన్ని బీహార్ మహారాష్ట్ర ఎన్నికల్లో కూడా ఉపయోగించుకుందని తెలిపారు. అన్ని రంగాలలోకి ప్రయివేట్ యాజమాన్యాన్ని ఆహ్వానిసున్నారని ప్రభుత్వం రంగాన్ని అమ్ముకొని వచ్చిన సొమ్మును ఆదాయంగా చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ బల మున్న అన్ని స్థానాలలో పోటీ చేస్తామని ఈ సమావేశంలో వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రాల శేఖర్ కుమార్ మాట్లాడుతూ పేద మధ్య తరగతి ప్రజల అవసరా లను దృష్టిలో ఉంచుకొని నిత్యవసర ధరల నియంత్రణ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐ డబ్ల్యూటీయు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఝూన్సీ, మహిళా సంఘం నాయకురాలు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బి.సుజాత, నాగేంద్రమ్మ, సంధ్యారాణి, జ్యోతి, భాను ప్రసాద్, పి.సురేష్, గంధం లక్ష్మీనారాయణ, జి.కృష్ణ, ఎం. అరుణ, రాజు, నవీన్ అఖిల తదితరులు పాల్గొన్నారు.

## భారతీయులపై అమెరికా దుర్మార్గపు పోకడలను ఖండించాలి

● ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో వినూత్న రీతిలో చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన,

● అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫ్లెక్సీ దహనం



**నవతెలంగాణ-హిమాయత్ నగర్**

అమెరికా నుండి 104 మంది భారతీయ పౌరులను అమెరికా నుండి బహిష్కరించిన అమానవీయ, ఆమోద యోగ్యం కానీ విధానాన్ని తీవ్రంగా ఖండిస్తూ, అమెరికా సైనిక విమానంలో సంకెళ్ల వేసుకుని, పరిమిత కదలికతో వ్యక్తులను సుదీర్ఘ ప్రయాణం చేయమని బలవంతం చేయడం మానవ గౌరవం, ప్రాథమిక మానవ హక్కులను ఉల్లంఘించడమేనని, ఇలాంటి ప్రవర్తన శోచనీయమని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తీవ్రంగా ఖండించింది. సోమవారం ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్ ఆధ్వర్యంలో హిమాయత్ నగర్ లోని ఎన్.సత్యనారాయణరెడ్డి భవన్ నుండి 'వై' జంక్షన్ కూడలి వరకు వినూత్న రీతిలో చేతులకు సంకెళ్ల వేసుకుని, నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫ్లెక్సీని దహనం చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలీ ఉల్లా ఖాద్రీ, కార్యదర్శి కల్లూరు ధర్మేంద్రలు మాట్లాడుతూ భారత పౌరులపై అమెరికా దుర్మార్గంగా వ్యవహరించడాన్ని అభ్యంతరం చెప్పడంలో విఫలమవడం ద్వారా మరోసారి తన క్రూరమైన వైఖరిని బహిర్గతం చేసిన మోడీ ప్రభుత్వం మౌనం వహించడం సిగ్గుచేటన్నారు. మోడీ అమెరికా సందర్శించినప్పుడల్లా కోట్లాది రూపాయలు ప్రచారం కోసం ఖర్చు చేస్తారని, 'హౌడీ మోడీ', 'నమస్తే ట్రంప్' వంటి కార్యక్రమాల స్పాన్సర్లు 104 మంది భారతీయులు స్వదేశానికి పంపేందుకు గౌరవప్రదమైన ప్రయాణాన్ని ఏర్పాటు చేయలేకపోయారని, గొలుసులతో బంధించి, చేతులకు బేడీలు వేసి అత్యంత క్రూరంగా వ్యవహరించి ఆగ్రహం వ్యక్తం చేశారన్నారు. దౌత్యపరంగా ఇది మోడీ సర్కారు ఘోర వైఫల్యంగా భావించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీమాన్, హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, ఉపాధ్యక్షులు మాజీద్ అలీఖాన్, కళ్యాణ్, అనీల్ కుమార్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మధు, సంజయ్ కుమార్, సుమన్, గణేష్, భానుప్రకాష్, స్వామి, వేణు, రమేష్, చెట్టుకింది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఎస్సీ వర్గీకరణ అమలును అడ్డుకోవాలి'

**ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్స్ ఫోరం జాతీయ చైర్మెన్ వడ్లమూరి కృష్ణ స్వరూప్**



**నవతెలంగాణ-హిమాయత్‌నగర్**

రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలును అడ్డుకోవాలని, లేక పోతే మాలలకు భవిష్యత్ ఉండదని, తీవ్ర అన్యాయానికి గురవుతారని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్స్ ఫోరం జాతీయ చైర్మెన్, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ హెచ్చరించారు. సోమవారం సూర్యలోక్ కాంప్లెక్స్‌లో మాల న్యాయవాదుల సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వారసులైన మాల జాతిని, విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్ ఫలాలను దక్కనీయకుండా రాజ్యాంగ హక్కులను కాలరాస్తు రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ పేరుతో మాలలకు ద్రోహం చేస్తుందని ఆరోపించారు. మాలల మద్దతుతో గద్దెనెక్కిన సీఎం ఎ.రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణకు అనుమతినివ్వడం మాలలకు ద్రోహం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాలల జనాభాను తక్కువగా చూపి, మాదిగల శాతాన్ని అధికంగా చూపుతూ వారికి 9 శాతం రిజర్వేషన్లు కేటాయించడం రాజ్యాంగ, సామాజిక సూత్రాలకు విరుద్ధమన్నారు.ఎస్సీ జాబితాలోని 59 కులాల్లో 57 కులాలకు రిజర్వేషన్ల కేటాయింపు జరగకపోవడం ప్రభుత్వ మోసపూరిత విధానానికి నిదర్శనమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న వర్గీకరణ నిర్ణయం మొత్తం దళిత జాతికి తీవ్ర స్థాయిలో నష్టం జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే 14న తలపెట్టిన 'తెలంగాణ రాష్ట్ర బంద్'ను ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా మాలలు పెద్ద ఎత్తున నిరసన, దిష్టి బొమ్మల దహనాలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు మద్దెల రాయప్ప, మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవేందర్ రావు, న్యాయవాదులు గోలి నరేష్, సంకు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రా ప్రజావాణికి 64 ఫిర్యాదులు

● వారంలోనే క్షేత్ర స్థాయి తనిఖీలు




**నవతెలంగాణ-సిటీబ్యూరో**

పార్కులను కాపాడండి.. రహదారులకు అడ్డంగా నిర్మించిన ప్రహరీలను తొలగించండి.. చెరువుల ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించండి.. మా ప్లాట్లతో పాటు.. ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కొంతమంది కబ్జా చేస్తున్నారు.. ఇలా హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్యలపై హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదులు వస్తున్నాయి. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 64 ఫిర్యాదులందాయి. ఇలా వచ్చిన ఫిర్యాదులపై అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి.. గూగుల్, సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌లను సరిపోల్చి.. సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాలు జారీ చేశారు. వారం రోజుల్లోనే క్షేత్రస్థాయిలో పర్యటించి.. ఇరు పక్షాలను సమావేశ పరిచి.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఎప్పుడు వస్తున్నది వివరించి.. తగిన సమాచారంతో ఉండాలని సూచిస్తున్నారు.

### ఫిర్యాదులు ఇలా..

మల్కాజిగిరి సర్కిల్‌లోని ఆర్‌కే పురం ఆఫీసర్ల కాలనీలో 3 వేల గజాల పార్కు స్థలం కబ్జాకు గురైందని ఆర్మీ ఆఫీసర్ల కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదుచేశారు.

కూకట్‌పల్లి జేఎన్‌టీయూకు ఎదురుగా ఉన్న సుబోధ, స్వగృహ హౌసింగ్ సొసైటీలో ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు కబ్జాకు గురయ్యాయని.. అంబీర్ చెరువు కబ్జాలకు గురౌతోందని.. ఆదిత్యనగర్‌లో ప్రజావసరాలకు ఉద్దేశించిన 2 వేల గజాల స్థలం కబ్జాల పాలౌతోందని ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఫిర్యాదు చేశారు.

పోచారం మున్సిపాలిటీ ఘట్కేసర్‌లోని జయపురి కాలనీలో ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు ఆక్రమణలకు గురౌతున్నాయని.. వాటిని కాపాడాలని అక్కడి ప్లాట్ల యజమానులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. 1968లో దాదాపు 56 ఎకరాలలో వేసిన గ్రామపంచాయతీ లే ఔట్‌లో స్థలాలను ఆక్రమించుకుని విల్లాలు కట్టుకుంటున్నారని ఆధారాలను కమిషనర్‌కు చూపించారు.

పోచారం మున్సిపాలిటీలోని ఏకశిలానగర్ కాలనీలో ఉన్న పార్కుల స్థలాలు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కబ్జా చేస్తున్నారని.. కాలనీకి వెళ్లే 50 ఫీట్ల రహదారిలో 15 అడుగుల మేర అక్కడి ఇంజినీరింగ్ కళాశాల వారు ఆక్రమించి వాహనాల పార్కింగ్ చేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆ కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు తెలిపారు.

రంగారెడ్డి జిల్లా, కుత్బుల్లాపూర్ మున్సిపాలిటీ, బౌరంపేట గ్రామంలో డాలర్ మెడోస్ పేరిట ఉన్న తమ కాలనీకి రహదారి లేకుండా చేశారని నివాసితులు ఫిర్యాదు చేశారు. రహదారికి అడ్డంగా వచ్చిన ప్లాట్‌ను రద్దు చేసి మార్గం వేయగా.. ఆ ప్లాట్ తమదంటూ.. స్థానికులు అభ్యంతరాలు చెబుతున్నారని ఆరోపించారు. దీంతో దారి మూసుకుపోయి.. కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోందని వాపోయారు. లే ఔట్ ఆధారంగా తమకు దారి చూపాలని హైడ్రాను కోరారు.

## 'సైకాలజిస్ట్స్ కౌన్సిల్ వెంటనే ఏర్పాటు చేయాలి'




● తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డా.మోతుకూరి రాంచందర్

**నవతెలంగాణ-హిమాయత్‌నగర్**

సమాజానికి ఉపయుక్తమైన సేవలను అందిస్తున్న సైకాలజిస్టులకు కౌన్సిల్ ఏర్పాటు చేయాలని తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డా.మోతుకూరి రాంచందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం హిమాయత్‌నగర్‌లోని ఎన్. సత్యనారాయణరెడ్డి భవన్‌లో సైకాలజిస్టుల రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైకాల జిస్టుల కౌన్సిల్ ఏర్పాటు అయ్యేంత వరకు తమ పోరాటం కొనసాగి స్తామన్నారు. ఇది పరీక్షల సమయం కాబట్టి విద్యార్థులలో పరీక్షలంటే భయం పోగొట్టల్సిన బాధ్యత సైకాలజిస్టులపై ఉందన్నారు. తమ అసోసియేషన్ పునవ్యవస్థీకరణలో భాగంగా తెలంగాణలోని 24 జిల్లాలకు అధ్యక్షులు, కమిటీలు, నలుగురిని కన్వీనర్లుగా ప్రకటించడం జరిగిందన్నారు. ఈ కమిటీ సమాజంలోని మానసిక రుగ్మతల నివారణకు కృషి చేయాలని సూచించారు. ప్రతి సైకాలజిస్ట్ నాయకత్వ లక్షణాలతో ఒక శక్తిగా ఎదగాలని ఇందుకు సంఘానికి దిన చర్యలో కొంత సమయాన్ని కేటాయించాలని కోరారు. సమాజం లో పెట్రేగిపోతున్న విపరీత ధోరణులపై వెంటనే ప్రతి సైకాలజిస్ట్ స్పందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి డా.శ్రీపూజ, ఉపాధ్యక్షులు ఎ.సుధాకర్, డా.వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శులు సుబ్బారాయుడు, బాలసుబ్రమణ్యం, నాయకులు రాధారాణి, రోజా, విశాల, సోనాలి నాగ్ దేవ్, స్నేహలత, శ్రీధర్, కొండేటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేద్దాం

● మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి .రాం చందర్



**నవతెలంగాణ-సుల్తాన్ బజార్**

కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తున్నామని మహారాజ్ గంజ్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.రాం చందర్ అన్నారు. సోమవారం దవాఖానాలో కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాంచందర్ మాట్లాడుతూ.. కుష్టు వ్యాధి మచ్చలు సహజ చర్మం రంగు కంటే తక్కువగా లేదా రాగి రంగు కలిగి ఉంటాయన్నారు. మచ్చలపై స్పర్శ ఉండదని దేహంలో ఏ ప్రదేశంలో నైనా రావచ్చన్నారు. ఒకటి నుండి ఐదు మచ్చలు ఉన్నవారికి ఆరు నెలల సమయం, ఆరు కన్నా ఎక్కువ మచ్చలు ఉన్నవారికి 12 నెలల సమయంలో చికిత్స ద్వారా పూర్తిగా నయం అవుతుందన్నారు. ఈ వ్యాధి మైక్రో బ్యాక్టీరియం లేప్రే అనే బ్యాక్టీరియా వలన వస్తుందన్నారు. శరీరంలో కుష్టు వ్యాధి ముఖ్యంగా చర్మానికి నరాలకు సోకుతుందన్నారు. కుష్టు వ్యాధి ఎవరికైనా రావచ్చని దీనికి వయస్సు లింగ బేధం లేదన్నారు. కుష్టు వ్యాధి వంశం పరంపర్యం కాదని, శాపం పాపం అంతకన్నా కాదన్నారు. కొంతమందికి అపోహ పడతారని అది నిజం కాదని చెప్పారు. ఈ వ్యాధి వల్ల ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో అకౌంటెంట్ వినోద్, ల్యాబ్ టెక్నీషియన్ రాము, స్టాఫ్ నర్స్ శృతిక, ఏఎన్ఎం సంజీవ, మలేరియా టెక్నీషియన్ గిరిబాబు, ఆశా వర్కర్లు ఝాన్సీ, రేఖ, కల్పన తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల మనిషి కాసాని ఐలయ్య ఆశయాలు కొనసాగించాలి



● సంస్మరణ సభలో వక్తలు

**నవతెలంగాణ-ముషీరాబాద్**

నిరంతరం ప్రజా సమస్యలు, గొర్ల కాపర్ల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం కృషిచేసిన కాసాని ఐలయ్య ఆశయాలు కొనసాగించాలని ఆయన సంస్మరణ సభలో పలువురు వక్తలు తెలిపారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జీఎంపీఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కాసాని ఐలయ్య సంస్మరణ సభ రాష్ట్ర అధ్యక్షులు కిల్లె గోపాల్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో జన్మించి కొత్తగూడెం జిల్లా సుజాత నగర్ కు వలస వెళ్లి ఆ ప్రాంతంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నిరంతరం గొర్ల కాపర్లు ఎదుర్కొంటున్న సమస్యపై ప్రజలను ఐక్యం చేసి నిరంతరం పోరాటాలు నిర్వహించి సమస్యలు పరిష్కరించడంలో కీలకపాత్ర పోషించారని అలాంటి నాయకున్ని కోల్పోవడం ప్రజలకు ముఖ్యంగా గొర్రెల మేకల పెంపకం దారులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. వ్యవసాయ లేని ప్రజలను సమీకరించి భూ పంపిణీ కోసం ఉద్యమాలు నిర్వహించారని గుర్తు చేశారు. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యంగా ఖమ్మం జిల్లాలో గొర్ల కాపరులను ఐక్యం చేసి సొసైటీలకు జేఎల్‌జీ గ్రూపుల ద్వారా రుణాలు ఇప్పించి, గొర్ల మేత కోసం భూములు ఇప్పించడంలో కీలకపాత్ర పోషించారన్నారు. సుజాతనగర్ సర్పంచ్‌గా 25 సంవత్సరాలుగా సేవలందించి ఆదర్శ గ్రామంగా నిలిపారని ఐలయ్య ఆశయా లను అమలు చేసినప్పుడే ఆయనకు ఘనమైన నివాళి అవు తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు రావుల జంగయ్య, రాష్ట్ర నాయకులు పగడాల యాదయ్య, కె.చంద్రశేఖర్, కె.లింగయ్య, ఏ.శంకరయ్య, బొల్లం అశోక్, ఎం.రాజు, ఆలేటి యాదగిరి, అమీర్‌పేట్ మల్లేష్, ఏ.కొమురయ్య, సిహెచ్.కోటేశ్వర్ రావు, డి.నాగేశ్వర్ రావు, కాసాని రజిత తదితరులు పాల్గొన్నారు.

## కెరీర్ ప్లానింగ్ పై నైపుణ్య శిక్షణ సదస్సు



**నవతెలంగాణ-ముషీరాబాద్**

విద్యానగర్ లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీఎస్‌కేసి - టాస్క్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ డా.కె. ప్రభు అధ్యక్షతన 'కెరీర్ ప్లానింగ్-ఇంటర్వ్యూ టెక్నిక్స్, రెజ్యూమ్ బిల్డింగ్' అనే అంశంపై నైపుణ్య శిక్షణ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డా.కె.ప్రభు మాట్లాడుతూ..సరైన రెజ్యూమ్ ఇంటర్వ్యూ టెక్నిక్స్ తోనే ఈ పోటీ ప్రపంచంలో ఉన్నత ఉద్యోగం సాధించగలరని తెలిపారు. ఈ సదస్సు వక్త, కేంటి లివర్ ల్యాబ్స్ హైదరాబాద్ రీజనల్ బిజినెస్ హెడ్ లీలా సాయిదేవ్ విద్యార్థులకు రెజ్యూమ్ బిల్డింగ్‌లోని ముఖ్య అంశాలను, ఇంటర్వ్యూలో నెగ్గడానికి మెలకువలను శిక్షణ సదస్సులో బోధించారు. ఈ సదస్సులో టాస్క్ కోఆర్డినేటర్ డా.ఆర్.లావణ్య ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. పి. పద్మజ, మేనేజ్మెంట్ విభాగాధిపతి సంతోషి, ప్రవీణ అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## 'నక్సలిజాన్ని అంతం చేయటం అమిత్ షాతో కాదు'

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీ.ఎస్.బోస్



**నవతెలంగాణ-హిమాయత్‌నగర్**

2026 మార్చి 31 నాటికి దేశంలో నక్సలిజం లేకుండా అంతం చేస్తామని పదే పదే కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించడం అంటే కార్పొరేట్ దోపిడీ శక్తుల మెప్పు కోసమేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీ. ఎస్.బోస్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో పీడిత ప్రజలపై కొనసాగుతున్న అణిచివేత, పీడన, వివక్ష, దోపిడి ఉన్నంత కాలం ఉద్యమాలు, పోరాటాలు కొనసాగుతాయని, సమాజం లో సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో మార్పు రాకుండా ఒక నక్సలైట్ భావజాలాన్ని లేకుండా చేయడం అసాధ్యమ న్నారు. గతంలో పాలకులు ఇదే విధంగా కమ్యూనిస్టు పార్టీలను, నక్సలైట్ పార్టీలను లేకుండా చేస్తామని ప్రగాల్బాలు పలికి చివరికి వారు అధికారం కోల్పోయారన్నారు. అనేక ఆదివాసీ ప్రాంతాలలో చెరువులు, స్కూళ్ల నిర్మాణం, వ్యవ సాయ పంటల అవగాహనను పెంచడం జరిగిందని, వారి జీవితంలో మార్పులు కనిపించాయని, ఇప్పుడు ఉన్న కేంద్ర ప్రభుత్వం అక్కడ ఉన్న ఆదివాసీ ప్రజలను అడవి నుంచి బలవంతంగా పంపించి ఖనిజ సంపదను దోచుకోవాలనుకుంటున్నారని ఆరోపించారు.

## నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎంపీ డా.కె.లక్ష్మణ్



**నవతెలంగాణ-ముషీరాబాద్**

నూతన సంవత్సర క్యాలెండర్‌ను కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ ఆధ్వర్యంలో గాంధీనగర్ డివిజన్ అశోక్ నగర్‌లో ఏర్పాటు చేసిన క్యాలెండర్‌ను ఓబీసీ మోర్చ జాతీయ అధ్యక్షులు ఎంపి డా. కె.లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై వారి చేతుల మీదుగా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు అనునిత్యం బీజేపీ బలోపేతానికి కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. రానున్న ఎన్నికలలో వరుస విజయాలతో త్వరలో తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీని అధికారంలోకి తేవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, ఓబీసీ మోర్చ జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు, సీనియర్ నాయకులు రత్న సాయి చంద్, శ్రీకాంత్, ఎం.ఉమేష్, శ్రీనివాస్, నర్సింహ, శ్రీనివాస్, ఆనంద్ రావు, యాదగిరి, నీరజ్, రాణి, కృష్ణ వేణిలి తదితరులు పాల్గొన్నారు.

## 'వాటర్ ట్యాంకర్ వాహనం ఢీకొని వ్యక్తి మృతి'



**నవతెలంగాణ-హిమాయత్‌నగర్**

వాటర్ ట్యాంకర్ వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన నారాయణగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఈ మేరకు సోమవారం నారాయణగూడ సీఐ యు.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా, చెంగిచెర్ల ప్రాంతానికి చెందిన జగన్నాథన్ (50), తండ్రి విట్టల్, వృత్తిరీత్యా కార్పెం టర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం జగన్నాథన్ పల్సర్ బైక్ పై అబిడ్స్ వైపు వెళుండగా రోడ్డు ప్రమాదం సంభవించింది. ఒకసారిగా వాటర్ ట్యాంకర్ వాహనం అతడి పల్సర్ బైక్‌ను ఢీ కొట్టడంతో గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు.ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

# సైన్స్‌లో స్త్రీ శక్తి

**చదువులో, వృత్తిలో ఎన్ని ఒడుదుడుకులు ఎదురైనా ముందుకు నడిచి విజయాలు సాధించిన మహిళా శాస్త్రవేత్తలు ఎందరో ఉన్నారు. వీరి జీవితాలు మనకేం చెబుతున్నాయి. అవకాశం ఇవ్వాలే గాని తాము ఎవ్వరికీ తీసిపోమని, కృషిలోగానీ, మేధస్సులోగాని అగ్రగాములుగా నిలుస్తామంటున్నాయి. శాస్త్ర సాంకేతిక రంగాల్లో చాలాకాలం పురుషాధిక్యతే కొనసాగింది. ఎందరో మహిళా శాస్త్రవేత్తలు తమ ఆవిష్కరణలో శాస్త్ర సాంకేతిక రంగాలను సుసంపన్నం చేసినా వారి గురించి సమాజానికి పెద్దగా తెలియదు. వారు సాధించిన ఘన విజయాలు నేటి యువతను ఈరంగంవైపు ఆకట్టుకుంటున్నాయి. వైజ్ఞానిక పరిశోధనల్లో వివక్ష రహితమైన సంపూర్ణ మహిళా భాగస్వామ్యమే నూతన ప్రపంచ నిర్మాణానికి దోహదం చేస్తుంది. ఫిబ్రవరి 11న ఇంటర్నేషనల్ డే ఆఫ్ ఉమెన్ అండ్ గర్ల్స్ ఇన్ సైన్స్ సందర్భంగా సైన్స్‌లో మహిళా భాగస్వామ్యం ఎలా ఉందో తెలుసుకుందాం...**

అమ్మాయిలు, మహిళలకు విద్యలో, అభిరుచికి తగిన రంగాల్లో సరైన అవకాశాలు అందక వారి శక్తి సామర్థ్యాలు వృథాగా పోతున్నాయి. వారికి తగిన అవకాశాలిచ్చి ప్రోత్సహిస్తే, విభిన్నమైన ఆలోచనలతో నవీన సాంకేతికతలను సృష్టించడానికి, అభివృద్ధి చేయడానికి వీలవుతుందని నిపుణులు అంటున్నారు. ఇందుకోసం విద్యారంగంలో అమ్మాయిలకు సమాన అవకాశాలు దక్కేలా చూడాలి. శాస్త్ర, సాంకేతిక, పరిశోధనా రంగాల్లో వారి శక్తి సామర్థ్యాలను వెలికితీయాలనే ఉద్దేశంతో ప్రారంభమైన రోజే 'ఇంటర్నేషనల్ డే ఆఫ్ ఉమెన్ అండ్ గర్ల్స్ ఇన్ సైన్స్'.



రాజేశ్వరి ఛటర్జీ



దర్శన్ రంగనాథన్

### స్ఫూర్తి ప్రదాతలుగా...

దశాబ్దాల కిందటే సామాజిక కట్టుబాట్లను, కష్టాలను ఎదుర్కొని సైన్స్‌లో తమదైన ముద్రవేసిన మహిళలు స్ఫూర్తి ప్రదాతలుగా ఉన్నారు. తొమ్మిదేండ్ల బాల్యంలోనే పెండ్లి చేస్తే, 14ఏండ్ల వయసుకే తల్లై, కొడుకును పోగొట్టుకుని పుట్టెడు దు:ఖాన్ని దిగమింగి డాక్టర్ కావాలని సంకల్పించిన అపూర్వ విద్యావతి ఆనందీబాయి జోషి. అమెరికాలోని పెన్సిల్వేనియా మెడికల్ కాలేజీలో 1886లోనే పాశ్చాత్య వైద్యంలో శిక్షణ పొందిన తొలి భారతీయ మహిళ ఆనందీబాయి. సైన్స్ చదవాలని, పరిశోధనలు చేయాలని ప్రతిష్ఠాత్మక ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో ప్రవేశానికి కమలా సోహ్నీ ఆరాట పడితే కేవలం మహిళ అన్న కారణంగా ఆమెకు ప్రవేశం నిరాకరించబడింది. సి.వి.రామన్ ఇచ్చిన ప్రోత్సాహంతో ఆమె డాక్టరేట్ పూర్తి చేశారు. రామన్ మార్గదర్శకత్వంలో మొట్టమొదటి పిహెచ్.డి పొందిన ప్రప్రథమ మహిళా శాస్త్రవేత్త కమలా సోహ్నీ. సత్యేంద్రనాథ్ బోస్, ప్రఫుల్లచంద్ర రే వంటి ఉద్దండుల మార్గదర్శనలో రసాయన శాస్త్రంలో పిహెచ్.డి చేసిన తొలి మహిళగా ప్రసిద్ధి చెందిన ఆసిమా ఛటర్జీ మొక్కల్లో ఉండే ఔషధాలను కనుగొన్నారు. కర్ణాటకలో తొలి మహిళా ఇంజనీరుగా పనిచేసిన రాజేశ్వరి ఛటర్జీ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో మిచిగాన్ యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పొందారు. భారత వైజ్ఞానిక సంస్థలో తన భర్తతో కలిసి ఎలక్ట్రిక్ కమ్యూనికేషన్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. మైక్రోవేవ్ ఇంజనీరింగ్‌లో విశేష కృషి చేసిన విజ్ఞానవేత్తగా ఆమె ప్రసిద్ధికెక్కారు.





ఆనందీబాయి జోషీ

### అంతర్జాతీయ స్థాయిలో...

నోబెల్ బహుమతి అందుకున్న మొదటి మహిళ మేరీ క్యూరీ, రెండు వేర్వేరు రంగాల్లో నోబెల్ పొందిన ఏకైక శాస్త్రవేత్త. రేడియో ధార్మిక యూలకాలైన రేడియం, పోలోనియంలను క్యూరీ గుర్తించారు. ఆమె కనుగొన్న రేడియం పేరు మీదుగానే రేడియేషన్ పదం పుట్టింది. ఈ పరిశోధనలకుగాను 1903లో 'ఫిజిక్స్ నోబెల్' అందుకున్నారు. తర్వాత కెమిస్ట్రీలో పరిశోధనకు 1911లో 'కెమిస్ట్రీ నోబెల్' పొందారు. తన పరిశోధనల సమయంలో క్యూరీ ఎంతగా రేడియేషన్‌కు గురయ్యారంటే, ఆమె రాసిన నోటు పుస్తకాల నుంచి ఇప్పటికీ రేడియేషన్ వెలువడుతోంది. తొలి ఎలక్ట్రానిక్-డిజిటల్ కంప్యూటర్ 'యూనివాక్'ను రూపొందించిన బృందంలో కీలక పాత్ర పోషించిన అమెరికన్ శాస్త్రవేత్త గ్రేస్ హొపర్. 'బైనరీ' భాషలోకి మార్చే తొలి కంపైలర్ ప్రోగ్రామ్‌ను ఆమె రూపొందించారు. 'కోబాల్' ప్రోగ్రామ్ రూపకల్పనలోనూ ఆమెది కీలకపాత్ర. చైనాలో పుట్టి, అమెరికాలో స్థిరపడి అణుశక్తి తయారీకి మార్గం చూపిన శాస్త్రవేత్త చీన్‌షుంగ్ వు. అణుబాంబుల తయారీ కోసం 'మాన్ హట్టన్ ప్రాజెక్టు'లో కీలకపాత్ర పోషించారు. రసాయన ప్రక్రియల ద్వారా యురేనియం ఉత్పత్తి చేసే విధానాన్ని తొలిసారి ఆమె కనుగొన్నారు.

### అద్భుత విజయాలు

భారతదేశంలో గణిత పరిశోధకుల్లో మేటిగా పేరుగాంచిన మంగళ నార్లీకర్ గణితాన్ని సులభతరం జేసి మనసుకు హత్తుకునేలా బోధించేవారు. పెండ్లయిన పదహారేండ్లకు ఆమె గణితశాస్త్రంలో పిహెచ్.డి చేశారు. వీరేగాక ఇటీవలి కాలంలో ఎందరో మహిళలు వైజ్ఞానిక పరిశోధనా రంగంలో విశేష కృషి చేస్తున్నారు. ఇస్రో రాకెట్ శాస్త్రవేత్త నందిని హరినాథ్ తన ఇరవై ఏండ్ల సర్వీసులో 14మిషన్స్‌లో పనిజేశారు. మంగళ్‌యాన్‌కు డిప్యూటీ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా ఉన్నారు. రక్షణ రంగ పరిశోధనల్లో పరిశోధనలు చేసి 'అగ్ని' క్షిపణి ప్రాజెక్టులకు నేతృత్వం వహించిన మహిళ టెస్సీ థామస్. క్షిపణి ప్రయోగాలను విజయవంతం చేయటంలో కీలక పాత్ర వహించిన టెస్సీని 'క్షిపణి మహిళ', 'అగ్నిపుత్రి'గా పిలుస్తారు. మహికో విత్తన సంస్థలో పరిశోధనలు చేసిన ఉషా బార్వాలే తొలి జన్యుమార్పిడి ఆహారపంట వంగను ఉత్పత్తి చేస్తే.. జన్యుమార్పిడి పంటలతో ప్రజారోగ్యానికి వచ్చే ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కలిగిస్తూ సంచలనం సృష్టించారు సుమన్ సహాయ్. ఈమే 'జీన్ క్యాంపేయిన్'ను స్థాపించి స్థానిక ప్రజల, రైతుల హక్కుల కొరకు, కార్పొరేట్ల నుండి వారికి రావలిసిన వాటా రాబట్టేందుకు విశేష కృషి చేశారు. అంటార్కిటికాను సందర్శించిన తొలి మహిళా శాస్త్రవేత్త అదితి పంత్.




అసీమా ఛటర్జీ

కృత్రిమ గర్భధారణ పిండాల ప్రక్రియలను సుసాధ్యం చేసిన వారు ఇందిర హిందూజా. అంతరిక్షనౌక కొలంబియా ప్రయోగ ప్రమాదంలో చనిపోయిన మిషన్ స్పెషలిస్టు కల్పనా చావ్లా... ఇలా ఎందరెందరో మహిళా శాస్త్రవేత్తలు వైజ్ఞానిక పరిశోధనలను సమున్నతం చేసి ప్రఖ్యాతిగాంచారు.

### సముచిత స్థానం కల్పించాలి

ఎన్ని విజయాలు సాధించినా సైన్స్‌లో మహిళలకు సముచిత స్థానం దక్కడం లేదు. స్త్రీలకు వైజ్ఞానిక రంగ అవసరం ఎంత వుందో అంతకంటే ఎక్కువగా వైజ్ఞానిక రంగానికి మహిళల అవసరం ఉంది. ప్రపంచంలో సగభాగంగా ఉన్న మహిళల సమాన ప్రాతినిధ్యం లేకుండా సైన్సేకాదు ఏ రంగమూ పురోగమించలేదు. స్త్రీ పురుష సమానత్వం ఒక మానవ హక్కు. దీన్ని నిజం చేయటానికి సైన్స్‌లో మహిళలకు సముచిత స్థానం కల్పించవలసి ఉంది. బాలికలను సైన్స్ పట్ల ఆకర్షించడానికి ఇప్పటికే డాక్టరేట్లు పొందిన మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పించి, వారి సృజనాత్మక పరిశోధనలను దేశ ప్రగతికి వినియోగించుకోవటం ఎంతైనా అవసరం. వైజ్ఞానిక పరిశోధనల్లో వివక్షా రహితమైన సంపూర్ణ మహిళా భాగస్వామ్యమే నూతన ప్రపంచ నిర్మాణానికి చేయూతనిస్తుంది.



# ఉద్రిక్తత

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

కరీంనగర్-నిజామాబాద్-మెదక్-ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నామినేషన్లకు చివరి రోజైన సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ఉద్రిక్తత నెలకొంది. అధికార పార్టీ అభ్యర్థి సహా పీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్, మంత్రులు వాహనాలతో కలెక్టరేట్ లోపలి వరకూ వస్తుండగా పోలీసులు అడ్డు చెప్పారు. అయినప్పటికీ వాహనాలు లోపలి వరకూ వెళ్లాయి. అదే సమయంలో నామినేషన్ వేసి తిరిగి వస్తున్న స్వతంత్ర్య అభ్యర్థి.. బీఆర్ఎస్ నేత సర్దార్ రవీందర్ సింగ్ కలగజేసుకున్నారు. 'మా వాహనాలు అనుమతించకుండా.. మంత్రుల వాహనాలను ఎలా కలెక్టరేట్‌లోకి పంపించారు' అంటూ పోలీసులను ప్రశ్నించారు. దాంతో అక్కడే ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు నినాదాలు చేస్తూ తోసుకుంటూ వచ్చారు. ఈ క్రమంలో మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్‌తోపాటు వచ్చిన వ్యక్తులు, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసులు కలగజేసుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. ఈ సందర్భంగా రవీందర్‌సింగ్ మీడియాతో మాట్లాడుతూ.. సామాన్యులకు ఒక న్యాయం అధికార పార్టీ మంత్రులకు మరో న్యాయమా? అంటూ ప్రశ్నించారు. ఎన్నికల నియమాలను ఉల్లంఘించిన మంత్రులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

**నిజామాబాద్ అడిషనల్ కలెక్టర్‌పై ఫిర్యాదు**

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నిజామాబాద్ అడిషనల్ కలెక్టర్‌పై పట్టభద్రుల స్వతంత్ర్య అభ్యర్థి దేవతి శ్రీనివాస్ కరీంనగర్ ఎన్నికల అధికారి పమేలా సత్పతికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ.. ఈనెల 6న తాను కరీంనగర్ కలెక్టరేట్‌లో నామినేషన్లు దాఖలు చేశానని, ఆ సమయంలో ఓటరు నమోదు, సర్టిఫైడ్ కాపీ సమర్పించలేదని, ఆ వివరాలు ఇవ్వాలని ఎన్నికల అధికారులు అడిగారన్నారు. ఈ మేరకు ఆ వివరాల కోసం నిజామాబాద్ అడిషనల్ కలెక్టర్ అంకిత్‌ను కోరితే తనను అవమానపరిచారని చెప్పారు. మరోవైపు సోమవారం కరీంనగర్ కలెక్టరేట్‌లో కాంగ్రెస్ శ్రేణులు తనపై దాడి చేసేంత పని చేశారని, వారిపై కూడా చర్యలు తీసుకోవాలని కరీంనగర్ ఎన్నికల అధికారిని కోరినట్టు తెలిపారు.

**చివరి రోజు నామినేషన్ల జోరు**

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి సోమవారం చివరి రోజు ఏకంగా 51 మంది నామినేషన్లు వేశారు. ఈ నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం నుంచి ఇప్పటివరకు ఆ సంఖ్య 100కు చేరుకోవడం గమనార్హం. మరోవైపు టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి నిన్నటి వరకూ 9మంది నామినేషన్లు వేయగా, చివరి రోజు మరో 8మంది నామినేషన్లు సమర్పించారు. మొత్తం ఈ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 17 నామినేషన్లు వచ్చాయి.

**నల్లగొండలో 23 అభ్యర్థుల- 50 సెట్ల నామినేషన్స్**

నల్లగొండ- వరంగల్- ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికల్లో భాగంగా సోమవారం 18మంది 27సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా తాటికొండ వెంకట రాజయ్య, పూలరవీందర్, కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. ఇంతకుముందు దామెర బాబురావు ఒక సెట్ నామినేషన్ దాఖలు చేయగా చివరిరోజు మరో సెట్ దాఖలు చేశారు. ప్రజావాణి పార్టీ తరపున లింగిడి వెంకటేశ్వర్లు మరో రెండు సెట్లు వేశారు. ఇక్కడ మొత్తం 23మంది అభ్యర్థులు 50సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు.



## బీజేపీతో కేసీఆర్ లోపాయికారి ఒప్పందం

### ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి : పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీతో కేసీఆర్ లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నారని పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. అందుకే ఈ ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెట్టకుండా కాంగ్రెస్ ఓటమికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అన్ని కోణాల్లో నుంచి పరిశీలించి నరేందర్ రెడ్డిని అభ్యర్థిగా ఎంపిక చేశామని, ఆయన్ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వుట్కూరి నరేందర్‌రెడ్డి సోమవారం కరీంనగర్‌లో భారీ ర్యాలీతో వచ్చి నామినేషన్ వేశారు. ఆయన వెంట పీసీసీ అధ్యక్షులు సహా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్‌లు ఆదిశ్రీనివాస్, లక్ష్మణ్‌కుమార్ సహా ఆ పార్టీ ఎమ్మెల్యేలు వెంట వచ్చారు. ఈ సందర్భంగా మహేష్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ ఏడాదికి 5వేల ఉద్యోగాలిస్తే... సీఎం రేవంత్ రెడ్డి నెలకు 5వేల ఉద్యోగాలు ఇస్తున్నారని చెప్పారు. కేంద్రమంత్రిగా ఉన్న బండి సంజయ్ రూపాయి కూడా తీసుకురాలేదని ఆరోపిం చారు. బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై నలుగురు ఎంపీలు సమాధానం చెప్పాలన్నారు.

## ప్రభుత్వానికి డెడికేషన్ కమిషన్ నివేదిక

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కులగణన కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన డెడికేషన్ కమిషన్ (డెడికేటెడ్ కమిషన్) తన 700 పేజీల నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. సోమవారం కమిషన్ చైర్మెన్ మాజీ ఐఏఎస్ భూసాని వెంకటేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిసి నివేదిక అందజేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల కల్పన కోసం రాజకీయంగా వెనుకబడిన వర్గాల (బీసీ) జనాభా లెక్కల సేకరణకు ప్రత్యేకంగా కమిషన్ ఏర్పాటు చేయాలని హైకోర్టు తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. ఆ ఆదేశాల అమలులో భాగంగా ప్రభుత్వం గతేడాది నవంబర్‌లో భూసాని వెంకటేశ్వరరావు నేతృత్వంలో ఈ డెడికేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజాభిప్రాయాన్ని సేకరించింది. మరో వైపు రాష్ట్రవ్యాప్తంగా ఎన్యూమరేటర్లు సేకరించిన డేటాను ఆన్‌లైన్ చేయడం పూర్తి కాగానే ఆ రిపోర్టును ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ బీసీ డెడికేటెడ్ కమిషన్‌కు అందజేసింది. ఈ సమాచారాన్నంతటినీ క్రోఢీకరించిన కమిషన్ తుది నివేదికను రూపొందించింది. ఆ నివేదికను ప్రభుత్వానికి సమర్పించడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల అంశం ఓ కొలిక్కి వచ్చి ఎన్నికల దిశగా ప్రభుత్వం ముందడుగు వేసేందుకు కీలకం కాబోతున్నది.

**వారం రోజుల్లో రిజర్వేషన్ల ఖరారు**

డెడికేటెడ్ కమిషన్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల ఖరారుకు మార్గం సుగమమైంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆ కమిషన్ నివేదికను బీసీ మంత్రిత్వశాఖకు పంపించింది. దీనిపై ఆ శాఖ నోట్ ఫైల్ తయారు చేసి సీఎంకి పంపించనుంది. ఒక రోజు గడువుతో ముఖ్యమంత్రికి నోట్ ఫైల్ చేరుతుందని భావిస్తుంది. అక్కడి నుంచి పంచాయతీ రాజ్ కు నివేదిక రాగానే రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు. గ్రామం యూనిట్‌గా వార్డులు, మండలం యూనిట్‌గా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జిల్లా యూనిట్‌గా జెడ్పీటీసీలు, రాష్ట్రం యూనిట్‌గా జెడ్పీ చైర్మెన్ల రిజర్వేషన్లను ఖరారు చేయనున్నట్టు సమాచారం. ఈ మొత్తం ప్రక్రియ వారం రోజుల్లో పూర్తి కానున్నది.

## క్రిమినల్ కేసులుంటే ఉద్యోగాలకే అనర్హులు! మరి ప్రజాప్రతినిధులుగా ఎన్నిక ఎలా ?

(మొదటిపేజీ తరువాయి)

సూచించింది. సుప్రీం కోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ కొన్ని రాష్ట్రాల్లో ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయకపోవడంపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. అనంతరం కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను మార్చి 4వ తేదీకి వాయిదా వేసింది.

## ఇందిరమ్మ ఇండ్లకు ఉచితంగా ఇసుక

(మొదటిపేజీ తరువాయి)

విధానంలో పలు మార్పులను ఆదేశించారు. ఆఫీస్ టైమింగ్స్‌లో బుకింగ్ చేసుకునేలా బుకింగ్ వేళల్లో మార్పు చేయాలని సూచించారు. అక్రమ రవాణాకు సహకరించే అధికారులపై వేటు తప్పదని హెచ్చరించారు. అవసరమైతే తానే స్వయంగా ఆకస్మిక తనిఖీలు చేస్తానన్నారు. పారదర్శకంగా అక్రమాలకు తావు లేకుండా పర్మినెంట్ ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించాలని ఆదేశించారు.

## స్టీల్, అల్యూమినియంపై ట్రంప్ ట్రిగ్గర్

**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పలు లోహాల దిగుమతులపై భారీగా దిగుమతి సుంకం విధించారు. అమెరికాలో దిగుమతి చేసుకునే ఉక్కు, అల్యూమినియంపై 25 శాతం సుంకాన్ని విధించాలని నిర్ణయించారు. ఆదివారం న్యూ ఓర్లీన్స్‌లోని ఎయిర్ ఫోర్స్ వన్‌లో ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ సుంకాల పెంపు ప్రపంచంలోని అన్ని దేశాలకూ వర్తిస్తుందని స్పష్టం చేశారు. మంగళవారం నాటికి పరస్పర సుంకాలను ప్రకటిస్తామని..ఆ తర్వాత అవి వెంటనే అమల్లోకి వస్తాయని వెల్లడించారు. అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన కొన్ని రోజులకే, డోనాల్డ్ ట్రంప్, అమెరికాతో వ్యాపారం చేసే దేశాలతో ద్వైపాక్షిక ఒప్పందాలను సమీక్షిస్తానని తెలిపారు. అమెరికా విధానాలకు సహకరించని దేశాల దిగుమతులపై సుంకాలు పెంచుతానని స్పష్టం చేశారు. ఇటీవలే చైనా, కెనడా, మెక్సికో నుంచి వచ్చే దిగుమతులపై సుంకాలు పెంచి వేటు వేశారు.

సుంకాల యుద్ధం శ్రేణీలో తాజా పెంపుతో రెండోసారి దాడి చేసినట్లయ్యింది. అయితే సరిగ్గా ప్రధాని మోడీ యూఎస్ పర్యటనకు బయలుదేరినప్పుడే సుంకాలు పెంచటం గమనార్హం. అయితే ఆ ప్రభావం తమపై ఉండదని ఉక్కుశాఖ అంటోంది. ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు కూడా ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై సుంకాలను విధించారు. అయితే.. కెనడా, మెక్సికో, బ్రెజిల్ సహా పలు వాణిజ్య భాగస్వామ్యులకు దీని నుంచి మినహాయింపు ఇచ్చారు. కాగా.. ప్రస్తుతం అమెరికా ఉక్కు దిగుమతుల్లో కెనడా, మెక్సికో, బ్రెజిల్ దేశాలు కీలక వాటా కలిగి ఉన్నాయి.

2024లోని మొదటి 11 నెలల్లో మొత్తం అల్యూమినియం దిగుమతుల్లో 79 శాతం కెనడా నుంచే వచ్చినవే కావడంతో ఆదేశ వాణిజ్యంపై తీవ్ర ప్రభావం పడనుంది. సుంకాలను పెంచడం ద్వారా అమెరికన్ పరిశ్రమలను రక్షించడం, వాణిజ్య సమతుల్యతను మెరుగుపరచడమే తన ఉద్దేశ్యమని ట్రంప్ ఎన్నికల సమయంలో పేర్కొన్నారు. ట్రంప్ టారీఫ్ దూకుడు ప్రపంచ వ్యాపార సామ్రాజ్యాన్ని తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. ట్రంప్ చర్యల పట్ల అనేక దేశాలు లోలోన మండిపడుతున్నాయి. తాజాగా లోహాల సుంకాలపై పలు ప్రధాన దేశాలు ప్రతీకార దాడికి దిగొచ్చని నిపుణులు భావిస్తున్నారు. అదే జరిగితే టారిఫ్ వాణిజ్య యుద్ధం మరింత ముదరనుంది. కాగా.. అమెరికా ఉక్కు దిగుమతులపై సుంకాల విధింపు భారత పరిశ్రమపై పెద్ద ప్రభావం చూపబోవని కేంద్ర ఉక్కు శాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ తెలిపారు. గత సంవత్సరం భారత్ 145 మిలియన్ టన్నుల ఉక్కును ఎగుమతి చేసిందన్నారు. అందులో 95,000 టన్నులు అమెరికాకు సరఫరా చేసిందన్నారు. భారత మార్కెట్‌లోనే ఉక్కుకు బలమైన డిమాండ్ ఉందన్నారు.

## రామరాజ్యం పేరుతో దాడులు చేస్తే తీవ్ర చర్యలు

### శ్రీ రాముని జీవన విధానానికి ఈ చర్యలు విరుద్ధం
### చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్‌ను పరామర్శించిన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
### ఫోన్ ద్వారా పరామర్శించిన ముఖ్యమంత్రి

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

రామరాజ్యం పేరుతో రాష్ట్రంలో అశాంతిని సృష్టిస్తూ దాడులు చేస్తామంటే చూస్తూ ఊరుకోబోమని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హెచ్చరించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్‌తో పాటు వారి తండ్రి సౌందర రాజన్‌ను మంత్రి సురేఖ పరామర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వారికి అన్నివేళలా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. సీఎస్ రంగరాజన్‌పై జరిగిన దాడిని మంత్రి తీవ్రంగా ఖండించారు. సంఘా వ్యతిరేక శక్తులు తమ స్వప్రయోజనాల కోసం రాముని పేరుతో రాజకీయాలు చేస్తున్నారన్నారు. ప్రశాంతంగా సాగుతున్న తెలంగాణ సమాజాన్ని అశాంతికి గురిచేసే చర్యలను ఉక్కుపాదంతో అణచివేస్తామని తెలిపారు. తన జీవిత పర్యంతం ధర్మానికే కట్టుబడి జీవించిన శ్రీరాముని పేరుతో హింసకు పాల్పడటం విచారకరమన్నారు. ఈ దాడికి కారకులైన వారిని చట్టబద్ధంగా శిక్షిస్తామని తేల్చి చెప్పారు. భవిష్యత్‌లో ఇలాంటి చర్యలకు పాల్పడితే తీవ్ర చర్యలుంటాయని హెచ్చరించారు. అంతకుముందు అర్చకులు రంగరాజన్‌ను చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పరామర్శించారు. వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డితో అర్చకుడు ఫోన్‌లో మాట్లాడారు. నిందితులపై కఠినచర్యలు తీసుకునేలా పోలీస్‌శాఖకు ఆదేశాలు జారీ చేస్తామని సీఎం చెప్పారు. ప్రభుత్వం వారి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటుందని, ఎలాంటి సహాయం అవసరమైనా చేస్తామని భరోసా ఇచ్చారు.



## బడ్జెట్‌కు ప్రాధాన్యతేది..?

(మొదటిపేజీ తరువాయి)

ఆదాయం రాకపోవటం, మరోవైపు రాష్ట్రానికి నిధులివ్వకుండా మోడీ సర్కారు వివక్ష చూపటం తదితర కారణాల రీత్యా గత బడ్జెట్‌లో రేవంత్ సర్కారు వేసుకున్న అంచనాలు తలకిందులయ్యాయి. దీంతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు కష్టంగా మారుతోంది.

ఫలితంగా క్షేత్రస్థాయి లో పలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందంటూ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇటీవల సీఎం వద్ద వాపోయినట్టు వినికిడి. ఈ క్రమంలోనే 'ఇప్పటి వరకూ ఇచ్చిన హామీలను ముందు అమలు చేద్దాం, ఆ తర్వాత కొత్త వాటి గురించి ఆలోచిద్దాం, మీరు ప్రజల మెప్పు కోసం కొత్తగా ఎలాంటి వాగ్దానాలు చేయకండి' అంటూ ముఖ్యమంత్రి వారికి సూచించినట్టు సమాచారం. ఇలాంటి పరిణామాల నేపథ్యంలో రాబోయే బడ్జెట్ రూపకల్పనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## బడ్జెట్ వివరాలివ్వండి

### వర్సిటీలను కోరిన ఉన్నత విద్యామండలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26) సంబంధించి రాష్ట్ర బడ్జెట్‌లో ఎన్ని నిధులు కావాలో వివరాలను సమర్పించాలని విశ్వవిద్యాలయాలను ఉన్నత విద్యామండలి కోరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఏ విశ్వవిద్యాలయానికి ఎంత బడ్జెట్‌ను కేటాయించారు? అందులో ఇప్పటి వరకు ఎన్ని నిధులు విడుదలయ్యాయి అన్న వివరాలనూ కూడా సేకరిస్తున్నది. ఎన్ని నిధులకు ఆర్థిక శాఖ టోకెన్లు ఇచ్చిందనే వివరాలను కూడా విశ్వవిద్యాలయాల నుంచి ఉన్నత విద్యామండలి అధికారులు అడిగి తెప్పించుకుంటున్నారు. రాష్ట్రంలో విద్యాశాఖ పరిధిలోని 12 విశ్వవిద్యాలయాలకు సంబంధించిన బీఆర్ఓ (బడ్జెట్ రిలీజ్ ఆర్డర్), టోకెన్ల వివరాలను సేకరించి ప్రభుత్వానికి ఉన్నత విద్యామండలి సోమవారం నివేదించినట్టు తెలిసింది. ఈ లెక్కల ప్రకారం పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి కూడా బడ్జెట్ కేటాయింపులు ఎంత కావాలో కూడా త్వరలోనే విశ్వవిద్యాలయాల వారీగా సమర్పించనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో విశ్వవిద్యాలయాలకు ప్రగతి పద్దు కింద రూ.500 కోట్లు కేటాయించింది.



# బడ్జెట్ సవరించాల్సిందే

## ఆర్ఎస్ఎస్‌కా సాత్..అంబానీ, అదానీకా వికాస్ | మోడీ సర్కారు బడ్జెట్ సారాంశం ఇదే





### ప్రజలు తిరగబడితే పార్లమెంట్ వణకాల్సిందే : జాన్‌వెస్లీ



దేశ సంపదను కొద్ది మంది పందికొక్కుల్లా మెక్కుతుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించడానికే ఈ ప్రజాసంఘాల పోరాట వేదిక మహాధర్నా అని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ అన్నారు. 30 కోట్ల మంది ఉపాధి కూలీలకు రూ.2 లక్షల కోట్లు ఎందుకు కేటాయించలేదు? చేతులెందుకు రావట్లేదు? పేదలే తిరగబడితే పార్లమెంట్ గడగడలాడాల్సి వస్తుంది జాగ్రత్త అని హెచ్చరించారు. కనీస వేతనం రూ.26 వేలు వేతనం ఈ దేశంలో ఉండకూడదా? దాని కోసం సమ్మెలు చేయాలా? కార్మికుల ప్రయోజనాలు పట్టవా? కార్మికులను పట్టించుకోని బడ్జెట్ ఎందుకు? కార్మికులంతా గమ్మునా ఉండటం వల్లనే పాలకులు ఇష్టమొచ్చినట్టు చేస్తూ పోతున్నార న్నారు. రైతులను కూలీలుగా మార్చేందుకు, వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు రూ.10 వేల కోట్లను తగ్గించారనీ, సబ్సిడీలను కుదించారని వివరించారు. రైతులు, కార్మికులు, కూలీలకు వ్యతిరేకంగా ఉంటే ఇది ప్రజా బడ్జెట్ ఎలా అవుతుంది? అని ప్రశ్నించారు. ఒక్క శాతం కార్పొరేట్ల చేతుల్లో 40 శాతం దేశసంపద పోగుబడుతుంటే ఇంకెన్నాళ్లు చూస్తూ ఊరుకుందామని ప్రజలను అడిగారు. తిరగబడి గర్జిస్తే ఆ డబ్బంతా పేదల చేతుల్లోకి వస్తుందన్నారు. దళితులు, గిరిజనులు, మైనార్టీలు, మహిళలకు ఈ బడ్జెట్‌లో సరిగా కేటాయింపులు లేవన్నారు. 16 శాతం దళితులకు ఐదు శాతం కేటాయించడమేంటి? వారికి దక్కాల్సిన 11 శాతాన్ని కార్పొరేట్లకు దోచిపెడుతున్నారని విమర్శించారు. దేశంలో 7 శాతం ఆదివాసీ గిరిజనులుంటే 2 శాతం కేటాయించడమేంటి? ఆ తరగతులు బాగుపడొద్దా? అని ప్రశ్నించారు. 50 శాతానికి పైగా ఉన్న బీసీల గురించి ఈ బడ్జెట్ పట్టించు కోలేదని విమర్శించారు. బీసీ ప్రధాని అయితే ఒరిగిబెట్టిందేంటి? బీసీలకు అన్యాయం జరుగుతుంటే పట్టదా? ఇది సామాజిక న్యాయం కోరుకునే బడ్జెట్ ఎలా అవుతుంది? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఇది కార్పొరేట్లకు, దోపిడీ దారులకు అనుకూలం తప్ప బీజేపీ హిందూ వులకు అనుకూలం కాదని విమర్శించారు. తెలంగాణకు సంబంధించిన విభజన చట్టం హామీలకు, ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించకుండా విస్మరించిందన్నారు. రాష్ట్రానికి నిధులు తీసుకురా చేతగాకపోతే బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలోని పేదలకు ఇండ్ల స్థలాల కోసం ఎర్రజెండా పోరాటం చేస్తుందని హామీనిచ్చారు.

### పారిశ్రామిక వేత్తల జేబులు నింపే బడ్జెట్ : ఎస్.వీరయ్య



ప్రజాసంఘాల పోరాట వేదిక కన్వీనర్ ఎస్.వీరయ్య మాట్లాడుతూ..పారిశ్రామిక వేత్తల జేబులు నింపేందుకు కేంద్ర బడ్జెట్‌లో కార్పొరేట్లకు ఏడు లక్షల కోట్ల రూపాయలను కేటాయించారని విమర్శించారు. దీనిపై జనమంతా ఆలోచించాల్సిన అవసరం ఆసన్నమైనదన్నారు. రాష్ట్రంలో 30 లక్షల పేదలకు ఇండ్లు లేవనీ, వారిలో చాలా మంది ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని పోరాటాలు చేస్తున్నారని

వివరించారు. ప్రధాని ఆవాసయోజన పథకం కింద పేదలందరికీ ఇండ్లు కట్టిస్తానని చెప్పావుగదా మోడీ..మరి ఈ బడ్జెట్‌లో గృహనిర్మాణ రంగానికి ఎంత బడ్జెట్ కేటాయించావ్? అని ప్రశ్నించారు. ప్రజలంతా ఇండ్లు లేకుండా ఇబ్బందులు పడుతుంటే రూ.467 కోట్లతో ప్రధాని మోడీకి ఇల్లు అవసరమా? రూ.15 వేల కోట్లతో అంబానీ ఇల్లు, వెయ్యి కోట్లతో అదానీ ఇల్లు ఉన్నాయిగదా? వారికి రాయితీలు, సబ్సిడీలు ఎందుకు? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. రోజుకు రూ.178 ఇస్తే కార్మికులకు సరిపోతుందంట? ఇదెలా సాధ్యం? నిత్యావసరాలు భగ్గుమంటున్న ఈ కాలంలో నెలకు రూ.5340తో బతకడం ఎలా సాధ్యం? అంత వేతనం చాలంటున్న ఆర్ఎస్ఎస్, బీజేపీ నేతలు ఆ డబ్బులతో బతికి చూపిస్తారా? అంటూ సవాల్ విసిరారు. ఓవైపు మధ్యతరగతికి పన్ను పరిమితి పెంచామంటూనే మరోవైపు జీఎస్టీల పేరుతో బాదుతున్న తీరును గణాంకాలతో వివరించారు. ప్రపంచంలో పేదలపై అత్యధిక పన్నుల భారం వేస్తున్నది మోడీ సర్కారే అన్న నిజాన్ని పేదలు గ్రహించి తిరగబడాలని పిలుపునిచ్చారు. ఎక్కడ ఎన్నికలు జరిగితే ఆ రాష్ట్రాలకు నిధులు ఇస్తూ పోతున్న కేంద్రానికి దేశంలోనే పన్నుల ద్వారా అత్యధిక ఆదాయం ఇస్తున్న తెలంగాణకు నిధులు కేటాయించాలనే సోయి ఎందుకు లేదు? ఏం మొహం పెట్టుకుని తెలంగాణకు వస్తావు మోడీ? అని ప్రశ్నించారు. దోస్తోం అన్నప్పుడల్లా అంబానీ, అదానీలే పేదలకు గుర్తుకొస్తున్నారన్నారు. వారికి రాయితీలిస్తే పేదలకు ఉపాధి కల్పిస్తున్నారా? దేశ అభివృద్ధి పాటుపడుతున్నారా? అని ప్రశ్నించారు. గతేడాది 109 మంది శతకోటీశ్వర్లు ఉండగా..కార్పొరేట్ల అనుకూల విధానాలతో ఏడాదిలో 200కు ఆ సంఖ్యకు చేరిన తీరును వివరించారు. దేశంలో కార్మికులు, రైతుల సంపద ఆ స్థాయిలో పెరిగిందా? అని అడిగారు. సంపద పన్నును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. వారసత్వపు పన్ను 33 శాతం పెడితే మన బడ్జెట్‌ను రెట్టింపు చేసుకుని అన్ని వర్గాలకు బడ్జెట్ కేటాయించవచ్చునన్నారు.

సంఘం రాష్ట్ర కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంజి మురళీధర్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, పీఎస్ఎమ్ రాష్ట్ర కార్యదర్శి కట్ట నర్సింహ్మా, టీపీఎస్ఏకే రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, టీపీఎస్కే రాష్ట్ర నాయకులు హిమబిందు, ఆయా ప్రజా సంఘాల రాష్ట్ర నాయకులు వేముల ఆనంద్, కిల్లెగోపాల్, గోరెంకల నర్సింహ్మా, శాంతికుమార్, సాయిలు, ఎం.వెంకటేశ్, ఎం.దశరథ, పాషా, చెన్నారం మల్లేశం, జి.నరేశ్, సచిన్, పాల్గొన్నారు.

### పేదలందరికీ ఇండ్లు ఇచ్చేదాకా పోరాటం తమ్మినేని వీరభద్రం



ప్రజల కష్టార్జితాన్ని కార్పొరేట్లు మరింత దోచుకునేలా కేంద్ర బడ్జెట్ ఉందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తమ్మినేని వీరభద్రం విమర్శించారు. రాబోయే కాలంలో అన్ని సమస్యలపైనా పోరాడే సంఘంగా ప్రజా సంఘాల పోరాట వేదిక పనిచేస్తుందని హామీనిచ్చారు. 20 జిల్లాల్లో పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం పోరాటం చేస్తున్న తీరును వివరించారు. గత ప్రభుత్వం పేదలపై విచక్షణారహితంగా ఎన్ని దాడులు చేసినా కొన్ని వేల గుడిసెల్లో పేదలుంటున్నారనీ, వారందరికీ పట్టాలొచ్చేదాకా, కొత్త ఇల్లు కట్టించేదాకా వదిలే సమస్యే లేదని నొక్కి చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం హామీలను విస్మరిస్తేనే ఇంట్లో కూర్చోబెట్టారనీ, ఇప్పుడు రేవంత్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకోకపోతే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. తెలంగాణ జానపదులకు కాణాచి అనీ, అలాంటి కళాకారులకు నేడు రాష్ట్రంలో దిక్కూదివానా లేని పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. జెండాలు..ఎజెండాలు..రాజకీయ అభిప్రాయాలను పక్కనబెట్టి ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజాసంఘాల పోరాటాలు విస్తృతం కావాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. వామపక్షాల ఐక్యత కంటే ముందు ప్రజా సంఘాల మధ్య ఐక్యత రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల మేలు కోరే బడ్జెట్ అంటే పాలకులు డబ్బున్నవాళ్ల దగ్గర ఎక్కువ వసూలు చేసి పేదల సంక్షేమం కోసం ఖర్చుపెట్టాలన్నారు. కానీ, దేశంలో దానికి విరుద్ధంగా బడ్జెట్ కేటాయింపులుంటున్న తీరును ఎత్తిచూపారు. ప్రజల కొనుగోలు శక్తి పెంచే చర్యలు బడ్జెట్‌లో ఉండాలని ఆకాంక్షించారు. ఉపాధి హామీ చట్టానికి రూ.86 వేల కోట్లు ఏవిధంగా సరిపోతాయని ప్రశ్నించారు. కనీసం రూ.2 లక్షల కోట్లకు పెంచాలని డిమాండ్ చేశారు. 200 మంది శతకోటీశ్వర్లపై నాలుగు శాతం సంపద వేయాలని డిమాండ్ చేశారు. అలా చేస్తే వంద లక్షల కోట్ల రూపాయలు వస్తాయనీ, దాని ద్వారా ఆస్పత్రులు, పాఠశాలలు కట్టొచ్చునీ, ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయవచ్చునని వివరించారు.



### వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే యత్నం : టి.సాగర్



వ్యవసాయ రంగాన్ని పూర్తిగా కార్పొరేట్లకు కట్టబెట్టే యత్నంలో మోడీ సర్కారు ఉందనీ, అందుకే వ్యవసాయ రంగానికి కేంద్ర బడ్జెట్‌లో నిధులను తగ్గించిందని, ఎరువుల సబ్సిడీలో కోత విధించిందని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ విమర్శించారు. ఢిల్లీ సరిహద్దుల్లో మరో పోరాటానికి రైతులు సన్నద్ధమవుతు న్నారని చెప్పారు. ఫసల్‌బీమా యోజన పథకం కార్పొరేట్ కంపెనీలకు వేల కోట్ల రూపాయల లాభాలు తెచ్చిపెడుతున్నాయి తప్ప రైతులకు ప్రయోజనం లేకుండా పోయిందని విమర్శించారు. ఎమ్ఎస్. స్వామినాథన్ సూచించినట్టు రైతుల పెట్టుబడికి 50 శాతం కలిపి కనీస మద్దతు ధరల చట్టం తెస్తామన్న హామీ ఏమైందని నిలదీశారు. రైతుల ఆత్మహత్యల నివారణ కోసం రుణ విమోచన చట్టం ఒక్క కేరళలోనే అమలవుతుందని చెప్పారు. రైతుల రుణమాఫీ గురించి కేంద్ర బడ్జెట్‌లో ప్రస్తావన లేదని విమర్శించారు. విత్తన రంగంలో పరిశోధన కేంద్రాలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే యత్నాన్ని తప్పుబట్టారు. డబ్బులు ప్రభుత్వానివనీ, పరిశోధనలకు కార్పొరేట్లకు ఇవ్వడమేంటని ప్రశ్నించారు. జీఎస్టీ ద్వారా వచ్చే ఆదాయంలో కేవలం 37 శాతమే ఇస్తూ రాష్ట్రాల హక్కులను కేంద్రం హరిస్తున్న తీరును ఎండగట్టారు.

### ఆదివాసీ గిరిజనుల నిధులు జాతీయ రహదారులకు మళ్లించడం దారుణం: బండారు రవికుమార్



ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్ మాట్లాడుతూ..కేంద్ర బడ్జెట్‌లో ఆదివాసీ గిరిజన యూనివర్సిటీకి నిధులు ఏవని నిలదీశారు. ఆదివాసీ గిరిజనులకు 2023 కేంద్ర బడ్జెట్‌లో కేటాయించిన నిధులను జాతీయ రహదారుల నిర్మాణం కోసం మళ్లించడమేంటని ప్రశ్నించారు. 2024లో ఆదివాసీ గిరిజనులకు రూ.17 వేల కోట్లు కేటాయిస్తే..దాన్నీ ఖర్చుపెట్టలేదని విమర్శించారు.

ఖనిజ సంపద లూటీ కోసం అడవులను బడా కార్పొరేట్లకు కట్టబెట్టాలని మోడీ సర్కారు చూస్తున్న తీరును ఎండగట్టారు. ఆదివాసీ గిరిజనులకు స్కాలర్‌షిప్పుల కోసం ఇచ్చే నిధుల్లో కోత పెట్టడమేంటి?అని నిలదీశారు. రాష్ట్రంలో తునికాకు సేకరణకు ఇంకా టెండర్లు పిలవకపోవడమేంటి? అని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు.

ఈ మహాధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్..వెంకట్రాములు, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మిడియం బాబురావు, పట్నం రాష్ట్ర కన్వీనర్ డీజీ నర్సింహారావు, గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీరాంనాయక్, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పైళ్ల ఆశయ్య, జీఎంపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఉడుత రవీందర్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేశ్, మత్స్యకార్మిక

### మహిళా శిశుసంక్షేమానికి 0.5 శాతం నిధులా? : మల్లు లక్ష్మి



ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. కేంద్రం ప్రవేశపెట్టినది మహిళా సంక్షేమ బడ్జెట్ కాదనీ, కార్పొరేట్ అనుకూల బడ్జెట్ అని విమర్శించారు. వ్యవసాయ రంగం సంక్షోభం కూరుకుపోయిందన్నారు. ఉపాధి హామీ చట్టం కింద ఎక్కువ మహిళా కూలీలు పనిచేస్తున్నారనీ, ఆ చట్టానికి నిధులు కేటాయించకుండా సబ్‌కావికాస్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఆకలి సూచీలో 109వ స్థానంలో ఉండటం దారుణమనీ, మనకంటే మెరుగైన స్థితిలో మన పక్కనున్న దేశాలున్నాయని వివరించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖకు 0.53 శాతం కేటాయించడమేంటని ప్రశ్నించారు. పౌష్టికాహారం, రక్తహీనతతో మహిళలు బాధపడుతున్నది నిర్మలమ్మ కండ్లకు కనిపించడం లేదా? అని నిలదీశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్-2 పథకానికి నిధులు తగ్గించడం దారుణమన్నారు. ఆహారభద్రతకు కోతలు పెట్టడం ఏం న్యాయం అని ప్రశ్నించారు.

### సచార్ కమిటీ 10 శాతం కేటాయించాలన్నది పట్టదా? : ఎమ్‌డీ.అబ్బాస్



ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎమ్‌డీ అబ్బాస్ మాట్లాడుతూ..అందరితో ఉంటాం..అందరినీ అభివృద్ధి చేస్తాం అని బీజేపీ నేతలు పదేపదే చెబుతున్నారనీ, బడ్జెట్‌ను చూస్తే ఆర్ఎస్ఎస్‌కా సాత్..అంబానీ, అదానీకా వికాస్ అని స్పష్టంగా కనిపిస్తున్నని చెప్పారు. వికసిత భారత్ అంటే..అన్ని రంగాలు అభివృద్ధి చెందాలన్నారు. మన దేశంలో 30 కోట్ల మంది ముస్లిం, సిక్కు, క్రిస్టియన్ మైనార్టీలుంటే దేశ బడ్జెట్‌లో 3,550 కోట్లు కేటాయించడమేంటి? కనీస ఇంగిత జ్ఞానం ఉందా? అని ప్రశ్నించారు. జస్టిస్ రాజేందర్ సచార్ కమిటీ రిపోర్టు ప్రకారమే వక్ఫ్‌బోర్డుకు సవరణలు చేస్తున్నామని చెబుతున్నారుగా…అదే కమిటీ మైనార్టీలకు బడ్జెట్‌లో పది శాతానికిపైగా నిధులు కేటాయించాలని చేసిన మొదటి సిఫారసును ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. మైనార్టీలకు 0.05 నిధులు కేటాయించడమా? అని ప్రశ్నించారు.

### కార్మిక శాఖకు రూ.3,600 కోట్లేనా..: పాలడుగు భాస్కర్



రూ.50 లక్షల కోట్ల రూపాయలలో దేశ సంపద సృష్టికర్తలైన 58 కోట్ల మంది కార్మికులకు కేవలం రూ.3,600 కోట్లు మాత్రమే కేటాయించడం ఏంటని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రశ్నించారు. ఒక్కో కార్మికునికి రూ.109 వస్తాయనీ, దాంతో కార్మికులను ఏం ఉద్ధరిస్తారు? అని నిలదీశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, కార్మికులకు సంబంధించిన సంక్షేమ పథకాల్లో కోత పెట్టడం దుర్మార్గ చర్య అన్నారు. పన్నులు పెంచి ఆదాయాలు సమాకూర్చుకోవడం ఏంటని నిలదీశారు. ఇన్సూరెన్స్ రంగమైన ఎల్ఐసీలోకి ఎఫ్‌డీఐలను వంద శాతం ఆహ్వానించడాన్ని తప్పుబట్టారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మి 47 వేల కోట్ల రూపాయలను సమకూర్చుకోవాలనే కేంద్రం నిర్ణయం దుర్మార్గమని విమర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు, మధ్యాహ్న భోజనం, ఆశా, తదితర స్కీమ్‌లకు బడ్జెట్ పెంచకుండా ఏం ఉద్ధరిస్తారని నిలదీశారు. జీడీపీలో అత్యధిక వాటా అసంఘటిత రంగం కార్మికుల నుంచేవస్తున్నదనీ, జీడీపీని పెంచే వారికి సామాజిక భద్రత గురించి పట్టదా? అని ప్రశ్నించారు. కార్మిక రంగంలో సంస్కరణలు అమలు చేసే రాష్ట్రాలకే నిధులు కేటాయిస్తామని కేంద్రం బెదిరించడం దుర్మార్గమన్నారు. సీఐటీయూ దేశవ్యాప్త ఆందోళనలకు సిద్ధమవుతుందని చెప్పారు.







## ఆకట్టుకున్న ర్యాలీలు.. జానపద కళాకారుల ప్రదర్శనలు

ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద చేపట్టిన మహాధర్నాలో జానపద కళాకారుల ప్రదర్శనలు హైలెట్‌గా నిలిచాయి. జానపద కళారూపాలను ప్రదర్శిస్తూ వేదిక వద్దకు చేరుకున్నారు. కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీకి కళాకారులు గదను అందజేశారు. కల్లు గీత కార్మికుల సంఘం ఆధ్వర్యంలో తాటికమ్మలను పట్టుకుని మహాధర్నా ప్రాంతంలో నినాదాలు చేస్తూ తిరిగారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు పెద్ద ఎత్తున ర్యాలీగా మహాధర్నా ప్రాంతానికి వచ్చారు. జిల్లాల నుంచి అంగన్‌వాడీ, ఆశాలు, మున్సిపల్, పంచాయతీ, ఆయా పరిశ్రమల కార్మికులు పెద్దఎత్తున తరలివచ్చారు. గుడిసెల పోరాటాలు చేస్తున్న ప్రాంతాల నుంచి పేదలు తరలివచ్చారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

## అపరంజి @ 88,500

- బంగారం రూ.2,430 ప్రియం



**న్యూఢిల్లీ :** బంగారం ధర భగ్గుమంటోంది. పేద, సామాన్యులు కొనలేని స్థాయికి చేరింది. ఒక్క రోజులోనే రూ.2,430 పెరిగింది. మునుపెన్నడూ లేని స్థాయిలో 10 గ్రాముల అపరంజి రూ.88,000 మార్క్‌ను దాటేసింది. ట్రంప్ టారిఫ్ యుద్ధ భయాలు, రూపాయి పతనం పసిడి ధరలను ఎగిసిపడేలా చేస్తోన్నాయి. సోమవారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర రూ.88,500గా పలికిందని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. గత వారం ముగింపు నాటికి అపరంజి ధర రూ.86,070గా నమోదయ్యింది. కిలో వెండిపై రూ.1,000 పెరిగి రూ.97,500గా పలికింది. అపరంజి ఒక్క పూటలోనే రూ.2వేల పైగా పెరగడం ఆందోళనకరం. ప్రపంచ మార్కెట్‌లోనూ స్పాట్‌గోల్డ్ ఔన్స్ ధర రూ.2,900 డాలర్లను దాటేసింది. ఔన్స్ ధర 3,000కే చేరొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ పరిణమాలు, వరుసగా పడిపోతున్న రూపాయి విలువ బంగారం ధర పెరుగుదలకు కారణమని ఆలిండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. అమెరికా దిగుమతి చేసుకునే అల్యూమినియం, స్టీల్‌పై 25 శాతం సుంకం విధిస్తామని అధ్యక్షుడు ట్రంప్ పేర్కొనడంతో బంగారం ధర భగ్గుమంది. ట్రంప్ వాణిజ్య యుద్ధ భయాలతో సురక్షిత పెట్టుబడి సాధనంగా భావించే బంగారానికి డిమాండ్‌ను పెంచింది. టారిఫ్‌లు పెరిగితే ద్రవ్యోల్బణం పెరిగి, ఆర్థిక వృద్ధి మందగిస్తుందన్న భయాలు బంగారానికి డిమాండ్ పెంచుతున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## దలాల్ స్ట్రీట్‌కు ట్రంప్ టారిఫ్ సెగ

- సెన్సెక్స్ 548 పాయింట్ల పతనం
- రూ.6 లక్షల కోట్ల సంపద ఆవిరి



**ముంబయి :** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజా టారిఫ్ హెచ్చరికలు భారత మార్కెట్లను మరింత ఒత్తిడికి గురి చేశాయి. దీనికి తోడు ఎఫ్ఐఐలు తరలిపోవడం, రూపాయిపై ఒత్తిడి నేపథ్యంలో సోమవారం బీఎస్ఈ సెన్సెక్స్ 548 పాయింట్లు లేదా 0.70 శాతం క్షీణించి 77,312కు పరిమితమయ్యింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 178 పాయింట్లు లేదా 0.76 శాతం కోల్పోయి 23,382 వద్ద ముగిసింది. దీంతో వరుసగా నాలుగో సెషన్‌లోనూ దలాల్ స్ట్రీట్ నష్టాలు చవి చూసినట్లయ్యింది. మోడీ సర్కార్ ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్, ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు మార్కెట్లలో విశ్వాసాన్ని నింపలేకపోవడం విశేషం. సోమవారం సెషన్‌లో బ్లూ చిప్ స్టాక్స్ బ్యాంకింగ్, మెటల్, ఆయిల్ షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. 'అమెరికా టారిఫ్ ముప్పు ఇన్వెస్టర్లు, మార్కెట్ల సెంటిమెంట్‌పై ప్రభావం చూపింది. రిస్కు అసెట్స్‌లో పెట్టుబడులు పెట్టడం కంటే సురక్షిత పెట్టుబడి మార్గం బంగారంలో పెట్టుబడులకు ఇన్వెస్టర్లు ప్రాధాన్యం ఇస్తున్నారు' అని జియోజిత్ ఫైనాన్సియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ పేర్కొన్నారు. బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.6 లక్షల కోట్లు ఆవిరి కావడంతో రూ.418 లక్షల కోట్ల వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టాటా స్టీల్, జొమాటో, టైటాన్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు అధిక నష్టాలు చవి చూశాయి. కోటక్ మహీంద్రా బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఐసీఐసీఐ బ్యాంక్, టెక్ మహీంద్రా షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. దేశీయ మార్కెట్‌లో విదేశీ మదుపర్ల అమ్మకాలు కొనసాగుతున్నాయి. అమెరికన్ డాలర్ బలపడడం, అక్కడి పదేండ్ల బాండ్ల రాబడులు 4.4 శాతం పైనే ఉండటంతో ఎఫ్ఐఐలు తరలిపోతున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు.

## మరిన్ని నిధులను సమీకరిస్తాం..

- నియామక ప్రక్రియలో ఎఐకి శ్రీకారం
- జెడ్‌ఇంటర్వ్యూ ఎఐ సీఈఓ సిద్దరామ్



**నవ తెలంగాణ - హైదరాబాద్**

తమ సంస్థ విస్తరణ, వృద్ధి కోసం మరిన్ని నిధులను సమీకరించే యోచనలో ఉన్నామని జెడ్‌ఇంటర్వ్యూ ఎఐ వ్యవస్థాపకుడు, సీఈఓ సిద్దరామ్ శింగశెట్టి అన్నారు. ఇప్పటికే దాదాపు రూ.1.70 కోట్ల (2 లక్షల డాలర్లు) ఫండింగ్ సమీకరించామని చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ సంస్థ సహ వ్యవస్థాపకుడు విజేందర్ జైన్‌తో కలిసి సిద్దరామ్ మాట్లాడారు. రిక్తం టెక్నాలజీకి చెందిన తమ జెడ్‌ఇంటర్వ్యూఎఐ సంస్థ నియామక ప్రక్రియలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని చెప్పారు. హెచ్‌ఆర్ రంగంలో ఎఐ ఆధారిత 'జెడ్‌ఇంటర్వ్యూఎఐ'ని ఆవిష్కరించామని చెప్పారు. కృత్రిమ మేధస్సును ఉపయోగించి టాలెంట్ హైరింగ్‌ను సులభతరం చేయడం ద్వారా సంస్థలు సమయాన్ని, వనరులను ఆదా చేసుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్ నియామకాల మార్కెట్ 2022 నాటికి 11.38 బిలియన్ డాలర్లుగా ఉందని.. ప్రతీ ఏడాది 15.35 శాతం పెరుగుతోందని.. 2032 నాటికి 41.14 బిలియన్లకు చేరొచ్చని అంచనా వేశారు. ఈ ఎఐ 15 పైగా భాషల్లో ఇంటర్వ్యూలు నిర్వహించగలదన్నారు. అందులో అనేక భారతీయ భాషలు కూడా ఉన్నాయని తెలిపారు.

## ఐస్ మేక్ రిఫ్రిజిరేషన్ రెవెన్యూలో 34 శాతం వృద్ధి



**హైదరాబాద్ :** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 34 శాతం వృద్ధితో రూ.110.56 కోట్ల రెవెన్యూ సాధించినట్లు ఐస్ మేక్ రిఫ్రిజిరేషన్ లిమిటెడ్ (ఐస్‌మేక్) వెల్లడించింది. ఇదే సమయంలో నికర లాభాలు 39 శాతం పెరిగి రూ.2.81 కోట్లుగా నమోదయ్యాయని ఆ కంపెనీ సిఎండి చంద్రకాంత్ పటేల్ తెలిపారు. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3లో రూ.1.28 కోట్ల లాభాలు ప్రకటించింది. ఐస్‌మేక్ దేశంలో 50కి పైగా రకాల రిఫ్రిజరేషన్ పరికరాలను తయారు చేస్తోంది. ఆధునిక కూలింగ్ సొల్యూషన్లు అందిస్తోంది. బలమైన మార్కెట్ డిమాండ్, ఆపరేషనల్ సామర్థ్యాల కారణంగా గడిచిన త్రైమాసికంలో మెరుగైన ఆదాయ వృద్ధిని సాధించినట్లు చంద్రకాంత్ తెలిపారు.

## అమెజాన్‌లో 'రూ.99 ప్యార్ బజార్'

**బెంగళూరు :** ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్‌లో వాలెంటైన్ డే సందర్భంగా రూ.99తో ప్రారంభమయ్యే 'ప్యార్ బజార్' సెలక్షన్‌ను ప్రారంభించినట్లు ఆ సంస్థ పేర్కొంది. ఇందులో ఫ్యాషన్, గృహాలంకరణ, వంటగది ఉత్పత్తులు, ఫోన్ యాక్సెసరీలపై భారీగా తగ్గింపు ధరలను పొందవచ్చని పేర్కొంది. వాలెంటైన్స్ డే కోసం కావలసినవి అన్నీ అమెజాన్ బజార్ వారి ప్రత్యేకంగా రూపొందించిన ప్యార్ బజార్ విభాగంలో లభిస్తాయని పేర్కొంది.

# కేరళతో పాటు దక్షిణాదిని విస్మరించారు

- పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రతిపక్ష సభ్యులు నిలదీత
- గ్రామీణ భారతం నిర్లక్ష్యం : సీపీఐ(ఎం) ఎంపీ వి.శివదాసన్



**నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో**

కేంద్ర బడ్జెట్ దేశంలోని సామాన్యులకు, రైతులకు హాని కలిగిస్తోందని పార్లమెంటు ఉభయ సభలలో ప్రతిపక్ష సభ్యులు విమర్శించారు. బడ్జెట్ చర్చ సందర్భంగా బీహార్, ఇతర రాష్ట్రాలకు ప్రోత్సాహమిచ్చినప్పటికీ, కేరళతో సహా దక్షిణ భారత రాష్ట్రాలను విస్మరించారని విమర్శలు వచ్చాయి. మంగళవారం బడ్జెట్ చర్చకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమాధానమిస్తారు. బడ్జెట్ సమావేశాల మొదటి దశ గురువారం వరకు కొనసాగాల్సి ఉన్నప్పటికీ, మంగళవారం బడ్జెట్ సమాధానంతో ఇది ముగిసే అవకాశమున్నది.

రాజ్యసభలో జరిగిన చర్చలో సీపీఐ(ఎం) ఎంపీ వి. శివదాసన్ మాట్లాడుతూ.. వాయనాడ్ ఇప్పటికీ కేరళకు కన్నీటి దారగా మిగిలిపోయిందనీ, బడ్జెట్‌లో కూడా కేంద్రం దానిని నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు. వాయనాడ్ భారత గణతంత్రంలో భాగం కాదన్న కేంద్రం వైఖరి తేటతెల్లంమవుతున్నదని తెలిపారు. గ్రామీణ భారతం నిర్లక్ష్యం చేయబడిందన్నారు. ప్రకటించిన ప్రాజెక్టులలో దేనికీ నిధులు కేటాయించలేదనీ, ఉపాధి హామీ పథకంలో ఎలాంటి పెరుగుదలా ఉండదని అన్నారు. 2020-21 సంవత్సరానికి కేటాయించిన ప్రాజెక్టుకు ప్రస్తుతం రూ.86,000 కోట్లు మాత్రమే అందిస్తున్నారని తెలిపారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూపాయి విలువ పతనమవుతోందనీ, ప్రభుత్వ రంగ సంస్థలు పెద్దఎత్తున అమ్మేందుకు సిద్ధమవుతున్నాయని అన్నారు. మధ్యాహ్న భోజన పథకానికి ఇక డబ్బులు లేవనీ, పంటల బీమాకు కేటాయింపులు తగ్గించారని తెలిపారు. ఎరువుల సబ్సిడీ, దళిత, ఆదివాసీ స్కాలర్‌షిప్ పథకాలను తగ్గించారని ఆందోళన వ్యక్తం చేశారు. సంక్షేమ పెన్షన్లలో ఎటువంటి పెరుగుదలా ఉండదని శివదాసన్ అన్నారు.

# 22, 23 తేదీల్లో శిక్షణా తరగతులకు రండి

- లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న, డిప్యూటీ స్పీకర్ రఘురామ ఆహ్వానం

**నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో**

ఫిబ్రవరి 22, 23 తేదీల్లో నిర్వహించే ఎమ్మెల్యేల శిక్షణా తరగతులకు రావాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడిని ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు ఆహ్వానించారు. సోమవారం నాడిక్కడ ఏపీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయ్యన్న పాత్రుడు, రఘురామ మాట్లాడుతూ.. ఈనెల 24 నుంచి ఏపీలో బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించుకున్నామన్నారు. ఈలోపు ఎమ్మెల్యేలకు విజయవాడలో ఒక ట్రైనింగ్ క్యాంప్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపారు. రాష్ట్రంలో 174 మందిలో 84 మంది మొదటిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారనీ, వారందరికీ చట్ట సభల్లో ఎలా వ్యవహరించాలన్న దానిపై శిక్షణనిస్తే బాగుంటుందని లోక్‌సభ స్పీకర్‌కు తెలిపామన్నారు. అందుకు స్పీకర్ ఓం బిర్లా సానుకూలంగా స్పందించారని చెప్పారు. గత ప్రభుత్వ హయంలో ఐదేండ్లలో 61 రోజులు మాత్రమే అసెంబ్లీ సమావేశాలు జరిగాయనీ, ఏడాదికి కనీసం 75 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు జరపాలనీ, అప్పుడే సభ్యులు ప్రజా సమస్యలపై చర్చించే అవకాశముంటుందని అన్నారు.

వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మొదటి నుంచీ అసెంబ్లీకి రావాలని కోరానని, ఆయన సమావేశాలకు రావడం లేదని తెలిపారు. ఆయనకు అవగాహన ఉందో లేదో అర్థం కావడం లేదని వివరించారు. చంద్రబాబు నాయుడుకు ఇచ్చిన సమయం తనకూ ఇవ్వాలని జగన్ అంటున్నారని తెలిపారు. ఆయన ప్రతిపక్ష నాయకుడు కాదనీ, ఆయనకు ప్రజలు ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని వివరించారు. జగన్మోహన్ రెడ్డి కూడా ఎమ్మెల్యేల అవగాహన సదస్సులో పాల్గొనాలనీ, ప్రజల చేత ఎన్నుకోబడిన నేతల ప్రవర్తన బాగుండాలన్నారు. సభను హుందాగా జరిపేందుకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. అన్నిపార్టీల శాసన సభా పక్ష నేతలు అవగాహన కార్యక్రమానికి హాజరు కావాలని అన్నారు.

# విద్యా కాషాయీకరణలో భాగమే యూజీసీ ముసాయిదా

- ఆ ప్రతిపాదనలను వెనక్కి తీసుకోవాలి
- విశ్వవిద్యాలయాలపై సంఘ్‌పరివార్ కుట్రలను తిప్పికొడతాం : ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి దినేష్ సిరంగరాజ్

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

విద్యా కాషాయీకరణలో భాగంగానే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ముసాయిదాను తెచ్చిందని ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ సిరంగరాజ్ విమర్శించారు. అందులో భాగంగానే విద్యా కాషాయీరణ, కేంద్రీకరణ, కార్పొరేటీకరణ, వ్యాపారీకరణను ప్రోత్సహించే నిర్ణయాలు చేస్తున్నదని అన్నారు. యూజీసీ ముసాయిదా ప్రతిపాదనలు ఉన్న విద్యారంగాన్ని నిర్వీర్యం చేసేలా ఉన్నాయనీ, వాటిని వెంటనే వెనక్కి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్ ఉన్న సత్యనారాయణరెడ్డి భవన్‌లో ఏఐఎస్ఎఫ్ జాతీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విద్యావిధానం (ఎన్ఈపీ-2020) పేరుతో విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే కుట్ర కేంద్ర ప్రభుత్వం చేస్తున్నదని విమర్శించారు. ప్రభుత్వ విద్యారంగాన్ని ధ్వంసం చేయడానికి, ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్న వారినే విశ్వవిద్యాలయాల వీసీలుగా నియమించడానికి తీసుకుంటున్న చర్యలని అన్నారు. వర్సిటీల్లో ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. విద్యారంగానికి జీడీపీలో ఆరు శాతం, కేంద్ర బడ్జెట్‌లో పది శాతం నిధులు కేటాయించకుండా వివక్ష చూపుతున్నదని చెప్పారు. వీసీల ఎంపికలో గవర్నర్లకు ప్రాధాన్యత ఇవ్వడం ప్రమాదకరమని అన్నారు. ఎన్ఈపీ-2020ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. యూజీసీ ముసాయిదా మార్గదర్శకాలను వెనక్కి తీసుకోవాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు విరాజ్ దేవాంగ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఎన్ఏ స్టాలిన్, సంఘమిత్ర జెనా, సహాయ కార్యదర్శులు కె శివారెడ్డి, కబీర్, హమీమ్ హంజా, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# పాతబస్తీలో భారీ అగ్ని ప్రమాదం

- మదీనా అబ్బాస్ టవర్స్‌లో ఘటన
- నాలుగు అంతస్తులకు పాకిన మంటలు
- కోట్లల్లో నష్టం



**నవతెలంగాణ - ధూల్‌పేట్**

హైదరాబాద్ పాతబస్తీ మదీనా చౌరస్తా సమీపంలోని దివాన్ దేవిడి ప్రాంతంలో సోమవారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో సుమారు 50 దుకాణాల వరకు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.60 కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగిందని ప్రాథమికంగా గుర్తించినట్టు నిర్వాహకులు తెలిపారు. అగ్నిమాపక అధికారులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దివాన్ దేవిడిలోని మదీనా అబ్బాస్ టవర్‌లో సుమారు 400 వరకు హోల్‌సేల్ వస్త్ర దుకాణాలు న్నాయి. ఆదివారం రాత్రి నిర్వాహకులు తమ కార్యకలాపాలు ముగించుకుని వెళ్లిపోయారు. సోమవారం తెల్లవారుజామున సుమారు 2గంటల సమయంలో ఒక భవనంలో 4వ అంతస్తులో మంటలు రావడం గమనించిన వాచ్‌మెన్ వెంటనే మొఘల్‌పుర అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకురావడానికి తీవ్రంగా శ్రమించారు. బట్టల షాపులు కావడంతో త్వరగా మంటలు అదుపులోకి రాలేదు. డిస్ట్రిక్ అగ్నిమపక అధికారి వెంకన్న ఆదేశాలతో హైకోర్టు, యాకుత్‌పుర, సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, మలక్‌పేట్, సాలర్‌జంగ్ మ్యూజియం, రాజేంద్రనగర్ ఏరియాల నుంచి అగ్ని మాపక వాహనాలను రప్పించి అదుపు చేయడానికి ప్రయత్నించారు. అగ్నిమాపక శాఖకు చెందిన సుమారు 60 మంది సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకురావడానికి శ్రమించారు. 4వ అంతస్తులో రాజుకున్న మంటలు క్రమేణా సెల్లార్‌లోని బి2గ్రౌండ్‌లోని దుకాణాల వరకు వ్యాపించాయి. తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఇదిలా ఉండగా, టవర్స్‌లో నివసిస్తున్న వాచ్‌మెన్ కుటుంబాన్ని రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి కాపాడారు. ప్రమాదానికి విద్యుద్ఘాతమే కారణమని ప్రాథమికంగా గుర్తించినట్టు అధికారులు తెలియజేశారు.

# శిక్షలు పడితేనే నేరస్తుల్లో భయం

- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి.కమలాసన్‌రెడ్డి

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

నేరస్తులకు శిక్షలు పడితేనే వారిలో భయం ఏర్పడుతుందనీ, అప్పుడే వారు భవిష్యత్‌లో నేరాలకు పాల్పడకుండా ఉంటారని తెలంగాణ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి.కమలాసన్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని అబ్కారీ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ కేసుల్లో నేరస్తులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకున్న 28 మంది సిబ్బందికి ఆయన నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని డ్రగ్‌ఫ్రీగా చేయాలని ఇచ్చిన ఆదేశాల మేరకు అందరూ నిబద్ధతతో పని చేయాలంటూ సూచించారు. ఆబ్కారీ శాఖ తనిఖీల్లో పట్టుబడిన నిందితులపై కేసు నమోదు నుంచి తీర్పు వచ్చే వరకు పకడ్బందీగా వ్యవహరించాలని ఆదేశించారు. పోలీసుశాఖలో పనిచేసే సిబ్బంది తరహాలో పనిచేసేలా తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ ఇప్పించే కార్యక్రమం చేపట్టామని తెలిపారు. దీని ద్వారా భవిష్యత్‌లో కేసుల పురోగతిలో ఆశించిన ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. 2024లో పది కేసుల్లో శిక్షలు పడడం మంచి పరిణామమని పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరింత నిబద్ధతతో పని చేయడం ద్వారా నేరస్తులకు శిక్షలు పడేలా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ ఖురేషీ, అసిస్టెంట్ కమిషనర్ ప్రణవీ, అడిషనల్ ఎస్పీ భాస్కర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్లు ప్రదీప్‌రావు, నంద్యాల అంజి రెడ్డి, డీఎస్పీ తిరుపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు ఓటేసింది..భూములు లాక్కోడానికి కాదు

- రేపటి గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌ను అడ్డుకుంటాం
- మహాపడావ్‌లో నాయకులు



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

కర్నాటకలో ప్రజలు బీజేపీని కాదని కాంగ్రెస్‌కు ఓటు వేసింది భూములు లాక్కోడానికి కాదని పలువురు వక్తలు విమర్శించారు. సోమవారం కర్నాటక రాజధాని బెంగళూరులో కర్నాటక ప్రాంతీయ రైతు సంఘం (కేఆర్పీఎస్), అఖిల భారత వ్యవసాయ సంఘం కర్నాటక రాష్ట్ర యూనిట్ ఆధ్వర్యంలో అక్కడి రైతులు, వ్యవసాయ కార్మికులు నిరవధిక సామూహిక నిరసన ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు క్రిష్ణన్, ఏఐఏడబ్ల్యూయూ బి.వెంకట్ మద్దతుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బలవంతపు భూసేకరణను అడ్డుకుంటామనీ, భూపంపిణీ కోసం పోరాడుతామని చెప్పారు. భూమి, ఉపాధి సమస్యలను పరిష్కరించకుండా బుధవారం నుంచి జరిగే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌ను అడ్డుకుంటామని హెచ్చరించారు. వేలాది మంది రైతులు, వ్యవసాయ కార్మికులతో ప్రారంభమైన మహాపడావ్‌ను ఉద్దేశించి వారు మాట్లాడుతూ భూసేకరణ, భూ పంపిణీ వంటి అంశాలపై బీజేపీ, కాంగ్రెస్‌కు తేడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగ రక్షణ అంటే భూములను లాక్కోవటం కాదని గుర్తుచేశారు. నిరసనలో భాగంగా మూడ్రోజులు ఫ్రీడం పార్క్‌లోనే వంటావార్పు, బస ఉంటుందని తెలిపారు. పెట్టుబడి పేరుతో భూసేకరణను సులభతరం చేసే ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కర్నాటక నలుమూలల నుంచి పది వేల మందికిపైగా రైతులు మరియు వ్యవసాయ కార్మికులు సమావేశమయ్యారు. భూమి, గృహ హక్కులు, పంటలకు గిట్టుబాటు ధరలు, ఏపీఎంసీని బలోపేతం చేయడం, రుణమాఫీ, ఎంజీఎన్ఆర్ఈజీఏ కింద 200 రోజుల పని, కార్పొరేట్ లాభాపేక్ష కోసం భూసేకరణకు వ్యతిరేకంగా డిమాండ్ చేస్తూ వారు సమావేశ మయ్యారు. రాష్ట్రం లోని కాంగ్రెస్ ప్రభుత్వం గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్‌ను నిర్వహిస్తున్న రోజున, కర్నాటక ప్రాంతీయ రైతు సంఘం (ఏఐకేఎస్‌కు అనుబంధం), కర్నాటక ప్రాంతీయ కృషి కూలికరారా సంఘం (ఏఐఏడబ్ల్యూయూకు అనుబంధం) సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ నిరవధిక నిరసన కార్పొరేట్ దోపిడీకి వ్యతిరేకంగా ఒక ముఖ్యమైన సందేశమని విజ్జు క్రిష్ణన్, వెంకట్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కేపీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి టి.యశ్వంత, ఏఐఏడబ్ల్యూయూ రాష్ట్ర కార్యదర్శి చంద్రప్ప హొసకెరె, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీ.ఎస్.నాగరాజ్, కేపీఆర్ఎస్ ఉపాధ్యక్షులు యు.బసవరాజ్, వెంకటాచలయ్య, సీఐటీయూ నాయకులు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి కె..ప్రకాష్, ఇతరులు సంఘీభావంగా ప్రసంగించారు. నవీన్ కుమార్ సభకు స్వాగతం పలికారు.

## కొత్త పర్యాటక ప్రాంతాలను గుర్తించండి

- టూరిజం పాలసీ -2025లో పొందుపర్చండి : అధికారులకు సీఎస్ శాంతి కుమారి ఆదేశం

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

కొత్త ప్రాంతాలు, వారసత్వ కట్టడాలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకురానున్న నూతన టూరిజం పాలసీ -2025లో పొందుపర్చాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో పర్యాటక శాఖపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఎకో, టెంపుల్, హెల్త్ టూరిజం ప్రాజెక్టులను అభివృద్ధి చేసి, పర్యాటకులను భారీ ఎత్తున ఆకర్షించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్ నగరంలోని పలు చారిత్రక కట్టడాల సందర్శనకు వచ్చే పర్యాటకుల కోసం ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్డు పరిసర ప్రాంతాలను సందర్శించేందుకు స్కై వాక్ ప్రాజెక్టును చేపట్టాలని సీఎస్ అధికారులకు సూచించారు. ఇతర రాష్ట్రాల్లో అమల్లో ఉన్న టూరిజం పాలసీలను అధ్యయనం చేసి యువజన, పర్యాటక శాఖ రూపొందించిన టూరిజం పాలసీ-2025పై అధికారులు సీఎస్‌కు వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.శ్రీనివాసరాజు, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, పీసీసీఎఫ్ ఆర్ఎం.డోబ్రియాల్, ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శులు ఎస్.సంగీత, చంద్రశేఖర్‌రెడ్డి, ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ప్రకాష్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## వారంలో గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలు!

- ముగిసిన జవాబు పత్రాల మూల్యాంకనం

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ ముగిసింది. వారంరోజుల్లో గ్రూప్-1 ఫలితాలను విడుదల చేయాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది. 1:2 నిష్పత్తిలో మెరిట్ జాబితాను విడుదల చేయాలని భావిస్తున్నది. ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన చేపడుతుంది. గ్రూప్-1 మెయిన్స్‌కు రాష్ట్రవ్యాప్తంగా 31,403 మంది అభ్యర్థులు ఎంపికైన విషయం తెలిసిందే. వారిలో 21,093 మంది మెయిన్స్‌కు హాజరయ్యారు. 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి గతేడాది ఫిబ్రవరి 19న గ్రూప్-1 నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే. గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్షను జూన్ తొమ్మిదిన నిర్వహించింది. ఈ పరీక్షకు 4.03 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 3.02 లక్షల మంది హాజరయ్యారు. హైకోర్టు ఆదేశాలతో కలిపి 31,403 మంది అభ్యర్థులు గ్రూప్-1 మెయిన్స్‌కు ఎంపికయ్యారు. ఆ తర్వాతే గ్రూప్-2, గ్రూప్-3 ఫలితాలను ప్రకటించాలని టీజీపీఎస్సీ భావిస్తున్నది.

## ఉర్దూ అకాడమి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

- సీఎం రేవంత్‌రెడ్డికి కంప్యూటర్ కం లైబ్రరీస్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ లేఖ

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలో పనిచేస్తున్న ఉర్దూ అకాడమి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమి కంప్యూటర్ కం లైబ్రరీస్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సోమవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అఫ్సాన్ అబ్రార్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అఖీల్ లేఖ రాశారు. ఉర్దూ అకాడమిలో కాంట్రాక్టు కన్సాలిడెట్ ఉద్యోగులుగా 1991-92లో నియామకమయ్యామని వివరించారు. కంప్యూటర్ ఫ్యాకల్టీ, లైబ్రరీస్, ఆఫీస్ సబార్డినేట్‌గా 15 నుంచి 35 ఏండ్లుగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. కొత్త జిల్లాలు ఏర్పడినందున 2016 నుంచి తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ పరిధిలో జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ (డీఎండబ్ల్యూవో), వక్ఫ్ ట్రిబ్యునల్ కోర్టులతోపాటు మైనార్టీ గురుకులాల్లో విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. పిల్లల ప్రవేశాలు, రంజాన్, క్రిస్మస్ బట్టల పంపిణీలో సబ్సిడీ రుణాలు, అన్ని ఎన్నికల విధులను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. చాలీచాలనీ జీతాలతో జీవనం సాగిస్తున్నామని వివరించారు. రూ.ఐదు వేల నుంచి రూ.8,500 జీతాలతో పనిచేస్తున్నామని తెలిపారు. ఇంత వరకు పీఆర్సీ 2016 జీవో నెంబర్ 14 ప్రకారం కనీస వేతనాలను ఇవ్వలేదని పేర్కొన్నారు. ఇప్పుడైనా పీఆర్సీ 2016, 2021 ప్రకారం జీవో నెంబర్ 60లోని కనీస వేతనాలను, బకాయిలతో సహా అమలు చేయాలని కోరారు. తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి ఉర్దూ అకాడమికి బదిలీ చేయాలని సూచించారు. మానవతా దృక్పథంతో ఆలోచించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## వైద్యారోగ్యశాఖ మంత్రిగా పని చేసి అక్రమ వైద్యులకు మద్దతిస్తారా?

- మాజీ మంత్రి హరీశ్‌రావుపై జూడా ఆగ్రహం

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

అక్రమ వైద్యులకు మద్దతు ఇవ్వడం పట్ల వైద్యారోగ్యశాఖ మాజీ మంత్రి టి.హరీశ్‌రావుపై తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు సోమవారం టీజూడా అధ్యక్షులు డాక్టర్ కొమ్ము రాహుల్, ప్రధాన కార్యదర్శి జె.ఐజాక్ న్యూటన్, చైర్‌పర్సన్ డాక్టర్ డి.శ్రీకాంత్ ఒక ప్రకటన విడుదల చేశారు. పల్లె దవాఖానాలు, బస్తీ దవాఖానాలున్నాయనీ, ఇంకా ప్రజలకు నకిలీ వైద్యులు, అశాస్త్రీయ వైద్యం చేసే వారితో పని లేదని తెలిపారు. ఆర్ఎంపీ, పీఎంపీలు గుర్తింపు కోరుతూ నిరసనలు తెలపడాన్ని ఖండించారు. నకిలీ వైద్యులు, వారికి సహకరించే వారిని తక్షణమే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## అపాయింట్‌మెంట్ ఇవ్వండి..

- ఏకసభ్య కమిషన్ నివేదికలోని అభ్యంతరాలను తెలియజేస్తాం : మంద కృష్ణ మాదిగ

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ నివేదికలోని అంశాలపై చర్చించేందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని కోరుతూ సీఎం రేంవత్‌రెడ్డికి ఎంఆర్పీఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ సోమవారం లేఖ రాశారు. ఎస్సీ వర్గీకరణకు సానుకూల నిర్ణయాన్ని తీసుకోవటాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు.

జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ సమర్పిం చిన నివేదికలో ఉన్న లోపాల వల్ల మాదిగలు, మరికొన్ని దళిత కులాల హక్కులు, వాటా, అస్థిత్వం, భవిష్యత్తు ప్రమాదంలో పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ అంశాలపై సీఎంతో చర్చించడానికి అవకాశం ఇవ్వాలని కోరారు.

## ఏటా 10 లక్షల ఉద్యోగాల కోసం ఫౌండ్‌ఇట్‌తో కేంద్ర కార్మిక శాఖ ఒప్పందం

**న్యూఢిల్లీ :** యువ అభ్యర్థులకు ఏటా 10 లక్షలకు పైగా ఉద్యోగాలు కల్పించడం కోసం ప్రముఖ ఉద్యోగ పోర్టల్ ఫౌండ్‌ఇట్‌తో కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ ఒప్పందం కుదుర్చుకుంది. కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రి మన్సుఖ్ మాండవీయ సమక్షంలో ఈ అవగాహన ఒప్పందం (ఎంఓయు)పై సంతకాలు జరిగాయి. నేషనల్ కెరీర్ సర్వీస్ (ఎన్‌సిఎస్) పోర్టల్‌లో నమోదు చేసుకున్న ఉద్యోగార్థులకు అంతర్జాతీయ, దేశీయ ఉపాధి కల్పించడమే ఒప్పందం లక్ష్యమని మంత్రిత్వ శాఖ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. ఈ ఒప్పందం సందర్భంగా మంత్రి మాండవీయ మాట్లాడుతూ ఎన్‌సిఎస్ పోర్టల్‌ను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అందుబాటులో ఉన్న అనేక కెరీర్ అవకాశాలను పూర్తిగా వినియోగించుకోవాలని కోరారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ వద్ద నమోదు చేసుకున్న 500 కంటే ఎక్కువ క్రియాశీల నియామక ఏజెన్సీలను ఎన్‌సిఎస్ పోర్టల్‌తో అనుసంధానం చేసినట్లు మంత్రి తెలిపారు. అలాగే ఎన్‌సిఎస్‌తో మైభారత్, ఎస్ఐడిహెచ్ పోర్టల్లను కూడా అనుసంధానం చేశామని చెప్పారు.

## అర్చకుడిపై దాడి హేయమైన చర్య

- కాంగ్రెస్ ప్రభుత్వంలో శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయి
- నిందితులను కఠినంగా శిక్షించాలి : కేటీఆర్



నవతెలంగాణ-మొయినాబాద్

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం చిలుకూరు బాలాజీ టెంపుల్ ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్‌పై రామరాజ్యం పేరుతో చేసిన దాడి హేయమైన చర్య అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణిస్తున్నాయని ఆరోపించారు. ఇటీవల దాడికి గురైన రంగరాజన్‌ను ఆయన నివాసంలో కేటీఆర్ సోమవారం పరామర్శించారు. ఘటనకు గల కారణాలు, దాడి చేసిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రంగరాజన్‌కు అండగా ఉంటామని భరోసానిచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చిలుకూరులో రెండు రోజుల క్రితం కొందరు వ్యక్తులు రంగరాజన్‌పై దాడి చేయడం అత్యంత దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతల పరిస్థితికి ఈ దాడి ఘటనే నిలువెత్తు నిదర్శనమని అన్నారు. దాడి చేసిన వారు ఏ ముసుగులో ఉన్నా, ఏ ఎజెండాతో ఇలాంటి దారుణానికి ఒడిగట్టినా, వారిని ఉక్కుపాదంతో అణచివేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. చిలుకూరు బాలాజీ టెంపుల్‌కు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది భక్తులు వస్తుంటారని గుర్తు చేశారు. స్వామివారి సేవలో నిమగ్నమైన కుటుంబాన్ని అవమానించడం అంటే అది దేవుడినే అవమానించినట్టేనని, కాబట్టి ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. నిందితులందరినీ వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. రంగరాజన్ కుటుంబ సభ్యులకు పూర్తిస్థాయి భద్రత కల్పించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రంగరాజన్ కుటుంబ సభ్యులకు తాము పూర్తిస్థాయిలో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, బాల్క సుమన్, పార్టీ నాయకులు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, కొంపల్లి అనంతరెడ్డి, తదితరులు ఉన్నారు.

## తెలంగాణ స్కిల్ వర్సిటీకి నిధులివ్వలేం

- కేంద్రమంత్రి జయంత్ చౌదరి సమాధానం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నెలకొల్పుతున్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు నిధులివ్వలేమని కేంద్రం స్పష్టం చేసింది. ఈ వర్సిటీ ఏర్పాటుకు నిధులిచ్చేలా కేంద్రంలో ఎలాంటి పథకమూ లేదని వెల్లడించింది. అయితే ఇతర స్కీంల ద్వారా క్రెడిబిలిటీ కలిగిన సంస్థలకు సహకారం అందిస్తామని సభకు తేల్చి చెప్పింది. సోమవారం లోక్ సభ క్వశ్చన్ అవర్ లో యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీకి కేంద్ర ఆర్థిక సాయం అంశాన్ని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి లేవనెత్తారు. ఈ అంశంపై సప్లిమెంటరీ ప్రశ్నను అడిగారు. విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణను అందించడానికి ఉద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్శిటీని హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా నెలకొల్పుతున్నారని ఎంపీ సభ్యుల దృష్టికి తెచ్చారు. పీపీపీ మోడల్‌లో చేస్తోన్న ఈ వర్సిటీ కోసం 17 ప్రియార్టీ సెక్టార్లు ఐడెంటిటీ చేసినట్టు చెప్పారు. 2025-26 మొదటి ఏడాదిలో రెండు వేల మందికి శిక్షణను అందిస్తాయని తెలిపారు. ఇకపై ప్రతి ఏడాదీ 20 వేల మందికి ట్రైనింగ్ ఇవ్వనున్నట్టు వివరించారు. ఈ వర్సిటీ కోసం సీఎం రూ. 100 కోట్లు రిలీజ్ చేసినట్టు చెప్పారు. అలాగే కార్పస్ ఫండ్ కింద సుమారు రూ. 300 నుంచి రూ.500 కోట్లు సృష్టించనున్నట్టు సభ దృష్టికి తెచ్చారు. అయితే.. ఈ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్శిటీకి తగిన నిధులు సమకూర్చాలని కేంద్రం నుంచి ఏదైనా ప్రతిపాదన ఉందా? అని కేంద్ర మంత్రిని ప్రశ్నించారు. ఇందుకు స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మంత్రి జయంత్ చౌదరి మౌఖికంగా సమాధానమిచ్చారు. రాష్ట్ర చట్టాల ప్రకారం.. చాలా రాష్ట్రాలు స్కిల్ వర్సిటీలను నెలకొల్పుతున్నాయని అన్నారు. అయితే నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ(ఎన్ఈపీ)-2020 ప్రకారం.. ప్రస్తుతం స్కూల్స్‌లో స్కిల్ ఎకో సిస్టం నెలకొల్పడం తమ లక్ష్యమని చెప్పారు. అనంతరం ఉన్నత విద్యపై ఫోకస్ చేయనున్నట్టు తెలిపారు. అండర్ గ్రాడ్యుయేట్ లెవల్‌లో ఇప్పటికే యూజీసీ గైడ్ లైన్స్‌ను రిలీజ్ చేసిందని సభకు వివరించారు.

## ఉన్నతా విద్యా సంస్థల్లో జీఈఆర్

- టాప్‌లో తమిళనాడు, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, కేరళ

**న్యూఢిల్లీ :** ఉన్నత విద్యా సంస్థల్లో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్) సాధన 2021-22లో తమిళనాడు, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, కేరళ ఉత్తమ ప్రదర్శన కనబర్చాయి. ఈ విషయాన్ని సోమవారం విడుదల చేసిన నిటి ఆయోగ్ నివేదిక వెల్లడించింది. 'రాష్ట్రాలు, రాష్ట్ర ప్రభుత్వ విశ్వ విద్యాలయాల ద్వారా నాణ్యమైన ఉన్నత విద్యను విస్తరించడం' అనే పేరుతో ఈ నివేదికను విడుదల చేశారు. ఉన్నత విద్యా సంస్థల్లో (జీఈఆర్) సాధనలో ఛత్తీస్‌గఢ్, నాగాలాండ్, జార్ఖండ్, బీహార్ వెనకబడ్డాయని నివేదిక తెలిపింది. ఫ్రంట్ రన్నర్స్ కేటగిరిలో సిక్కిం, ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, కర్నాటకలను నివేదిక చేర్చింది. ఈ నివేదికను నిటి ఆయోగ్ వైస్-చైర్మెన్ సుమన్ బేరీ విడుదల చేశారు. ఈ నివేదిక ప్రకారం తమిళనాడు, గోవా, కర్ణాటకల్లో విశ్వ విద్యాలయాల్లో విద్యార్థి-ఉపాధ్యాయ నిష్పత్తి అతి తక్కువగా ఉండగా, జార్ఖండ్, బీహార్‌ల్లో ఈ నిష్పత్తి అతి ఎక్కువగా ఉంది. దేశంలో అతి తక్కువగా బీహార్ తన జీఎస్‌డీపీలో కేవలం 1.56 శాతాన్నే ఉన్నత విద్యపైనే ఖర్చు చేసింది. ఇక, కళాశాల సాంద్రత (ఒక లక్ష అర్హత కలిగిన జనాభాకు కళాశాల సంఖ్య)లో 66తో కర్ణాటక మొదటి స్థానంలో ఉంది. ఇది జాతీయ సగటు కంటే రెండు రెట్లు ఎక్కువ కావడం విశేషం. ఈ జాబితాలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, కేరళ ఉన్నాయి. ఈ జాబితాలో మణిపూర్ చివరి స్థానంలో ఉంది. దేశంలో మొత్తంగా 1,168 విశ్వవిద్యాలయాలు ఉండగా, వీటిల్లో 495 రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు (ఎస్‌పీయూ) ఉన్నాయి. కర్నాటకలో అత్యధికంగా 43 ఎస్‌పీయూలు ఉన్నాయి.

## ఇంజినీర్ రషీద్‌కు రెండు రోజుల పెరోల్



**న్యూఢిల్లీ :** జైలు శిక్ష అనుభవిస్తున్న జమ్మూకాశ్మీర్ ఎంపి అబ్దుల్ రషీద్ షేక్ అలియాస్ ఇంజనీర్ రషీద్‌కు ఢిల్లీ హైకోర్టు సోమవారం రెండో రోజుల పెరోల్ మంజూరు చేసింది. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనడం కోసం ఈ నెల 11, 13 తేదీల్లో ఈ పెరోల్ మంజూరు చేసింది. జమ్మూకాశ్మీర్‌లో ఏర్పాటువాదులకు, తీవ్రవాద గ్రూపులకు నిధులు సమకూర్చారనే కేసులో బారాముల్లా స్థానం ఎంపి రషీద్ జైలు శిక్ష అనుభవిస్తున్నారు. ఎన్ఐఎ కోర్టులో బెయిల్ పిటీషన్ తిరస్కరణకు గురికావడంతో హైకోర్టును రషీద్ ఆశ్రయించారు. హైకోర్టు తాత్కాలిక ఉపశమనంగా కస్టడీ పెరోల్‌ను మంజూరు చేసింది. కాగా, పార్లమెంట్ సమావేశాలకు ఒక సభ్యుడు పెరోల్ మీద హాజరుకావడం ఇదే మొదటిసారి కాదు. 2009లో పప్పు యాదవ్ కూడా పెరోల్ మీద పార్లమెంట్ సమావేశాలకు హాజరయ్యారు.

# వాయిదా

- పార్టీ ఫిరాయింపుల పిటిషన్లపై 18న విచారణ : సుప్రీం ధర్మాసనం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్టీ ఫిరాయింపులపై దాఖలైన పిటిషన్లపై విచారణను సుప్రీంకోర్టు ఈ నెల 18కి వాయిదా వేసింది. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలపై త్వరగా చర్యలు తీసుకోవాలని కోరుతూ గతనెల 15న బీఆర్ఎస్.. సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, దానం నాగేందర్‌లపై ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కె.వి వివేకానంద్‌లు స్పెషల్ లీవ్ పిటిషన్(ఎస్ఎల్‌పీ)ను దాఖలు చేశారు. మిగిలిన ఏడుగురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, అరెకపూడి గాంధీలపై కేటీఆర్ రిట్ పిటిషన్ దాఖలు చేశారు.

ఈ పిటిషన్లపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.ఆర్ గవాయి, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరపు సీనియర్ అడ్వొకేట్ అర్యమ సుందరం, నాయుడు, మోహిత్ రావులు హాజరయ్యారు. అర్యమ సుందరం వాదనలు వినిపిస్తూ.. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై 10 నెలలు గడుస్తోన్న స్పీకర్ ఎలాంటి చర్యలూ తీసుకోలేదని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం, 10వ షెడ్యూల్, అసెంబ్లీకి ఐదేండ్ల గడువును దృష్టిలో పెట్టుకుని స్పీకర్ నిర్దిష్ట గడువులోగా చట్ట ప్రకారం నిర్ణయం తీసుకోవాలని సుందరం అన్నారు. ఐదేండ్ల చట్టసభ పదవీ కాలం ముగిసే వరకు మీనమేషాలు లెక్కించడానికి వీల్లేదన్నారు. రీజనబుల్ టైం అనేదానికి నిర్దిష్ట గడువును సుప్రీంకోర్టు నిర్దేశించిందని గుర్తు చేశారు. మూడు నెలల్లోగా స్పీకర్ తన ముందున్న ఫిరాయింపుదారులపై ఫిర్యాదులను పరిష్కరించాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. ఈ మేరకు కేశం మేఘా చంద్ర కేసులో జారీ చేసిన ఉత్తర్వులు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ అమలు చేసేలా ఉత్తర్వులివ్వాలని కోరారు.

అలాగే పార్టీ ఫిరాయించిన ఒక ఎమ్మెల్యే ఏకంగా కాంగ్రెస్ కండువాపై పోటీ చేయగా.. మరో ఎమ్మెల్యే తన కూతురు కోసం కాంగ్రెస్ కండువా కప్పుకొని ప్రచారం చేశారని చెప్పారు. ఫిరాయింపులు అంతా ఓపెన్‌గానే జరుగుతున్నాయన్నారు. మధ్యలో జోక్యం చేసుకున్న ధర్మాసనం.. విచారణ ప్రచారంపై కాదనీ, పిటిషన్‌లోని అంశాలను ప్రస్తావించాలని సూచించింది. ఈ పిటిషన్‌పై స్పందించేందుకు ఎంత టైం కావాలని ప్రతివాది స్పీకర్ సెక్రెటరీ తరపు సీనియర్ అడ్వొకేట్ ముకుల్ రోహిత్గిని ప్రశ్నించింది. ఇందుకు రోహిత్గి బదులిస్తూ.. మరికొంత సమయం కావాలన్నారు. దీనిపై ధర్మాసనం మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. "టైం అంటే ఎంత. అసెంబ్లీ సెషన్ ముగింపు వరకా? మనం ప్రజాస్వామ్యంలో ఉన్నాం. ఇది ప్రజాస్వామ్య హక్కులకు సంబంధించిన అంశం" అని అభిప్రాయపడింది. అయితే, సంపత్ కుమార్, సుభాశ్ దేశాయ్ కేసులో స్పీకర్ రీజనెబుల్ టైంపై గతంలో సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని రోహిత్గి కోర్టు దృష్టికి తెచ్చారు. అయితే రీజనెబుల్ టైం అంటే ఎంతని రోహిత్గిని జస్టిస్ గవాయి ప్రశ్నించారు. రీజనెబుల్ టైం అంటే రెండు నెలలు, మూడు నెలలు అని ఆ తీర్పులో సర్వోన్నత న్యాయస్థానం చెప్పలేదన్నారు. ఇందుకు ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. 'డిక్షనరీ ప్రకారం... రీజనెబుల్ టైం అంటే ఎంత? 10 నెలలు రీజనెబుల్ టైం కాదా?" అని అడిగింది. స్పీకర్ ఫిర్యాదులే కాకుండా, ఇతర పనులు కూడా చూడాల్సి ఉంటుందని రోహిత్గి వాదనలు వినిపించారు. ఈ అంశాలను పరిగణలోకి తీసుకొని జస్టిస్ గవాయి.. రీజనెబుల్ టైం అంటే ఎంతో రేపు చెప్పాలని ఆదేశించారు. అయితే రోహిత్గి స్పందిస్తూ.. మూడు, నాలుగు రోజులని అడిగారు. ఈ రిక్వెస్ట్‌తో ఈ పిటిషన్లపై విచారణను ఈ నెల 18 వాయిదా వేస్తున్నట్టు ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే చివరగా రీజనెబుల్ వ్యక్తికి రీజనెబుల్ టైమివ్వాలని రోహిత్గి అన్నారు. అంటే ఆ రీజనెబుల్ వ్యక్తి దృష్టిలో రీజనెబుల్ టైం అంటే ఏంటీ? అని ధర్మాసనం కామెంట్ చేసింది.

## మహిళను రాత్రి వేళ అరెస్టు చేస్తే చట్టవిరుద్ధమవదు !

- మద్రాసు హైకోర్టు రూలింగ్

**చెన్నై :** సిఆర్‌పిసిలోని సెక్షన్ 46(4)లో పేర్కొన్న విధంగా జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ అనుమతి లేకుండా రాత్రి వేళల్లో మహిళలను అరెస్టు చేసినంత మాత్రాన ఆ అరెస్టు చెల్లకుండా పోదని, చట్టవిరుద్ధంగా మారదనిమద్రాసు హైకోర్టు వ్యాఖ్యానించింది. ఆ నిషేధమనేది తప్పనిసరిగా పాటించాలిన ఆదేశాలుగా కాకుండా కేవలం నిబంధనలపరమైన ఆదేశాల వరకే చూడాలని ఈ నిర్దేశించిన నిబంధనను పాటించకపోతే జరిగే పర్యవసానాలేమిటో ఆ సెక్షన్‌లో వివరించలేదని జస్టిస్ స్వామినాథన్, జస్టిస్ జోతిరామన్‌లతో కూడిన బెంచ్ పేర్కొంది. ఆ నిబంధనను కచ్చితంగా పాటించాల్సిందే అనే ఉద్దేశ్యమే వుంటే దాన్ని పాటించని పక్షంలో తలెత్తే పర్యవసానాలేమిటో తప్పనిసరిగా చట్టసభ వివరించి వుండేదని బెంచ్ పేర్కొంది. సంబంధిత జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ముందస్తు అనుమతి లేకుండా రాత్రి వేళ ఒక మహిళన అరెస్టు చేసినట్లైతే సదరు పోలీసు అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడాన్ని కోర్టు తోసిపుచ్చింది. నిబంధనలను పాటించడం ముఖ్యమైన అంశమే, కానీ ఒకవేళ పాటించకుండా అరెస్టు చేసినట్లైతే ఆ అరెస్టు చట్టవిరుద్ధమని చెప్పడానికి లేదని కోర్టు పేర్కొంది.

2019 జనవరి 4న తనను రాత్రి 8గంటల సమయంలో అరెస్టు చేయడాన్ని ప్రశ్నిస్తూ విజయలక్ష్మి అనే మహిళ హైకోర్టును ఆశ్రయించింది. దానిపై హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం స్పందిస్తూ ఆ అరెస్టు చట్టవిరుద్ధమైనదని పేర్కొంది. వెంటనే సదరు పోలీసు అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. పైగా ఆ మహిళకు నష్టపరిహారాన్ని ఇవ్వాలని కూడా పేర్కొంది. దీనిపై బాధితులైన సబ్ ఇనస్పెక్టర్, మహిళా హెడ్‌కానిస్టేబుల్ ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ ప్రస్తుత డివిజన్ బెంచ్ ముందుకు వచ్చారు. దీనిపై విచారణ జరిపిన డివిజన్ బెంచ్ ఏకసభ్య ధర్మాసనం నిర్ణయాన్ని తోసిపుచ్చింది. మహిళల రక్షణ కోసం ఆ సెక్షన్‌ను తీసుకువచ్చారని, అంతేకానీ ఒకవేళ అరెస్టు జరిగితే అది చెల్లదని చెప్పడానికి లేదని స్పష్టం చేసింది.

## తప్పుదారి పట్టించే వాణిజ్య ప్రకటనలపై చర్యలేవీ ?

- ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, జమ్మూ కాశ్మీర్ సహా పలు రాష్ట్రాల ముఖ్య కార్యదర్శులకు సుప్రీం చివాట్లు




**న్యూఢిల్లీ :** ఆయుర్వేదిక్, సిద్ధ, యునానీ ఔషధాల గురించి చట్టవిరుద్ధమైన రీతిలో వాణిజ్య ప్రకటనలు గుప్పిస్తున్నవారిపై చర్యలు తీసుకోవడంలో విఫలమైనందుకు ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్, జమ్మూ కాశ్మీర్‌తో సహా పలు రాష్ట్రాల ముఖ్య కార్యదర్శులను సోమవారం పిలిపించిన సుప్రీం కోర్టు వారిని మందలించింది. తమ ఆదేశాలను అమలు చేయడానికి వారు ఎలాంటి చర్యలు తీసుకోలేదని జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన బెంచ్ పేర్కొంది. ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదో వివరించడానికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టులో హాజరు కావాల్సిందిగా బెంచ్ ఆయా రాష్ట్రాల ముఖ్య కార్యదర్శులను ఆదేశించింది. అమికస్ క్యూరీగా హాజరైన సీనియర్ న్యాయవాది షాదన్ ఫరాసత్ వాదనలు వినిపిస్తూ, చాలా రాష్ట్రాలు క్షమాపణలను ఆమోదించాయని, ఉల్లంఘించిన వారిని నిర్దోషులుగా విడుదల చేస్తూ చర్యలు తీసుకున్నాయని తెలిపారు.

డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ రూల్స్, 1945లోని 170వ నిబంధనను రాష్ట్రాలు సంపూర్ణంగా అమలు చేయడం ఆరంభిస్తే అమికస్ క్యూరీ చెప్పినట్లుగా ఆయుర్వేదం, సిద్ధం, యునాని ఔషధాల అక్రమ వాణిజ్య ప్రకటనల సమస్య గణనీయంగా పరిష్కరించబడుతుందని బెంచ్ పేర్కొంది. ఈ కోర్టు ఇందుకు సంబంధించి అనేక ఆదేశాలను జారీ చేసినా రాష్ట్రాలు వాటిని అమలు చేయడం లేదని బెంచ్ వ్యాఖ్యానించింది. 170వ నిబంధన అమలుపై స్పందనతో సహా అఫిడవిట్లు దాఖలు చేయాల్సిందిగా ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, గోవా, గుజరాత్, జమ్మూ కాశ్మీర్‌లను సుప్రీం ఆదేశించింది. ఇందుకు ఈ నెలాఖరు వరకు గడువు ఇస్తున్నట్లు తెలిపింది. మార్చి 7వ తేదీకి విచారణను వాయిదా వేసింది.

తప్పుదారి పట్టించే వాణిజ్య ప్రకటనలు నిషేధించే 170వ నిబంధనను తొలగిస్తూ ఆయుష్ మంత్రిత్వ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్‌పై గతేడాది ఆగస్టు 27న సుప్రీం స్టే విధించింది.

**పేదలకు నీళ్లు లేవు.. నివాసాల్లేవు.. సైకిల్ ట్రాక్‌లు అవసరమా?**

పేదలకు ఇళ్లు సమకూర్చేందుకు, శుద్ధమైన తాగునీటిని అందించేందుకు ప్రభుత్వాల వద్ద డబ్బుల్లేవని, సైకిళ్ల కోసం ప్రత్యేకంగా ట్రాక్‌లు ఏర్పాటు చేయడం అవసరమా? అని సుప్రీంకోర్టు పిటిషనర్‌ను ప్రశ్నించింది. దేశంలో సైకిళ్ల కోసం ప్రత్యేకంగా ట్రాక్‌లు ఏర్పాటు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై అత్యున్నత ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. అనేక రాష్ట్రాల్లో రోడ్లపై సైకిళ్ల కోసం ప్రత్యేక ట్రాక్‌లు ఉన్నాయని.. దేశవ్యాప్తంగా ఈ సౌకర్యాన్ని కల్పించాలంటూ ఒక వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. దీనిని పరిశీలించిన న్యాయస్థానం.. "ఒకసారి మురికివాడకు వెళ్లి చూడండి. వారి పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోండి. కనీస సౌకర్యాలు ఉన్నాయో లేవో చూడండి. ప్రజలకు ఇళ్లు సమకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వాల వద్ద డబ్బు లేదు. తాగేందుకు శుద్ధ జలాలు లేవు. అలాంటిది సైకిల్ ట్రాక్‌ల గురించి పగటి కలలు కంటున్నారు" అని జస్టిస్ అభయ్ ఎస్ ఓఖా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం పిటిషనర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించింది. "మనం ఎలాంటి అవసరాలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. వాటిపై ఒకసారి పరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ఉద్దేశాన్ని గుర్తు చేసుకోండి. తాగేందుకు సరైన నీటి సౌకర్యం లేదు. ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్నాయి. కానీ, మీకు మాత్రం సైకిల్ ట్రాక్‌లు కావాలా..?" అంటూ సుప్రీంకోర్టు ప్రశ్నించింది.

## పాలస్తీనీయన్లకు ఆ హక్కు ఉండదు : ట్రంప్



**వాషింగ్టన్:** ఇజ్రాయిల్ దాడులతో శిథిల నగరంగా మారిన గాజాను స్వాధీనం చేసుకునే ఆలోచనలో ఉన్నట్టు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెబుతోన్న విషయం తెలిసిందే. తాజాగా ఇదే అంశంపై మాట్లాడుతూ తన ప్రతిపాదిత ప్రణాళిక ప్రకారం.. పాలస్తీనీయన్లకు గాజాకు తిరిగి వచ్చే హక్కు ఉండదని పేర్కొన్నారు. ఫాక్స్ న్యూస్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో గాజా ప్రణాళిక గురించి మాట్లాడారు."నేను గాజాను స్వాధీనం చేసుకుంటా. నా ప్రణాళిక ప్రకారం.. పాలస్తీనీయన్లు నివసించేందుకు గాజా బయట ఆరు ప్రాంతాలు ఉంటాయి" అని ట్రంప్ పేర్కొన్నారు. పాలస్తీనీయన్లు తిరిగి గాజాలో వచ్చేందుకు అవకాశం కల్పిస్తారా? అన్న ప్రశ్నకు బదులిస్తూ.. అటువంటి అవకాశం లేదన్నారు. అక్కడ వారికి ఇంతకంటే మంచి గృహ వసతులు ఉంటాయని చెప్పారు.

**హమాస్ వెనకడుగు..**

తదుపరి విడత బందీల విడుదల విషయంలో హమాస్ ఓ ప్రకటన చేసింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయిల్ ఉల్లంఘిస్తోందని ఆరోపిస్తూ.. తదుపరి బందీల విడుదల ప్రక్రియను ఆలస్యం చేస్తామని వెల్లడించింది. ఇజ్రాయిల్-హమాస్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం ఎంతమేర సజావుగా కొనసాగుతుందోననే అనుమానాలు నెలకొన్న వేళ ఈ పరిణామం చోటుచేసుకుంది.తదుపరి విడుదల ప్రక్రియ శనివారానికి నిర్ణయించగా.. హమాస్ ఈ మేరకు ప్రకటన చేసింది.

# సిద్ధార్థ ఆస్పత్రిపై చర్యలు

- ఆపరేషన్ థియేటర్లు సీజ్
- మృతదేహానికి వైద్యం చేసిన ఆస్పత్రి సిబ్బంది
- పత్రికల్లో వచ్చిన వార్తలపై స్పందించిన వైద్యారోగ్య శాఖ మంత్రి
- మంత్రి ఆదేశాలతో చర్యలు
- ఆస్పత్రిని తనిఖీ చేసిన రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-చందానగర్

మృతదేహానికి వైద్యం అందించి, డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న రంగారెడ్డి జిల్లా మదినగూడలోని సిద్ధార్థ ఆస్పత్రిపై జిల్లా వైద్యాధికారులు చర్యలు తీసుకున్నారు. ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్లను సీజ్ చేశారు. ఇటీవల ఆస్పత్రిలో జరిగిన ఘటనపై వివిధ పత్రికల్లో వచ్చిన వార్తలపై వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పందించారు. ఘటనపై పూర్తి విచారణ జరిపించాలని జిల్లా వైద్యాధికారులను ఆదేశించారు. దాంతో సోమవారం రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు ఆస్పత్రిని తనిఖీ చేశారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ విజయ పూర్ణిమ, ఇతర అధికారులతో కలిసి దర్యాప్తు చేశారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా నందనూరు గ్రామానికి చెందిన జి. సుహాసిని సిద్ధార్థ ఆస్పత్రిలో చేరింది. ఆమెకు వైద్యం అందించిన ఆస్పత్రి సిబ్బంది బాధితుల నుంచి సుమారు రూ.12లక్షల వరకు వసూలు చేశారు.

ఇదిలా ఉంటే యువతి.. రెండ్రోజుల క్రితమే చనిపోయినప్పటికీ.. ఆ విషయం కుటుంబ సభ్యులకు చెప్పకుండా వైద్యం అందించారు. బాధితురాలి కుటుంబ సభ్యులకు అనుమానం రావడంతో యువతిని నిమ్స్‌కు తరలించాలని సిద్ధార్థ ఆస్పత్రి సిబ్బంది సూచించారు. ఆమెను నిమ్స్‌కు తరలించగా.. అప్పటికే ఆమె మృతిచెందిందని అక్కడి వైద్యులు నిర్ధారించారు. దాంతో సిద్ధార్థ ఆస్పత్రి ఎదుట మృతదేహంతో బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. ఈ వార్త వివిధ పత్రికల్లో ప్రచురితం కావడంతో ఘటనపై పూర్తి విచారణ చేపట్టాలని వైద్యారోగ్య శాఖ మంత్రి ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు డీఎంఅండ్‌హెచ్‌ఓతో సోమవారం ఆస్పత్రిని తనిఖీ చేశారు. యువతి ఎలా చనిపోయింది... ఏ జబ్బుతో బాధపడుతూ వచ్చారు.. ఎలాంటి ట్రీట్మెంట్ చేశారు.. అనేదానిపై ఆరా తీశారు. ఆస్పత్రి నుంచి కేస్ షీట్స్ తీసుకుని ఆధారాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో థియేటర్లను సీజ్ చేశారు. అనంతరం డీఎంఅండ్‌హెచ్‌ఓ మీడియాతో మాట్లాడారు. సుహాసిని మృతి పట్ల పూర్తి వివరాలు సేకరించినట్టు తెలిపారు. సమగ్ర విచారణ జరిపి డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా పేషెంట్ చనిపోయిందని నిర్ధారణ అయితే ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామ ని చెప్పారు. ఆస్పత్రిలో పేషెంట్స్ ఉన్నందున ఆస్పత్రిని సీజ్ చేయడం లేదని, కానీ కొత్త పేషెంట్స్‌ని చేర్చుకోవడానికి ఎట్టి పరిస్థితు ల్లోనూ వీలు లేదని ఆస్పత్రి యాజమాన్యానికి తేల్చి చెప్పినట్టు తెలిపారు.

## సీఎం రేవంత్‌రెడ్డితో సచిన్ పైలెట్ భేటీ



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డితో రాజస్థాన్ మాజీ డిప్యూటీ సీఎం సచిన్ పైలెట్ భేటీ అయ్యారు. సోమవారం హైదరాబాద్‌లోని రేవంత్ నివాసంలో ఆయన సీఎంను కలిశారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు వచ్చిన పైలెట్.. రేవంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తాజా రాజకీయాలపై వారిరువురూ చర్చించారు. ఈ సందర్భంగా సీఎం...పైలెట్‌కు శాలువా కప్పి, మెమెంటో ఇచ్చి ఆయన్ను సన్మానించారు.

## నీటిరంగంలో బీఆర్ఎస్ సర్కారు విఫలం

- టీపీసీసీ అధికార ప్రతినిధి నిజాముద్దీన్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రజలకు సాగు, తాగునీరు కల్పించడంలో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని టీపీసీసీ అధికార ప్రతినిధి నిజాముద్దీన్ విమర్శించారు. కాంగ్రెస్‌ను మాత్రం ఈ విషయంలో పార్టీ...కాంగ్రెస్‌ను బదనాం చేస్తున్నదని విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రజలను ఆ పార్టీ నేతలు తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్, బీజేపీ రహస్య ఒప్పందంలో భాగంగానే కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తున్నారన్నారు. బీజేపీతో ఆ పార్టీకి రహస్య ఒప్పందం ఉందని ఆరోపించారు.

## నకిలీ వైద్యులు, వారికి సహకరించే వారిపై చర్యలు తీసుకోండి : హెచ్‌ఆర్డీఏ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నకిలీ వైద్యులు, వారికి సహకరించే వారిపై చర్యలు తీసుకోవాలని హెల్త్‌కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ (హెచ్‌ఆర్డీఏ) తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌ను కోరింది. ఈ మేరకు హెచ్‌ఆర్డీఏ అధ్యక్షులు డాక్టర్ బ్రహ్మేశ్వర్ కె, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.కార్తీక్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చట్టవిరుద్ధంగా మెడికల్ ప్రాక్టీస్ చేస్తున్న వారితో పాటు వారికి సహకరిస్తున్న రాజకీయ నాయకులు, అధికారులపై చర్యలు తీసుకుని ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలని వారు కోరారు.

## 2024 లోక్‌సభ ఎన్నికల కోసమే ఇండియా బ్లాక్

- కాంగ్రెస్ నాయకులు మాణిక్యం ఠాగూర్



**న్యూఢిల్లీ :** 2024 లోక్‌సభ ఎన్నికల కోసమే ఇండియా బ్లాక్ ఏర్పాటయిందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాణిక్యం ఠాగూర్ స్పష్టం చేశారు. తాజాగా జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఓటమికి, బిజెపి గెలుపునకు కాంగ్రెసే కారణమని విమర్శలు వస్తున్న నేపథ్యంలో మాణిక్యం ఠాగూర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ ఎన్నికల్లో ఆప్ కూటమిని కాంగ్రెస్ తోసిపుచ్చిందనే విమర్శలు సరికావని ఆయన ఖండించారు. కాంగ్రెస్‌ను ఇతర పార్టీలు తప్పుగా విమర్శిస్తున్నాయని, నిజానికి ఇండియా బ్లాక్‌ను విచ్ఛిన్నం చేసిన పార్టీపై ఈ విమర్శలు చేయాలని ఠాగూర్ సూచించారు. ఎన్నికల్లో ఆప్ ఒంటరిగా పోటీ చేస్తుందని గత ఏడాది డిసెంబర్ 1నే కేజ్రీవాల్ ముందుగా ప్రకటించిన విషయాన్ని మాణిక్యం ఠాగూర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు.అలాగే, 2024 లోక్‌సభ ఎన్నికల కోసం బిజెపి, ఆర్ఎస్ఎస్, మోడీ వ్యతిరేక శక్తులను ఏకం చేయడానికి ఇండియా బ్లాక్‌ను ఏర్పాటయిందని మాణిక్యం ఠాగూర్ తెలిపారు. అయితే ఇండియా బ్లాక్‌కు కాంగ్రెస్ మద్దతుగానే ఉందని తెలిపారు. లోక్‌సభలో రాహుల్ ఇటీవల మాట్లాడుతూ ప్రత్యామ్నాయ విధానం గురించి మాట్లాడారని అయితే దాన్ని కాంగ్రెస్ విధానం అని పేర్కొనలేదని, ఇండియా బ్లాక్ విధానంగానే రాహుల్‌గాంధీ పిలిచారని ఠాగూర్ ప్రస్తావించారు.అలాగే, 2024 లోక్‌సభ ఎన్నికల కోసం ఇండియా బ్లాక్ ఏర్పాటైనా, ఆ ఎన్నికల్లో కూడా ఇండియా బ్లాక్ ఎన్నికల వ్యూహం రాష్ట్రానికి రాష్ట్రానికి భిన్నంగా ఉందని ఠాగూర్ వెల్లడించారు. ఢిల్లీలో ఆప్‌కు, కాంగ్రెస్‌కు మధ్య అవగాహన ఉన్నా.. పంజాబ్‌లో ఆ విధంగా లేదని చెప్పారు.

## ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలి

- ఎస్ఈ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా

నవతెలంగాణ-సూర్యాపేట

ఎస్ఆర్ఎస్‌పీ కాల్వల ద్వారా నీటిని విడుదల చేసి మోతె, చివ్వెంల, నడిగూడెం మునగాల మండలాల్లో ఎండిపోతున్న పంటలకు నీరందించాలని రైతులు డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లాలోని స్థానిక నీటిపారుదల శాఖ ఎస్ఇ కార్యాలయం వద్ద సోమవారం రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ పేదల సంఘం జిల్లా కార్యదర్శి కొనకంచి వీరభద్రయ్య మాట్లాడారు. యాసంగి పంటలకి విడతలవారీగా నీళ్లు విడుదల చేస్తామని స్వయంగా నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి ప్రకటించారని, కానీ ఇప్పటివరకు విడుదల చేయలేదని అన్నారు. మోతె, చివ్వెంల, నడిగూడెం, మునగాల మండలాల రైతులు బోర్లు, బావులు, చెరువుల ఆధారంగా వరి నాట్లు వేశారని తెలిపారు. నేడు భూగర్భ జలాలు ఇంకిపోవడంతో నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎకరానికి ముప్పై వేల రూపాయలు పెట్టుబడి పెట్టి రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎస్సారెస్పీ ద్వారా నీళ్ల రాక.. వచ్చిన నీళ్ల కాలువలపై ఉన్న రైతులకే సరిపోకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని చెప్పారు.

## ఒత్తిడి అధిగమిస్తేనే విజయం

- పరీక్షా పే చర్చలో విద్యార్థులకు ప్రధాని మోడీ సూచన



**న్యూఢిల్లీ :** ఒత్తిడిని అధిగమించి పరీక్షలను బాగా రాయాలని, ఒత్తిడిని అధిగమిస్తేనే పరీక్షల్లో విజయం సాధించగలమని ప్రధాని నరేంద్ర మోడీ విద్యార్థులకు సూచించారు. ఢిల్లీ సుందర్ నర్సరీలో వివిధ రాష్ట్రాలకు చెందిన 35 మంది విద్యార్థులతో ఆయన సోమవారం 'పరీక్షా పే చర్చ' కార్యక్రమం నిర్వహించారు. సవాళ్లను ఎదుర్కోడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని ప్రధాని సూచించారు. సరైన పోషకాహారం, నిద్ర కూడా చాలా ముఖ్యమని మోడీ వివరించారు. వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకోవాలని తెలిపారు. పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని మోడీ నిర్వహించడం ఇది 8వసారి. ఇప్పటి వరకూ టౌన్ హాల్ ఫార్మాట్‌లో ఈ కార్యక్రమం నిర్వహించిన మోడీ ఈసారి ఢిల్లీలోని సుందర్ నర్సరీలో నిర్వహిం చారు. ఒత్తిడికి గురికాకుండా చదువుపై దృష్టి పెట్టాలని, పరీక్షలే అన్నీ అనే ఆలోచనతో జీవిం చకూడదని తెలిపారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ఇతరులతో పోల్చకూడదని, పిల్లలకు మద్దతు ఇవ్వాలని కోరారు.




## ఇండ్ల స్థలాలకు పొజిషన్ చూపాలి

- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో తహసీల్ కార్యాలయ ముట్టడి
- వారంలో ప్రక్రియ పూర్తి చేస్తామని ఎమ్మెల్యే హామీ

నవతెలంగాణ- ఆత్మకూరు

గూడు కోసం గతంలో ఇస్తామన్న స్థలాలకు పొజిషన్ చూపాలంటూ మూడ్రోజులుగా రిలే దీక్షలు చేస్తున్న పేదలు సోమవారం వనపర్తి జిల్లా అమరచింత మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. దీక్షా శిబిరం నుంచి సోమవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పెద్దఎత్తున ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. అప్పటికే అక్కడ భారీగా మోహరించిన పోలీసులు, ఆత్మకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో కార్యాలయం చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆందోళనకారులను లోపలికి అనుమతి నిరాకరించడంతో బారికేడ్లను దూకి వెళ్లేందుకు ప్రయత్నించగా అడ్డుకున్నారు. ఈ క్రమంలో కొద్దిసేపు ఉద్రిక్తత ఏర్పడింది. అక్కడే సాయంత్రం వరకు వంటావార్పు చేసుకుని ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా నాయకులు ఎండి జబ్బార్, మండల కార్యదర్శి జీసస్ గోపి, మాట్లాడుతూ.. అమరచింత పట్టణంలో ఇండ్లు లేని నిరుపేదల కోసం 1998లో సర్వేనెంబర్ 586 1/2లో 7 ఎకరాలు, 587/2లో 7 ఎకరాలు, 587/2/ఆ/2లో 0.28 గుంటలు, 587/1లో 0.9 గుంటలు ఇలా మొత్తం 14 ఎకరాల 37 గుంటల భూమిలో 280 మందికి ఒక్కొక్కరికి 0.02 సెంట్ల చొప్పున 1997 అక్టోబర్ 31న పంపిణీ చేసినట్టు వివరించారు. కానీ ఇప్పటి వరకు సర్వే చేసి పొజిషన్ చూపించలేదన్నారు. దాంతో ఇన్నేండ్లుగా లబ్దిదారులు వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నా అధికారుల సమస్యను పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పొజిషన్ చూపించాలని అక్కడే లబ్దిదారులు గుడిసెలు వేసుకొని ఉన్నారని చెప్పారు. ఆ భూమిలో ఏడు ఎకరాలను ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం కోసం ప్రభుత్వం కేటాయించిందని, మిగతా భూమిని సర్వే చేసి లబ్దిదారులను గుర్తించి, స్థలాలు, ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.సాయంత్రం అక్కడకొచ్చిన మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి ఆందోళనకారుల దగ్గరకు వెళ్లి నాయకులను అడిగి సమస్యను తెలుసుకున్నారు. అమరచింత పట్టణంలో ఇండ్ల స్థలాల కోసం ఎన్నో ఏండ్లుగా ఆందోళన చేస్తున్నారని నాయకులు వివరించారు. పట్టణంలో గ్రామసభ నిర్వహించి నిజమైన లబ్దిదారులను ఎంపిక చేసి, స్థలాన్ని గుర్తించి చదును చేసి, స్థలాలు ఇవ్వాలని, వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. అందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ.. త్వరలోనే పట్టణంలో అఖిలపక్ష కమిటీ ఏర్పాటు చేస్తామని, లబ్దిదారులను ఎంపిక చేసి ఇంటి స్థలాలు, ఇండ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఎమ్మార్వోను పిలిచి.. సమస్యపై ఫైల్‌ను నేరుగా జిల్లా జాయింట్ కలెక్టర్ వద్దకు తీసుకెళ్లి పరిష్కరించాలని సూచించారు. ఆ భూమిని పూర్తి చదును చేయించాలని మున్సిపల్ కమిషనర్‌కు చెప్పారు. వారం రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేసి త్వరలోనే లబ్దిదారులను గుర్తించి స్థలాలు ఇచ్చేందుకు వంద శాతం కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు మహమూద్, ఎస్.అజయ్, రమేష్, వెంకటేష్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

## కులవివక్షకు పాల్పడితే 24 గంటల్లో రిమాండ్ చేయాలి

- ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య




నవతెలంగాణ-తాడ్వాయి

కుల వివక్ష చూపి ఆలయం నుంచి గెంటివేసిన నిందితున్ని 24 గంటల్లోగా అరెస్టు చేయాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య అధికారులను ఆదేశించారు. ఈనెల 4వ తేదీన జరిగిన మల్లికార్జున ఉత్సవాల్లో పాల్గొని ఆలయంలో భజన చేపడుతున్న కూరల రమేష్‌ను.. మీరు ఇక్కడ ఉండకూడదంటూ వివక్షకు పాల్పడ్డ చిన్న గొల్ల సాయిలును తక్షణమే అరెస్టు చేయాలని తెలిపారు. కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం బ్రాహ్మజివాడ గ్రామాన్ని సోమవారం సందర్శించారు. గ్రామాల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కావద్దని కుల వివక్షతపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గతేడాది మండల కేంద్రంలో కులాంతర వివాహం చేసుకున్న దంపతులను కుల బహిష్కరణ చేశారని గుర్తు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కావొద్దని, దుర్మార్గమైన చర్య అంటూ వారికి బుద్ధి ప్రసాదించాలని మల్లికార్జున ఆలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలో అధికారులు అవగాహనా సదస్సులు ఏర్పాటు చేయడం లేదని దళిత సంఘాల నాయకులు రాష్ట్ర చైర్మెన్ దృష్టికి తీసుకెళ్లారు. అధికంగా కులాంతర వివాహాలు జరుగుతున్నప్పటికీ వివక్షకు పాల్పడటం హేయమైన చర్య అని అన్నారు. అన్ని కులాల యువతీ యువకులు సోదర భావంతో మెలగాలని కుల వివక్షకు పాల్పడితే ఎంతటి వారైనా సహించేది లేదని తెలిపారు. అనంతరం బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల ఐక్యత వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. చైర్మెన్‌ను స్థానికులు సన్మానించారు. అంతకు ముందు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మల్లికార్జున స్వామి ఆలయానికి వెళ్లారు. ఆయన వెంట ఏఎస్పీ చైతన్య రెడ్డి, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్ఐ కొండల్ రెడ్డి, తహసీల్దార్ రహీముద్దీన్, తెలంగాణ మాల మహానాడు జిల్లా అధ్యక్షులు, టేక్ రియల్, ఎడ్ల రాజు, ఆల్ ఇండియా మాల మహానాడు జిల్లా అధ్యక్షులు గైని రాజు, జిల్లా అధ్యక్షులు గంగారాం, బబ్లు, స్థానిక పంచాయతీ కార్యదర్శి, జిల్లాలోని ఆయా గ్రామాల దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 24 నుంచి ఏపీ అసెంబ్లీ

- నోటిఫికేషన్ జారీచేసిన గవర్నర్




**అమరావతి :** రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు 24వ తేది నుండి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఈ మేరకు గవర్నర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఉదయం 10 గంటలకు శాసనసభ, శాసనమండలి ఉమ్మడి భేటీ ప్రారంభమవుతుందని ప్రకటించారు. 16వ శాసనసభలో భాగంగా మూడో శాసనసభ సమావేశాలు, 47వ శాసనమండలి సమావేశాలు ప్రారంభం కానున్నట్లు గవర్నర్ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా తొలి రోజు ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు. ఆ తరువాత రోజు గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం, చర్చలు ఉంటాయి. 24వ తేదీనే శాసనసభ, శాసనమండలి వ్యవహారాల కమిటీలు భేటీ అయి ఎన్ని రోజులు సమావేశాలు నిర్వహించాలి, ఏయే అంశాలపై చర్చించాలన్న కోణంలో నిర్ణయాలు తీసుకుంటారు.

## బ్రిటన్‌లో ఇమ్మిగ్రెంట్లపై దాడులు

- 609మంది అరెస్టు
- గతేడాదితో పోలిస్తే 48శాతం పెరిగాయన్న ప్రభుత్వం

**లండన్ :** అమెరికాలో మాదిరిగా బ్రిటన్‌లో కూడా చట్టవిరుద్ధంగా నివసిస్తూ, పనిచేస్తున్న వారిపై బ్రిటన్ ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తోంది. దేశవ్యాప్తంగా చేపట్టిన ఈ ఆకస్మిక ఆపరేషన్‌కు లక్ష్యాలుగా మారిన వాటిలో భారతీయ రెస్టారెంట్లు, నెయిల్ బార్‌లు, స్టోర్లు, కార్ వాష్‌లు వంటి సంస్థలు వున్నాయి. హోం కార్యదర్శి యెవెట్టె కూపర్ మాట్లాడుతూ, ఇమ్మిగ్రేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు రికార్డు స్థాయిలో 828 ప్రాంతాల్లో దాడులు జరిపాయని, 609మందిని అరెస్టు చేశారని తెలిపారు. గతేడాది జనవరితో పోల్చుకుంటే వీరి సంఖ్య 48శాతం పెరిగిందన్నారు.

# కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా అవసరమా?



నవతెలంగాణ-గజ్వేల్

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గౌరవించి తెలంగాణ ప్రజలు ముఖ్యంగా గజ్వేల్ ప్రజలు ఆయనకు ప్రతిపక్ష హోదా కల్పించారని, కానీ ఇటు గజ్వేల్ ప్రజల వద్దకు రాక, అటు అసెంబ్లీ సమావేశాలకు రాకుండా ప్రతిపక్ష హోదా అవసరమా అని పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ క్షేత్రానికే పరిమితమైన కేసీఆర్‌కు ప్రజలు బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసి వ్యవసాయ క్షేత్రంలో కాలం వెళ్లదీస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాల్సిన కేసీఆర్.. శాసనసభ సమావేశాలకు రాకుండా, ఆయన్ను గెలిపించిన గజ్వేల్ నియోజకవర్గానికి సైతం ముఖం చాటేస్తున్నారన్నారు. అలాంటి నాయకుడు రాష్ట్రానికి అవసరమా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదికాలంగా అనేక పథకాలను అమలు చేస్తూ ప్రజాభిమానాన్ని పొందుతుండటంతో కేసీఆర్ కుటుంబానికి నిద్ర పట్టడం లేదని తెలిపారు.

### ఇంగ్లీష్ రాగానే పెట్టుబడులు రావు

ఇంగ్లీష్ వస్తదని గొప్పలు చెబుతున్న కేటీఆర్ ఐటీ ఎంతవరకు అభివృద్ధి చేశారని, ఎన్ని కంపెనీలు తెచ్చారని మహేశ్ ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలో రాష్ట్రానికి రూ.1.50 లక్షల కోట్ల పెట్టుబడులను తీసుకొచ్చామని చెప్పారు.

**అప్పుడు పార్లమెంటు.. ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీతో దోస్తీ : పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్**

కేటీఆర్‌కు ఇంగ్లీషు రాగానే పెట్టుబడులు రావని చురకలు వేశారు. ఏడాది కాలంలోనే 56 వేల ఉద్యోగాలు ఇచ్చామని, పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలన్నారు. పేదలకు ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇవ్వలేదని విమర్శించారు. దళిత బంధు, బీసీ బంధు అమల్లో చిత్తశుద్ధి లేదని అన్నారు. కేసీఆర్ రూ.6.50 లక్షల కోట్లు అప్పులు చేసి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేసీఆర్ విమర్శించడం సిగ్గుచేటన్నారు. రైతులకు రూ.22 వేల కోట్లు కేటాయించి రుణమాఫీ చేశామని, అదేవిధంగా రైతు భరోసా కూడా అమలు చేస్తున్నామని తెలిపారు.

### కేసీఆర్ బీసీలకు ఏం ఒరగబెడతారు ?

సమగ్ర కుటుంబ సర్వేకు తోక, తొండం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల గణన ప్రజలకు అర్థమైందన్నారు. కులగణనలో పాల్గొనని కేసీఆర్ కుటుంబం బీసీలకు ఏం ఒరగబెడుతుందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రంలో, ఇటు గజ్వేల్‌లో కాంగ్రెస్ పార్టీ తన ఆధిపత్యాన్ని చాటుకుంటుందని చెప్పారు. గజ్వేల్ నియోజకవర్గంలోని 9 మండలాల్లో ఎంపీపీలు, జడ్పీటీసీలతో పాటు సిద్దిపేట జిల్లా పరిషత్‌ను కైవసం చేసుకుంటామని తెలిపారు.

### బీజేపీతో కేసీఆర్ లోపాయికారి ఒప్పందం

గత పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలో 8 బీజేపీ స్థానాలు గెలిచే విధంగా బీజేపీతో కేసీఆర్ కుటుంబం లోపాయికారి ఒప్పందాలు చేసుకుందన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెట్టకపోవడం సైతం బీజేపీకి లోపాయికారంగా మద్దతు ఇస్తున్నట్లేనని విమర్శించారు. తెలంగాణ నుంచి బీజేపీ కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం చేసినా నోరు తెరవడం లేదన్నారు. అలాంటి కేంద్ర మంత్రులు మనకు అవసరమా అని ప్రశ్నించారు. ఈ విలేకరుల సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అంక్షారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మెన్ గాడిపల్లి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఎంపీ, పీఎంపీలపై వేధింపులు ఆపాలి

## ఏ ఒక్క హామీనీ అమలు చేయని కాంగ్రెస్

**అందరి బతుకులు రోడ్డున పడ్డాయి : మాజీమంత్రి హరీశ్‌రావు**

**ఇందిరాపార్కు వద్ద మహాధర్నా**




నవతెలంగాణ - ముషీరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క హామీనీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, అందరి బతుకులను రోడ్డుపాలు చేసిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆర్ఎంపీ, పీఎంపీలపై అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద సోమవారం ఆర్ఎంపీ, పీఎంపీల మహాధర్నా నిర్వహించారు. ధర్నా వద్దకొచ్చిన హరీశ్‌రావు వారికి సంఘీభావం తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్ఎంపీ, పీఎంపీలపై బీఆర్ఎస్ హయాంలో ఎలాంటి కేసులూ లేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో భయభ్రాంతులకు గురిచేసి, అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఆర్ఎంపీ, పీఎంపీలకు ట్రైనింగ్ ఇచ్చి, సర్టిఫికెట్ ఇస్తామన్నారని, ఇప్పుడు రోడ్లపైకి తెస్తున్నారని విమర్శించారు. వారిపై ఆరోగ్యశాఖ అధికారుల వేధింపులను ఆపాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. రుణమాఫీ కూడా పూర్తిస్థాయిలో చేయలేదని, దీనిపై చర్చకు ఏ గ్రామానికైనా రావడానికి సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. గతంలో తాము ఇచ్చిన పథకాలు, రైతుబంధు, బతుకమ్మ చీరలు, ఫీజురీయింబర్స్‌మెంట్, కేసీఆర్ కిట్, వృద్ధుల రెండు నెలల పెన్షన్ ఎగ్గొట్టి రుణమాఫీకి నిధులు మళ్లించారని ఆరోపించారు.

ఆర్ఎంపీ, పీఎంపీలపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేసి వారిని వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటుకు మించిన ఆయుధం లేదని, దానితో స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి, ఆరోగ్య శాఖ మంత్రి వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామీణ వైద్యుల సమైక్య రాష్ట్ర అధ్యక్షులు పి.మల్లేశం మాట్లాడుతూ.. తెలంగాణలో సుమారు 50 వేల మంది ఆర్ఎంపీ, పీఎంపీలు గ్రామీణ వైద్యాన్ని నమ్ముకుని బతుకుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు 429 జీవో ప్రకారం ఆర్ఎంపీలకు శిక్షణ ఇచ్చి గుర్తింపు ఇవ్వాలని, మెడికల్ కౌన్సిల్ అధికారుల దాడులను వెంటనే ఆపాలని కోరారు. ప్రభుత్వ హయాంలో హెల్త్ గైడ్స్‌గా గుర్తించి వారి సేవలను వినియోగించుకోవాలన్నారు. తమపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ ధర్నాలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాష్ట్ర నాయకులు నగేష్ ముదిరాజ్, గ్రామీణ వైద్యుల సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి రాజమౌళి, ఉపాధ్యక్షులు హు స్సేన్, గౌరవ అధ్యక్షులు హరిబాబు, వివిధ జిల్లాల నుంచి ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు పాల్గొన్నారు.

# బీసీల్లో కులాల వారీగా లెక్కలు బయటపెట్టాలి

**బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి**

**ఎండుతున్న పొలాలకు కాళేశ్వరం నీళ్లివ్వాలి**

**బీఆర్ఎస్‌కు ద్రోహం చేసిన ఎమ్మెల్యే సంజయ్ : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**



నవతెలంగాణ-జగిత్యాల టౌన్

బీసీల్లో కులాల వారీగా ఎంత జనాభా ఉన్నదో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం లెక్కలు ఎందుకు బయటపెట్టడం లేదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. తప్పుడు లెక్కలు చెప్పడం, బీసీ ఉద్యమ నాయకులు, కుల సంఘాలతో సీఎం మాట్లాడకపోవడం సరికాదన్నారు. 42 శాతం రిజర్వేషన్స్ ఇచ్చే వరకు బీసీలందరూ పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావుతో కలిసి విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేసీఆర్ పాలన ఐఫోన్‌లా ఉంటే, రేవంత్‌రెడ్డి పాలన చైనా ఫోన్‌లా ఉన్నదని చెబుతూ.. చైనా ఫోన్ చూడడానికే బాగుంటుంది కానీ సరిగ్గా పని చేయదని జోస్యం చెప్పారు. తూ.తూ మంత్రంగా మంత్రి పొన్నం ప్రభాకర్ బీసీ సంఘాలతో సమావేశం పెట్టారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే బీసీ కుల సంఘాలతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. 52 శాతం బీసీలు ఉన్నారని 2014లోనే కేసీఆర్ లెక్క తేల్చారని, కానీ లెక్కపెట్టడం కూడా రాని రేవంత్‌రెడ్డి సర్కారు తప్పుడు లెక్కలు చెబుతోందని, బీసీల సంఖ్యను తక్కువ చూపిస్తోందని అన్నారు. ఈ తప్పుడు లెక్కలు చెప్పి రాహుల్‌గాంధీ పార్లమెంటును కూడా తప్పుదోవ పట్టించారని ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి బిల్లు ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. ఎండిపోయిన పొలాలను చూపిస్తూ రైతులు బాధపడుతున్నారన్నారు. కేసీఆర్‌పై అక్కసుతో మేడిగడ్డ ప్రాజెక్టును వినియోగించడం లేదని, రైతులకు నీళ్లిచ్చే తెలివి లేదని విమర్శించారు. రాజకీయ కక్షను పక్కనపెట్టి సీఎం రేవంత్ రెడ్డి కాళేశ్వరం నీళ్లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఆడపిల్లలకు స్కూటీలు ఇస్తామన్నారని, మహిళలకు రూ.2500 ఇస్తామని చెప్పి ఇంకా ఇవ్వలేదన్నారు. రేవంత్ రెడ్డి తప్పులను ప్రజలు లెక్కిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెబుతారన్నారు. అర్హులకు వెంటనే ఇండ్లు ఇవ్వాల్సిందేనన్నారు. రేషన్ కార్డులను ఎందుకు జారీ చేయడం లేదని ప్రశ్నించారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ బీఆర్ఎస్ పార్టీకి ద్రోహం చేసి కాంగ్రెస్‌లో చేరారన్నారు. అయినా కార్యకర్తలు చెక్కు చెదరలేదని, ఉప ఎన్నిక వస్తే జగిత్యాలలో కాంగ్రెస్ పార్టీ అడ్రస్ లేకుండా పోతుందని అన్నారు.




## డంపింగ్ యార్డ్‌పై మహిళా లోకం కన్నెర్ర

**అఖిలపక్షం ఆధ్వర్యంలో పురవీధుల్లో ర్యాలీలు, నిరసనలు**

**భారీగా పోలీసు బలగాల మోహరింపు**

**సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం పారానగర్‌లో ఘటన**

నవతెలంగాణ-గుమ్మడిదల

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి పంచాయతీ పరిధిలోని పారానగర్‌లో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా మహిళా లోకం కన్నెర్ర చేసింది. అఖిలపక్షం ఆధ్వర్యంలో సోమవారం పెద్ద ఎత్తున నిరసన ర్యాలీలు చేపట్టారు. డంపింగ్ యార్డు అనుమతులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పలువురు మహిళలు మాట్లాడుతూ.. హైదరాబాద్ చెత్తను తీసుకువచ్చి పల్లె వాతావరణాన్ని కలుషితం చేయడానికి గత ప్రభుత్వాలు అనుమతులు ఇచ్చినప్పటికీ.. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలన్నారు. గుమ్మడిదల మండలం వ్యవసాయాధారిత ప్రాంతమని, ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు కూరగాయలు, పాలు, పెరుగు, బియ్యం తదితర వస్తువులు పెద్ద ఎత్తున రైతులు తీసుకెళుతుంటారని తెలిపారు. అలాంటి రైతుల ఉపాధిని హరించేలా ఈ ప్రాంతాన్ని కలుషితం చేయొద్దని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంతంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే.. చాలా గ్రామాలు కాలుష్య కోరల్లో చిక్కుకుంటాయన్నారు. వన్యప్రాణులు, పశుపక్షాదుల మనుగడ కూడా ప్రశ్నార్థకం అవుతుందని తెలిపారు. చెరువులు, కుంటలు కాలుష్యమై.. తాగునీటికి కూడా ప్రజలు ఇబ్బంది పడాల్సిన దుస్థితి వస్తుందన్నారు. ఇలాంటి విషయాన్ని కలెక్టర్‌తో పాటు రాష్ట్ర ఉన్నత అధికారులు గమనించి.. డంపింగ్ యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. మండల వ్యాప్తంగా నిరసనలు చేస్తున్నా నియోజకవర్గ ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు కనీసం మండలానికి వచ్చి డంపింగ్ యార్డు ఏర్పాటుపై మాట్లాడకుండా మౌనం పాటిస్తున్నారంటే.. ఈ యార్డు ఏర్పాటుకు ముఖ్య కారకులు వారేనేమో అని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని అన్నారు. డంపింగ్ యార్డు నిలిపి వేస్తున్నామని ఆదేశాలు జారీ అయ్యే వరకు గ్రామ గ్రామాన రైతుల, జేఏసీల ఆధ్వర్యంలో నిరసనలు, ర్యాలీలు నిర్వహిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. ఎన్ని పోలీసు బలగాలు వచ్చినప్పటికీ తమ పోరాటాలు ఆపలేరని హెచ్చరించారు. మరోవైపు నల్లవల్లి గ్రామంలో చేపట్టిన నిరవధిక నిరసనలు ఆరో రోజుకు చేరుకున్నాయి. ఈ కార్యక్రమంలో మండల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మెన్ చిమ్ముల జైపాల్ రెడ్డి, రైతు సంఘం అధ్యక్షులు అమ్మగారి సదానంద రెడ్డి, నాయకులు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, కుమార్ గౌడ్, పుట్ట నర్సింగరావు, ఎం నరేందర్ రెడ్డి, మద్దుల బాల్ రెడ్డి, పడమటి లక్ష్మారెడ్డి, చిమ్ముల దేవేందర్ రెడ్డి, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, చెన్నంశెట్టి ఉదయ్ కుమార్, వివిధ మహిళా సంఘాల సభ్యులు, మహిళలు యువకులు, రైతులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

### హైదరాబాద్ చెత్తతో మా బతుకులు నాశనం చేయొద్దు : పద్మా కొండల్ రెడ్డి

ప్రభుత్వాలు మారితే మా బతుకులు మారుతాయనుకున్నం. కానీ హైదరాబాద్ చెత్తను తెచ్చి మా బతుకులు చెత్త బతుకులు చేస్తారని అనుకోలేదు. అయ్యా పాలకులారా మా ప్రాంతం పచ్చని పల్లె వాతావరణం. మీరు మంచి చేయకపోయినా పర్వాలేదు కానీ మా వాతావరణాన్ని కలుషితం చేసే పరిస్థితి తీసుకురావొద్దు. గత పాలకులు చేసిన తప్పిదం వల్ల డంపింగ్‌యార్డ్ నిర్మాణం అనుమతులు వచ్చాయి. కానీ ఆ అనుమతులను వెంటనే తొలగించే దిశగా ఈ ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

## మహిళ ఆత్మహత్యాయత్నం

**ఇబ్రహీంపట్నం కోర్టు ఆవరణలో ఘటన**

**ఆస్తి తగాదాలే కారణం**

**కోర్టులో కేసు కొనసాగుతుండగానే భూమి విక్రయం**

**ఆస్తి మొత్తం రెండో భార్యకే ఇస్తున్న భర్త**

**పీఎస్‌కు బాధిత మహిళ తరలింపు, కౌన్సెలింగ్**



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి(ఇబ్రహీంపట్నం)

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం కోర్టు ఆవరణలో ఓ మహిళ ఒంటిపై డీజిల్ పోసుకొని ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నించింది. నిప్పంటించుకునే ప్రయత్నం చేస్తుండగా సమీపంలో ఉన్న వారు అడ్డుకున్నారు. ఆస్తి తగాదాలే ఘటనకు కారణమని పోలీసులు వెల్లడించారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. యాచారం మండలం మంతన్ గౌరెల్లి గ్రామ సమీపంలోని కేసీ తండాకు చెందిన జర్పుల భద్రియ, కమలబాయి దంపతులు. వీరికి కొడుకు, ఇద్దరు ఆడపిల్లలున్నారు. వీరు నగరంలో ఉంటూ చిన్నా.. చితికా పనులు చేసుకుని జీవనం సాగించేవారు. ఈ క్రమంలో కమలబాయి భర్త బద్రియ తరచుగా తన స్వగ్రామమైన కేసీ తండాకు వచ్చి పోతుండేవాడు. ఆయనకు పద్మ అనే మరో మహిళతో పరిచయం ఏర్పడింది. మొదటి భార్య కమలబాయికి విడాకులు ఇవ్వకుండానే పద్మను రెండో వివాహం చేసుకున్నాడు. దాంతో భద్రియ, కమలబాయి మధ్య గొడవలు మొదలయ్యాయి. అప్పటి నుంచి తన ముగ్గురు పిల్లలతో కమలబాయి నగరంలోనే ఉంటోంది. ఈమె పెద్దకూతురుకు వివాహం జరిగింది. రెండవ కూతురికి వివాహం చేసేందుకు చిల్లి గవ్వలేదు. కొడుకు చిన్నోడు. ఇదిలా ఉంటే పద్మకు కూడా ముగ్గురు ఆడపిల్లలున్నారు. వారి వివాహం భద్రియానే ముందుండి చేశాడు. మొదటి భార్య, పిల్లలను గాలికి వదిలేశాడు. దాంతో భద్రియ పేరుతో ఉన్న ఆస్తిలో భాగం కోసం భార్య కమలబాయి గ్రామ పెద్దలను ఆశ్రయించింది. వారి నుంచి ఎలాంటి న్యాయం లభించకపోవడంతో కోర్టును ఆశ్రయించింది. అతని పేరుతో ఉన్న రెండు ఎకరాల భూమిలో వాటా కోసం ఇబ్రహీంపట్నం కోర్టులో 2021లో కేసు వేసింది. ఈ కేసు కోర్టు పరిధిలో కొనసాగుతోంది. ఈ క్రమంలో భద్రియ తన రెండో భార్య పద్మతో కలిసి 20 గుంటల భూమిని విక్రయించాడు. మరో ఎకర భూమిని కూడా ఇతరులకు విక్రయించేందుకు బేరసారాలు కుదుర్చుకున్నాడు. ఓ వైపు కేసు కోర్టులో కొనసాగుతుండగానే భూమి విక్రయాలు జరపడం ఏమిటనీ కమలాబాయి ప్రశ్నించింది. తాను నియమించుకున్న అడ్వకేట్లను కూడా ప్రలోభాలకు గురి చేస్తూ కేసును నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. చేసేదేమీ లేక తీవ్ర మనస్థాపంతో ఇబ్రహీంపట్నం కోర్టు ఆవరణలో సోమవారం ఒంటిపై డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను పక్కన ఉన్నవారు అడ్డుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకొని, పీఎస్‌కు తరలించి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం జడ్జి ఆదేశాలతో ఆమెపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# సామాజిక బాధ్యత పేరుతో రూ.1000 కోట్లకు టోకరా

**సిఎస్ఆర్ ఇనీషియేటివ్ పేరుతో మోసం**

**ప్రమోషన్ కార్యక్రమాలకు కేంద్ర మంత్రి, బిజెపి నేతలు హాజరు**

**కేరళను కుదిపేస్తున్న వందల కేసులు, వేల ఫిర్యాదులు**



**తిరువనంతపురం :** కార్పొరేట్ సామాజిక బాధ్యతా (సిఎస్ఆర్) ఇనీషియేటివ్ పేరుతో జరిగిన కుంభకోణం కేరళను కుదిపేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 200కు పైగా కేసులు నమోదయ్యాయి. వేలాదిగా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ కుంభకోణంలో వెయ్యి కోట్లకు పైగా అవినీతి జరిగిందని అంచనా వేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం తోడ్పాటుతో చేపట్టే సిఎస్ఆర్ ఇనీషియేటివ్ ముసుగులో ద్విచక్ర వాహనాలు, ల్యాప్‌టాప్‌లు, గృహోపకరణాలు వంటివి రాయితీ ధరకు అందిస్తామనే హామీలతో బాధితులను లక్ష్యంగా చేసుకున్నారు. ఇడుక్కికి చెందిన 26ఏళ్ల ఆనందు కృష్ణన్ ఈ కుంభకోణానికి సూత్రధారిగా భావిస్తున్నారు. ఈ మోసం, అవినీతికి విస్తృతమైన పకడ్బందీ నెట్‌వర్క్ రూపొందించాడు. మార్కెట్ ధరలో సగానికే తాను ఈ ఉత్పత్తులను కొంటానని, మిగిలిన ఖర్చు సిఎస్ఆర్ నిధుల నుండి చెల్లిస్తామని చెబుతూ ఆనందు, బాధితులను ఆకర్షించాడు. తొలుత కొంతమంది బాధితులకు ఉత్పత్తులు కూడా ఇచ్చాడు. దాంతో ఈ పథకం పట్ల ప్రజల్లో విశ్వసనీయత పెరిగింది. ఈ ఆపరేషన్‌ను విస్తరిస్తున్న కొద్దీ, ఉత్పత్తులను డెలివరీ చేయడంలో జాప్యం జరుగుతూ వచ్చింది. చివరకు బాధితులకు మొండిచేయి చూపారు.

### బిజెపి నేతల హస్తం?

ఈ కుంభకోణంలో రాజకీయ కోణాలు కూడా బయటపడడంతో ఆందోళన మరింత పెరిగింది. ముఖ్యంగా బిజెపికి చెందిన వారి హస్తం ఇందులో వుందని అనుమానిస్తున్నారు. మోసపూరితమైన ఈ పథకాన్ని ప్రమోట్ చేయడంలో పలువురు బిజెపి నేతలు కీలక పాత్ర పోషించడంతో ఈ పథకానికి ఒక చట్టబద్ధత వచ్చింది. ఎర్నాకులం మెరైన్ డ్రైవ్‌లో అట్టహాసంగా జరిగిన కార్యక్రమానికి కేంద్ర మంత్రి శోభా కరందలాజె, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాధాకృష్ణన్ హాజరయ్యారు. సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ గ్రోత్ ఆఫ్ ది నేషన్ (సైన్) సంస్థ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం, పైగా బిజెపి నేతలు పెద్దగా పాల్గొనడం, సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు వైరల్ కావడంతో ఇదొక అధికార కార్యక్రమమని, ప్రభు త్వమే చేపట్టిందనే తప్పుడు భావన ప్రజల్లోకి వెళ్లింది. దీనికి తోడు ప్రధానితో ఆనందు కృష్ణన్ ఫోటోలు కూడా వైరల్ అయ్యాయి. సీడ్ (సోషల్ ఎడ్యుకేషన్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ సొసైటీ) పేరుతో సభ్యులను రిక్రూట్ చేసుకోవడానికి తన అవినీతి కార్య కలాపాలను విస్తరించుకోవడానికి ఆనందు ఆ సంస్థను ఉపయోగించుకున్నాడు.

### బిజెపి నేతృత్వంలోని కోపరేటివ్ బ్యాంక్ నుంచి రూ.3 కోట్ల ఉపసంహరణ

మోసం చేసిన వ్యక్తులు దాదాపు రూ.3 కోట్లు ఎర్నాకులంలో బిజెపి నేతృత్వంలోని సహకార బ్యాంక్ నుండి విత్ డ్రా చేసుకోవడంతో మొత్తంగా ఈ ఆర్థిక లావాదేవీలన్నింటిపై నిశితంగా పరిశీలన జరపాల్సి వచ్చింది. పైగా ఈ నిధులను కొట్టేయడంలో బ్యాంక్ పాత్ర గురించి కూడా తీవ్రమైన ప్రశ్నలు తలెత్తాయి. ఈ కుంభకోణం ఎర్నాకులానికే పరిమితం కాలేదు. ఇదే తరహాలో వివిధ జిల్లాల్లో స్థానిక పోలీసులు కేసులు నమోదు చేశారు. కమ్యూనిటీ గ్రూపులు, చారిటీ సంస్థలను కూడా లక్ష్యంగా చేసుకున్నారు. ఒక చారిటీ సంస్థ అయితే ఏకంగా రూ.75 లక్షలు కోల్పోయింది. వందమందికి పైగా ప్రజలకు పంపిణీ చేసేందుకు ఉద్దేశించిన ద్విచక్ర వాహనాల కోసం ఈ నిధులను బదిలీ చేసింది. వారిలో అతి కొద్ది మందికి మాత్రమే ఆ వాహనాలు అందాయి.